
కథల కథ

కథలు! ఆహ్, కథలు! వాటిని వినడానికి మనం ఎంతో ఇష్టపడతాం! వాటిని చెప్పడానికి మనం ఎంతో ఇష్టపడతాం! మనం ఆకలి, దప్పిక మరచిపోయేలా మంచి కథ చేస్తుంది. మంచి కథ నిద్రను కూడా పోగొడుతుంది!

మీరు ఎన్ని కథలు విన్నారు? మీరు ఎన్ని కథలు చెప్పారు? వాటిని లెక్కించడం కూడా సాధ్యమేనా? పురాతన కాల రాజులు, రాణుల కథలు, మాయాజాలం, చెట్లు, పువ్వులు, జంతువుల కథలు... హాస్య కథలు, అమ్మమ్మలు, తాతల కథలు, మనల్ని ఆలోచింపజేసే కథలు...

కథలు ఎక్కడి నుండి వచ్చాయి? ఇది తెలుసుకోవడానికి కథల గురించి కొన్ని కథలను చూద్దాం.








ఇది భారత దేశం నుండి వచ్చిన ఒక కథ:

ఒకసారి ఒక క్షురకుడు ఒక రహస్యాన్ని విన్నాడు. అతను దానిని తనలో ఉంచుకోటానికి ప్రయత్నించాడు. దాంతో అతని కడుపు ఉబ్బిపోయింది! చివరికి, అతను దానిని తన భార్యకు చెప్పాడు. ఎంత ఉపశమనం!

ఇప్పుడు ఆ రహస్యంతో అతని భార్య కడుపు ఉబ్బియింది. చివరికి, ఆమె కూడా ఎవరికైనా చెప్పాల్సి వచ్చింది. కానీ ఎవరు? ఆమె నేలలో ఒక గొయ్యి తవ్వి, రహస్యాన్ని దానికి గుసగుసగా చెప్పింది. తరవాత ఆమె ఆ గోతిని పూడ్చేసింది.

కాలం గడిచింది. రహస్యం రహస్యంగా ఉందా? లేదు! ఆమె తవ్విన గోతిలో ఒక వెదురు మొక్క పెరిగింది. సంవత్సరాల తరవాత, దానితో ఒక వేణువు చేశారు. దాని సంగీతం విన్న వారందరికీ ఆ రహస్యం తెలిసిపోయింది!







కథల గురించి మరొక కథ. ఇది ఆఫ్రికా నుండి వచ్చింది:

ఒకప్పుడు ఒక చిన్న ఎలుక ఉండేది. అది ఇళ్లలోకి చొరబడి పగుళ్లలో దాక్కునేది. అక్కడ కూర్చుని ఇళ్లలో నివసించే ప్రజల కథలను వినేది. ఈ కథలను ఎలుక చాలా ఇష్టపడింది. వాటిని చెట్టు కింద కలుగులో జాగ్రత్తగా దాచింది.

ఎలుక తన కథలను దాచిపెడుతుండగా ఒక టక్కరి నక్క చూస్తూ ఉంది. ఒక ఉదయం, నక్క ఆ కలుగుని తవ్వింది. అయ్యో! కథలు భయంతో వణికిపోయాయి! అవి కలుగు నుండి బయటపడి అన్ని వైపులకి పరిగెత్తాయి. పట్టణం గుండా పరిగెత్తుకుంటూ పొలాలు, గ్రామాలు, నగరాల్లోకి వెళ్లాయి...







అలా పురాతన కాలం నుండి, ప్రపంచవ్యాప్తంగా కథలు పరిగెత్తుతూనే ఉన్నాయి.

అవి మీ పట్టణం వైపు, నా పట్టణం వైపు పరిగెత్తుతున్నాయి! అవి మన స్నేహితులు, మన కుటుంబాల వైపు పరిగెత్తుతున్నాయి! అవి నీ వైపు, నా వైపు పరిగెత్తుతున్నాయి!

వాటిలో కొన్ని కథలు ఇక్కడ ఉన్నాయి:

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

ఏనుగు, కుక్క

ఒకప్పుడు కాశీ రాజు బ్రహ్మదత్తుడికి ఇష్టమైన ఒక ఏనుగు ఉండేది. ఈ రాచ ఏనుగును రాజభవన మావటీ చూసుకునేవాడు.


ప్రతిరోజు, ఏనుగుకు ఆరోగ్యకరమైన ఆహారం పుష్కలంగా తినిపించేవాడు మావటీ. ఉదయం, సాయంత్రం ఏనుగును చెరువు వద్దకు తీసుకెళ్లి ప్రేమగా స్నానం చేయించేవాడు.

ఒక రోజు ఒక చిన్న కుక్క ఏనుగుల శాలకు వచ్చింది. ఏనుగు తన ఆహారాన్ని ఆ కుక్కతో పంచుకుంది. దాంతో, ప్రతిరోజు కుక్క అక్కడకు రాసాగింది.



త్వరలోనే రెండు జంతువులు మంచి స్నేహితులు అయ్యాయి. అవి కలిసి తింటాయి, కలిసి స్నానం చేస్తాయి, కలిసి ఆడతాయి. ఏనుగు తొండం పైకి కుక్క ఎక్కుతుంది, ఏనుగు దానిని ఉయ్యాల ఊపుతుంది.

కుక్క తన దగ్గరకు వచ్చే వరకు ఏనుగు వేచి ఉండేది. కుక్క రాకపోతే ఏనుగు ఏమీ తినదు.



ఒక రోజు మావటీకి డబ్బు అవసరం అయ్యింది. ఏ దారీ లేక, అతను చిన్న కుక్కను అమ్మేశాడు. పాపం, కుక్క గుండె పగిలిపోయింది. కానీ అది ఏం చేయగలదు? తన కొత్త యజమానిని అది నిశ్శబ్దంగా అనుసరించింది.


దాంతో, ఏనుగు తినటం, తాగటం మానేసింది! అది చెరువుకి వెళ్లటం లేదు! తన శాల నుండి బయటకు రావటం లేదు!

మావటీ దానికి చెరకు, అరటిపండ్లు, రుచికరమైన ఆహారాలను ఇచ్చేవాడు. కానీ అది తల మరొకవైపుకి తిప్పి కొంచెం కూడా తినేది కాదు.

ఎటువంటి మార్పు లేకుండా ఒక రోజు గడిచిపోయింది. దాంతో, రాజు వద్దకు వెళ్లి అతనికి ఇష్టమైన ఏనుగు జబ్బుపడిందని మావటీ చెప్పాడు.

"దయచేసి వైద్యుడిని పంపండి!" అని మావటీ అడిగాడు.

అప్పుడు ఏనుగును చూడటానికి మంత్రిని పంపాడు రాజు. ఏనుగు శాలలోకి వెళ్లి దానిని పరిశీలించాడు మంత్రి. 'ఈ ఏనుగు బాధపడుతోంది. కానీ దానికి ఏ జబ్బూ లేదు. దానిని ఏదో ఇబ్బంది పెడుతూ ఉంది,' అని అతను అనుకున్నాడు.



చుట్టూ ఉన్నవారిని మంత్రి అడిగినప్పుడు, "ఏనుగుకు ఒక స్నేహితుడు ఉండేవాడు... ఒక కుక్క ఉండేది. వాళ్లు ఆడుకునేవారు," అని వాళ్లు చెప్పారు.

"కుక్క ఎక్కడ?" అని మంత్రి అడిగాడు. "ఒక అపరిచితుడు దానిని తీసుకుని వెళ్లాడు," అని వారు అన్నారు.

అప్పుడు రాజు దగ్గరకు వెళ్లి, "మీ ఏనుగు ఆరోగ్యంగా ఉంది. కానీ దాని మనస్సు కలత చెందుతోంది. దానికి ఒక స్నేహితుడైన కుక్క ఉండేది. మీ ఏనుగు తన స్నేహితుడి కోసం దిగులుపడుతోంది," అని మంత్రి చెప్పాడు.

రాజు వెంటనే, "ఏనుగు శాల నుండి కుక్కను తీసుకుని వెళ్లిన వ్యక్తి వెంటనే దానిని తిరిగి ఇవ్వాలి!" అని చాటింపు వేయించాడు.

దాంతో కుక్క కొత్త యజమాని దానిని వెంటనే తిరిగి ఇచ్చాడు. నేరుగా ఏనుగు వద్దకు కుక్క పరిగెత్తింది!

ఒకరినొకరు చూసి అవి ఎంత సంతోషించాయి! ఏనుగు కళ్ల నుండి ఆనందభాష్పాలు కారుతున్నాయి. అది తన తొండంతో కుక్కను ఎత్తి దాని విశాలమైన తలపై మెల్లగా పెట్టింది.

అప్పుడు రుచికరమైన ఆహారంతో మావటి పరిగెత్తుకుంటూ వచ్చాడు. కానీ ఏనుగు తినలేదు! మావటి దానిని ప్రలోభ పెట్టలేకపోయాడు!

కుక్క తినటం పూర్తైన తరవాతే ఏనుగు తినడం ప్రారంభించింది.

తిన్న తరవాత, ఇద్దరు స్నేహితులు కలిసి ఆడుకున్నారు.

జాతక కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy


తొమ్మిదా, పదా?




తన పది ఒంటెలతో ఒక వర్తకుడు ఎడారి గుండా ప్రయాణం చేస్తున్నాడు. అతను ముందు ఒంటెపై ఎక్కాడు, మిగిలినవి వెనక వస్తున్నాయి.

కొంతసేపటి తరవాత అతను, "అన్ని ఒంటెలు వెనక వస్తున్నాయా?" అని అనుకున్నాడు. అతను వెనక్కి తిరిగి లెక్కించాడు: "ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది... అయ్యో! ఒక ఒంటె తప్పిపోయింది!"

వర్తకుడు కిందకు దూకి చుట్టూ వెతికాడు.




కానీ తప్పిపోయిన ఒంటె జాడ దొరకలేదు. 'నేను పొరబడ్డానేమో,' అని అతను అనుకున్నాడు. 'మళ్లీ లెక్కబెడతాను: ఒకటి, రెండు, మూడు, నాలుగు...'



ఈసారి పది ఒంటెలూ ఉన్నాయి!

హమ్మయ్య! వ్యాపారి తన ఒంటెను ఎక్కి ప్రయాణం కొనసాగించాడు. కొంతసేపటి తర్వాత అతను లెక్కించడానికి మళ్లీ వెనక్కి చూశాడు.

అయ్యో! మళ్లీ తొమ్మిది ఒంటెలే ఉన్నాయి!




వ్యాపారి అయోమయంలో పడ్డాడు. ఒంటెల సంఖ్య ఎందుకు మారుతోంది? అతను మళ్లీ కిందకు దిగి చుట్టూ వెతికాడు. కానీ తప్పిపోయిన ఒంటె కనిపించలేదు. అతను అలసిపోయి వెనక్కి వచ్చాడు.

'నేను పొరపాటు చేశానా?' అని అనుకున్నాడు. ఒంటెలను మళ్లీ లెక్క పెట్టాడు, 'ఒకటి, రెండు, మూడు, నాలుగు...' ఆశ్చర్యం! పది ఒంటెలూ ఉన్నాయి! "ఓహ్!" అతను అరిచాడు, "ఈ మండే ఎండకి నా తల తిరుగుతోంది."

అతను అలసిపోయి ముందు ఒంటెపైకి ఎక్కాడు. నెమ్మదిగా ఎడారిలో ముందుకు వెళుతున్నాడు. కానీ అతను ప్రశాంతంగా ఉండలేకపోయాడు.

'చివరిసారిగా లెక్కపెడతాను!' అని అనుకుని వెనక్కి తిరిగాడు - తొమ్మిది ఒంటెలే ఉన్నాయి!






"ఒక్క ఒంటె ఎందుకు తప్పిపోతోంది?" ఎడారి గాలిని అడిగాడు. కానీ సమాధానం రాలేదు!

వ్యాపారి కిందకి దిగాడు. అతను వెనక్కి నడుస్తూ, "ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది," అని లెక్కపెట్టాడు. ఈసారి ముందుకు నడుస్తూ, "ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది," అని లెక్కపెట్టాడు.

సంతృప్తి చెంది, అతను ఇలా అనుకున్నాడు: 'నేను ఒంటె మీద ఉంటే, ఒక ఒంటె తప్పిపోతోంది. కానీ కిందకు దిగితే, పదీ ఉంటున్నాయి. కాబట్టి, నేను ఒంటెను ఎక్కను.' అతను ఒంటెల వైపు తిరిగి, "ఇప్పటి నుండి, మీతో పాటు నడుస్తాను!" అని ప్రకటించాడు.

మండుతున్న ఎండలో ఎడారిలో నడుస్తూ తన ప్రయాణం కొనసాగించాడు వ్యాపారి.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist S. P. Raju

మాయా పెన్సిలు

అనగనగా ఒక ఊరిలో ఒక తెలివైన బాలుడు ఉండేవాడు. అతనికి బొమ్మలు వేయటం ఇష్టం కాబట్టి అతన్ని అందరూ "ఆర్టీ" అని పిలిచేవారు.

ఆర్టీ చాలా బొమ్మలు గీశాడు. రాళ్లు, పుల్లలను పదునుపెట్టి నేలపై బొమ్మలు గీసేవాడు. ఊరిలోని అన్ని వీధులు ఆర్టీ బొమ్మలతో నిండిపోయాయి!


ఒక రోజు ఆర్టీ, 'నా దగ్గర పెన్సిల్ ఉంటే, ఎంతో అందమైన బొమ్మలు గీసేవాడిని!' అని అనుకున్నాడు. అకస్మాత్తుగా ఒక వృద్ధుడు అతని ముందు ప్రత్యక్షం అయ్యాడు. ఆ వృద్ధుడు ఆర్టీకి ఒక పెన్సిలు ఇచ్చాడు.



"నీ బొమ్మలను పేదలకు మాత్రమే ఇవ్వు," అని చెప్పి అతను అదృశ్యం అయ్యాడు.

ఆర్టీ చాలా సంతోషించాడు. అతను వెంటనే ఒక కోడిని గీశాడు. ఆశ్చర్యం! బొమ్మ నిజమైన కోడిగా మారింది! అతను పిల్లిని గీశాడు. బొమ్మ నిజమైన పిల్లిగా మారింది! ఆర్టీకి అంతా అర్థమైంది. అతని కొత్త పెన్సిలు ఒక మాయా పెన్సిలు!

ఆర్టీ ఒక బంతిని గీశాడు, అది పేజీ నుండి బయటకు గెంతింది. దగ్గరలో ఉంటున్న కొంతమంది పిల్లలకు ఆ బంతిని ఇచ్చాడు. అతను ఒక నోట్‌బుక్, బొంగరం, చొక్కా, పువ్వు, పండు గీశాడు. అవన్నీ నిజమైనవి అయ్యాయి. వాటిని పిల్లలకు ఇచ్చాడు.



ఇప్పుడు ఒక్క నిమిషం కూడా ఆర్టీ విశ్రాంతి తీసుకోవటంలేదు! చూడటానికి వెలుతురు ఉన్నంత వరకు, అతను గీసేవాడు. పేదవాళ్లు వచ్చినప్పుడు, వాళ్లు అడిగినవన్నీ ఆర్టీ గీసేవాడు. గీయడం అతను ఎప్పుడూ ఆపలేదు!


త్వరలోనే మాయా పెన్సిలు గురించి రాజు విన్నాడు. అతను ఆర్టీని పిలిచి, "బంగారు నాణేలతో నిండిన చెట్టును గీయి," అని ఆజ్ఞాపించాడు. "ఓ రాజా! నేను పేదల కోసం మాత్రమే గీస్తాను. మీ కోసం చెట్టు గీయలేను!" అంటూ ఆర్టీ నిరాకరించాడు.

రాజుకి కోపం వచ్చింది. "అతన్ని బంధించండి!" అని ఆదేశించాడు.



ఆర్టీని జైలు గదిలో బంధించారు. కానీ అతను అక్కడ ఊరికే ఉన్నాడా? లేదు! అతను తన మాయా పెన్సిలుతో ఒక తాళం చెవి బొమ్మ గీశాడు.

చూడండి! తను జైలు గది తలుపు తెరిచాడు! ఇప్పుడు అతను స్వేచ్ఛగా వెళ్లిపోతున్నాడు!



మలేషియా కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist S. P. Raju




తోటమాలి కోతులు

అనగనగా ఒక రాజు తన ప్రజలందరికీ సెలవు ప్రకటించాడు. రాజభవన పనివాళ్లకు కూడా సెలవు ఇచ్చారు. వాళ్లందరూ తమ పనులు ముగించుకుంటూ, బహుమతులు కొంటూ, సంచులు సర్దుకుంటూ హడావిడిగా ఉన్నారు. త్వరలోనే సిబ్బంది గదులు ఖాళీ అయ్యాయి.

రాజభవన తోటమాలి మాత్రమే సంకోచించాడు. ‘నేను వెళితే అన్ని మొక్కలు ఎండిపోతాయి,’ అని అతను అనుకున్నాడు. అయినప్పటికీ తన కుటుంబాన్ని చూడాలని అతనికి ఉంది! హ్మ్మ్... ఒక దారి ఉందనుకుంటా...

రాజు తోటలో కోతుల గుంపు ఉండేది. ఆ గుంపు నాయకుడి వద్దకు వెళ్లి తోటమాలి ఇలా అన్నాడు,




"ఇప్పటివరకు మీరు తోటలో స్వేచ్ఛగా విహరిస్తున్నారు. చెట్లలో ఊగుతున్నారు, రుచికరమైన పండ్లు తింటున్నారు, ఆడుకుంటున్నారు, ఇష్టానుసారంగా గెంతుతున్నారు. ఇప్పుడు, నా కోసం మీరు ఏమైనా చేస్తారా?"

"సంతోషంగా!" అన్నాడు కోతుల నాయకుడు.

"నా కుటుంబాన్ని చూడటానికి వెళుతున్నాను," అన్నాడు తోటమాలి. "నేను లేనప్పుడు మొక్కలకు నీళ్లు పొయ్యండి."

అతని చుట్టూ కోతులు గుమిగూడి, "అలాగే! అలాగే!" అన్నాయి. "మేం నీళ్లు పోస్తాం!"



తోటమాలి వాటికి కృతజ్ఞతలు చెప్పి, "ఎక్కువ, తక్కువ కాకుండా మొక్కలకు తగినంత నీరు పొయ్యండి," అని అన్నాడు. అలా చేస్తామని కోతులు వాగ్దానం చేశాయి. దాంతో సంతోషంగా తన గ్రామానికి బయలుదేరాడు తోటమాలి.

ఆ సాయంత్రం, కోతులు నీటి డబ్బాలను తీసుకుని మొక్కలకు నీళ్లు పొయ్యటానికి సిద్ధం అయ్యాయి. "ప్రతి మొక్కకు సరిపడా నీరు వచ్చేలా చూసుకోండి," అంటూ కోతుల నాయకుడు వాటికి గుర్తు చేశాడు.


"కానీ ఎంత నీరు సరిపోతుంది?" అని ఒక చిన్న కోతి అడిగింది.

కోతుల నాయకుడు కాసేపు ఆలోచించి, "ప్రతి మొక్కను తీసి దాని వేర్లను చూడండి. వేర్లు పొడవుగా ఉన్న మొక్కలకు ఎక్కువ నీరు, వేర్లు చిన్నగా ఉన్న మొక్కలకు తక్కువ నీరు పొయ్యండి," అన్నాడు.



దాంతో ఒక్కొక్క మొక్కను పీకుతూ, దేని వేర్లు పొడవుగా ఉన్నాయో, దేని వేర్లు పొట్టిగా ఉన్నాయో చూస్తూ కోతులు తోట అంతా తిరిగాయి. త్వరలోనే అవి, "నా మొక్క వేర్లు పొడవుగా ఉన్నాయి!" అంటే, "లేదు, నా మొక్క వేర్లు పొడవుగా ఉన్నాయి!" అంటూ తమలో తాము పోట్లాడుకోసాగాయి. ఆ గొడవలో అసలు పని మరిచిపోయాయి!

తోటమాలి తిరిగి వచ్చినప్పుడు, అతనికి ఒక దారుణ దృశ్యం కనపడింది. అతను ప్రేమగా పెంచిన మొక్కలు అన్నీ చచ్చిపోయి, నేలపై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.



జాతక కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist S. P. Raju


సగం నీకు, సగం నాకు

ఒకప్పుడు ఒక రైతుకి అడవి దగ్గర పొలం ఉండేది. ఆ పొలంలో వేరుశనగ విత్తాలని అతను నిర్ణయించుకున్నాడు. పొలం దున్నిన తరవాత, అతను గింజలను నాటాడు, నీరు పోసి కలుపు తీసి, పంట పండే వరకు వేచి ఉన్నాడు.

ఇదంతా ఎవరు చూస్తున్నారు? ఎలుగుబంటి!

ఒక రోజు ఎలుగుబంటి రైతు వద్దకు వచ్చి,





"ఓ రైతూ! నిన్ను తినబోతున్నాను!" అని చెప్పి, కొట్టడానికి తన పంజాని పైకి లేపింది!

రైతు భయంతో వణికిపోయాడు. కానీ అతను త్వరగా ఆలోచించి, "అయ్యా! ఎలుగుబంటి గారు! దయచేసి నన్ను తినకండి! నా వేరుశనగ పంట పండినప్పుడు, దానిని మీతో సమానంగా పంచుకుంటాను," అని జవాబు ఇచ్చాడు.

ఎలుగుబంటి తన పంజాను కిందకి దించింది. "వివరంగా చెప్పు!" అంటూ అరిచింది.

"ప్రతి మొక్కలో వేర్ల భాగాన్ని నేను తీసుకుంటాను, పై భాగాన్ని మీరు ఉంచుకోండి," అని రైతు అన్నాడు.

హమ్మయ్య! పంట కోసం వేచి ఉండటానికి ఎలుగుబంటి అంగీకరించింది. అది తిరిగి అడవిలోకి వెళ్లింది.

ఆ పంట కాలం అంతా రైతు చాలా కష్టపడి పనిచేశాడు. అతని పొలాలు పచ్చగా పెరిగాయి. పంట అద్భుతంగా ఉంది.

ఇప్పుడు ఎలుగుబంటి తన భాగం కోసం వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం మొక్కల పైభాగాన్ని దానికి ఇచ్చాడు రైతు.

అప్పుడు అతను వేరుశనగలను తన బండిలోకి ఎక్కించుకున్నాడు. కానీ అతను వెళ్లేటప్పుడు, ఎలుగుబంటి గర్జించింది, "ఆగు! నాకు కొన్ని వేర్లను ఇవ్వండి. వాటి రుచి చూడాలని అనుకుంటున్నాను."


రైతుకు వేరే మార్గం లేదు. అతను ఎలుగుబంటికి కొన్ని వేరుశనగలను ఇచ్చాడు.

వేరుశనగలను నమిలి, "ఈ వేర్లు రుచిగా ఉన్నాయి. కానీ నాకు ఇచ్చిన ఆకులు, కొమ్మలు అస్సలు రుచిగా లేవు. మీరు నన్ను మోసం చేశారు!" అని అరుస్తూ తన పంజా ఎత్తింది ఎలుగుబంటి...

రైతు వెంటనే ఇలా అన్నాడు: "ఎలుగుబంటి గారు! దయచేసి కోపగించుకోకండి! నేను మరొక పంటను పండిస్తాను. ఈసారి మీరు వేర్లను తీసుకోవచ్చు, నేను పైభాగాన్ని తీసుకుంటాను," అని అతను మాట ఇచ్చాడు.

హమ్మయ్య! వేచి ఉండటానికి అంగీకరించి అడవిలోకి తిరిగి వెళ్లింది ఎలుగుబంటి.

విత్తే కాలం వచ్చినప్పుడు, రైతు తన పొలంలో మొక్కజొన్నను విత్తాడు. అతను కష్టపడి పనిచేశాడు. మొక్కజొన్న బాగా, పొడవుగా పెరిగింది. ఎలుగుబంటి తన వాటాను అడిగింది. రైతు దానికి వేర్లను ఇచ్చాడు. అతను మొక్కజొన్న కంకులను తన బండిలోకి ఎక్కించుకుని వేగంగా వెళ్లిపోయాడు.



ఎలుగుబంటి వేళ్లను తిని చూసింది. "ఇవి ఏమాత్రం రుచిగా లేవు!" అని అది గుర్రుమని అరిచింది. "రైతు నన్ను మళ్లీ మోసం చేశాడు! అతను ఎప్పుడైనా ఇక్కడికి తిరిగి వస్తే, నేను అతనికి గుణపాఠం నేర్పుతాను!"

కానీ ఆ తెలివైన రైతు – మళ్లీ తిరిగి వస్తాడా?



P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

మారిన ఇల్లు

ఒకసారి ఒక ధనవంతుడు ఒక పెద్ద నగరంలో పదవీ విరమణ చేశాడు. అతను ఒక చిన్న గ్రామంలో ఒక అందమైన బంగళా కొన్నాడు. ఇల్లు మారిన తరవాత అతను తన కొత్త వరండాలో ప్రశాంతతను ఆస్వాదిస్తూ కూర్చున్నాడు.

కానీ మరుసటి రోజు ఉదయం, అతని ప్రశాంతత చెదిరిపోయింది!



ధనవంతుడి బంగళాకు ఎడమ వైపున ఒక కమ్మరి శాల, కుడి వైపున ఒక వడ్రంగి శాల ఉన్నాయి.

"బ్యాంగ్, బ్యాంగ్, క్లాంగ్, క్లాంగ్" అంటూ ఇనుమును సుత్తితో కమ్మరి కొట్టే శబ్దం రోజంతా వినిపించేది. ఇంకోవైపు "జ్‌జ్‌నీ్, జ్‌జ్‌జ్‌నీ్," అంటూ వడ్రంగి రంపపు శబ్దం వినిపించేది.

విరామం లేని ఈ శబ్దాలకు ధనవంతుడి చెవులు చిల్లులు పడేవి. అతను విశ్రాంతి తీసుకోలేకపోయేవాడు, నిద్రపోలేకపోయేవాడు. అతను చాలా దుఃఖంలో ఉన్నాడు.

అతను ఇక ఇది భరించలేని రోజు వచ్చింది. అతను వడ్రంగిని, కమ్మరిని పిలిపించాడు. వాళ్లు వచ్చి అతని ముందు వినయంగా నిలబడ్డారు.




"మీ ఇళ్ల నుండి చాలా శబ్దం వస్తోంది, నేను విశ్రాంతి తీసుకోలేకపోతున్నాను, నిద్రపోలేకపోతున్నాను," అని వాళ్లతో చెప్పాడు.

"మాకు నిజంగా బాధగా ఉంది, అయ్యా," అని వారు బదులు ఇచ్చారు. "కానీ ఏం చేస్తాం? మేం పేదవాళ్లం, పని చేస్తేనే మాకు గడుస్తుంది!"

"దయచేసి మీ ఇళ్లను మార్చండి," అని ధనవంతుడు చెప్పి వారికి బాగా డబ్బులు ఇస్తానని అన్నాడు. ఆ ఇద్దరూ అందుకు అంగీకరించి, సంతోషంగా వెళ్లిపోయారు.

వాళ్లు తమ పనిముట్లు, ఇంటి సామాను బండ్లపైకి ఎక్కించుకోవడం చూసినప్పుడు ధనవంతుడు సంతోషించాడు. 'హమ్మయ్య! ఇక నేను హాయిగా నిద్రపోవచ్చు,' అని అతను అనుకున్నాడు. ఆ తరవాత అతను పడుకోటానికి వెళ్లాడు.



కానీ మరుసటి రోజు చెవులు చిల్లులుపడే అవే శబ్దాలకు అతను మేల్కొన్నాడు! ఏమి జరిగి ఉంటుంది? తెలుసుకోవడానికి అతను తన సేవకుడిని పంపాడు.

సేవకుడు పరిగెత్తుకుంటూ తిరిగి వచ్చాడు. "అయ్యా! కమ్మరి, వడ్రంగి ఇద్దరూ తమ ఇళ్లను మార్చారు. కానీ వడ్రంగి ఇంట్లోకి కమ్మరి మారాడు, కమ్మరి ఇంట్లోకి వడ్రంగి మారాడు!" అని అతను అన్నాడు.

కొరియన్ కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist S. P. Raju

ఎవరి పక్షి?



ఆ ఉదయం ఆహ్లాదకరంగా ఉంది. తోట నిండా పూలు పూశాయి. చెట్లలో పక్షులు కిలకిలలాడుతూ పాడుతున్నాయి. పువ్వుల సువాసనను యువరాజు సిద్ధార్థ ఆస్వాదిస్తున్నాడు.



అకస్మాత్తుగా పక్షులు అరుస్తూ, ఎగరసాగాయి. 'ఏమైంది?' యువరాజు ఆశ్చర్యపోయాడు.

ఆ సమయంలో ఆకాశం నుండి ఒక హంస సిద్ధార్థ కాళ్ల దగ్గర పడింది. హంసకి ఒక బాణం గుచ్చుకుని ఉంది. అది బాధ, భయంతో వణుకుతోంది!



ఆ పక్షిని సిద్ధార్థ తన చేతులలోకి తీసుకున్నాడు. జాగ్రత్తగా బాణాన్ని బయటకు తీశాడు. గాయానికి కొంత మందు రాశాడు. హంసను తన ఒడిలో పెట్టుకుని, వేళ్లతో సున్నితంగా నిమిరాడు. హంస కుదుటపడింది. దాని వణుకు ఆగిపోయింది.

సిద్ధార్థ సోదరుడు దేవదత్త అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చాడు. సిద్ధార్థ ఒడిలో ఉన్న హంసను చూసి ఆగిపోయాడు.

"ఆ పక్షిని నాకు ఇవ్వు. అది నాది!" అని అతను అన్నాడు.



కానీ సిద్ధార్థ, "లేదు! ఈ పక్షి నాది. దాన్ని కాపాడింది నేనే," అని బదులు ఇచ్చాడు. అతను హంసను తన ఛాతీ దగ్గర ఉంచుకుని రాజభవనం వైపు నడిచాడు. దేవదత్తుడు అతనిని అనుసరించాడు.

ఇద్దరు సోదరులు రాజు వద్దకు వెళ్లారు. "సిద్ధార్థుడు నా పక్షిని నాకు ఇవ్వటం లేదు," అని దేవదత్తుడు ఫిర్యాదు చేశాడు.

"తండ్రీ, దేవదత్తుడు బాణం వేసి పక్షిని గాయపరిచాడు. కానీ నేను మందు వేసి దాని ప్రాణాన్ని కాపాడాను. కాబట్టి, పక్షి నాది," అంటూ సిద్ధార్థుడు జవాబు ఇచ్చాడు,



"నేను మొదట చూశాను! కాబట్టి, అది నాది," అన్నాడు దేవదత్తుడు.

రాజు కాసేపు ఆలోచించి, "దేవదత్తా, నువ్వు పక్షిని చంపడానికి ప్రయత్నించావు. కానీ సిద్ధార్థుడు దానిని కాపాడటానికి ప్రయత్నించాడు. ప్రాణాన్ని తీయడం కంటే ప్రాణాన్ని కాపాడటం గొప్పది. కాబట్టి పక్షి సిద్ధార్థుడికి చెందుతుంది," అని తీర్పు చెప్పాడు.



P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

ఒంటె, నక్క

"ఓ, ఒంటె అన్నా!" అంటూ నక్క పిలిచింది. "నది అవతల చూడు! తియ్యని దోసకాయలు కనిపిస్తున్నాయా? మనం వెళ్లి వాటిని తిందాం!"

"అలాగే వెళదాం!" అని ఒంటె అంది. నక్కని తన వీపు పైకి ఎక్కించుకుని, నదిని దాటసాగింది ఒంటె.

అవతలి వైపుకి చేరుకున్నప్పుడు, నక్క కిందకు దూకింది. ఆ రెండూ పొలంలోకి ప్రవేశించి దోసకాయలను తినసాగాయి. మ్మ్మ్... చాలా రుచిగా ఉన్నాయి!





కొన్ని దోసకాయలు తినేసరికి నక్క పొట్ట నిండిపోయింది.. అప్పుడు అది అక్కడి నుండి వెళ్లిపోవాలని అనుకుంది. కానీ ఒంటె పొట్ట ఇంకా నిండలేదు.

నక్క అటూ ఇటూ పరిగెత్తసాగింది. "అన్నా!" అది కేకలు వేసింది. "నువ్వు తినటం ఇంకా పూర్తి కాలేదా?"

"నా కడుపు సగం కూడా నిండలేదు! నిశ్శబ్దంగా ఉండు, నన్ను తిననివ్వు," అని ఒంటె అంది.

"నేను మౌనంగా ఉండలేను! నా కడుపు నిండినప్పుడు అసలే ఉండలేను!" అని నక్క అంది. "తిన్న తరవాత ఆకాశం వైపు చూస్తూ అరవడం నా అలవాటు. నన్ను క్షమించు!" అంటూ అది అరవడం ప్రారంభించింది. "ఊఊఊ!"




ఆ ప్రాంతంలోని రైతులు ఆ అరుపు విని కర్రలతో పరిగెత్తుకుంటూ వచ్చారు. నక్క పారిపోయి నది ఒడ్డు దగ్గర దాక్కుంది.

పాపం ఒంటె! అది దొరికిపోయింది! ప్రజలు దాన్ని పట్టుకుని బాగా కొట్టారు. ఏదో విధంగా అది తప్పించుకుని నక్క దగ్గరకు పరిగెత్తింది.

"అయ్యో! వాళ్లు నిన్ను బాగా కొట్టినట్టు ఉన్నారు!" అంది నక్క.

"పర్వాలేదు," అని ఒంటె బదులు ఇచ్చింది. "రా, నా వీపు మీద ఎక్కు. మనం ఇక్కడి నుంచి వెళ్లిపోదాం!"

వాళ్లు నది మధ్యలోకి చేరుకున్నప్పుడు, ఒంటె అకస్మాత్తుగా ఆగిపోయింది. అప్పుడు అది ఒక వైపు నుండి మరొక వైపుకు ఊగడం ప్రారంభించింది.




నక్క భయపడిపోయింది. "ఏయ్! నువ్వు ఇలా ఎందుకు ఊగుతున్నావు? నేను నీటిలో పడిపోతాను!" అంటూ అది అరిచింది.

"కంగారుపడకు, తమ్ముడూ! నాకు తిన్న తర్వాత ఊగడం అలవాటు ఉంది. నన్ను క్షమించు!" అంటూ ఒంటె ఇంకా వేగంగా ఊగసాగింది. "దయచేసి ఆపు!" అంటూ నక్క అరిచింది.

కానీ ఒంటె ఊగుతూనే ఉంది! దాంతో ఒంటె వీపు నుండి నక్క నీటిలో పడిపోయింది. పాపం నక్క!

పంచతంత్ర కథ



P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

ఒక కొమ్మ ప్రయాణం



"పటక్!"

ఒక చెట్టు నుండి ఎండిన కొమ్మ విరిగిపోయింది. అది నేలపై పడింది. కానీ అది అలాగే పడి ఉందా? అస్సలు కాదు! అది లేచి తిరగసాగింది.



కాసేపటికి ఆ కొమ్మ ఒక నదిని చేరుకుంది. అది కాసేపు నీటిలో మునిగింది, కాసేపు తేలింది. అది నీటి ప్రవాహంలో ఆడింది. అది చాలా సరదాగా గడుపుతోంది!

ఉన్నట్టుండి... సంగీతం! పైకి చూస్తే అక్కడ కూర్చున్న ఒక కోయిల పక్షి ఆ కొమ్మకి కనిపించింది. అది ఒక మధురమైన పాటను పాడుతోంది.

ఆ కొమ్మ నీటి అంచుకు వచ్చి పాట వింటూ ఉండిపోయింది.

అది కోయిలను మెచ్చుకోవాలని అనుకుంది. కానీ, "...", "..." ఆ కొమ్మ మాట్లాడలేకపోయింది!

అది మళ్లీ విచారంగా బయలుదేరింది.





కాసేపటికి ఒక గులాబీ పొద వద్దకు ఆ కొమ్మ వచ్చింది. అది, "నువ్వు చాలా అందంగా ఉన్నావు!" అని చెప్పాలని అనుకుంది కానీ అది కుదరలేదు.


కొంచెం దూరం వెళ్లిన తరవాత పద్యం రాస్తున్న ఒక కప్ప దానికి కనిపించింది! ఒకటి, రెండు చరణాలను అది సూచించాలని అనుకుంది. కానీ, ఎప్పటి లాగానే దానికి కుదరలేదు.

పాపం కొమ్మ! అది వెనక్కి తిరిగి, వచ్చిన దారిని చూసుకుంది.


ఆహ్! ఇదేంటి? నేల వెంబడి ఒక గీత నేరుగా కొమ్మ దగ్గరకు దారి తీసింది!

ఆ గీత అది నడిచి వచ్చిన దారి!






కొమ్మ ఆనందంతో గంతులు వేసింది. అది గీయడం ప్రారంభించింది. మొదట అది మరిన్ని గీతలు గీసింది. తరవాత అది బొమ్మలను గీసింది - కొట్టొచ్చే, అందమైన బొమ్మలు!



అడవిలోని జంతువులు, పక్షులు చుట్టూ గుమిగూడాయి. కానీ కొమ్మ గమనించలేదు. అది బొమ్మలు వేయటంలో మునిగిపోయింది.


త్వరలోనే ఒక అద్భుతమైన ప్రకృతి దృశ్యం కనిపించింది. అది దారులను నింపి అన్ని దిశలలో వ్యాపించింది. అడవిలో ఎవరూ అలాంటిది చూడలేదు!



కొమ్మను ప్రశంసించాలని అందరూ అనుకున్నారు.



పక్షులు తమ రెక్కలు ఆడించి, పాడాయి. పువ్వులు వికసించి, ఊగాయి. సీతాకోకచిలుకలు కూనిరాగాలు తీశాయి. చెట్లు తమ కొమ్మలను సున్నితంగా ఊపాయి.



కానీ కొమ్మ వాటిని చూడలేదు, వినలేదు. దాని మనస్సు బొమ్మలతో నిండిపోయింది. అది గీసింది, గీసింది.



అకస్మాత్తుగా, ఆకాశం చీకటిగా మారింది. అయ్యో! టప్, టప్, టప్, టప్... వాన పడటంతో అందమైన బొమ్మలన్నీ కొట్టుకుపోయాయి! అడవి నిశ్శబ్దంగా ఏడ్చింది.

కానీ ఆ కొమ్మ ఏమాత్రం ఆందోళన చెందలేదు. అది కోరుకున్నప్పుడల్లా కొత్త బొమ్మలను గీయగలదు!

ఇప్పుడు అది ఒక ఆకు కింద దాక్కుని, వర్షం ఎప్పుడు ఆగుతుందా అని వేచి ఉంది. అదిగో! మబ్బులు అప్పుడే విడిపోతున్నాయి...

జాన్ లెచ్నర్ రాసిన 'ది క్లెవర్ స్టిక్' ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


ఇక పండ్లు వద్దు!

ఒకసారి ఒక చిన్న కోతి తిరుగుతూ పుచ్చకాయ పొలంలోకి వెళ్లింది. అది పెద్ద, గుండ్రని పండ్లను ఆనందంతో చూసింది. యామ్! అన్నిటిలోకి పెద్ద పండును అది కొరికింది.

"అయ్యో! ఇది చాలా చేదుగా ఉంది!" చిన్న కోతి అరిచింది.

ఒక మేక అది చూసింది. "నువ్వు పుచ్చకాయ లోపలి భాగాన్ని తినాలి, తొక్క కాదు," అని మేక చెప్పింది.

చిన్న కోతి తొక్కని ఊసేసింది. "నాకు తెలుసు! నువ్వు నాకు చెప్పాల్సిన అవసరం లేదు!" అంటూ చిన్న కోతి అరిచింది.





చిన్న కోతి కొద్దిసేపు అలా తిరుగుతూ ఉంది. అకస్మాత్తుగా గాలిలో తియ్యటి వాసన వచ్చింది. ఆహ్! ఇక్కడ కర్బూజకాయ తోట ఉంది! ఒక కర్బూజకాయను పగలగొట్టి, మధ్య భాగాన్ని రుచి చూసింది కోతి.

"అయ్యో!" అది అరిచింది. "ఈ పండు చాలా జిగటగా ఉంది!"

ఒక గాడిద అది చూసింది. "కర్బూజకాయ మధ్య భాగం గింజలతో జిగటగా ఉంటుంది! చర్మం దగ్గర కండని తినాలి," అని ఆ గాడిద చెప్పింది.

ఆ జిగట కర్బూజకాయ గింజలను చిన్న కోతి ఊసేసింది. "నాకు తెలుసు! నువ్వు చెప్పాల్సిన అవసరం లేదు!" అని అది అంది.





కోతి అటు ఇటు తిరిగింది. దానికి చాలా ఆకలిగా ఉంది! హ్మ్మ్మ్... ఇక్కడి దారి నిండా రాలిన పండ్లు ఉన్నాయి. కోతి పైకి చూసింది. అది బాదం చెట్టు కింద నిలబడి ఉంది!

‘ఈ పండ్లు చిన్నగా, మెత్తగా ఉన్నాయి. ఇవి తినడానికి బాగుంటాయనుకుంటా,’ అనుకుంది కోతి. అది చెట్టుపైకి ఎక్కి ఒక బాదం పండును కోసుకుంది.

ఒక నీలి పక్షి అది చూసింది. "మెత్తటి కండ చూసి మోసపోకు! గట్టి గింజపెంకును పగలగొట్టి, లోపలి పప్పు తినాలి," ఈల వేసి చెప్పింది ఆ పక్షి.

కానీ ఈ చిన్న కోతి వింటుందా? పక్షిని పట్టించుకోకుండా, బాదం పండును గట్టిగా కొరికింది. "నా పన్ను విరిగిపోయింది!" అని కోతి అరిచింది.





నొప్పిగా ఉన్న దవడను పట్టుకుని అటూ ఇటూ పరిగెత్తింది చిన్న కోతి. ఒక్కసారిగా అది కిందకి ఉన్న ఒక కొమ్మకు రుద్దుకుంది. ఆ కొమ్మ నిండా పండిన బేరి పండ్లు ఉన్నాయి!

కోతి ఒక బేరి పండును తెంచి చెట్టు కాండానికి కొట్టింది. పగిలిన పండు నుంచి గట్టి, నల్లటి విత్తనాలను తీసుకుని నోటిలో పెట్టుకుంది.

"ఛూ!" అని అరుస్తూ అది విత్తనాలను ఊసేసింది.

"బేరి పండు రుచికరంగా ఉందా?" పైన ఎగురుతున్న ఒక నీలి పక్షి అడిగింది.

పగిలిన బేరి పండును పక్షిపైకి విసిరింది చిన్న కోతి. "ఇక నేను పండ్లు తినను!" అని అది అంది.

చీనా కథ






Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

12


నేను ఎవరు?



నేను ఆకాశాన్ని వెలిగిస్తాను
మీ కళ్లను మిరుమిట్లు గొలుపుతాను!

నేను ఏడుస్తూ పడిపోయినప్పుడు
భూమి నవ్వడం ప్రారంభిస్తుంది

మనిషి తయారు చేయని జాలికపై
మల్లెలు పూస్తాయి



నేను కొన్నిసార్లు గుండ్రంగా ఉంటాను
ప్రధానంగా తెల్లగా ఉంటాను
పగటిపూట నేను మసకబారతాను
కానీ రాత్రి బాగా వెలుగుతుంటాను!

నేను గాలిలో నిశ్శబ్దంగా లేస్తాను
నేను గాలిలో తెల్లగా పైన తేలుతూ ఉంటాను
కొన్నిసార్లు నల్లగా ఉంటాను, అప్పుడు బరువుగా
అనిపిస్తాను
నేను గర్జిస్తూ, కేకలు వేస్తాను, మళ్లీ
కిందపడిపోతాను



ఈ రంగురంగుల విల్లు

అందనంత ఎత్తులో ఉంది!

జీవులకు గాలి అవసరం – నాకు కూడా!

జీవులకు ఆహారం అవసరం – నాకు కూడా!

జీవులకు నీరు అవసరం - కానీ నాకు

కాదు!

నాకు నీరు ఇస్తే చనిపోతాను!

నా తలపై చాలా ఎత్తులో

ఒక అందమైన, విశాలమైన పైకప్పు ఉంది

కానీ నేను దగ్గరకు వెళ్లినప్పుడు

అది దూరంగా జరుగుతుంది!

అతను లేకుండా వర్షం కురవదు

అతను లేకుండా పంటలు ఏపుగా పెరగవు

అతను లేకుండా భూమి ఎన్నటికీ

బాగుపడదు

అతను లేకుండా నిద్ర ఎప్పటికీ అంతం

కాదు!





దొర్లుతూ, పరిగెత్తుతూ

దూకుతూ ఆడుతుంది

రంధ్రం చూసినప్పుడు

దాని మీదకు దూకుతుంది!

కాళ్లు లేకుండా అది తిరుగుతుంది

చేతులు లేకుండా తాకుతుంది

శరీరం లేకుండా ఆడుతుంది

జీవం లేకుండా ఒక ప్రదేశంలోకి

ప్రవేశిస్తుంది,

మళ్లీ వెళ్లిపోతుంది

ఓహ్! ఇది పేదవాడి మంచం:

దానిని ఉదయం ఎవరూ చుట్టరు!

ఎప్పుడూ కదులుతూ, విశ్రాంతి తీసుకోను

నా పెద్ద కడుపులో లక్షలాది జీవులు

బరువైన ప్రతిదాన్నీ మింగేస్తాను

చెక్క వస్తువులను మాత్రం వదిలేస్తాను

అగ్ని, భూమి, గాలి, నీరు, ఆకాశం, సూర్యుడు,
సముద్రం, చంద్రుడు, నక్షత్రాలు, వర్షం, మేఘం,
ఇంద్రధనస్సు, మెరుపు

బిగుతుగా ఉండే పొర లాగా

నిన్ను మొత్తం కప్పేస్తాను

వేసవిలో చెమట పడుతుంది

చలికాలంలో వణుకుతాను

ఒక పొదపైన వెన్నుగడ్డ

రెండు వైపులా వాలుగా ఉంటుంది

వారు అక్కచెల్లెళ్లు

వారు పొరుగువారు

కలిసి పని చేస్తారు

కానీ ఎప్పుడూ కలవరు

నేను ప్రతి మాట వింటాను

కానీ విన్నదాన్ని ఎప్పుడూ చెప్పను

ఆప్యాయంగా, స్నేహపూర్వకంగా

వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తాను

విశాలమైన గదిలో ఉంటాను

నా ఇంటిని ఎప్పుడూ వదిలి వెళ్లను

నాలుక, ముక్కు, కళ్లు, చెవులు, చర్మం

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

ఎలుకల కవాతు

ఎలుకలను తేలికగా పట్టుకోటానికి ఒక తెలివైన పిల్లి ఒక పథకం వేసింది.


అది ఎలుకలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, "స్నేహితులారా! సంవత్సరాలుగా మిమ్మల్ని వేటాడి, వెంటడించి మీకు శాంతి లేకుండా చేశాను. ఇప్పుడు మనం ఒక సంధి కుదుర్చుకుందాం. సామరస్యంగా జీవించడానికి ప్రయత్నిద్దాం," అని చెప్పింది.

ఎలుకలు చాలా ఆశ్చర్యపోయాయి.

పిల్లి ఇలా కొనసాగించింది, "మీ పట్ల నా కరుణను ప్రతి ఉదయం, సాయంత్రం మీరు గుర్తించాలని మాత్రమే నేను అడుగుతున్నాను. రోజుకు రెండుసార్లు మీరందరూ నా ముందు కవాతు చేయాలి, నమస్కరించి, ముందుకు సాగాలి. అంతే!"

దాంతో ఎలుకలు అన్నీ ఆనందించాయి. వాటికి ఏ అనుమానం రాలేదు!

పిల్లి ప్రణాళికను మీరు ఊహించగలరా? అది సింహాసనంపై కూర్చుంటుంది. ఒకదాని తరవాత ఒకటి ఎలుకలు దాని ముందు వంగి, వెళ్లిపోతాయి. కానీ వరసలో చివరి ఎలుక పిల్లికి భోజనం అవుతుంది!



ప్రణాళిక చాలా రోజులు సజావుగా సాగింది. ఏదో జరుగుతోందని చాలా ఎలుకలు గ్రహించలేదు.

కానీ ఎలుకలలో తెలివైన స్నేహితులు ఉన్నాయి – అంటే, రంటే. ప్రతిరోజు వరసలో ఎలుకలు తగ్గిపోవటం ఈ రెండూ గమనించాయి. ఎలుకల సంఖ్య తగ్గిపోయింది!

అంటే, రంటే వెంటనే పిల్లిని అనుమానించాయి. రెండూ కలిసి ఆలోచించి, ఒక ప్రణాళికను రూపొందించాయి.

మరుసటి రోజు ఉదయం, అంటే వరసలో ముందు నిలబడి, "రంటే, ఎక్కడ ఉన్నావు?" అని పిలిచింది. రంటే వరసలో చివరిగా నిలబడింది. "నేను ఇక్కడే ఉన్నాను!" అని అది సమాధానం ఇచ్చింది.




వరస ముందుకు కదులుతున్నప్పుడు అవి ఒకదానినొకటి పేరు పెట్టి పిలుస్తూనే ఉన్నాయి. సాయంత్రం కూడా అవి అదే పని చేశాయి. ఈసారి వరసలో ముందు రంటే, చివర అంటే ఉన్నాయి.

పిల్లి కోపంగా ఉంది. ఈ కొత్త జీవన విధానం దానికి ఎంతో హాయిగా ఉంది. ప్రతి రోజు, రోజుకు రెండుసార్లు రుచికరమైన ఆహారం తన దగ్గరకు నడిచి వచ్చేది. అది ఒక అద్భుతమైన ఏర్పాటు!

కానీ ఇప్పుడు ఎలా? ఉదయం రంటేను పట్టుకుని తిన్నా లేదా సాయంత్రం అంటేను పట్టుకుని తిన్నా పిల్లి కుట్ర బయటడుతుంది.


ఆ రోజు పిల్లి ఆకలితో ఉంది. రాత్రి నిద్ర పట్టలేదు!



కానీ ఉదయపు వెలుతురు కొత్త ఆశను తెచ్చిపెట్టింది. 'నిన్న ఏదో అలా జరిగింది,' అని పిల్లి తనలో తాను అనుకుంది. 'ఈ రోజు చివరి ఎలుకను పట్టుకుంటాను.' అలా అనుకుంటూ తన సింహాసనంపై కూర్చోటానికి సంతోషంగా వెళ్లింది.

కానీ ఆ ఉదయం కూడా కవాతు సమయంలో అంటే, రంటే ఒకదానినొకటి పిలుచుకున్నాయి. సాయంత్రం కూడా అదే చేశాయి.

మరో నిద్రలేని రాత్రి గడిపింది పిల్లి! అది కోపంతో కేకలు వేసింది, "నాకంటే తెలివైనవా? నేనేంటో చూపిస్తాను!"



ఆ రాత్రి తమ స్నేహితులందరినీ అప్రమత్తంగా ఉండమని అంటే, రంటే హెచ్చరించాయి. "పిల్లి కళ్లల్లో ఏదైనా మార్పు గమనించినట్లైతే, వెంటనే పారిపోండి."






మరుసటి రోజు, అంటే, "రంటే, ఎక్కడ ఉన్నావు?" అని అరిచినప్పుడు ఎలుకల మీదకు పిల్లి దూకింది!

కానీ ఎలకలు దీనికి సిద్ధంగా ఉన్నాయి కదా? అవి మెరుపు వేగంతో పారిపోయాయి!

టిబెట్ కథ



P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

ఖాళీ కుండీ


చిన్నారి పింగ్‌కి మొక్కలు పెంచటం ఇష్టం. అతను ఏమి నాటినా పచ్చగా, చక్కగా పెరిగేవి. అతను పెంచిన మొక్కలు ఎప్పుడూ బాగా పూసేవి.

ఆ దేశ రాజుకి కూడా మొక్కలు అంటే ఇష్టం. అతని పూల తోటలంటే అతనికి గర్వం, ఆనందం. మరే దేశంలో ఇంత చక్కటి గాలి ఉండదు!

ఒక రోజు రాజు తన నమ్మకమైన మంత్రితో ఇలా అన్నాడు, "నేను వారసుడిని ఎన్నుకోవలసిన సమయం వచ్చింది. ఈ రాజ్యంలోని పిల్లలను రాజభవనానికి ఆహ్వానించండి."

అందరూ సమావేశం అయినప్పుడు, వారితో రాజు మాట్లాడాడు. "ప్రియమైన పిల్లల్లారా! ఈ రోజు మీ అందరికి కొన్ని పూల విత్తనాలు ఇస్తాను. ఈ విత్తనాల నుండి అందమైన పువ్వులను పెంచిన బాలుడు నా వారసుడు అవుతాడు, నా తరవాత నా రాజ్యాన్ని పరిపాలిస్తాడు," అని రాజు చెప్పాడు.

రాజు నుండి విత్తనాలను పిల్లలు ఉత్సాహంగా అందుకున్నారు.



చిన్నారి పింగ్ ఇంటికి వెళ్లి రాజు ఇచ్చిన కొన్ని విత్తనాలను ఒక కుండీలో విత్తాడు. అతను ప్రతిరోజూ నీళ్లు పోస్తూ అవి ఎప్పుడు మొలకెత్తుతాయా అని ఎదురు చూస్తున్నాడు.

ఒక వారం గడిచినా మొలకలు రాలేదు! పింగ్ మట్టి మార్చి చూశాడు. అతను విత్తనాలను ఒక పెద్ద కుండీలో నాటి చూశాడు. కానీ విత్తనాలు మొలకెత్తలేదు!



నిర్ణీత రోజున రాజ్యంలోని అన్ని దారులు పూలతో నిండిపోయాయి. మత్తెక్కించే పూల వాసనతో గాలి నిండిపోయింది.

ఆనందంగా వెళుతున్న పిల్లల గుంపును చూస్తూ పింగ్ కిటికీ దగ్గర కూర్చుని ఉన్నాడు. అతని గుండె బద్దలౌతోంది.

‘రాజు ఇచ్చిన విత్తనాల నుండి మిగతా పిల్లలందరూ మొక్కలు పెంచగలిగారు. నేను మాత్రమే చెయ్యలేకపోయాను,' అని అతను అనుకున్నాడు. ‘నా ఖాళీ కుండీని చూసి అందరూ నవ్వుతారు.’ రాజభవనానికి వెళ్లకూడదని అతను నిర్ణయించుకున్నాడు.





కానీ పింగ్ తండ్రి అతన్ని ప్రోత్సహించాడు. "నీ శక్తి మేరకు ప్రయత్నించావు. అదే ముఖ్యం!" అని అతను చెప్పాడు.

రాజభవనంలో పిల్లలు తెచ్చిన మొక్కలను రాజు పరిశీలిస్తున్నాడు. ప్రతి ఒక్కరినీ చూస్తూ దయగా నవ్వాడు కానీ ఎక్కడా ఆగలేదు.

పింగ్ పరిగెత్తుకుంటూ వచ్చినప్పుడు, రాజు అతన్ని పిలిచి, "నువ్వు ఖాళీ కుండీ ఎందుకు తెచ్చావు?" అని అడిగాడు.

పింగ్ ఏడవడం ప్రారంభించాడు. "మీరు ఇచ్చిన విత్తనాలను మంచి మట్టిలో విత్తాను. ప్రతిరోజూ వాటికి నీళ్లు పోశాను. కానీ అవి మొలకెత్తలేదు! నేను మట్టిని మార్చాను. కుండీని కూడా మార్చాను. కానీ విత్తనాలు మొలకెత్తలేదు," అని అతను చెప్పాడు.








రాజు సంతోషించాడు! పింగ్ వైపు చూసి నవ్వాడు. ఆశగా చూస్తున్న పిల్లల వైపు తిరిగాడు. "మీ పువ్వులు చాలా బాగున్నాయి! కానీ నేను ఇచ్చిన విత్తనాల నుండి అవి రాలేదు. మీకు ఉడకబెట్టిన విత్తనాలు ఇచ్చాను. అవి మొలకెత్తవు!" అని అతను అన్నాడు.

పింగ్ వైపు రాజు తిరిగాడు. "ఖాళీ కుండీతో నా దగ్గరకు వచ్చినందుకు నిన్ను అభినందిస్తున్నాను!" అని అతను అన్నాడు.

అప్పుడు, "నిజాయితీపరుడైన ఈ పింగ్ నా తరవాత రాజు అవుతాడు," అని ప్రకటించాడు.

చీనా కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist S. P. Raju

దర్జీ, చంద్రుడు



ఒక గ్రామంలో ఒక దర్జీకి చిన్న దుకాణం ఉండేది. అతను ఒక సాధారణ వ్యక్తి, తన పని చాలా శ్రద్ధగా చేసేవాడు. అతను కుట్టిన బట్టలు వాటి అందానికి, వెచ్చదనానికి ప్రసిద్ధి చెందాయి.

ఒక రోజు దర్జీ తన దుకాణాన్ని ముందుగానే మూసివేశాడు. తన కోటును తన చుట్టూ లాక్కుని, చల్లటి సాయంత్రంలో బయలుదేరాడు. ఉన్నట్టుండి అతనికి ఒక మృదువైన స్వరం వినిపించింది.



"నాకు చాలా చలిగా ఉంది," అని ఆ గొంతు అంది, "నేను చాలా దూరం ప్రయాణం చేయాలి. నా కోసం ఒక కోటు కుడతావా?"

దర్జీ చుట్టూ చూశాడు. అతను చూడగలిగినంత వరకు దారిలో ఎవరూ లేరు.

"పైకి చూడు, ఇక్కడ ఉన్నాను," అని ఆ గొంతు అంది. అది మరెవరో కాదు, చంద్రవంక!

చంద్రుని వైపు చూశాడు దర్జీ. అది ఆకాశంలో ఎత్తుగా, చాలా చిన్నదిగా కనిపించింది.

'పాపం! నెలవంక చలికి తట్టుకోలేకపోతోంది,' అని అతను అనుకున్నాడు. దానికి మంచి, వెచ్చని కోటు కుట్టడానికి అతను ఒప్పుకున్నాడు.

మరుసటి రోజు ఉదయం, మిగిలిపోయిన పట్టు గుడ్డను నెలవంక ఆకారంలో కత్తిరించాడు దర్జీ. మూడు రోజుల్లో కోటు కుట్టే పని పూర్తి చేశాడు. అది తెల్లగా, సాదాగా ఉంది. దానికి మందపాటి లోపలి పొర ఉంది.


చంద్రుడు చాలా సంతోషించాడు. ఆ కోటును తీసుకుని వేసుకోడానికి ప్రయత్నించాడు. కానీ కోటు చాలా చిన్నగా ఉంది!

"నువ్వు నా కొలతలు తీసుకోలేదు," కోప్పడ్డాడు చంద్రుడు. "అందుకే ఈ కోటు చాలా చిన్నగా అయ్యింది."

సహాయం చేయడానికి ఒక గద్ద ముందుకు వచ్చింది. "నీ కొలత టేపు నాకు ఇవ్వు," అని దర్జీని అడిగింది. "నేను చంద్రుడిని కొలుస్తాను!"

చంద్రుని చుట్టూ గద్ద ఎగిరింది. అది తిరిగి వచ్చి దర్జీకి కొలతలు చెప్పింది. కొత్త, బాగా సరిపోయే కోటు తయారు చేస్తానని దర్జీ మాట ఇచ్చాడు.

ఈ పండగ సమయంలో దర్జీకి చాలా పని ఉంటుంది. కోటును పూర్తి చేయడానికి అతనికి వారం పట్టింది! అతను దానిని మంచి ఉన్నితో కుట్టాడు. కాలరు, చేతుల మీద వెండి దారంతో కుట్టాడు. కోటు నిజంగా చాలా అందంగా ఉంది!





ఆ ఎంబ్రాయిడరీని చూసి, "బాగా కుట్టావు, దర్జీ!" అని చంద్రుడు మెచ్చుకున్నాడు. కానీ కోటు దానికి సరిపోలేదు!

ఇప్పుడు దర్జీకి కోపం వచ్చింది. "చూడు నువ్వు ఎంత లావుగా అయ్యావో!" అన్నాడు. "ఈ కోటు నీకు ఎప్పటికీ సరిపోదు!"

"ఇంకొక్కటి కుట్టు. మళ్లీ అడగనని హామీ ఇస్తున్నాను," అన్నాడు చంద్రుడు.

"ఇదే చివరిది అవుతుంది!" అంటూ దర్జీ ఒప్పుకున్నాడు. "నువ్వు మళ్లీ లావెక్కవని ఆశిస్తున్నాను."





ఈసారి అతను బట్టల ముక్కలను సేకరించి ఒక పెద్ద కోటు కుట్టాడు. అది దాదాపు గుండ్రంగా ఉంది, దానికి తెల్లటి నూలు కుచ్చులు ఉన్నాయి. వెండి గుండీలతో కోటు అద్భుతంగా ఉంది!



దర్జీ దానిని చంద్రుడికి ఇచ్చాడు. కానీ ఇప్పుడు చంద్రుడు గుండ్రంగా ఉన్నాడా?

"ఈ పెద్ద కోటు నన్ను చలి నుండి ఎలా కాపాడుతుంది?" కోటు మీద డిజైన్‌ను గమనించకుండా చంద్రుడు గొణిగాడు. చంద్రుడి చుట్టూ కోటు వదులుగా వేలాడుతోంది.

"ఇలా ఎందుకు అయ్యిందో నాకు తెలియదు!" కోపంగా అన్నాడు దర్జీ.



అప్పటి నుండి మన హృదయాలను ఉత్తేజపరిచే అందమైన పౌర్ణమి చంద్రుడిని చూడటం దర్జీకి ఆనందాన్ని కలిగించేది కాదు.

'ఆ మారే చంద్రుడిలాంటి మరొక వ్యక్తి తారసపడకూడదని కోరుకుంటున్నాను!' అతను తనలో తాను గొణుక్కున్నాడు.

నిరుపమ రాఘవస్ కథ ఆధారంగా

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist S. P. Raju


మాయా మామిడి

చాలా కాలం క్రితం ఒక అడవిలో ఒక పెద్ద మామిడి చెట్టు ఉండేది. ఒక రోజు బలమైన గాలికి ఆ చెట్టు ఊగింది. పండిన ఒక మామిడి పండు నేలపై పడింది. ఇది సాధారణ మామిడి కాదు: మాయా మామిడి!

మాయా మామిడి చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు అది స్వేచ్ఛగా తిరుగుతూ ప్రపంచాన్ని చూడగలదు.

అది అడవి నుండి పొలంలోకి దొర్లింది. అది ఒక మేకను కలిసే వరకు దొర్లుతూనే ఉంది.

మేక నిద్రమత్తుగా మేస్తోంది. అప్పుడు అది మాయా మామిడిని చూసింది. "ఆగు! నిన్ను తినాలని అనుకుంటున్నాను!" అని మేక అరిచింది.



కానీ మాయా మామిడి నవ్వింది. అది ఇలా పాడింది,


నేను మాయా మామిడిని

నన్ను ఎవరూ పట్టుకోలేరు

నేను దొర్లుతాను, పరిగెత్తుతాను

నేను గాలి కంటే వేగం!

నన్ను చూడు- నేను స్వేచ్ఛా జీవిని!



మాయా మామిడి వేగంగా దొర్లింది. దాని వెనక మేక పరిగెత్తుతూ ఉంది.

ఒక పల్లెటూరి పిల్లవాడు గాలిపటం ఎగరవేస్తున్నాడు. దొర్లుకుంటూ వెళుతున్న మాయా మామిడిని అతడు చూశాడు. "ఆగు! నిన్ను తినాలని అనుకుంటున్నాను!" అని అతను అన్నాడు.

మామిడికాయ మళ్లీ నవ్వుతూ పాడింది,

నేను మాయా మామిడిని

ఎవరూ నన్ను పట్టుకోలేరు

నేను దొర్లుతాను, పరిగెత్తుతాను

నేను గాలి కంటే వేగం!

నన్ను చూడు- నేను స్వేచ్ఛా జీవిని!


మామిడికాయ వేగంగా దూసుకుపోయింది.

మేక, బాలుడు దాని వెనకే పరిగెత్తారు.



కొంతమంది అమ్మాయిలు తోటలో ఆడుకుంటున్నారు. వాళ్లు మామిడికాయను చూసి, "ఆగు! నిన్ను తినాలని అనుకుంటున్నాం!" అని పిలిచారు. వాళ్లు కూడా మాయా మామిడికాయ వెంట పరిగెత్తడం ప్రారంభించారు.

మామిడికాయ దాని వేగాన్ని రెట్టింపు చేసింది. ఇప్పుడు అది పిల్లల కంటే చాలా ముందు ఉంది. మేక కూడా దానంత వేగంగా పరిగెత్తలేకపోయింది!



మామిడికాయ పాడింది,

నేను మాయా మామిడిని

ఎవరూ నన్ను పట్టుకోలేరు

నేను దొర్లుతాను, పరిగెత్తుతాను

నేను గాలి కంటే వేగం!

నన్ను చూడు- నేను స్వేచ్ఛా జీవిని!

అలా అది దొర్లుకుంటూ వెళ్లింది. మేక, బాలుడు, బాలికలు దాని వెనక పరిగెత్తుతున్నారు. కానీ మామిడికాయ వారికంటే చాలా వేగంగా పరిగెత్తుతోంది! త్వరలోనే అది వారి కంటే చాలా ముందుకు వెళ్లింది. ఆ మాయా మామిడికాయ పొలాలు, తోటలు, నీడనిచ్చే తోపులను దాటుకుంటూ వెళ్లింది. ఇంకా దొర్లుకుంటూ వెళుతూనే ఉంది.


అకస్మాత్తుగా బాగా అలసిపోయినట్లు దానికి అనిపించింది. పొడవైన గడ్డిలో దాక్కుని అది గాఢ నిద్రలోకి జారుకుంది.

చాలాసేపు - చాలా నెలలు అది నిద్రపోయింది! ఒక రోజు చర్మంపై సూర్యకిరణాల స్పర్శకి అది మేల్కొంది.

తాను మారానని దానికి అనిపించింది... అది మొలకెత్తుతోంది...

అవును! ఆ మాయా మామిడికాయ చెట్టుగా పెరుగుతోంది!

పాపువా న్యూ గినియా కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

పిచ్చుక బహుమతి



త్సే-రింగ్, చాం-బా పొరుగువారు. కానీ ఇద్దరి తత్వాలలో చాలా తేడా ఉంది . త్సే-రింగ్ కఠిన హృదయుడు, అసూయాపరుడు. చాం-బా దయగలవాడు, అవసరంలో ఉన్న ఎవరికైనా సహాయం చేస్తాడు.

ఒక రోజు చాం-బా తన ఇంటి దగ్గర ఉన్న చెట్టు నుండి ఒక పిచ్చుక పిల్ల పడిపోవడం చూశాడు. దగ్గరికి వెళ్లి దానిని ఎత్తుకున్నాడు. పాపం పిచ్చుక! దాని కాలు విరిగిపోయింది! చాం-బా జాగ్రత్తగా మూలికల పసరు రుద్ది, కాలికి కట్టు కట్టాడు. తరవాత, పక్షి పిల్లను తిరిగి గూడులో పెట్టాడు.

ఎగరటం నేర్చుకున్న తరవాత ఆ పిచ్చుక వచ్చి చాం-బా భుజంపై వాలింది. దాని ముక్కు విత్తనాలతో నిండి ఉంది. "నువ్వు నా ప్రాణాన్ని కాపాడావు," అంటూ ఆ విత్తనాలను చాం-బాకి ఇచ్చింది. "ఈ విత్తనాలను నాటు. ఏమి వస్తుందో వేచి చూడు!" అంటూ అది ఎగిరిపోయింది.

చాం-బా విత్తనాలను విత్తాడు. త్వరలోనే మొక్కజొన్న పంట ఏపుగా పెరిగింది. మొక్కలు పొడవుగా, బంగారు రంగులో పెరిగాయి. ఒక రోజు అతను చేనులోకి వచ్చి ఒక అద్భుతమైన దృశ్యాన్ని చూశాడు! మొక్కజొన్న గింజలకు బదులుగా విలువైన రత్నాలు మెరుస్తున్నాయి. అది ఒక అద్భుతం! రత్నాలతో బజారుకు వెళ్లాడు చాం-బా. అతను ధనవంతుడిగా ఇంటికి తిరిగివచ్చాడు!

ఇప్పుడు చాం-బా తన కుటుంబం కోసం ఒక పెద్ద బంగళా కట్టుకుని, పేదల సేవకు అంకితం అయ్యాడు. అతను చాలా సంతోషంగా ఉన్నాడు!

చాం-బా జీవితంలో వచ్చిన మార్పులను త్సే-రింగ్ గమనిస్తున్నాడు. ‘అతను అంత ధనవంతుడు ఎలా అయ్యాడు?’ అని ఆశ్చర్యపోయాడు. ఆ విషయం తెలుసుకుందామని త్సే-రింగ్ వెళ్లాడు. గూడు నుండి పడిపోయిన పిచ్చుక పిల్ల గురించి, దాని విరిగిన కాలు గురించి త్సే-రింగ్‌కు చాం-బా చెప్పాడు.





తరవాత తనకు బహుమతిగా దొరికిన విత్తనాల గురించి అతనికి చెప్పాడు. ఏమీ దాచకుండా మొత్తం కథ చెప్పాడు. ‘చాం-బా లాగా నేను కూడా ధనవంతుడిని ఎందుకు కాకూడదు?’ అని ఆలోచిస్తూ త్సే-రింగ్ ఇంటికి వెళ్లాడు. విలువైన రత్నాలను తానూ సంపాదించాలని నిర్ణయించుకున్నాడు!

పిచ్చుక గూడు దొరికే వరకు చెట్లలో వెతికాడు త్సే-రింగ్. పిచ్చుక పిల్ల కింద పడే వరకు ఆ చెట్టును ఊపాడు. తరవాత పిచ్చుక పిల్లను చేతుల్లోకి తీసుకుని, దాని విరిగిన కాలు మీద మూలికల పసరు రుద్ది, కట్టు కట్టాడు. తరవాత పక్షిని తిరిగి గూడులో పెట్టాడు.


కొంతకాలం తరవాత పిచ్చుక వచ్చి అతని చేతిలో కొన్ని విత్తనాలను పోసి, "వీటిని నాటు, ఏమి వస్తుందో వేచి చూడు!" అని చెప్పింది.

త్సే-రింగ్ విత్తనాలు విత్తాడు. త్వరలోనే మొక్కజొన్న పంటకి వచ్చింది. రత్నాల కోసం ప్రతిరోజూ అతను కంకులను చూస్తున్నాడు.

ఒక రోజు అతను పొలానికి వచ్చి భయంకరమైన దృశ్యాన్ని చూశాడు! మొక్కజొన్న పంట స్థానంలో, ఒక భయంకరమైన రాక్షసుడు అతని వైపు చూస్తూ నిలబడ్డాడు. దాని చేతిలో ఒక పెద్ద కత్తి ఉంది!

వీలైనంత వేగంగా తన ఇంటికి త్సే-రింగ్ పరిగెత్తాడు. రాక్షసుడు అతన్ని అనుసరించాడు. త్సే-రింగ్ అన్నీ ఆభరణాలను, నగదును లాక్కుని పూఫ్‌మని గాలిలో అదృశ్యం అయ్యాడు!

టిబెట్ జానపద కథ



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi


Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

18

చెప్పినట్టు చేసే డూఫీ



అత్తను చూడటానికి డూఫీ తరచు వెళుతుండేవాడు. డూఫీ అంటే ఆమెకి ఎంతో ఇష్టం. ఇంటి పని చేసుకుంటున్నప్పుడు అతన్ని ఆమె ఆడుకోనిచ్చేది. తిరిగి వెళుతున్నప్పుడు, అతను ఇంటికి తీసుకెళ్లడానికి ఆమె ఎప్పుడూ ఏదో ఒకటి ఇచ్చేది.



ఒక రోజు, డూఫీ అత్త అతనికి ఒక పెద్ద చాక్లెట్ కేక్ ఇచ్చింది. గట్టిగా పట్టుకుని, దానిని పడనివ్వవద్దని డూఫీకి ఆమె చెప్పింది. గెంతుకుంటూ ఇంటికి వెళుతూ కేక్‌ను చేతుల మధ్య నలిపేశాడు డూఫీ. అయ్యో! అతను ఇంటికి చేరుకునేసరికి కేక్ తుంపులు తుంపులు అయిపోయింది.

"కేక్‌ను ఎలా తీసుకురావాలో తెలియదా, డూఫీ?" అతని తల్లి ముఖం చిట్లించింది. "ఆకులలో చుట్టి టోపీ కింద పెట్టుకోవాలి."

మరుసటి వారం డూఫీకి అత్త ఒక పెద్ద వెన్న ముద్ద ఇచ్చింది. దానిని ఆకులలో జాగ్రత్తగా చుట్టి టోపీ కింద పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు.



ఆ రోజు చాలా వేడిగా ఉంది! డూఫీ ఇంటికి వచ్చేసరికి అతని ముఖం అంతా వెన్న కారి ఉంది. అతని చొక్కా మీదకి కూడా వెన్న కారుతోంది! అదంతా శుభ్రం చెయ్యటం చాలా పని!


డూఫీని చూసి తల్లి అదిరిపడింది. "ఏం చేశావ్, డూఫీ! వెన్న అలా తీసుకుని రాకూడదు! చల్లటి నీటిలో పెట్టుకుని తీసుకుని రావాలి," ఆమె చెప్పింది.

మరుసటి వారం, డూఫీ అత్త అతనికి ఒక అందమైన కుక్కపిల్లని ఇచ్చింది. డూఫీ దానిని చల్లటి నీటి తొట్టిలో పెట్టాడు. అది వణుకుతూ, ఇంటికి వెళ్లే వరకు అరుస్తూనే ఉంది!

"ఏం చేశావు?" డూఫీ తల్లి అడిగింది. "పాపం ఆ కుక్కపిల్ల చలికి వణికిపోతోంది! దాని మెడ చుట్టూ తాడు కట్టి, తీసుకుని రావాలి."

మరోసారి వెళ్లినప్పుడు, డూఫీకి తాజాగా చేసిన బ్రెడ్ ఇచ్చింది అత్త. 'దీనిని ఎలా తీసుకుని వెళ్లాలి?' డూఫీ ఆలోచించాడు. 'ఆ! తాడు!' బ్రెడ్‌కి జాగ్రత్తగా ఒక తాడు కట్టి రోడ్డు వెంట దానిని లాక్కుంటూ వెళ్లాడు!

బ్రెడ్‌ని తాడుతో లాక్కుని వస్తున్న డూఫీని చూసి అతని తల్లికి మూర్ఛ వచ్చినంత పని అయ్యింది. కానీ ఈసారి ఆమె డూఫీని తిట్టలేదు. "మీ అత్త చాలా మంచిది! ఇప్పుడు కాకుండా ఆమెను చూడటానికి సెలవల్లో వెళదాం. ఆమె ఇచ్చే బహుమతులు అన్నీ అప్పుడు తెచ్చుకుందాం!"




ఆ తరవాత అంతా ప్రశాంతంగా ఉంది. కానీ డూఫీ లాంటి కొడుకుతో ప్రశాంతత ఎంతో కాలం ఉండదు!

ఒక రోజు, జబ్బు చేసిన బంధువును చూడటానికి డూఫీ వాళ్ల అమ్మ వెళ్లాల్సి వచ్చింది. ఆమె బయలుదేరేటప్పుడు, "డూఫీ, కొన్ని అప్పడాలు ఎండబెట్టాను. కాబట్టి చూసి అడుగులు వెయ్యి," అని చెప్పింది.

కొంచెంసేపు తరవాత అప్పడాలను చూడటానికి డూఫీ వెళ్లాడు. అమ్మ ఏం చెప్పింది? ఆ, అవును: "చూసి అడుగులు వెయ్యి!" దాంతో అతను ప్రతిదాని మీద అడుగులు వేశాడు!

యూరోపియస్ కథ ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist S. P. Raju

టున్టుని



టున్టుని అనే ఆకుల పోతడు పిట్ట రాజు తోటలో పండ్లు తింటోంది. అయ్యో! దాని మెడలో ఒక ముల్లు గుచ్చుకుంది!

ఏడుస్తూ, నిట్టూరుస్తూ రాజభవన మంగలి వద్దకు వెళ్లి ముల్లుని బయటకు తీయమని అడిగింది టున్టుని.

"నేను రాజుకి మంగలిని! చిన్న పక్షి అయిన నీకు సహాయం చేయను! పో!" అని అతను అన్నాడు.

రాజు వద్దకు ఎగిరింది టున్టుని. "నేను చాలా బాధలో ఉన్నాను! కానీ మంగలి నాకు సహాయం చేయటం లేదు! అతన్ని శిక్షించండి!" అని అది చెప్పింది.

రాజు పగలబడి నవ్వాడు.

ఎలుక వద్దకు ఎగిరి టున్టుని ఇలా చెప్పింది,

ఓ ఎలుకా! నేను చాలా బాధలో ఉన్నాను. కానీ మంగలి నాకు సహాయం చేయలేదు! మంగలిని రాజు శిక్షించలేదు! రాజు నిద్రపోతున్నప్పుడు వెళ్లి కొరుకు!

కానీ ఎలుక పారిపోయి దాని కలుగులో దాక్కుంది. టున్టుని పిల్లి వద్దకు వెళ్లి ఇలా చెప్పింది,

ఓ పిల్లీ! నేను చాలా బాధలో ఉన్నాను.

కానీ మంగలి నాకు సహాయం చేయలేదు!

మంగలిని రాజు శిక్షించ లేదు!

రాజును ఎలుక కొరక లేదు!

ఆ ఎలుకను పట్టుకుని తిను!



కానీ, "ఇప్పుడు కాదు! నాకు చాలా నిద్ర వస్తోంది!" అని చెప్పింది పిల్లి.

కర్ర వద్దకు ఎగిరి టున్‌టుని ఇలా చెప్పింది,

ఓ కర్రా! నాకు చాలా నొప్పిగా ఉంది

ఎలుకను పిల్లి పట్టుకోలేదు! వెళ్లి ఆ సోమరి పిల్లిని కొట్టు!

కానీ, "నేను పిల్లిని ఎందుకు కొట్టాలి? పిల్లి నన్ను ఎప్పుడూ బాధించలేదు!" అని చెప్పింది కర్ర.

పాపం టున్‌టుని ఏడ్చింది! అప్పుడు అది నిప్పుని చూసింది. దాని చుట్టూ తిరుగుతూ ఇలా చెప్పింది,

ఓ నిప్పూ! నాకు చాలా నొప్పిగా ఉంది.

కర్రని పిల్లి కొట్టలేదు!

వెళ్లి ఆ పనికిరాని కర్రను కాల్చివేయి!

"నేను రోజంతా మండుతున్నాను. ఇప్పుడు అలసిపోయాను. ఆ పని చెయ్యను!" అని నిప్పు చెప్పింది.

నది వద్దకి ఎగిరి టున్‌టుని ఇలా చెప్పింది,

ఓ నదీ! నాకు చాలా బాధగా ఉంది

కర్రను నిప్పు కాల్చలేదు!

వరదలా పొంగి ఆ పని చెయ్యని నిప్పుని ఆర్పెయ్యి!

కానీ నది నిశ్శబ్దంగా ప్రవహించింది. ఏనుగు వద్దకు ఎగిరి, టున్‌టునీ ఇలా చెప్పింది

ఓ ఏనుగు! నేను చాలా బాధలో ఉన్నాను

నిప్పున నది ఆర్పలేదు!

ఆ పొగరుబోతు నదిని నువ్వు తాగెయ్యి

"నేనా? నదిని తాగేస్తే, నా పొట్ట పగిలిపోతుంది!" అని అంది ఏనుగు. టున్‌టునీ అలసిపోయింది. విశ్రాంతి తీసుకోవడానికి ఒక చెట్టు కొమ్మపై కూర్చుంది.

దాని కళ్లు మూతపడ్డాయి. అప్పుడు, "బజ్, బజ్, బజ్," అంటూ దోమ శబ్దం వినిపించింది.


ఉన్నట్టుండి టున్‌టునీకి ఆశ పుట్టింది!

ఓ దోమా! నేను చాలా బాధలో ఉన్నాను

నది నీటిని ఏనుగు తాగలేదు!

వెళ్లి ఆ తెలివితక్కువ ఏనుగును బాగా కుట్టు!

"అలాగే, టున్‌టునీ!" అంది దోమ.



అప్పుడు అక్కడ ఉన్న దోమలన్నీ ఏనుగు మీద దాడి చేసి కుట్టిపెట్టాయి. ఏనుగు భయపడిపోయింది. నదిలో దాక్కునేందుకు అది పరిగెత్తింది. కానీ దోమలు దాని వెంటపడ్డాయి!


దాంతో, "నేను నదిని తాగుతాను," టున్‌టునీతో చెప్పింది ఏనుగు.

దాంతో, "నేను నిప్పును ఆర్పేస్తాను!" అంటూ నది వరదై పొంగింది.

అప్పుడు, "నేను కర్రను కాల్చేస్తాను," అంటూ నిప్పు భగ్గున మండింది.

వెనక్కి దూకి, "నేను పిల్లిని కొడతాను," అంది కర్ర.

"నేను ఎలుకను పట్టుకుంటాను!" అంటూ పిల్లి మేల్కొంది.



"నేను రాజును కొరుకుతాను!" అంటూ ఎలుక అరిచింది.

"నేను మంగలిని శిక్షిస్తాను!" అన్నాడు రాజు.

భయపడిపోయిన మంగలి టున్‌టునీ మెడ నుండి ముల్లును తీసేశాడు.


టున్‌టుని ఇప్పుడు ఎంత హాయిగా ఉందో ఊహించుకోండి!

బెంగాలీ జానపద కథ

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

కొత్త స్నేహితుడు



ఒకప్పుడు ఒక ఉడుత, కుందేలు దట్టమైన అడవిలో ఉండేవి. అవి మంచి స్నేహితులు. చాలా సమయం కలిసి గడిపేవి.



ఈ ఉడుత ఎప్పుడూ ఆసక్తిగా ఉండేది ప్రపంచంలో ఉన్న ప్రతి దాని గురించి తెలుసుకోవాలని అనుకునేది. కానీ దాని స్నేహితుడు కుందేలు ఏ ప్రశ్నకూ తిన్నగా సమాధానం ఇవ్వదు. అదృష్టవశాత్తూ, ఆ రెండింటికీ చిక్కుముడులు, పొడుపు కథలు ఇష్టం!

ఒక రోజు ఉదయం కుందేలు ఎక్కడికో వెళుతుండటం ఉడుత చూసింది. దానిని అందుకోటానికి అది పరిగెత్తింది.

ఉడుత: కుందేలూ, ఇంత ఉదయమే ఎక్కడికి వెళుతున్నావు?

కుందేలు: నా కొత్త స్నేహితుడితో ఆడుకోటానికి వెళుతున్నాను!





ఉడుత: నిజంగా! నీ కొత్త స్నేహితుడు ఎవరు?

కుందేలు: నువ్వు ఊహించు! దాని గురించి ఒక విషయం చెబుతాను: దానికి నాలుగు కాళ్లు.

ఉడుత: ఎవరబ్బా? మనందరికీ నాలుగు కాళ్లు ఉన్నాయి! ఓహో, నీ స్నేహితుడు ఎవరో నేను కనుక్కోవాలి. హ్మ్మ్, చూద్దాం...

కుందేలు: ఎవరని అనుకుంటున్నావు?

ఉడుత: ఊఁ... అది పెద్ద జంతువా?

కుందేలు: అవును!

ఉడుత: నాకు అర్థమైంది! నీ స్నేహితుడు ఏనుగు!

అడవిలో అతి పెద్ద జంతువు ఏనుగు!

కుందేలు: తప్పు! నా కొత్త స్నేహితుడికి పొడవైన తొండం లేదు.

ఉడుత: అయితే ఖడ్గమృగం అయి ఉండాలి!

ఖడ్గమృగానికి తొండం లేదు!

కుందేలు: లేదు, లేదు! నా కొత్త స్నేహితుడికి కొమ్ము లేదు.

కుందేలు వేగంగా నడుస్తోంది. ఉడుత దాని వెంట పరిగెత్తింది.

ఉడుత: ఆగు! నాకు తెలుసు! నీ కొత్త స్నేహితుడు ఒంటె!

ఒంటెకు నాలుగు కాళ్లు ఉన్నాయి. దానికి తొండం లేదు, కొమ్ము లేదు.





కుందేలు: కానీ నా కొత్త స్నేహితుడికి మూపురం కూడా లేదు.

కుందేలు పరిగెత్తసాగింది.

ఉడుత: అయితే ఇంకెవరు? ఆహా! అది చారల గుర్రం అయి ఉండాలి!

కుందేలు: హో, హో, హో! నా స్నేహితుడికి చారలు లేవు!

ఇక చాలు, నేను తొందరగా వెళ్లాలి.


ఉడుత: ఆగు! నీ స్నేహితుడు ఎలుగుబంటి అనుకుంటున్నాను!

కుందేలు: కానే కాదు! నా స్నేహితుడికి ఎలుగుబంటి లాగా బొచ్చు లేదు!

ఉడుత: అలాగా? అయితే, నీ స్నేహితుడికి మచ్చలు ఉన్నాయా?







కుందేలు: అవును! మచ్చలు ఉన్నాయి!

ఉడుత: అయితే నీ స్నేహితుడు చిరుత! కదా!

కుందేలు: నీకు పిచ్చా? చిరుత నన్ను తినేస్తుంది! ఏమైనా, నా స్నేహితుడికి చిరుత లాగా పదునైన గోళ్లు లేవు.

ఉడుత: ఇప్పుడు తెలిసింది! నీ స్నేహితుడు జింక.

కుందేలు: మళ్లీ తప్పు! నా కొత్త స్నేహితుడికి పొడవైన మెడ ఉంటుంది.

ఉడుత: ఆహ్, ఇప్పుడు చెప్పగలను: నీ స్నేహితుడు జిరాఫీ! అవునా?

కుందేలు: అవును, సరిగ్గా చెప్పావు! నాతో నువ్వూ రా. నా కొత్త స్నేహితుడు జిరాఫీ మనల్ని అడవిలో షికారుకికి తీసుకుని వెళతాడు!

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy



కలలు

ఆకాశం చీకటిగా ఉంది. వర్షం కురుస్తోంది. మీరా కిటికీ దగ్గర కూర్చుని చూస్తూ ఉంది. ఆమెకు వర్షం అంటే ఎంతో ఇష్టం!

మబ్బులు తొలగిపోయిప్పుడు, మీరా తన అక్క రాణితో కలిసి బయటకు పరిగెత్తింది. ఇంటి కప్పు నుండి పడే వాన చినుకులను పట్టుకోవడానికి వాళ్లు దోసిళ్లు పట్టారు. ఇంటి బయట ఉన్న నీటి మడుగులలోకి వాళ్లు దూకారు. వాటిల్లో చిన్న కాగితపు పడవలను వదిలారు. ఎంత సరదాగా ఉంది!

అకస్మాత్తుగా, మాయాజాలం లాగా, ఇంద్రధనస్సు కనిపించింది. ఎరుపు! నీలం! పసుపుపచ్చ! ఊదా! ఎంత అద్భుతమైన రంగులు! మీరా తన కళ్లను తిప్పుకోలేకపోయింది.



అప్పుడు, ఆకాశంలో ఒక వంతెన ఆమెకు కనిపించింది! ఓహ్, అది ఎక్కడికి వెళుతుంది? ఆమె వంతెన మీదుగా నడవసాగింది. ఆమె చుట్టూతా మొత్తం ప్రపంచం పరుచుకుని ఉంది!

"మీరా! అమ్మ నిన్ను పిలుస్తోంది!" రాణి గొంతు పీలగా వినిపించింది. దాంతో మీరా తిరిగి భూమి మీదకి వచ్చింది. ఆ దృశ్యం నెమ్మదిగా మసకబారింది.

మరుసటి రోజు ఆడపిల్లలు ఎప్పటిలాగా బడికి వెళుతున్నారు. ఆకాశంలో వారి పైన ఎగురుతున్న తెల్లటి కొంగలను వాళ్లు చూశారు.

మీరా కళ్లు మూసుకుంది. ఇప్పుడు ఆమె కూడా ఎగురుతోంది! అడవులు, కొండలు, నగరాలు, పట్టణాలు ఆమె కింద పరుచుకుని ఉన్నాయి. అంతలోనే, ఆమెను రాణి పిలిచింది.





మీరా సొంత ఊరిలో విగ్రహాలు, పురాతన దేవాలయాలు ఎంతో బాగుంటాయి. తనకు ఇష్టమైన శిల్పాలను చెక్కుతున్నట్టు ఆమె ఊహించుకుంది. ఏదో ఒక రోజు శిల్పి కావాలని ఆమె కోరిక!

గుడి పక్క నుంచి వెళుతన్నప్పుడల్లా, "మనం ఇద్దరం శిల్పులు అవుదాం!" అని రాణితో చెప్పేది.

వాళ్ల ఇంటి దగ్గర చాలా చేపలు ఉన్న చెరువు ఒకటి ఉంది.




ఆ చేపలు చేసే పనులు చూడటం మీరాకి ఇష్టం. అలా చూస్తూ ఆమె ఏదేదో ఊహించుకునేది. విశాలమైన సముద్రంలో ఆమె ఈదుతోంది! చాలా లోతులకు వెళుతోంది, అలల మీద ఎత్తుకు ఎగసిపడుతోంది.

"నువ్వు దేని గురించి కలలు కంటున్నావు? నాకు అన్నీ చెప్పు!" రాణి అడిగింది. తాను చూసినవన్నీ, చేసినవన్నీ మీరా చెప్పింది.

రాణి మనసు ఆ కథతో నిండిపోయింది. ఆమె కూడా కలల మాధుర్యాన్ని చవి చూస్తోంది. "ఈసారి నీతో నన్ను కూడా తీసుకుని వెళతావా?" ఆమె అడిగింది.

"తప్పకుండా!" మీరా నవ్వింది.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

ఒకదానిని తరుముతూ మరొకటి!

చాలా సంవత్సరాల నాటి సంగతి... అప్పుడు, కుక్క, పిల్లి, ఎలుక స్నేహితులుగా ఉండేవి. అవి అన్నీ సమానంగా పంచుకునేవి. పనిలో, ఆటలో ఒకదాని సావాసాన్ని ఇంకొకటి ఇష్టపడేది. అవి ప్రశాంతంగా జీవించేవి.

ఒకే ఒక్క విషయం వారిని బాధించేది... అది పొరుగున ఉన్నవి చేసే గోల. ఆ అరుపుల నుండి ముగ్గురు స్నేహితులు తప్పించుకోలేకపోయేవి.

"చూడండి, అవి ఎలా పోట్లాడుకుంటున్నాయో!" ఒక రోజు కుక్క అంది.




"మనలాగా అవి స్నేహంగా ఎందుకు ఉండలేవు?" అని అడిగింది పిల్లి.


"మనం ఎప్పుడూ పోట్లాడుకోకూడదని, ఎప్పటికీ స్నేహితులుగా ఉందామని మాట ఇద్దాం," అని ఎలుక అంది.

కుక్క, పిల్లికి ఈ ఆలోచన చాలా నచ్చింది. దాంతో, ఎలుక ఒక ఒప్పంద పత్రాన్ని రాసింది, దానిపై అవి సంతకం చేశాయి. ఆ ఒప్పంద పత్రాన్ని సురక్షితంగా ఉంచడానికి దానిని ఎత్తైన అరలో ఉంచింది పిల్లి.

ఆ ఒప్పందం ప్రకారం, ఇంటి బయట పనులు కుక్క చేసేది, ఇంటి లోపల పనులు పిల్లి, ఎలుక చేసేవి. అంతా బాగానే ఉంది...

కానీ, ఒక రాత్రి, కుక్క లోపలికి వచ్చి, "నేను ఒక్కడినే బయట ఎందుకు పని చేస్తున్నాను? చలి, తేమ నన్ను బాధపెడుతున్నాయి!" అని ఫిర్యాదు చేసింది.






అది పిల్లి వైపు కోపంగా చూసింది. "నువ్వూ, ఎలుకా ఎప్పుడూ వెచ్చగా, హాయిగా ఉంటున్నారు. ఇది న్యాయంగా లేదు!"

"కోపపడకు. మన ఒప్పంద పత్రాన్ని మరిచిపోయావా? ఎవరు ఏం చెయ్యాలో అందులో రాసి ఉంది," అని పిల్లి జవాబు ఇచ్చింది.

"ఆ ఒప్పంద పత్రాన్ని నాకు చూపించు!" అని కుక్క అంది.

అర పైకి ఎక్కింది పిల్లి. కానీ... అయ్యో! కాగితం అంతా ముక్కలుగా చిరిగిపోయి ఉంది! ఆ ఒప్పంద పత్రాన్ని పక్క లాగా ఎలుక ఉపయోగించుకుంటోంది! అది ఇప్పుడు కూడా అక్కడే నిద్రపోతోంది!

పిల్లి బుసలు కొట్టింది. తన పంజాతో ఎలుకని గీరింది.



అర నుండి దూకి ఎలుక పారిపోయింది.

"ఆ ఎలుక ఎక్కడ?" అని పిల్లి గుర్రుమంది. అర మీద నుండి దిగి ఎలుకను తరుముతూ పరిగెత్తింది.

"ఆ ఒప్పంద పత్రం ఎక్కడ?" అని కుక్క మొరిగింది. అది పిల్లిని తరమసాగింది.

అప్పటి నుండి, పిల్లులను కుక్కలు వెంబడిస్తున్నాయి. "ఆ ఒప్పంద పత్రం ఎక్కడ?" అని అవి మొరుగుతాయి. ఒప్పంద పత్రాన్ని ఎలుక ముక్కలుగా చేయడాన్ని పిల్లులు ఎప్పటికీ మరచిపోలేవు. అందుకే ఏ ఎలుక కనిపించినా వాటి వెంట పరిగెత్తుతాయి.

ఆ వేట అలా కొనసాగుతోంది - అది ఎప్పటికైనా ముగుస్తుందా?

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugui K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy


కోతుల ఉపవాసం

ఒక ప్రశాంతమైన ఉదయం, ఒక పెద్ద మర్రి చెట్టు నీడలో కోతుల గుంపు కూర్చుని ఉంది. అవి అలా నిశ్శబ్దంగా కూర్చోవడం వింతగా ఉంది.

కోతులు ఉపవాసం ఉండే రోజు ఇది!

ఉపవాసం మొదలైనట్లు కోతుల నాయకుడు ప్రకటించాడు. "సాయంత్రం భోజనానికి అన్నీ సిద్ధం చేయండి," అని కూడా చెప్పాడు.

అరటిపండ్ల గెలలను కోయడానికి పెద్ద కోతులు పరిగెత్తాయి.




గెలలతో పరిగెత్తుకుంటూ వచ్చి వాటిని నాయకుడి ముందు అవి ఉంచాయి.

"ఉపవాసం ముగిసిన తరవాత మనకు చాలా ఆకలిగా ఉంటుంది. సమయం వృధా కాకుండా ఇప్పుడే ఆహారాన్ని పంచుకుందాం," నాయకుడి భార్య చెప్పింది.

దానికి కోతులు అంగీకరించాయి. ఒక్కొక్కటిగా వచ్చి తమ వాటా అరటిపండ్లను తీసుకున్నాయి.

"ఒక అరటిపండు తొక్క తీసి సిద్ధంగా ఉంచుకుందామా?" ఒక చిన్న కోతి అడిగింది.






ఎంత అద్భుతమైన ఆలోచన! సాయంత్రానికి సిద్ధంగా ఉండటానికి కోతులు అన్నీ అరటిపండు తొక్క తీశాయి.

అప్పుడు తన నాన్నతో, "నా నోటిలో ఒక్క అరటిపండు ఉంచుకోవచ్చా? నువ్వు చెప్పే వరకు దానిని కొరకనని మాట ఇస్తున్నాను," అంటూ ఒక చిన్న పిల్ల గుసగుసలాడింది.

ఆ ఆలోచనకు తండ్రి కోతి ఎగిరి గంతువాడు. "తొక్క తీసిన అరటిపండును మన నోటిలో ఎందుకు ఉంచుకోకూడదు? ఉపవాసం ముగిసిన తరవాత మింగడానికి అవి సిద్ధంగా ఉంటాయి!" అంటూ అతను సూచించాడు.

తొక్క తీసిన అరటిపండ్లను వెంటనే కోతులు అన్నీ తమ నోటిలో పెట్టుకున్నాయి. అయితే అవన్నీ ఇబ్బంది పడసాగాయి. అవన్నీ ఒకదానినొకటి చూసుకున్నాయి.



తరవాత ఏమి జరిగిందని అనుకుంటున్నారు?

కనురెప్ప పాటులో అరటిపండ్లు అన్ని కోతుల గొంతులోకి జారిపోయాయి!

ఉపవాసం అలా సంతోషంగా ముగిసింది.

కన్నడ జానపద కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

24

నేను ఎవరు?



తినడానికి నిలబడతాను
తాగడానికి నిలబడతాను
పడుకోటానికి నిలబడతాను
గెలవడానికి పరిగెత్తుతాను

బిడ్డను పట్టుకుని చెట్లలో దూకుతాను
కొమ్మలలో ఊగుతూ మిమ్మల్ని వెక్కిరిస్తాను!

నీటిలో సంతోషంగా ఉంటాను
భూమి మీద కష్టపడతాను

విశ్వాసంగా ఉంటాను
స్నేహపూర్వకంగా ఉంటాను
ఇంటికి కాపలా ఉంటాను
మీ కోసం అన్నీ ఇస్తాను



నేను చాలా నిశ్శబ్దంగా నడుస్తాను - కానీ దొంగను కాదు!
దూకి పట్టుకుంటాను - కానీ పోలీసును కాదు!
చాలా నిద్రపోతాను - కానీ చిన్నపిల్లని కాదు
రోజంతా ఇంట్లోనే ఉంటాను - కానీ ముసలమ్మని కాదు

నేలపై జాగ్రత్తగా నడుస్తాను
చెట్లలో హాయిగా తిరుగుతాను
నా పొడపైన, గుబురు తోకతో
చెట్లలో దూకుతాను

అంతులేని అలల మీద
వస్తువులను, ప్రజలను తరలిస్తాను
మోటారు, తెరచాప లేకుండా
తీరం నుండి తీరానికి చేరతాను

నాలుగు రోకళ్లు దంచుతాయి
రెండు చేటలు ఆడతాయి
పొడవాటి గొట్టం ఊగుతుంది
చిన్న తాడు వేలాడుతుంది
స్థిరంగా, ప్రశాంతంగా
ఊరేగింపును ముందుండి నడిపిస్తుంది

పెద్దగా, బలంగా ఉంటాను
వంటి నిండా పొడపైన, నల్లటి బొచ్చు
శీతాకాలంలో నిద్రపోతున్నప్పుడు తప్ప
అడవి అంతా తిరుగుతాను

మీ కోసం కష్టపడి పనిచేస్తాను
మీ కోసం బరువులు మోస్తాను
కానీ మీరు కర్ర తీసుకుంటే
వెనక కాళ్లతో తన్నుతాను!

నాకు పది కాళ్లు ఉన్నాయి
కానీ ఎనిమిది కాళ్లతోనే నడుస్తాను
తిన్నగా నడవలేను కాబట్టి
పక్కకు నడుస్తాను

నాలుగు బలమైన కాళ్లు, చీలిన గిట్టలు
గుట్టలు, చెట్లలో తిరుగుతాను
లేత గడ్డి, ఆకుల కోసం వెతుకుతాను

నేను నెమ్మదిగా, కానీ స్థిరంగా నడుస్తాను
నన్ను రక్షించే బలమైన డిప్ప ఉంది
నాకు భయం వేస్తే,
తలని నా డిప్ప లోపలికి లాక్కుంటాను

గోడలపై, పైకప్పుపై నడుస్తాను
చటుక్కున పురుగులను పట్టుకుంటాను
ప్రాణాల కోసం తోకను వదులుకుంటాను -
మళ్లీ దానిని పెంచుకుంటాను

నేను పుట్టినప్పుడు తోక ఉంటుంది
కాళ్లు పెరగటంతో తోక పోతుంది
భూమి మీద నివసిస్తాను, కానీ నీళ్లు అంటే ఇష్టం –
నిజంగా నా అసలు స్థానం అదే

పొడవాటి కాళ్లు నేలపై గట్టిగా ఆనతాయి
పొడవాటి మెడ ఎంతో ఎత్తుకు చేరుతుంది
దొరికిన చిగుళ్లను రుచి చూస్తాను

పసుపుపచ్చ గడ్డం ఉన్న నన్ను చూసి
ప్రతి ఒక్కరూ భయపడతారు
గర్జిస్తూ వస్తే
వణుకుతూ పారిపోతారు



చీకటిలో ధైర్యంగా ఎగురుతాం
తలకిందులుగా వేలాడుతూ నిద్రపోతాం
మా పిల్లలకు పాలు ఇస్తాం
పళ్లు అంటే ఇష్టపడతాం

సింహం, ఏనుగు, కుక్క, ఉడుత, గాడిద, గుర్రం,
మేక, కోతి, జిరాఫీ, ఒంటె, పిల్లి, పీత, కప్ప, బల్లి, చేప,
గబ్బిలం, ఎలుగుబంటి, తాబేలు



© Katha Jharna 2008

P. Saraswati | V. Vijayakanthi
L. S. Saraswathi | S. Rajalakshmi


Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

అద్భుతమైన గాడిద

నస్రుద్దీన్‌కి ఒక గాడిద ఉండేది. దానికి కోపం ఎక్కువ, పని చేయడం అస్సలు ఇష్టపడదు. పైగా ఎప్పుడూ ఆకలితో ఉంటుంది!

దాంతో ఆ గాడిద నస్రుద్దీన్‌కి అస్సలు నచ్చలేదు. 'దానిని అమ్మగలిగితే ఎంత బాగుంటుంది,' అని అతను అనుకున్నాడు.

ఒక రోజు అతను గాడిదను సంతకి తీసుకుని వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చినప్పుడు గట్టిగా నవ్వుతున్నాడు.




"ఈ రోజు ఏమి చేశానో నీకు తెలుసా? గాడిదను సంతకి తీసుకుని వెళ్లి వేలం వేసే వ్యక్తికి ఇచ్చాను," అతను తన భార్యకు చెప్పాడు.

"మన సోమరి, పనికిమాలిన గాడిదనా?" అతని భార్య అడిగింది.

"అవును! దానిని అతను మంచి ధరకు అమ్మేశాడు! నీకు మొత్తం కథ చెబుతాను, ఉండు," అని అతను ఇలా చెప్పసాగాడు.

"సంత రద్దీగా ఉంది. కొనుగోలుదారుల దృష్టిని వేలం వేసే వ్యక్తి ఆకర్షించాడు. అప్పుడు అతని సహాయకుడు గాడిదను చూపించాడు. 'అయ్యల్లారా! ఈ అద్భుతమైన గాడిదను చూడండి...' అని వేలంపాట నిర్వాహకుడు అన్నాడు."



"అద్భుతమైన జంతువా! దానికి కోపం ఎక్కువ అని అందరికీ తెలియలేదా?" అని నస్రుద్దీన్ భార్య అడిగింది.

"అస్సలు తెలియలేదు! వేలంపాట నిర్వాహకుడు తెలివైనవాడు! దానికి ముందుగానే క్యారెట్లు తినిపించాడు. ఏమైనా, అతను మన గాడిదను ఆకాశం అంత ఎత్తు పొగిడాడు. 'పొడవాటి చెవులను, బలమైన కాళ్లను గమనించండి! దీని గట్టి పళ్లను చూడండి!' అని అతను అన్నాడు. 'వయస్సులో ఉన్న ఈ గాడిద బాగా పని చేస్తుంది. కొత్త యజమాని కోసం కష్టపడి పనిచేస్తుంది,' అంటూ అతను ముగించాడు. ఆ సమయంలో గాడిద నాకు కూడా బాగుందని అనిపించింది!"

"ఆశ్చర్యంగా ఉందే," అంది నస్రుద్దీన్ భార్య.



"వేలంపాట మొదలైనప్పుడు మొదట ప్రజలు చిన్న మొత్తాల్లో పాడసాగారు. మొదటి వ్యక్తి మూడు బంగారు నాణాలు మాత్రమే ఇస్తానని అన్నాడు. నిర్వాహకుడు వేలంపాటను కొనసాగించాడు. అంతలో ఎవరో పది బంగారు నాణాలు అన్నారు! తరవాత మరొకరు పదిహేను బంగారు నాణేలు అన్నారు. అలా ధర పెరుగుతూనే ఉంది..." అని నస్రుద్దీన్ చెప్పాడు.

నస్రుద్దీన్ కథకు గాడిద అరుస్తున్న శబ్దం అంతరాయం కలిగించింది. హీ-హా! హీ-హా! ఆ శబ్దం చాలా దగ్గరగా ఉంది!

అతని భార్య ఆశ్చర్యపోయింది. "చివరకు, ఏమైంది? త్వరగా చెప్పు!" అని అడిగింది.

"నేను 'ఇంత అద్భుతమైన జంతువును ఎందుకు అమ్మాలి?' అని అనుకున్నాను. దానిని నేనే ముప్పై బంగారు నాణాలకు కొన్నాను!" అంటూ తన కథను గర్వంగా ముగించాడు నస్రుద్దీన్.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
P. Saraswati V. Vijayakanthi
Telugu K. Suresh
L. S. Saraswathi S. Rajalakshmi
Artist Uma Krishnaswamy


తుమ్మ చెట్టు మూడు కోరికలు

వేడిగా ఉన్న మైదానంలో తిన్నటి, పొడవైన రహదారి ఉంది. దాని పక్కన కొన్ని మొండి చెట్లు పెరిగాయి. వీటిలో ఒకటి ముళ్ల తుమ్మ.

'నన్ను ఎవరూ ఇష్టపడరురు. ముళ్లు లేని చెట్లని అందరూ ప్రేమిస్తారు! అవి ఎంతో అందంగా ఉంటాయి!' అని తుమ్మ చెట్టు తరచుగా తనకు తాను చెప్పుకునేది.

ముళ్లు లేకుండా ఉండాలని హృదయపూర్వకంగా కోరుకుంది తుమ్మ చెట్టు. 'నేను మారాలి!' అని అది అనుకుంది. అకస్మాత్తుగా దాని ముళ్లు మాయం అయ్యాయి. దాని కొమ్మల నుండి మృదువైన, ఆకుపచ్చ ఆకులు వేలాడుతున్నాయి. ఎంత ఆనందం!






అంతలో, దారి వెంట నడుస్తూ ఒక మేక వచ్చింది. అది లేత ఆకులను చూసింది. వాటిని తినడానికి ఆగిపోయింది. ‘అయ్యో! నా అందమైన చిగుళ్లను ఈ మేక తినేస్తుంది! ఇవి బంగారం లాగా మారాలని కోరుకుంటున్నాను!’ అని చెట్టు అనుకుంది.

మరుసటి క్షణం అలాగే జరిగింది!

ఇప్పుడు దారి వెంట ఒక వ్యక్తి వచ్చాడు. మెరిసే బంగారు ఆకులను విశాలమైన కళ్లతో చూస్తూ అతను ఉండిపోయాడు.





'ఎంత అద్భుతం! నేను చాలా అదృష్టవంతుడిని!' అనుకుని, ఆ మనిషి బంగారు ఆకులను కోయసాగాడు. పాపం, ఒక్క ఆకు కూడా మిగల్చకుండా అతను కోస్తూనే ఉన్నాడు!

'బంగారాన్ని చూస్తే మనుషులు దానిని వదిలి వెళతారా? నా ఆకులు గాజువి అయితే బాగుండును!' నిట్టూరుస్తూ అనుకుంది చెట్టు. మరుక్షణంలో కొమ్మల అంతటా గాజు ఆకులు మెరుస్తున్నాయి.

చివరికి చెట్టుకి సురక్షితంగా అనిపించింది. కానీ అకస్మాత్తుగా బలమైన గాలి వీచింది. అయ్యో! గాలికి గాజు ఆకులు ఒకదానికొకటి కొట్టుకుని చిన్న ముక్కలుగా పగిలిపోయాయి!




‘నేను ఎప్పటికీ ప్రశాంతంగా బతకలేనా?’ అంటూ చెట్టు ఏడ్చింది.

‘మేకలు తినని ఆకులతో... మనుషులు కోయని ఆకులతో... గాలికి పగిలిపోని ఆకులతో నేను ఒక చెట్టుగా ఉండాలని అనుకుంటున్నాను...!’ అని అప్పుడు అది కోరుకుంది.

తక్షణమే దాని నిండా ముళ్లు వచ్చాయి. అది మళ్లీ తుమ్మ చెట్టు అయ్యింది! తుమ్మ చెట్టు లాగా అది సంతోషంగా ఉండిపోయింది. తన ముళ్లను చూసి అది మళ్లీ ఎప్పుడూ బాధపడలేదు.

భారతీయ జానపద కథ



© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

27


సింహ రాజు, కుందేలు

అది ప్రకాశవంతమైన, చల్లని శీతాకాలపు ఉదయం. నిద్ర లేచిన సింహం రాజు కాళ్లు పట్టేశాయి. ‘వేటాడలేనంత ముసలివాడిని అవుతున్నాను,’ విచారంగా అనుకున్నాడు సింహ రాజు.

అంతలోనే అతనిలో ఉత్సాహం వచ్చింది. తాను అడవికి రాజు కాదా? అతను ఒక ప్రణాళిక వేసుకుని వేచి చూస్తూ తన గుహ బయట కూర్చున్నాడు.

ఆ రోజు, అడవి జంతువులను సమావేశానికి పిలిచాడు రాజు. అవి వణుకుతూ గుహ వద్దకు చేరుకున్నాయి.

సింహ రాజు ఇలా చెప్పాడు: "నా ప్రియమైన ప్రజలారా! నన్ను చూడగానే మీరు పారిపోతారు. వేటలో రోజుకి నేను ఒక్క జంతువునే పట్టుకుంటాను. ఒకసారి ఆలోచించండి! మీరు కష్టపడి పని చేసే వ్యక్తులు. మీ పనికి నా వేట అంతరాయం ఎందుకు కలిగించాలి?



"నా ప్రణాళిక వినండి. ఈ రోజు నుండి, వేటకు వెళ్లే బదులు, నా గుహ వద్దే వేచి ఉంటాను. మీలో ఒకరు నా దగ్గరకు వచ్చి నాకు ఆహారం కావాలి. ఏ రోజు ఎవరు రావాలో మీరందరూ కలిసి నిర్ణయించుకోవచ్చు.

"దీనికి ఒప్పుకోవటం ద్వారా, మొత్తం అడవిలో శాంతిని నెలకొల్పినవారు అవుతారు."

ఎంత అద్భుతమైన ఆలోచన! జంతువులు ఆశ్చర్యపోయాయి, సంతోషించాయి. ఒక చిన్న కుందేలుకు మాత్రమే సందేహం వచ్చింది. 'రాజు వేటకు వచ్చినప్పుడు, తప్పించుకునే అవకాశం మనకు ఉంది. కానీ ఈ కొత్త ప్రణాళికలో, పాపం ఎంపిక అయిన జంతువు తప్పించుకునే అవకాశం లేదు!'

అయితే, ఆ ప్రణాళిక సింహానికి బాగా పని చేసింది. ప్రతిరోజూ ఒక జంతువును దాని దగ్గరకి పంపేవి, మిగిలినవి భయం లేకుండా తిరిగేవి.

కొంతకాలం తరవాత చిన్న కుందేలు వంతు వచ్చింది.



‘నేను రాజు దగ్గరకు ఆహారంగా వెళ్లాలా? లేదు! ఈ ఏర్పాటును ఆపివేస్తాను!’ అది అనుకుంది.

రాజు గుహ దగ్గరకి ఆలస్యంగా వెళ్లింది కుందేలు. బయటకు వచ్చిన సింహం కుందేలును చూసి, "ఇంత ఆలస్యంగా రావడానికి కారణం ఏమిటి?" అని గర్జించాడు.



"ఓ రాజా! దయచేసి నన్ను క్షమించు. మీ భోజన సమయానికి చేరుకోవడానికి ప్రయత్నించాను. కానీ నా ప్రమేయం లేకుండానే ఆలస్యం అయ్యింది," అంటూ చిన్న కుందేలు వినయంగా సమాధానం ఇచ్చింది.

"ఏం జరిగిందో చెప్పు!" అని సింహం అడిగాడు.

"నేను వస్తున్నప్పుడు ఒక కొత్త సింహం నన్ను ఆపింది. 'నిన్ను తినబోతున్నాను!' అని అది అంది. 'నువ్వు నన్ను తినలేవు! అడవి రాజుకి ఆహారంగా నేను వెళుతున్నాను,' అని దానికి చెప్పాను.

"'అడవి రాజా? ఎవరో చెప్పు? అతన్ని ముక్కలుగా చీల్చివేస్తాను! ఈ 'రాజు'ని నాకు చూపించు!' అంటూ కొత్త సింహం గర్జించింది. ఎలాగో తప్పించుకుని నేను మీ దగ్గరికి వచ్చాను!" కుందేలు చెప్పింది.

రాజు కోపంతో రగిలిపోయాడు. "ఆ దుష్ట సింహం ఎక్కడ ఉంది? వెంటనే దాని దగ్గరకి తీసుకుని వెళ్లు!" అని గర్జించాడు. రాజును అడవి అంచుకు తీసుకుని వెళ్లింది కుందేలు.



వారు ఒక బయలు ప్రదేశంలోకి వచ్చారు. అక్కడ ఒక పెద్ద బావి ఉంది. "ఇక్కడే ఉండండి, ఓ రాజా! కొత్త సింహాన్ని చూసి వస్తాను," అని కుందేలు చెప్పింది.

బావి దగ్గరకు వెళ్లింది కుందేలు. అది బావిలోకి తొంగి చూసింది. బావిలో దాని ప్రతిబింబం కనబడింది.


"ఇదిగో, కొత్త సింహం ఇక్కడ ఉంది!" అని కుందేలు పిలిచింది. తరవాత ఒక చెట్టు వెనక దాక్కుంది.

రాజు గర్జించాడు! బావి దగ్గరకు పరిగెత్తి లోపలికి చూశాడు. అక్కడ కొత్త సింహం అతని వైపు తిరిగి గర్జిస్తోంది! దాడి చేయడానికి బావిలోకి దూకాడు రాజు.



దాంతో సింహం రాజు వేసిన ప్రణాళిక ముగిసింది!

పంచతంత్ర కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


పొడవా, పొట్టా?


ఒంటె, పంది మంచి స్నేహితులు. కానీ అవి ఒకదానిని మరొకటి బాగా ఆట పట్టించేవి! ఒక రోజు...

ఒంటె: ఓయ్, పొట్టీ! ఇటు చూడు! నా అంత పొడవు అవ్వాలని అనిపించటం లేదా?

పంది: ఓ పొడవాటి కాళ్లవాడా! పొడవుగా ఉండాలని ఎందుకు అనుకుంటాను? పొట్టిగా ఉండటమే చాలా మంచిది.

ఒంటె: చూడు! ఈ గోడకు అవతల నాకు కనిపిస్తోంది. అవతలి వైపు తినడానికి చాలా ఉన్నాయి – పొదలు, చిన్న చెట్లు, పూల మొక్కలు. పచ్చటి ఆకులు, కొమ్మలను ఇక్కడినుంచే అందుకోగలను. కానీ వాటిని నువ్వు చూడను కూడా చూడలేవు! ఇప్పుడు అర్థమైందా?





పంది: ఆగు, అన్నా! కాస్త ఓపిక పట్టు. నేను వివరిస్తాను. గోడ కింద ఉన్న ఆ కంత నీకు కనిపిస్తోందా? ఆ కంత గుండా నేను అవతలి వైపుకి వెళ్లగలను! అక్కడ ఉన్న అన్నింటిని తినగలను. కానీ నువ్వు! ఆ కంతలో నీ కాలు పట్టదు, తల కూడా పట్టదు! (నవ్వుతూ) వస్తాను! నేను తినడం ఇక్కడ నుండి చూసి, ఆనందించు!

కంత గుండా పంది దూరి, అవతలి వైపుకి వెళ్లింది.

నోట మాట లేకుండా ఒంటె నిలబడింది. అప్పుడు,

ఒంటె: నువ్వు చెప్పింది నిజమే. కొన్ని పొట్టిగా ఉంటాయి, కొన్ని పొడవుగా ఉంటాయి. నా అంత పెద్దగా అందరూ ఎందుకు ఉండాలి?


పగిలిన కుండ

గోపాల్ కష్టపడి పనిచేసే వ్యక్తి. నది నుండి నీళ్లు తీసుకుని రావడం అతని పనులలో ఒకటి. నదికి ఎన్నోసార్లు వెళ్లేవాడు! తన అడుగులతో ఏర్పడిన దారిలో ప్రతి రోజూ తిరిగేవాడు.

భుజం పైన కావిడి బద్దకు రెండు కుండలు తగిలించి గోపాల్ నీళ్లు మోసేవాడు. కుండలలో ఒకటి బీటవారింది. దాంతో కుండ నుంచి చుక్క చుక్క కారుతూ ఉండేది. నది నుంచి ఇంటికి వెళ్లేలోపు ఆ కుండలోని సగం నీరు కారిపోయేది.

ఇది చూసి, పగులు లేని కుండకి గర్వం పెరిగింది. "నన్ను చూడు! ఒక్క చుక్క కూడా కారిపోకుండా ఇంటికి వస్తాను!" అని అది అనేది.

పగిలిన కుండను ఇది బాధపెట్టేది. "నన్ను క్షమించు! ఇంటికి కావలసిన నీళ్లు తేవడానికి నువ్వు చాలా కష్టపడుతున్నావు! అందులో సగం నేను వృధా చేస్తున్నాను," అని గోపాల్‌తో అంది.



పగిలిన కుండ అలా అన్నప్పుడు గోపాల్ నవ్వాడు. "మన దారిలో చాలా పువ్వులు పూచాయి. ఈసారి జాగ్రత్తగా చూడు," దానిని ప్రేమగా చూస్తూ అన్నాడు.


అది నిజమే! దారిలో చాలా పూల మొక్కలు ఉన్నాయి. వాటిని చూస్తూ పగిలిన కుండ తన బాధను మరచిపోయింది. వాటి అందం దాని దుఃఖాన్ని దూరం చేసింది. కానీ ఇంటికి వెళ్లేసరికి మళ్లీ విచారంగా అనిపించింది.

"నా కష్టాలను కొంతకాలం మరచిపోయేలా ఆ అందమైన పువ్వులు చేశాయి. కానీ నా వల్ల నీ కష్టాలు పెరిగాయి. దానిని ఎలా మరిచిపోగలను?" గోపాల్‌తో అది అంది.

"ఓ కుండా! ముఖ్యమైన విషయాన్ని నువ్వు గమనించలేదు! దారిలో ఒక వైపు మాత్రమే పువ్వులు పూస్తున్నాయి! నీ నుండి కారుతున్న నీటి వల్లే అవి పూస్తున్నాయి," అని గోపాల్ సమాధానం చెప్పాడు.

"ఒకప్పుడు నేను పగుళ్లు లేని కొత్త కుండ కొనాలని అనుకున్నాను. కానీ తరవాత, 'పూల మొక్కలు పెరగాలి. ప్రజలు వాటిని చూసి ఆనందించాలి,' అని అనుకున్నాను. "దీన్ని సాధ్యం చేసింది నువ్వే!" అంటూ గోపాల్ ముగించాడు.

భారతీయ జానపద కథ



© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi


L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

చీమ చేసిన చెప్పులు



ఒకప్పుడు ఒక అడవిలో ఒక చీమ ఉండేది. ఈ చీమ ఇతర చీమల లాంటిది కాదు. అది ఎప్పుడూ కొత్త సవాళ్ల కోసం వెతుకుతూనే ఉండేది.

ఒక రోజు అది చెప్పులు కుట్టాలని అనుకుంది. ఆకులు, పుల్లలు సేకరించి రాత్రంతా పని చేసింది. తెల్లవారేసరికి ఆమె ఒక జత పూర్తి చేసింది. వాటిని అమ్మడానికి అది బయలుదేరింది.

దారిలో చీమ ఒక కోతిని కలిసింది. "మామా, ఈ చెప్పులు కొనండి," అని అంది. "మిత్రమా, నాకు నాలుగు కాళ్లు. ఒక చెప్పుల జతతో నేను ఏం చేయాలి?" అంది కోతి.

ఆ రోజు చీమ కలిసిన జంతువులన్నీ అదే సమాధానం ఇచ్చాయి.

ఏం చేయాలో తెలుసుకుని చీమ ఇంటికి తిరిగి వచ్చింది. మరిన్ని ఆకులు, పుల్లలు సేకరించి మళ్లీ రాత్రంతా పని చేసింది. తెల్లవారుజామున ఆమె వద్ద అమ్మకానికి రెండు జతల చెప్పులు ఉన్నాయి.








ఆ చీమ నేరుగా కోతి దగ్గరికి వెళ్లింది. కోతి కూర్చుని నాలుగు చెప్పులు తన చేతుల్లోకి తీసుకుంది. వాటిని జాగ్రత్తగా చూసింది. తరవాత, "ఈ చెప్పులు కొంచెం చిన్నవి. అవి నాకు సరిపోవు. కానీ అవి మీలాంటి మరో చీమకు సరిపోతాయి. మీ స్నేహితుల్లో ఒకరిని ఎందుకు అడగకూడదు?" అని అంది. చెప్పులు తిరిగి ఇచ్చి తన దారిలో వెళ్లిపోయింది.

ఆ చీమ తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. దానికి చెప్పులు చూపించింది. కానీ, "నేను నాలుగు చెప్పులతో ఏం చేయాలి? చీమలకి ఆరు కాళ్లు ఉంటాయన్నది మరిచిపోయావా?" ఆమె స్నేహితురాలు అడిగింది.


ఆ చీమ సిగ్గుతో ఎర్రబడింది! "నువ్వు చెప్పింది నిజమే," అని చెప్పి తొందరగా ఇంటికి వెళ్లింది. ఆ రాత్రి అది మరో జత చెప్పులు కుట్టింది. ఉదయం ఆమె ఆరు చెప్పులు సర్దుకుని తన స్నేహితురాలిని చూడటానికి వెళ్లింది.






ఆమె స్నేహితురాలు చెప్పులు వేసుకుని చూస్తుండగా, 'ఈ చెప్పులు నచ్చాలి! ఈ చెప్పులు నచ్చాలి!' అని చీమ ప్రార్థించింది.

కానీ దాని స్నేహితురాలు, "ఈ చెప్పులు బాగున్నాయి. కానీ అవి చాలా తేలికైనవి. అవి చాలా త్వరగా చిరిగిపోతాయి. నాకు ఇవి వద్దు. హమ్మ్మ్... నాకు తెలుసు! సాలీడుని అడుగు. అది కచ్చితంగా వీటిని కొంటుంది," అంది.



చీమ నిరాశతో వెనక్కి వచ్చింది! కానీ త్వరలోనే ధైర్యం తెచ్చుకుంది. ఆమె చెప్పులు బాగా తయారు చేసింది కదా? అవి అందంగా ఉన్నాయి కదా? ఈ రోజు ఆరు చెప్పులను అమ్మేస్తుంది! వాటిని సంచిలో పెట్టుకుని సాలీడును చూడటానికి వెళ్లింది.

సాలీడు ఇంటి గుమ్మం వద్ద చీమ ఆగిపోయింది. "అత్తా! నిన్ను చూడటానికి వచ్చాను!" అంటూ పిలిచింది చీమ. "ఇంత విచారంగా ఎందుకు ఉన్నావు?" సాలీడు వచ్చి ఆమెను అడిగింది. మొదటి చెప్పుల జత కుట్టినప్పటి నుండి జరిగినదంతా సాలీడుకి చీమ చెప్పింది.








అకస్మాత్తుగా చీమ గమనించింది, 'ఓహ్! సాలీడుకి ఎనిమిది కాళ్ళు ఉన్నాయి! మరో జత కుట్టమని నన్ను ఇంటికి పంపిస్తుంది!' కానీ సాలీడుకి మంచి ఆలోచన వచ్చింది.

"నీ చెప్పులు ఎలా అమ్మాలో చెబుతాను," సాలీడు దయతో అంది. "వెళ్లి కాళ్లజెర్రిని కలువు. దానికి చాలా కాళ్లు ఉన్నాయి. ఎన్ని జతల చెప్పులు చేసినా అది తీసుకుంటుంది."

"మంచిది, అత్తా!" అంటూ సంతోషంగా ఇంటికి వెళ్లింది చీమ.

భారతీయ కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi


Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

పెయింటర్ యాంగ్

ఒకప్పుడు ప్రసిద్ధ కళాకారుడైన తన మామతో యాంగ్ అనే బాలుడు ఉండేవాడు. ప్రతి రోజు, యాంగ్ తన మామ పక్కన కూర్చుని, అతను పెయింట్ చేయడాన్ని చూస్తూ ఉండేవాడు. ప్రతి చిన్న విషయాన్ని కూడా అతను జాగ్రత్తగా గమనించేవాడు. గంటలు గడిచిపోవటం అతనికి తెలిసేదే కాదు.

రోజులు గడిచేకొద్దీ ఆ బాలుడి ఆసక్తి మరింతగా పెరుగుతోందని అతని మామ గమనించాడు. దాంతో అతనికి కావలసినవి కొని ఇచ్చి, "వెళ్లి పెయింట్ చేయి!" అని మామ చెప్పాడు. ఊరిలో తిరుగుతూ, బొమ్మలు గీస్తూ, రంగులు వేస్తూ ఉండేవాడు యాంగ్. అతను ఒక బొమ్మని పూర్తి చేసిన తరవాత దానిని తన మామకి చూపించేవాడు.





ఒక రోజు అతని మామ, "నీ పెయింటింగ్స్ చాలా అందంగా ఉన్నాయి! నీలో గొప్ప ప్రతిభ ఉంది!" అని మెచ్చుకున్నాడు. ఒక నిమిషం ఆలోచించి, "ఒక ప్రదర్శన ఏర్పాటు చేద్దాం. చుట్టుపక్కలవాళ్లని పిలుద్దాం. నీ పెయింటింగ్స్‌ను ప్రదర్శిద్దాం. మా స్నేహితులు సంతోషిస్తారు!" అని మామ చెప్పాడు.


యాంగ్ పెయింటింగ్‌లను చూడటానికి చుట్టుపక్కలవాళ్లు వచ్చారు. వాళ్లందరూ అతనిని మెచ్చుకున్నారు. "ఈ బొమ్మలు నిజమైన వాటిలా కనిపిస్తున్నాయి!" అని ఒకరు అన్నారు. "నీ పువ్వుల నుండి తేనె తాగాలని తేనెటీగలు కోరుకుంటాయి!" అని మరొకరు అన్నారు.

యాంగ్ వాళ్ల మామ చాలా సంతోషించాడు. ప్రదర్శన తరవాత అతను యాంగ్‌తో, "నాకు పట్టణంలో ఒక స్నేహితుడు ఉన్నాడు. అతను నిన్ను అక్కడికి రమ్మన్నాడు," అని చెప్పాడు. తన స్నేహితుడి ఇంటికి ఎలా వెళ్లాలో యాంగ్‌కి చెప్పాడు.

మామ నుండి వెళ్లిపోవటం యాంగ్‌కి ఇష్టం లేదు. కానీ అతను ఎలా కాదనగలడు? అతను తన సంచి సర్దుకుని ఆ రోజే పట్టణానికి బయలుదేరాడు.

పట్టణానికి అడవి గుండా వెళ్లాలి. చెట్ల మధ్య నడుస్తూ, యాంగ్ మంత్రముగ్ధుడయ్యాడు! తీగలు, పూల మొక్కలు, జంతువులు, పక్షులు... అన్నీ చూడమని, మెచ్చుకోమని అంటున్నాయి.

వాటిని గీయడానికి యాంగ్ ఆగిపోయాడు. మొదట, దారి పక్కన మేస్తున్న జింకను అతను గీశాడు. తరవాత అతను ఒక చెట్టు కొమ్మపై కూర్చున్న పసుపుపచ్చ పక్షుల జంటను గీశాడు. చెట్లు కూడా గీశాడు! ప్రతిదాని ప్రత్యేకతను యాంగ్ చూడగలిగాడు. వాటన్నింటినీ గీయాలని అతనికి ఉంది!



గీస్తూ, పెయింటింగ్ వేస్తూ అడవిలో ఎన్నో రోజులు గడిపాడు యాంగ్. ప్రతి రాత్రి దారి పక్కన ఉన్న చెట్టు గుడిసెలో సురక్షితంగా నిద్రపోయేవాడు.

ఒక రోజు యాంగ్ ఒక పందిని చూశాడు. అతను దాని బొమ్మని గీస్తుండగా, ఒక మనిషి పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఆ మనిషి, "పులి! పులి!" అని అరుస్తున్నాడు.

అయ్యో! ఎలా తప్పించుకోవాలి? యాంగ్‌కి ఒక ఆలోచన వచ్చింది. పంది బొమ్మను తీసుకుని, దానిని ఒక పొదకు ఆనించాడు. తరవాత అతను, ఆ మనిషి వీలైనంత వేగంగా పరిగెత్తారు.

కాసేపటికి పొద వద్దకు పులి వచ్చింది. పంది బొమ్మని చూసి అది ఆగిపోయింది. "గ్రర్‌ర్‌ర్!" అది గాండ్రిస్తోంది. పంది మీదకు దూకడానికి సిద్ధమైంది.

ఆలోపు, యాంగ్, ఆ మనిషి చెట్టు గుడిసెలోకి ఎక్కారు. వారు బతికిపోయారు!



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugui K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

ఉత్తమ విద్యార్థి

పాండవులు, కౌరవులు యుద్ధ కళలలో రాణించారు. వారి గురువు ద్రోణుడు.

ఆ కాలంలో యుద్ధ కళలలో విలు విద్య గొప్పది. పాండవులలో అర్జునుడు మేటి విలుకాడు.

ఆ కళకు అర్జునుడు అంకితమైపోయాడు. అతను అవిశ్రాంతంగా సాధన చేశాడు. ఫలితంగా, మిగతా వారందరి కంటే ముందు ఉన్నాడు. ద్రోణుడి విద్యార్థులలో అతను ఉత్తముడు.



అర్జునుడి శ్రద్ధ ద్రోణుడికి నచ్చింది. ఇతరుల నుండి వేరు చేసి అతనికి అదనంగా పాఠాలు చెప్పాడు.

కౌరవులకు ఇది అస్సలు నచ్చలేదు! అర్జునుడి పట్ల వాళ్లు అసూయ పెంచుకున్నారు.

తన విద్యార్థులను పరీక్షించాలని ఒక రోజు ద్రోణుడు నిర్ణయించుకున్నాడు. ఒక ఎత్తైన కొమ్మ నుండి కొట్టవలసిన లక్ష్యాన్ని వేలాడదీశాడు. అది చెక్కతో చేసిన పక్షి.





విద్యార్థులను ద్రోణుడు తన వద్దకు పిలిచాడు.

వారు సమావేశం అయిన తరవాత, "చెక్క పక్షిని చూడండి. అదే మీ లక్ష్యం. దానిని జాగ్రత్తగా చూసి గురి పెట్టండి! పక్షి కంటిని మీ బాణం కొట్టాలి," అని చెప్పాడు.





పాండవులు, కౌరవులు వరసలో నిలబడ్డారు. ముందుగా యుధిష్ఠరుడిని పిలిచాడు ద్రోణుడు.

లక్ష్యాన్ని గురి చూశాడు యుధిష్ఠరుడు. బాణాన్ని సిద్ధం చేసుకున్నాడు. అకస్మాత్తుగా, "యుధిష్ఠరా!" అంటూ ద్రోణుడి స్వరం వినిపించింది.

యుధిష్ఠరుడు గురువు గారిని చూశాడు. "నీకేం కనిపిస్తోంది?" ద్రోణుడు అడిగాడు.

"గురువు గారూ! మీరు, చెట్టు, ఆకులు కనిపిస్తున్నాయి. పక్షి కనిపిస్తోంది," అని యుధిష్ఠరుడు జవాబు ఇచ్చాడు.

"పక్కకు తప్పుకో, యుధిష్ఠరా! కొట్టగలిగేటంత బాగా లక్ష్యాన్ని నువ్వు చూడలేదు. గురి తప్పుతావు," అన్నాడు ద్రోణుడు.

తరవాత దుర్యోధనుడి వంతు వచ్చింది. అదే ప్రశ్న అడిగాడు ద్రోణుడు. "గురువు గారూ! మీరు, ఇతర విద్యార్థులు కనపడుతున్నారు! చెట్లు, కొమ్మలు, ఆకులు కనపడుతున్నాయి! పక్షి కూడా కనపడుతోంది! నా కళ్లకు చాలా కనిపిస్తున్నాయి!" అని దుర్యోధనుడు గర్వంగా అన్నాడు.



"నువ్వు గురిని కొట్టలేవు, దుర్యోధనా!" అని సమాధానం వచ్చింది.

భీముడు, నకులుడు, సహదేవుడు, ఇతరులకు కూడా అదే అనుభవం ఎదురయ్యింది.

చివరకు, అర్జునుడి వంతు వచ్చింది. అతను తన బాణాన్ని సిద్ధం చేసుకున్నాడు. అతను మిగతావన్నీ మరిచిపోయాడు. తనను తాను కూడా మరిచిపోయాడు. చెక్క పక్షిపై మాత్రమే దృష్టి పెట్టాడు.

"అర్జునా, నీకు ఏమి కనిపిస్తోంది?" అని అతనిని ద్రోణుడు అడిగాడు.

"పక్షి కన్ను మాత్రమే నాకు కనిపిస్తోంది, గురువు గారూ," అని అర్జునుడు అన్నాడు.

అర్జునుడు లక్ష్యంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించాడని ద్రోణుడు అర్థం చేసుకున్నాడు. దాంతో, "నీ బాణాన్ని వదలు," అని అన్నాడు.

అర్జునుడు తన బాణాన్ని వదిలాడు. బాణం సూటిగా ఎగిరింది. పక్షి కన్నుకి అది గుచ్చుకుంది.


Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy



32

ఏనుగు బరువు

ఒకసారి ఒక ధనవంతుడు తనకు ఇష్టమైన ఏనుగును తూకం వేయాలని నిర్ణయించుకున్నాడు. కానీ ఎలా? తన గ్రామ ప్రజలను సలహా అడిగాడు. "మనం పెద్ద తక్కెడ తీసుకురావాలి!" అని వారిలో ఒకరు అన్నారు. కానీ, "ఏనుగును తూకం వేయడానికి తగినంత పెద్ద తక్కెడ ఎవరి దగ్గర ఉంది?" అని ఇతరులు అతనిని అడిగారు.

"ఏనుగును ముక్కలుగా చేసి, ప్రతి ముక్కను విడిగా తూకం వేయాలి," అని మరొకరు అన్నారు. ఎంత భయంకరమైన ఆలోచన! అంతకన్నా మంచి ఆలోచన మరెవరూ చేయలేకపోయారు. దాంతో, వారందరూ తిరిగి తమ పనులలోకి వెళ్లిపోయారు.

పెద్దలు మాట్లాడుకుంటుండగా ఒక పిల్లవాడు కుతూహలంగా విన్నాడు. 'ఏనుగు బరువును ఎలా తెలుసుకోగలరు? ఇది అసాధ్యం!' అని అతను అనుకున్నాడు.

కానీ ఆ సమస్య గురించే అతను ఆలోచించసాగాడు.


నది దగ్గర కూర్చుని వచ్చే, పోయే పడవలను చూడటం ఈ పిల్లవాడికి ఇష్టం.

ఒక రోజు నీటిలో ఎక్కువ మునిగిన పడవను పిల్లవాడు గమనించాడు. దాని పైఅంచుల దాకా అలలు ఎగసిపడుతున్నాయి.

అకస్మాత్తుగా ధనవంతుడి ఇంటికి ఆ బాలుడు పరిగెత్తాడు. "మీ ఏనుగు బరువు ఎంతో చెప్పగలను!" అని అతను అన్నాడు. అతని ఏనుగును నది ఒడ్డుకు తీసుకుని రమ్మని చెప్పాడు.

గ్రామస్తులందరూ చుట్టూ గుమిగూడారు. బాలుడు సూచనలు ఇవ్వసాగాడు. "మనకు బలమైన పడవ కావాలి!" అని అతను చెప్పాడు. ఒక పడవ తీసుకుని వచ్చారు. "ఇప్పుడు, పడవలోకి ఏనుగును ఎక్కించాలి!"

ఏనుగు ఎక్కటంతో నీటిలో పడవ కిందకి దిగింది.



ఆ బాలుడు ఇంటి నుండి ఒక పేనా తెచ్చాడు. నీటి మట్టం ఉన్న చోట పడవ మీద ఒక గీత గీశాడు. "ఇప్పుడు, పడవ నుండి ఏనుగును బయటకు తీసుకురండి!" అని అతను ఆదేశించాడు. కాసేపటికి ఏనుగుని ఒడ్డు మీదకి సురక్షితంగా దించారు. నీటిలో పడవ పైకి లేచింది! బాలుడు గీసిన గీత స్పష్టంగా కనిపిస్తోంది!

"ఇప్పుడు కొన్ని రాళ్లను పడవలోకి ఎక్కించాలి!" బాలుడు చెప్పాడు.





"గీత దాకా పడవ మునిగే వరకు రాళ్లను ఎక్కిస్తూనే ఉండండి!"

"ఆపండి!" గీత దగ్గరకు నీళ్లు చేరుకున్నప్పుడు బాలుడు అన్నాడు. "ఇప్పుడు పడవలోని రాళ్ల బరువు ఏనుగు బరువుతో సమానం!"

గ్రామస్తులు చప్పట్లు కొట్టారు. "ఎంత తెలివైన పిల్లవాడు!" అని ఒకరితో ఒకరు చెప్పుకోసాగారు. "రాళ్ల బరువు ఎంతో తెలుసుకుందామా?" ఆ బాలుడు అన్నాడు.

తమ తక్కెడలు తీసుకుని రావడానికి ప్రజలు ఇళ్లకు పరిగెత్తారు. ఒక్కొక్కటిగా రాళ్లను పడవ నుండి బయటకు తీస్తూ, వాటిని తూచారు. ఆ బరువులను పిల్లలు రాసుకున్నారు.

చివరి రాయిని తూకం వేయడం అయిపోయింది. అన్ని రాళ్ల బరువులను కూడారు. లెక్కలను మరోసారి సరిచూసుకున్నారు. అప్పుడు బాలుడు మొత్తాన్ని చదివాడు.

తన ఏనుగు బరువు తెలుసుకుని ధనవంతుడు సంతోషంతో నవ్వాడు!

సాంప్రదాయ చైనా కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

33

చాలా పెద్ద కథ

ఒకప్పుడు ఒక రాజు అన్ని రకాల కథలను ఇష్టపడేవాడు. ఖాళీ సమయం దొరికినప్పుడల్లా, తన సిబ్బందిలో ఒకరిని - ఒక మంత్రిని, సైన్యాధ్యక్షుడిని, కావలి వ్యక్తిని, తోటమాలినీ - పిలిచి వారికి ఇష్టమైన కథలను చెప్పమని ఆదేశిస్తాడు. ఎన్ని విన్నా అతని కథల దాహం తీరటంలేదు.

మరిన్ని కథలు వినడానికి ఒక రోజు అతను ఒక మార్గం ఆలోచించాడు. 'కథలు చెప్పే పోటీని నిర్వహిస్తాను!' అని అతను నిర్ణయించుకున్నాడు.

రాజ్యం నలుమూలలా ఒక చాటింపు వేశారు: "చాలా పెద్ద కథ చెప్పే కథకుడికి వెయ్యి బంగారు నాణేలను రాజు ఇస్తాడు!"

పోటీలో పాల్గొనడానికి దగ్గర నుండి, దూరం నుండి కథకులు వచ్చారు. చాలా పెద్ద కథలు చెప్పారు! ఒక కథ చెప్పడానికి ఒక వారం మొత్తం పట్టింది. మరొకటి పది రోజులు పట్టింది. ఇంకొక కథ నెలంతా కొనసాగింది! కానీ, "మీ కథ చాలా పెద్దగా లేదు," అని కథకులతో చెప్పి వాళ్లని రాజు పంపించేసేవాడు.

కథ చెప్పేవారు వస్తూనే ఉన్నారు. రాజు వారిని పంపిస్తూనే ఉన్నాడు. ఇలా నెలల తరబడి కొనసాగింది...

చివరికి ఒక రోజున ఒక తెలివైన కవి రాజభవనానికి వచ్చాడు. 'ఆ వెయ్యి బంగారు నాణేలను గెలుచుకోవాలి!' అని తనలో తాను అనుకున్నాడు.



రాజును కలిసే వంతు వచ్చినప్పుడు, ఆ కవి ఇలా అన్నాడు, "మహారాజా, నాకు చాలా పెద్ద కథ తెలుసు. దానిని పూర్తిగా చెప్పడానికి జీవితకాలం పడుతుంది!"

"అద్భుతం! అయితే, ప్రారంభించండి!" అన్నాడు రాజు.

"సరే. కానీ మీరు ఒక షరతుకు అంగీకరించాలి," అన్నాడు కవి.

"చెప్పు," అన్నాడు రాజు.

"వింటున్నప్పుడు 'తరవాత? తరవాత?' అని మీరు అంటూ ఉండాలి," అన్నాడు కవి.

"అంతేనా?" అన్నాడు రాజు. కవి ఇలా ప్రారంభించాడు:

ఒకప్పుడు సంపదలతో విలసిల్లిన రాజ్యం ఉండేది. దాని వరి పొలాలు చాలా దూరం వ్యాపించాయి. ఆకలి అన్నది ప్రజలకు తెలియదు. వారు కష్టపడి పనిచేసేవాళ్లు, సంతోషంగా ఉండేవాళ్లు.

ఇంతకు ముందు ఎన్నడూ లేనంత బాగా ఒక సంవత్సరం వరి పండింది. దిగుబడి భారీగా ఉంది! తూర్పారబోసిన ధాన్యపు రాశులు రాజ్యం అంతటా ఉన్నాయి.

"చాలా పెద్ద ధాన్యాగారం కట్టి, మిగులు ధాన్యం అంతా అందులో నిల్వ చేద్దాం. ఎప్పుడైనా పంటలు పండకపోతే, ప్రజలకు ఆహారం ఇవ్వగలుగుతాం," అని ఒక మంత్రి సూచించాడు. అందుకు రాజు అంగీకరించాడు.


కొత్త ధాన్యాగారం కట్టడానికి వేలాది మంది వచ్చారు. అది పూర్తయినప్పుడు, ప్రపంచంలో దానిలాంటిది మరొకటి లేదు! దానిని చూడటానికి దూరదూరాల నుండి ప్రజలు వచ్చారు. అంత పెద్ద ధాన్యాగారం పైదాకా ధాన్యంతో నిండి ఉంది.


లోపలికి గాలి వెళ్లడానికి ధాన్యాగారం పైభాగంలో ఒక చిన్న రంధ్రం చేశారు. ఆ రంధ్రాన్ని ఒక రోజు ఒక పిచ్చుక గమనించింది. అది లోపలికి వెళ్లి ముక్కులో ఒక ధాన్యం గింజను తీసుకుంది. దానిని తన గూటికి తీసుకుని వెళ్లింది...

కవి ఆగాడు. "తరవాత?" అని రాజు అడిగాడు.

"ధాన్యాగారంలోకి పిచ్చుక మళ్లీ ఎగిరింది, దాని ముక్కులో ధాన్యం గింజతో బయటకు వచ్చింది. దానిని తన గూడులో పెట్టింది..."

కవి ఆగాడు. "తరవాత?" రాజు అడిగాడు.





"ధాన్యాగారంలోకి పిచ్చుక మళ్ళీ ఎగిరి ధాన్యం గింజను తీసుకుంది. అది తన గూటికి తిరిగి ఎగిరింది..."

కవి తన కథను కొనసాగించాడు. పిచ్చుక మళ్ళీ, మళ్ళీ ధాన్యాగారానికి వెళ్ళి, ప్రతిసారీ ఒక ధాన్యం గింజను తీసుకుని వెళుతోందని చెప్పాడు.

రాజు త్వరలోనే సహనం కోల్పోసాగాడు. "తరవాత? తరవాత?" అంటున్నాడు. కానీ, 'ఆ పిచ్చుక ధాన్యం గింజతో ఎగరడం ఎప్పటికీ ఆగదు. ఈ కథ పూర్తికాకముందే నా జీవితం ముగుస్తుంది!' అని రాజు అనుకున్నాడు.

అతను తన చెవులు మూసుకుని తన సేవకులను పిలిచాడు. "వెయ్యి బంగారు నాణేలు తీసుకురండి!" అంటూ అరిచాడు.


"ఆ తరవాత పక్షి తన గూటికి తిరిగి ఎగిరింది..." అని కవి చెబుతున్నాడు. ఇప్పుడు కథ ఆపి, వేచి ఉన్నాడు. రాజు అతనికి వెయ్యి బంగారు నాణేలను ఇచ్చాడు.

చక్కని మాటలలో కవి తన కృతజ్ఞతలు తెలియచేయడం ప్రారంభించాడు, కానీ రాజు అతనిని ఆపాడు.

"నువ్వు వెళ్ళిపో! వెళ్ళిపో!" అంటూ ఆజ్ఞాపించాడు రాజు.

దాంతో, ఇక ఒక్క మాట కూడా మాట్లాడకుండా కవి వెళ్ళిపోయాడు. హమ్మయ్య అని రాజు నిట్టూర్పు విడిచాడు.

భారతదేశ జానపద కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

నందరియా, మొసలి

నందరియా ధైర్యవంతుడైన చిన్న కోతి. భయంకరమైన అడవిలో ఒంటరిగా తిరగడం అతడికి ఇష్టం.

ఒక రోజు నది మధ్యలో ఉన్న ఒక పెద్ద ఒక దీవిని అతడు చూశాడు. అది ఎలాంటి దీవి! అది మామిడి చెట్లతో నిండి ఉంది. వాటి ఆకుల మధ్య పండిన పండ్లు ఆకర్షిస్తున్నాయి.

'ఆ మామిడి పండ్ల రుచి చూడాలి! కానీ నది చాలా వెడల్పుగా ఉంది, నీళ్లు వేగంగా ప్రవహిస్తున్నాయి. నేను ఎలా దాటాలి?' అని నందరియా అనుకున్నాడు.

దీవికి సగం దూరంలో నీటిలో ఒక రాయి ఉండటం గమనించాడు. ఆహా! ఒక్క గెంతులో నందరియా ఆ రాయిని చేరుకున్నాడు. మరొక గెంతుతో దీవికి చేరుకున్నాడు. ప్రమాదకరమైన గెంతులు! కానీ ధైర్యవంతుడైన నందరియాకు అవి లెక్కలోనివి కావు!



నందరియా మామిడి పళ్లని రుచి చూశాడు. అవి ఎంతో రుచిగా ఉన్నాయి! తనివితీరా మామిడి పండ్లను తిన్నాడు. తరవాత తిరిగి రాతిపైకి దూకి, అక్కడి నుండి నది ఒడ్డుకు దూకాడు. తరవాత ఇంటికి వెళ్లాడు.


ఆ రాత్రి అమ్మానాన్నలకు ఆ దీవి గురించి, అద్భుతమైన మామిడి పండ్ల గురించి నందరియా చెప్పాడు. "అందరం వెళ్లి పండ్లు తిందాం..." అన్నాడు. "మాకు సమయం లేదు," వాళ్లు బదులు ఇచ్చారు. "ఆ దీవి చాలా దూరంలో ఉంది," అంటూ నందరియా స్నేహితులు కూడా రామని అన్నారు.

వారి ఆలోచనలను నందరియా మార్చలేకపోయాడు. దాంతో దీవికి అతను ఒక్కడే వెళ్లి వస్తున్నాడు. ధైర్యవంతుడైన ఆ చిన్న కోతిలో ఆ దట్టమైన అడవి ఎటువంటి భయాన్ని కలిగించలేదు.

కానీ ప్రమాదం పొంచి ఉంది! నందరియా రాకపోకలను ఒక మొసలి గమనించింది. తిని తినాలని అది నిర్ణయించుకుంది. దాని మెదడులో ఒక ప్రణాళిక రూపుదిద్దుకుంది. నందరియా వచ్చే వరకు అది వేచి ఉంది.


వానలు పడటంతో కొన్ని రోజులు నందరియా ఇంటివద్దే ఉండిపోయాడు. తరవాత మామిడి పండ్ల కోసం బయలుదేరినప్పుడు, వానలతో నది ఉప్పొంగి ప్రవహించటం చాశాడు! రాయి దాదాపుగా నీటిలో మునిగిపోయి ఉంది.

'నేను జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే, ఈ నదిలో కొట్టుకునిపోతాను!' నందరియా అనుకున్నాడు. తన బలాన్నంతా కూడగట్టుకుని దూకాడు. హమ్మయ్య! రాయిపైకి చేరుకున్నాడు. మరో గెంతుతో దీవిని చేరుకున్నాడు.



మామిడి తోటకు వచ్చినందుకు ఎంతో ఉత్సాహంగా ఉంది! బాగా పండిన పళ్లని ఎంచుకుని ప్రతి ముక్కను ఆస్వాదించాడు.

ఇంటికి తిరిగి వెళ్లే సమయం వచ్చింది. రాతిపైకి దూకడానికి నందరియా సిద్ధమయ్యాడు. కానీ ఆ రాయి తేడాగా ఉంది! దానిని జాగ్రత్తగా చూశాడు. వచ్చినప్పుడి కంటే ఇప్పుడు అది పెద్దదిగా ఉంది. 'ఎవరో నన్ను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు!' అనుకున్నాడు. కానీ ఎవరు? అది తెలుసుకోవడానికి ప్రయత్నించాడు.




"రాయి అన్నా! ఎలా ఉన్నావు?" నందరియా అడిగాడు. సమాధానం రాలేదు. "నాతో ఎందుకు మాట్లాడటం లేదు? మన స్నేహం ముగిసిందా. అన్నా?" అని అడిగాడు.

తల, తోక నీటిలో ముంచి రాయి మీద మొసలి పడుకుంది. నందరియా అరుపు బాగా వినపడకపోవటంతో, అది తలని కొద్దిగా పైకి లేపింది. ఇప్పుడు నందరియా మాటలు బాగా వినపడుతున్నాయి: "రాయి అన్నా, రాయి అన్నా!"

'కోతి, రాయి స్నేహితులు అయి ఉండాలి. నేను సమాధానం చెప్పాలి,' అనుకుంది మొసలి.

"ఏమిటి, తమ్ముడూ?" అని పిలిచింది.

చూడటానికి తన తల పైకెత్తింది.



ఇప్పుడు నందరియాకు అర్థం అయ్యింది. "మొసలి గారూ! మీకు ఏమైనా కావాలా?" అని అడిగాడు. తన ఎత్తుగడ తెలిసిపోయిందని మొసలికి కోపం వచ్చింది! "నిన్ను తినేస్తాను!" అంటూ అరిచింది.


'ఎలా తప్పించుకోవాలి?' నందరియా ఆలోచించాడు. వెంటనే ఒక ప్రణాళిక వేశాడు.

"సరే, మొసలి గారూ! నేను తప్పించుకోలేను. కాబట్టి నేరుగా మీ నోటిలోకి దూకుతాను. మీ నోటిని బాగా తెరవండి. కానీ మీ కళ్లు మూసుకోండి," అన్నాడు నందరియా.

మూర్ఖపు మొసలి కళ్లు మూసుకుని నోరు వెడల్పుగా తెరిచింది. నందరియా బాగా గాలిలోకి ఎగిరి మొసలి నోటిని దాటి, దాని వీపు మధ్య దిగి, వెంటనే మళ్లీ గెంతి నది ఒడ్డును చేరుకున్నాడు.


"మొసలి గారూ! ఇక నన్ను పట్టుకోలేరు!" అని నవ్వుతూ ఇంటికి పారిపోయాడు.

జాతక కథ




© Katha Jharna 2008
P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi
Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

35 నలుగురు స్నేహితులు




ఒకప్పుడు ఒక తాబేలు, కాకి, ఎలుక, జింక మంచి స్నేహితులు అయ్యాయి. అవి ప్రతి నిమిషం కలిసి గడిపేవి, ఆహారం కోసం మాత్రమే వేరు అయ్యేవి. కాకి, ఎలుక, జింక చాలా దూరం వెళతాయి. ఇంటి దగ్గర ఉన్న పొదలు, గడ్డిలో ఆహారం కోసం తాబేలు వెతుకుతూ ఉంటుంది.



ఒక సాయంత్రం జింక ఇంకా తిరిగి రాలేదని కాకి, తాబేలు, ఎలుక వేచి చూస్తున్నాయి. "ఏదో జరిగి ఉండాలి!" అని ముగ్గురు స్నేహితులు ఆందోళన పడుతున్నాయి.

"నేను వెళ్లి చూస్తాను," అని కాకి చెప్పింది. జింకను వెతకడానికి అది బయలుదేరింది. కొంత సమయం తరవాత దానికి జింక కనపడింది. కానీ ఏదో జరిగింది!





ఏమిటో చూడటానికి కాకి కిందికి దిగింది. అయ్యో! వేటగాడి వలలో జింక చిక్కుకుంది! వెంటనే ఇతరుల వద్దకు తిరిగి వెళ్లి ఈ వార్తను చెప్పింది కాకి.

"మనం జింకను రక్షించాలి! నేను వలను కొరికి విడిపిస్తాను!" అని ఎలుక చెప్పింది. అది కాకి వీపుపైకి దూకింది. జింక ఉన్న చోటికి దానిని కాకి తీసుకుని వెళ్లింది.

వలను కొరికి, కొరికి తాళ్ల నుండి విడిపించుకోడానికి జింకకు ఎలుక సహాయపడింది. అప్పుడు తాబేలు అక్కడికి వచ్చింది!


"అయ్యో! ఇల్లు వదిలి ఎందుకు వచ్చావు? వేటగాళ్లు ఇక్కడికి వస్తే, కాకి ఎగిరిపోతుంది, జింక పారిపోతుంది, ఒక బొరియలో నేను దాక్కుంటాను. కానీ నువ్వు దొరికిపోతావు," అని ఎలుక అంది.


"జింక ప్రమాదంలో ఉందని తెలిసి నేను ఇంట్లో ఉండలేక వచ్చాను," అని తాబేలు చెప్పింది.

వారు మాట్లాడుకుంటూ ఉండగానే ఒక వేటగాడు అక్కడికి వచ్చాడు. ఒక్క దూకులో జింక అదృశ్యమైంది. దగ్గరలోని బొరియలోకి ఎలుక దూరింది. కాకి ఎగిరిపోయింది.

పాపం తాబేలు దొరికిపోయింది! పొడవు గడ్డితో తాడు నేసి, తాబేలు కాళ్లను కట్టేశాడు వేటగాడు. దానిని భుజంపై వేసుకుని ఇంటికి బయలుదేరాడు. తాము దాక్కున్న ప్రదేశాల నుండి స్నేహితులు బయటకు వచ్చాయి. "తాబేలును రక్షించాలి!" అంది జింక.

ఎలుకకు ఒక ఉపాయం తట్టింది. "దారి పక్కన చనిపోయినట్లు పడుకో," అని జింకతో అది చెప్పింది.






"జింక పైన కూర్చుని దానిని పొడుస్తున్నట్లు నటించు. వేటగాడు జింకను చూసి తాబేలును కింద పెడతాడు. అతను నీ దగ్గరకి వచ్చినప్పుడు, నేను తాడును కొరికి తాబేలును విడిపిస్తాను," అని కాకితో చెప్పింది ఎలుక.

వారందరూ ఆ పథకాన్ని అనుసరించారు. దారి పక్కన ఉన్న జింకను వేటగాడు చూశాడు. ఒక కాకి దానిని పొడుస్తూ ఉంది. తాబేలును కింద పడేసి, జింక దగ్గరకు వెళ్లాడు వేటగాడు. అప్పుడు తాడును కొరికి, తాబేలును విడిపించింది ఎలుక.
వేటగాడు జింక దగ్గరకి వచ్చినప్పుడు, అది లేచి, పారిపోయింది. కాకి ఎగిరిపోయింది. వేటగాడు ఆశ్చర్యపోయి వాటి వెంట పడ్డాడు. కానీ అవి దొరకలేదు. తాబేలును తీసుకోవడానికి అతను తిరిగివచ్చినప్పుడు, అది కూడా అక్కడ లేదు!

పంచతంత్ర కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

36 నేను ఎవరు?



ముత్యాల లాంటి నీటి చుక్కలతో
గుండ్రని ఆకులు నీటిపై తేలతాయి
బయటకి వచ్చే బలమైన కాండాలపై
అందమైన పువ్వులు వికసిస్తాయి

పెద్ద, ఆకర్షణీయమైన పువ్వులు
బాకా ఆకారంలో ఎర్రటి పువ్వులు
పిల్ల గాలులలో ఊగుతుంటాయి
పుప్పొడి కాడలు తొంగి చూస్తుంటాయి

బంగారు పసుపు లేదా నారింజ రంగులలో
ఎన్నో పొరల రేకులతో అద్భుతమైన
పువ్వులు,
పండగల వేళ గదికి శోభని ఇచ్చేలా
దండలు కడతారు, అలంకరిస్తారు

పెద్దగా, పసుపుపచ్చ రంగులో ఉంటాను
సూర్యుని వైపు తిరుగుతుంటాను!
విత్తనాలను ఇస్తాను, తేనెటీగల ద్వారా -
తియ్యని తేనె ఇస్తాను!

పొరలు పొరలుగా విచ్చుకుంటూ
రేకులను చూపిస్తాను
సువాసనలు పంచుతుంటాను,
నా ముళ్ల కొమ్మలే నాకు రక్ష

నవ్వుతున్న పూలగుత్తులు
మంచువంటి తెల్లటి పూలగుత్తులు
తీగల పైన చిన్న పువ్వులు
నా సువాసనతో రాత్రి గాలి నిండిపోతుంది!

గులాబీ, మందార, బంతి పువ్వు, సూర్యకాంతి, తామర, సన్న జాజి

రెక్కలు ఉన్నాయి
కానీ ఎగరలేను
రెండు కాళ్లే ఉన్నాయి
కానీ గుర్రంలా పరిగెత్తుతాను



పసుపు కాళ్లు, పసుపు ముక్కు,
కళ్ల చుట్టూ పసుపుపచ్చ వలయం-
ఈలలు వేస్తాను, కిచకిచలాడతాను
కేకలు వేస్తాను, శబ్దాలు చేస్తాను
మీ మాటకు మాట చెబుతాను

చీకటిలో వేటాడేటప్పుడు అరుస్తాను
తెల్లవారుజామున గూటికి చేరతాను
గుండ్రని కళ్లు మూసుకుని నిద్రపోతాను

తలపై ఎర్రటి కుచ్చు - ఎవరు కోస్తారు?
కాలిపై పసుపుపచ్చ ముల్లు - ఎవరు తీస్తారు?
ఉదయం మేల్కొలుపుతాను – నన్ను ఎవరు విస్మరిస్తారు?
బరిలో గట్టి పోటీదారు – నన్ను ఎవరు ఓడిస్తారు?


ఆకుపచ్చ, నీలం రంగులతో
మెరిసే వెయ్యి కళ్లతో
నా అందమైన పింఛం,
నా అద్భుతమైన నృత్యంలో
ప్రతి ఈక ఈనె వణుకుతుంది!






ఎగరడానికి బలమైన రెక్కలు,
నడవడానికి బలమైన కాళ్లు,
ఈతకి బలమైన, తెడ్డు పాదాలు,
పాడటానికి బలమైన స్వరం–
కానీ నా పాట ఉత్తి క్వాక్ క్వాక్

నల్లగా ఉంటాను
తియ్యగా పాడతాను
నిన్ను చూస్తే పాట ఆపేస్తాను
కనపడకుండా మాయమైపోతాను



మీ సందేశాలను దూరాలకు చేరవేస్తాను
మళ్లీ గూటికి తిరిగి వస్తాను
పెద్ద గుంపులలో ఉంటాను
మీరు వేసే గింజలు తింటాను



ఆకులు, గడ్డి సేకరిస్తాను
ఎగురుతూ, తిరుగుతూ
పోగులతో గూడు అల్లుతాను
తుర్రున లోపలికి దూరతాను!

విగ్రహంలా కదలకుండా
నీటిలో నిలబడతాను
చటుక్కున తల వంచి
ముక్కుతో చేపను పట్టుకుంటాను!



ఎంతో అందమైనది!
ఆకుపచ్చ వళ్లు, ఎర్రటి ముక్కు!
ఊళ్లల్లో ఉంటుంది
పొలాల్లో తిరుగుతుంది



నల్ల చొక్కా వేసుకుని
రోజంతా పని చేస్తాడు
తినటానికి ఏమైనా వేస్తే -
కా! కా! కా! అంటూ
తన బంధువులు అందరినీ పిలుస్తాడు!

వంపుతిరిగిన ముక్కు
పదునైన చూపు
బలమైన రెక్కలు
ఆకాశంలో తిరుగుతూ, ఆహారం కోసం వెతుకుతాను

కాకి, డేగ, నెమలి, చిలుక, కోయిల, పావురం, కొంగ,
కోడిపుంజు, గుడ్లగూబ, మైనా, నిప్పుకోడి, గిజిగాడు, బాతు

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi


Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

పిల్ల గుర్రం, నది

ఒకప్పుడు ఒక పిల్ల గుర్రం తన తల్లితో కలిసి చెట్లతో నిండిన అందమైన లోయలో నివసించేది. ఆ పిల్ల గుర్రానికి తల్లి అంటే చాలా ఇష్టం. తల్లిని వదిలిపెట్టి వెళ్లటం దానికి ఏమాత్రం ఇష్టంగా ఉండేది కాదు! పగలు, రాత్రీ అన్ని వేళలా తల్లిని అంటిపెట్టుకుని తిరిగేది.

ఒక రోజు పిల్ల గుర్రంతో తల్లి ఇలా చెప్పింది, "నువ్వు ఇప్పుడు పిల్లదానివి కావు. పని ఎప్పటినుంచి మొదలుపెడతావు?"

"నేను ఇప్పుడు సిద్ధంగా ఉన్నాను! ఏం చేయాలో చెప్పు!" అని పిల్ల గుర్రం చెప్పింది. "చాలా బాగుంది!" అని తల్లి చెప్పింది. బిడ్డ ముఖాన్ని ప్రేమగా అది నాకింది.



"ఈ గోధుమల బస్తాను పిండి పట్టించటానికి మరకి తీసుకుని వెళ్లు."


"సరే, అమ్మా!" అని పిల్ల గుర్రం చెప్పింది. సంచిని దాని వీపుపైన వేసుకుని మరకు బయలుదేరింది. దారిలో అకస్మాత్తుగా ఆగిపోయింది. 'అయ్యో! ఇది ఏమిటి?' అది అనుకుంది.


పిండిమరకు వెళ్లే దారిలో ఒక నది ఉంది! ఉరకలెత్తుతున్న నీటిని పిల్ల గుర్రం చూసింది. 'నేను దాటగలనా?' అని అది ఆలోచనలో పడింది.

దగ్గరలోని పొలంలో ఒక ఎద్దు మేస్తోంది. "ఎద్దు గారూ! నదిని నేను దాటగలనా?" పిల్ల గుర్రం అడిగింది.

"ఈ నదిలోని నీళ్లు నా మోకాళ్ల వరకు రావు. నీకు కూడా ఇబ్బంది ఉండదు," అని ఎద్దు అంది. దాంతో ఆ పిల్ల గుర్రం ధైర్యం తెచ్చుకుని నదిలోకి అడుగు పెట్టబోయింది. కానీ అకస్మాత్తుగా, "ఆగు! తొందరపడకు!" అని ఒక గొంతు వినిపించింది.

"ఎవరు అది?" అని పిల్ల గుర్రం అడిగింది.





అది మెడ చాచి పైకి చూసింది. "ఓహ్! ఉడుత!"

అవును అది ఉడుతే! పిల్ల గుర్రం పక్కనున్న చెట్టు కొమ్మపైన ఉడుత ఉంది. "ఆ ముసలి ఎద్దు మాట వినవద్దు!" అని అది కోప్పడింది. "ఈ నది చాలా చాలా లోతుగా ఉంది! నిన్న, నా స్నేహితుడిని ఈ నీరు కిందకి లాగేసింది. అది చచ్చిపోయినంత పని అయ్యింది!"

పాపం, పిల్ల గుర్రం అయోమయంలో పడింది. నీరు లోతుగా ఉందా, లేదా? ఎవరు చెప్పింది నిజం? ఉడుతా, లేక ఎద్దా? 'నేను ఇంటికి వెళతాను. ఏం చేయాలో అమ్మ చెబుతుంది,' అని అది నిర్ణయించుకుంది.

దాంతో, నది నుండి వెనక్కి తిరిగి ఇంటికి నడిచింది పిల్ల గుర్రం. పిల్ల గుర్రాన్ని చూసి తల్లి గుర్రం ఆశ్చర్యపోయింది. "ఇంత త్వరగా ఇంటికి వచ్చావు ఏమిటి?" అని అడిగింది.

పిల్ల గుర్రం ఆమెకు నది గురించి చెప్పింది. "నీళ్లు చాలా వేగంగా ప్రవహిస్తున్నాయి. నది అడుగు భాగం నాకు కనిపించ లేదు. దాంతో, దాటడానికి భయపడ్డాను!" అని చెప్పింది.

"నిజంగానా? నేను ప్రతిరోజూ పిండిమరకు వెళతాను. ప్రతిసారీ సురక్షితంగా తిరిగి వస్తాను," చెప్పింది తల్లి గుర్రం.


"అవును, అమ్మా. కానీ నేను గందరగోళంలో ఉన్నాను," అని పిల్ల గుర్రం చెప్పింది. "నది అస్సలు లోతుగా లేదని ఎద్దు చెప్పింది. నీళ్లు దాని మోకాళ్ల వరకే వస్తాయంట. కానీ, నది చాలా లోతుగా ఉందని ఉడుత చెప్పింది. నీటి ఉధృతికి దాని స్నేహితుడు దాదాపు కొట్టుకుపోయింది. నేను ఏం చేయాలి, అమ్మా?"

తల్లి గుర్రం నవ్వింది. "ఎద్దు ఎంత ఎత్తుగా ఉందో చెప్పు? ఉడుత ఎంత ఎత్తుగా ఉంది? నువ్వు ఎంత ఎత్తుగా ఉన్నావు? ఇప్పుడు నదిని దాటగలవో, లేదో ఆలోచించి నువ్వే నిర్ణయం తీసుకో,"అని చెప్పింది.

"ఇప్పుడు నాకు అర్థమైంది! నా వరకు నది అస్సలు లోతుగా లేదు!" అంటూ పిల్ల గుర్రం సంతోషంగా పైకి లేచింది.

పిండిమరకు అది సంతోషంగా బయలుదేరింది.

చీనా కథ ఆధారంగా



© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

మా పిల్లి



భాను, వేణులకు ఒక పిల్లి ఉంది. అది అంటే వాళ్లకి ఎంతో ఇష్టం! ఒక రోజు వాళ్ల ప్రియమైన పిల్లి తప్పిపోయింది. భాను, వేణు దానికి ఇష్టమైన ప్రదేశాలు అన్నింటినీ వెతికారు. అది ఎక్కడా లేదు.

మూడు రోజులు గడిచాయి. నాల్గవ రోజు... "మియావ్, మియావ్!" అని వినిపించింది.

"ఆ శబ్దం ఎక్కడి నుండి వస్తోంది?" ఒక నిచ్చెన ఎక్కి చూసింది భాను. "వేణు! మన పిల్లి ఇక్కడ ఉంది!" అని ఆమె పిలిచింది. "అంతే కాదు, ఐదు పిల్లి పిల్లలు! వచ్చి చూడు!"

వేణు నిచ్చెన పైకి ఎక్కాడు. అక్కడ వాళ్ల పిల్లి, దాని పిల్లలు వెచ్చగా పడుకుని ఉన్నాయి.



భాను, వేణు చాలా సంతోషంగా ఉన్నారు! అతిథులకి, బంధువులకి పిల్లి పిల్లలను చూపించారు. అందరూ సంతోషించారు!

పిల్లులు త్వరగా పెరిగాయి. అవి అంతటా తిరుగుతున్నాయి. అవి ఆడుకుంటున్నాయి, పోట్లాడుకుంటున్నాయి. అవి ఒకదాని మీద ఒకటి పడుతున్నాయి. అవి కుండలు, పాత్రల లోపలకి దూరి దొర్లుతున్నాయి.

ఒక రోజు, "ఈ ఇంట్లో చాలా పిల్లి పిల్లలు ఉన్నాయి!" అని భాను తల్లి అరిచింది. ఒక్క పిల్లిని మాత్రమే ఉంచుకుని, మిగతా వాటిని ఇచ్చెయ్యమని భాను, వేణులకు చెప్పింది. ఎంతో బాధపడుతూ, నాలుగు పిల్లి పిల్లలను తమ స్నేహితులకు ఇచ్చేశారు. బూడిద రంగు పిల్లిపిల్లని తమ కోసం ఉంచుకున్నారు.

వాళ్లు ఆ పిల్లిని ఎంతగానో ప్రేమించేవాళ్లు! దానికి తరచు తినిపించి, తాగడానికి మంచినీరు బయట ఉంచేవాళ్లు. వాళ్లు దానితో గంటల తరబడి ఆడుకునేవాళ్లు. దానిని తమతో పాటు పడుకోబెట్టుకునేవాళ్లు.

ఒకసారి బూడిద రంగు పిల్లిని గడ్డివాములతో నిండిన పొలంలో ఆడుకోవడానికి భాను, వేణు తీసుకుని వెళ్లారు. గడ్డి వాములు పెద్దగా ఉన్నాయి. గడ్డి పరకలు గాలికి ఊగుతున్నాయి.

పిల్లిని కింద దించగానే అది ఆడుకోసాగింది. ఈ కొత్త ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు వేచి ఉన్నాయి? గడ్డివాము మీదకు దూకి పిల్లి కిందకు జారుతోంది.

అది గడ్డి పరకలతో ఆడుకుంటూ ఉంది. ఆడుకుంటున్న పిల్లిని చూసి పిల్లలు నవ్వారు. అది చూడటానికి మరింతమంది పిల్లలు వచ్చారు. తరవాత వాళ్లందరూ ఆడుకోసాగారు.

పిల్లలు అలసిపోలేదు కానీ ఇంటికి వెళ్లే సమయం అయ్యింది. పిల్లిపిల్ల ఎక్కడ ఉంది? పిల్లలు అంతటా వెతికారు, కానీ బూడిద రంగు పిల్లి ఎక్కడా కనిపించలేదు.

భాను, వేణు ఏడుపు ఆపుకోలేకపోయారు. "పాపం పిల్లి," అంటూ ఏడ్చారు. దానికి ఎవరు తినిపిస్తారు, పాలు ఎవరు ఇస్తారు? అది ఎక్కడ పడుకుంటుంది? అది వెచ్చగా ఎలా ఉంటుంది? ఇంటికి వెళ్లి ఈ ప్రశ్నలు అడిగారు. "మీ పిల్లి పిల్ల తిరిగి వస్తుంది!" అంటూ అమ్మ ఓదార్చింది.



సాయంత్రం చదవుకోటానికి పిల్లలు తమ పుస్తకాలను తీసుకున్నారు. కానీ వారి ఆలోచనలు బూడిద రంగు పిల్లి చుట్టూనే ఉన్నాయి.

అకస్మాత్తుగా, ఒక మూలలో, నేలపై ఒక టోపీ కదలసాగింది. "బాబోయ్! ఈ టోపీ నడుస్తోంది!" అని భాను అరిచింది. ఆమె, వేణు అమ్మ వద్దకు పరిగెత్తారు. ముగ్గురూ టోపీని చూడటానికి వెళ్లారు. అప్పుడు అమ్మ నవ్వింది.

"టోపీ వెనక బూడిద రంగులో ఏదో కనిపిస్తోంది!" ఆమె అంది. బూడిద రంగు తోక మెల్లగా ఊగుతోంది. "ఓహ్! అది మన పిల్లి!" భాను అంది. ఆమె పిల్లి దగ్గరకు పరిగెత్తి టోపీని జాగ్రత్తగా ఎత్తింది. ఆమె పిల్లి పిల్లను ఎత్తుకుని హత్తుకుంది.

"ఇంతసేపు ఇక్కడే దాక్కున్నావా?" ఆమె అంది. తరవాత, "నీ కోసం ఎంత వెతికామో తెలుసా!" అని కోప్పడింది. వేణు మెల్లగా భాను నుండి పిల్లి పిల్లను తీసుకున్నాడు. అతను దానిని హత్తుకుని, "నువ్వు దారి తప్పలేదని నాకు సంతోషంగా ఉంది!" అని గుసగుసలాడాడు.

రష్యా కథ ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


39 మాయా డప్పు

చాలా కాలం క్రితం జపాన్‌లో జెంకోరా అనే పిల్లవాడు ఉండేవాడు. జెంకోరా వద్ద ఒక మాయా డప్పు ఉండేది.

"పొడపైన ముక్కు, పొడపైన ముక్కు!" అంటూ డప్పుని ఒక వైపు కొట్టినప్పుడు అతని ముక్కు పొడవుగా పెరిగేది. "చిన్న ముక్కు, చిన్న ముక్కు!" అంటూ మరొక వైపు కొట్టినప్పుడు అతని ముక్కు చిన్నగా అయ్యేది.

తమ ముక్కులను మార్చుకోవాలని కోరుకుంటూ జెంకోరా వద్దకు చాలా మంది వచ్చేవాళ్లు. అతను సంతోషంగా వాళ్లకి సహాయం చేసేవాడు.

ఎవరైనా పొడపైన ముక్కు అడిగితే, డప్పును ఆ వైపు కొట్టి, "పొడపైన ముక్కు, పొడపైన ముక్కు!" అని అనేవాడు. వాళ్లు చిన్న ముక్కు అడిగితే, డప్పును మరొక వైపు కొట్టి, "చిన్న ముక్కు, చిన్న ముక్కు!" అని అనేవాడు. "ఆపు!" అని ఆ వ్యక్తి చెప్పే వరకు అతను డప్పు కొడుతూ ఉండేవాడు.




ఒకసారి ఒక వ్యక్తి, "ఆపు!" అని చెప్పడం మరిచిపోయాడు. చిలిపి పిల్లవాడైన జెంకోరా డప్పును కొడుతూనే ఉండేవాడు. అలా ఆ వ్యక్తి ముక్కు మునగకాయ కంటే పొడవుగా పెరిగింది!

'నా ముక్కు ఎంత పెద్దగా పెరుగుతుంది?' ఒక రోజు జెంకోరా అనుకున్నాడు. "పొడవైన ముక్కు, పొడవైన ముక్కు!" అంటూ డప్పును కొట్టసాగాడు. కాసేపటికి అతని ముక్కు అతని చేయి అంత పొడవుగా పెరిగింది!

అయినా జెంకోరా ఆగలేదు. అతను నేలపై పడుకుని డప్పును కొడుతూనే ఉన్నాడు. "పొడవైన ముక్కు, పొడవైన ముక్కు!" అంటూనే ఉన్నాడు. అతని ముక్కు చెట్టు అంత పొడవుగా పెరిగింది.

"పొడవైన ముక్కు, పొడవైన ముక్కు!" అతని ముక్కు కొండ కంటే ఎత్తుగా పెరిగింది.



"పొడవైన ముక్కు, పొడవైన ముక్కు!" జెంకోరా ముక్కు ఆకాశంలోకి పెరిగింది.

అక్కడ ఆకాశ ప్రపంచంలో, ఆకాశ వడ్రంగులు ఒక వంతెనను కడుతున్నారు. జెంకోరా ముక్కు కొనను వాళ్లు వంతెనకు ఒక పక్కన మేకుతో కొట్టి వెళ్లిపోయారు!

జెంకోరా డప్పును కొడుతూనే ఉన్నాడు, "పొడవైన ముక్కు, పొడవైన ముక్కు!" అని అంటూనే ఉన్నాడు. వంతెనకు మేకుతో కొట్టి ఉండటంతో జెంకోరా ముక్కు పెరగడం ఆగిపోయింది!

జెంకోరా డప్పును కొట్టడం ఆపి ఒక నిమిషం ఆలోచించాడు, అప్పుడు అతను, "చిన్న ముక్కు, చిన్న ముక్కు!" అంటూ డప్పు రెండో వైపు కొట్టసాగాడు.



ఇప్పుడు అతని ముక్కు చిన్నగా అవ్వసాగింది. కానీ ముక్కు కిందకి రాలేదు! జెంకోరా, అతని డప్పు నెమ్మదిగా ఆకాశంలో పైకి లేవసాగాయి!

జెంకోరా ఆకాశ వంతెన వద్దకు చేరుకున్నాడు. తన ముక్కుకి కొట్టిన మేకును అతను లాగాడు. ఒక క్షణం అతను గాలిలో తేలుతున్నాడు... తరవాత అతను కిందకి పడసాగాడు. కొండలను దాటి, చెట్లను దాటి కిందకి పడుతున్నాడు...

ఆకాశ వంతెన కింద ఒక చేపల చెరువు ఉంది. ఆ చెరువులో జెంకోరా పడ్డాడు. అతను అడుగుకు మునిగిపోయాడు. అక్కడ రంగు రంగుల చేపలు ఉన్నాయి. అవి ఆసక్తిగా ఈదుకుంటూ అతని వద్దకు వచ్చాయి.

జెంకోరా డప్పు అతని చేతుల నుండి పడిపోయింది. అతని శరీరం మారుతోంది! అతని చేతులు చేపల రెక్కలుగా మారాయి! అతని కాళ్లు తోకలాగా కలిసిపోయాయి! అతను ఈత కొట్టసాగాడు.

ఆ చెరువులోని చేపలను ఇప్పటికీ 'జెంకోరా చేప' అని పిలుస్తారు.

జపనీస్ జానపద కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

కవి ఎజుమలై

ఎజుమలై ఊహల ప్రపంచంలో జీవించేవాడు. కిటికీ దగ్గర కూర్చుని గంటల తరబడి బయటకి చూసేవాడు. "ఏం చేస్తున్నావు, ఎజుమలై?" అని ప్రజలు అడిగితే అతను ఒక కవితతో సమాధానం ఇచ్చేవాడు:

సీతాకోకచిలుకలు ఎగిరిపోతున్నాయి!

ఎలుక పరిగెత్తుతుంది - కానీ కాదు ఆకతాయి!

ఇతర అబ్బాయిలు అతన్ని ఆటపట్టించేవాళ్లు. అతన్ని చూసినప్పుడు, "ఎజుమలై కవి వస్తున్నాడహో!" అని అరిచేవాళ్లు. కానీ అతను పదాలతో ఆడుకోవటం ఎప్పుడూ ఆపలేదు.



ఒక రోజు, ఎజుమలై తన అమ్మమ్మను చూడటానికి బయలుదేరాడు. దారిలో చెట్లు, తోటలు, పక్షులు ఉన్నాయి... ఆహ్! ఎంత అందంగా ఉంది!

అతను ఒక తాటి చెట్టు దాటి నడిచాడు. వెంటనే అతను పాడాడు,

పొడవైన తాటి చెట్టు నిలబడి, నిలబడి, లాలల లా!

అతను ముందుకు నడిచాడు. ఓహ్! అక్కడ ఒక గుడ్లగూబ ఉంది! ఎజుమలై పాడాడు,

పెద్ద కళ్ల గుడ్లగూబ చూస్తూ, చూస్తూ, లాలల లా!

అకస్మాత్తుగా అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు. అతను పాడాడు,

పొడవైన తాటి చెట్టు నిలబడి, నిలబడి, లాలల లా! పెద్ద కళ్లున్న గుడ్లగూబ చూస్తూ, చూస్తూ, లాలల లా!

కొంచెం ముందుకు వెళ్లగానే, నేలను తవ్వుతున్న ఒక అడవి జంతువును అతను చూశాడు. అది ఒక నక్క!



తెలివైన నక్క తవ్వుతోంది, తవ్వుతోంది, లాలల లా, లాలల లా!

ఎంత బాగుంది! ఎజుమలై చరణాలు అలా వచ్చేస్తున్నాయి.

పొడవైన తాటి చెట్టు నిలబడి, నిలబడి, లాలల లా!

పెద్ద కళ్లున్న గుడ్లగూబ చూస్తోంది, చూస్తోంది, లాలల లా!

తెలివైన నక్క తవ్వుతోంది, తవ్వుతోంది, లాలల లా, లాలల లా!

అతను నడుస్తూ పాడుతున్నాడు. చివరికి, అతను తన అమ్మమ్మ ఊరికి చేరుకున్నాడు

రాత్రి అయిపోయింది. ఊరు నిశ్శబ్దంగా ఉంది. అయ్యో! అమ్మమ్మ ఇల్లు తాళం వేసి ఉంది! ఎజుమలై ఆందోళన చెందసాగాడు. కానీ చేసేది ఏముంది? ఆ రాత్రికి ఉండటానికి స్థలం కోసం చుట్టూ చూశాడు.

దగ్గరలో పెద్ద వరండా ఉన్న ఇల్లు ఉంది. తలుపుకి దగ్గరగా ఎజుమలై పడుకున్నాడు. అతను కళ్లు మూసుకున్నాడు...

...ఉలిక్కిపడి లేచాడు! ఆ శబ్దం ఏమిటి?!

కిటికీ ఊచల గుండా లోపలికి చూశాడు, రెండు పొడవైన కాళ్లు కనిపించాయి! నిద్ర మత్తులో అవి తాటి చెట్లు అని అనుకున్నాడు! దాంతో అతను పాడసాగాడు,

పొడవైన తాటి చెట్లు నిలబడి, నిలబడి, లాలల లా!

ఆ పాటను దొంగ విన్నాడు. కళ్లు పొడుచుకుని ఎంత చూసినా పాడుతున్న వ్యక్తి దొంగకి కనపడలేదు.


ఎజుమలై చూస్తున్నాడు, పాడుతున్నాడు,

పెద్ద కళ్ల గుడ్లగూబ చూస్తోంది, చూస్తోంది, లాలల లా!

'ఎవరో వస్తున్నారు! దొంగలించిన సొత్తును దాచడం మంచిది!' అని అనుకుని దొంగ ఒక గొయ్యి తవ్వసాగాడు.

ఎజుమలై పాడుతున్నాడు,

తెలివైన నక్క తవ్వుతోంది, తవ్వుతోంది, లాలల లా, లాలల లా!



దొంగ గడ్డకట్టుకుపోయాడు! అతను చుట్టూ కలయచూశాడు. తన పనిముట్లు, దొంగలించిన సొమ్ము వదిలి పారిపోయాడు!

వెంటనే, "దొంగ! దొంగ!" అని ఎజుమలై అరిచాడు. చుట్టుపక్కల వాళ్లు పరిగెత్తుకుంటూ వచ్చారు. పనిముట్లు, దోపిడీ సొమ్ముని చూశారు. ఏమి జరిగిందో వారికి అర్థమైంది. "నువ్వు దొంగ నుంచి కాపాడావు! భలే!" అంటూ ఎజుమలైని మెచ్చుకున్నారు.

అప్పటి నుండి, ఎజుమలై కవితలు వినాలని అందరూ కోరుకోసాగారు.

తమిళ కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

ఇటువైపు ఎవరు వస్తున్నారు?



సర్రాక్! సర్రాక్! సర్రాక్!

ఆ శబ్దం ఏమిటి?

సర్రాక్! సర్రాక్! సర్రాక్!

గుడ్లగూబ మేల్కొంది. తన తీక్షణమైన చెవులను ఆడించింది.

సర్రాక్! సర్రాక్!


కుందేలు తన బొరియలోకి దూరింది. తరవాత బయటకు తొంగి చూసింది. అది చుట్టూ చూసింది.

సర్రాక్! సర్రాక్!

పాము తన తలని ఎత్తి తన పడగ విప్పింది. అటు ఇటు తల తిప్పి చూసింది.

శబ్దం దగ్గరకు వస్తోంది.

సర్రాక్!



తన నైపుణ్యంతో ఊసరవెల్లి మాయమయ్యింది. దాని వంటి రంగు నెమ్మదిగా మారుతోంది. పరిసరాలలో అది కలిసిపోయింది. ఇప్పుడు అది ఒక ఆకు లాగా ఉంది!



నత్త పాకడం ఆపివేసింది. తన శరీరాన్ని గుల్లలోకి లాక్కుంది. ఇప్పుడు అది ఒక రాయి!

సర్రాక్! సర్రాక్!


ముళ్ల పంది వణుకుతోంది. బంతి లాగా చుట్టుకుని ముళ్లు విచ్చుకునేలా చేసింది.

పక్కకు అడుగులు వేయడం ఆపి, ఇసుకలో ఒక గొయ్యి తవ్వుకుంది పీత.




తామర ఆకు మీద ఉన్న
కప్ప పాట ఆపేసింది.
ఒక్కసారిగా నీటిలోకి దూకింది.


సర్రాక్! సర్రాక్!





శబ్దం దగ్గరవుతోంది. అందరూ ఆ వైపు
చూస్తూ ఎదురు చూస్తూ ఉన్నారు.





సర్రాక్! సర్రాక్!

వంపులు తిరిగిన దారిలో ఎవరు వస్తున్నారు?

సర్రాక్! సర్రాక్! సర్రాక్!

ఓహ్! అది మన రోకలిబండి! దాని ప్రతి కాలికి చెప్పు ఉంది! వాటితో నడవడం అది నేర్చుకోలేదు. అది జారుతూ, తడబడతూ సర్రాక్, సర్రాక్ అంటూ వస్తోంది!



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

42 పరుగు పందెం

ఎండగా ఉన్న ఒక రోజు ఒక ఏనుగు చెరువు నుండి ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. అది ఉల్లాసంగా ఉంది. దారిలో చీమల వరసను గమనించి ఆశ్చర్యపోయింది!


"నేను రావటం చూడలేదా? పనికిరాని పురుగులు!" అంటూ ఏనుగు ఉరిమింది.



"మేం చిన్నవాళ్లం కావచ్చు, కానీ పనికిరాని వాళ్లం కాదు!" అని ధైర్యంగల ఒక చిన్న చీమ బదులు ఇచ్చింది.

"నన్ను చూడు, చిన్న చీమా! అడవిలో అన్నిటికంటే బలమైన జంతువుని! నేను ఏదైనా చేయగలను! ఇప్పుడు నిన్ను నువ్వు చూసుకో. నువ్వు ఏం చేయగలవు?" అంది ఏనుగు.

కానీ చిన్న చీమ వెనక్కి తగ్గలేదు. "నువ్వు ఏది చేస్తే అది చేయగలను!" అని అది చెప్పింది.



"అలాగా?" ఏనుగు నవ్వింది.

"నా అంత వేగంగా పరిగెత్తగలవా! పందెం వేసుకుందామా?"

"పరుగు పందానికి సంతోషంగా ఒప్పుకుంటాను!" అని చీమ చెప్పింది.



"నువ్వు ఒక రోజులో నడవగలిగినంత నేను మూడు అడుగులలో నడుస్తాను!" అంటూ ఏనుగు వెక్కిరించింది.

సమాధానం చెప్పకుండా చీమ చూస్తూనే ఉంది. దీంతో ఏనుగు కోపం మరింత పెరిగింది.

"ఇప్పుడు నేను నీకు గుణపాఠం నేర్పుతాను!" అంటూ అది ఘీంకరించింది.

పరుగు పందెం మొదలయ్యింది!


ఏనుగు నడవటం మొదలుపెట్టింది. అడవి దారిలో చరుకుగా నడుస్తోంది. కొద్దిసేపటి తరవాత అది నవ్వింది. "ఆ పిచ్చి చీమ చాలా వెనకబడి ఉండాలి!"

అది కిందికి చూసింది. ఆశ్చర్యం! అక్కడ చీమ ఉంది!

ఏనుగు మళ్లీ బయలుదేరింది. ఈసారి, అది వేగంగా నడవసాగింది. పొదలను, తీగలను తొక్కేసింది. మొక్కలను పీకి పడేసింది. ధడ ధడమంటూ అది అడవి దారిలో పరిగెత్తింది. "నేను గెలిచాను!"

అని అది అనుకుంది. కానీ అది విశ్రాంతి తీసుకోటానికి ఆగినప్పుడు, ఏం కనపడింది? చీమ!

'ఆ చిన్న చీమ నా అంత వేగంగా ఎలా పరిగెత్తింది?' ఏనుగు ఆశ్చర్యపోయింది. 'ఈసారి ఇంకా వేగంగా పరిగెత్తుతాను!' ఇంకా వేగంగా పరిగెత్తడానికి అది సిద్ధం అయ్యింది. "నేను ఓడిపోను!" అంటూ అది ప్రతిజ్ఞ చేసింది.



ఇంతలో, పరుగు పందెం వార్త అడవిలో వ్యాపించింది. ఇతర జంతువులు చూడటానికి చేరాయి. "పరిగెత్తు, చిన్న చీమా, పరిగెత్తు! హుర్రే! హుర్రే!" అంటూ అవి అరిచాయి.

ఏనుగుకి కోపంగా ఉంది. కానీ ఇప్పుడు కోపంతోపాటు నొప్పి కూడా ఉంది. దాని కండరాలు నొప్పిపెడుతున్నాయి. దాని కాళ్లు ఒణుకుతున్నాయి. అది ఇక పరిగెత్తలేకపోయింది. ఉన్నట్టుండి దారిలో ఒక గొయ్యి వచ్చింది.






ఏనుగు ఆ గుంతలో పడిపోయింది. గుంతలో ఒక చీమ ఉంది! "నేను నీకు సహాయం చేయను!" అంటూ చీమ బయటకు పాకింది. గుంతలోంచి బయటపడటానికి కష్టపడుతున్న ఏనుగును ఇతర జంతువులు చూశాయి. "గుంత నుండి బయట పడటానికి సహాయం చేయండి!" అంటూ వాటిని ఏనుగు వేడుకుంది.

చివరికి జంతువులు దానిపై జాలిపడ్డాయి. గుంత నుండి బయటకు రావడానికి సహాయం చేశాయి. వాటికి కృతజ్ఞతలు చెప్పి ఇంటికి బయలుదేరింది ఏనుగు. అది చాలా అయోమయంలో ఉంది. 'పరుగు పందెంలో ఒక చిన్న చీమ నన్ను ఎలా ఓడించింది?'

పాపం ఏనుగు! పరుగు పందెంలో అది కిందకి చూసినప్పుడల్లా, దగ్గరలో ఒక చీమ ఉండేది. చెరువు దగ్గర తాను చూసిన చీమే అది అని ఏనుగు అనుకుంది.

కిందికి చూసిన ప్రతిసారీ వేరే చీమ కనిపించిందన్నది దానికి అర్థం కాలేదు! చీమలు ప్రతిచోటా ఉంటాయి కదా!

భారతీయ జానపద కథను శోబిత పుంజా తిరిగిచెప్పిన దాని ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


చంద్రుడు రాత్రిపూట ఎందుకు ప్రకాశిస్తాడు

చాలా కాలం క్రితం, చంద్రుడు, సూర్యుడు ఆకాశంలో పగటిపూట ఉండేవాళ్లు. ఒక రోజు సూర్యుడిని చూసి, 'సూర్యుడు ఎంత పెద్దగా ఉన్నాడు! ఎంత బాగా వెలుగుతున్నాడు!' అనుకున్నాడు చంద్రుడు. తాను చిన్నగా, పేలవంగా ఉన్నాడు.

గుడ్లగూబను సహాయం అడగాలని అనుకున్నాడు చంద్రుడు. గుడ్లగూబను లేపి, "సూర్యుడు తన కాంతిని ఎక్కడ దాస్తాడో కనుక్కోగలవా?" అని అడిగాడు.

"తప్పకుండా!" అంది గుడ్లగూబ.

"ధన్యవాదాలు! ఈ జముడు మొక్క వెనక నీ కోసం ఎదురు చూస్తుంటాను," చంద్రుడు అన్నాడు. గుడ్లగూబ ఎగిరిపోయింది. చంద్రుడు వేచి ఉన్నాడు. 'సూర్యుడు తన కాంతిని ఎక్కడ ఉంచుతాడో గుడ్లగూబ ఎలా కనుక్కుంటుంది? సూర్యుడు నిద్ర లేస్తే ఏం జరుగుతుంది?' చంద్రుడు భయపడసాగాడు.



నిద్రపోయే వరకు చంద్రుడు ఆందోళన పడుతూనే ఉన్నాడు.

మరుసటి రోజు సాయంత్రం, జముడు మొక్క వద్దకు పరిగెత్తాడు చంద్రుడు. గుడ్లగూబ వస్తోందో లేదో అప్పుడప్పుడు తొంగి చూస్తూ సూర్యాస్తమయం వరకు ఆత్రుతగా వేచి ఉన్నాడు.

చివరికి గుడ్లగూబ వచ్చింది. "నీ గురించే ఆందోళన పడుతున్నాను," అన్నాడు చంద్రుడు.


"నిద్రపోయే ముందు తన కాంతిని సూర్యుడు పెట్టెలో దాస్తాడు," గుడ్లగూబ గుసగుసలాడింది.

"ఓహ్, ధన్యవాదాలు!" చంద్రుడు గుసగుసలాడాడు. తరవాత అది, "ప్రియమైన మిత్రమా, నువ్వు నాకు ఇంకో సహాయం చేస్తావా?"

“తప్పకుండా," అని గుడ్లగూబ చెప్పింది.

"సూర్యుని కాంతిలో ఒక చిన్న ముక్క నాకు తెస్తావా?" అడిగాడు చంద్రుడు. "తెస్తాను!" అని గుడ్లగూబ చెప్పింది.

"రేపు సూర్యాస్తమయానికి ఇక్కడ కలుద్దాం," అని చంద్రుడు అన్నాడు.




ఆ రాత్రి చంద్రుడు నిద్రపోలేదు. ‘గుడ్లగూబ చిక్కుకుంటే... గుడ్లగూబ శబ్దం చేయకుండా లోపలికి రాగలదా?’ అనుకుంటూ ఆందోళన చెందాడు. ఆ రాత్రంతా, మరుసటి రోజంతా చంద్రుడు భయంగా వేచి ఉన్నాడు.

చివరికి, సూర్యాస్తమయం తరవాత గుడ్లగూబ వచ్చింది! అది సూర్యుని కాంతిలో ఒక చిన్న ముక్కను తెచ్చింది.

"ధన్యవాదాలు, మిత్రమా!" అన్నాడు చంద్రుడు. సూర్యుని కాంతిని వేసుకున్నాడు. "ఇప్పుడు నువ్వు వెలిగిపోతున్నావు!" అంటూ చంద్రుడిని మెచ్చుకుంది గుడ్లగూబ.

నెలలు గడిచాయి. ప్రతి రాత్రి గుడ్లగూబ సూర్యుని ఇంటికి వెళ్లేది. సూర్యుడు నిద్రపోతున్నాడని నిర్ధారించుకున్న తరవాత చంద్రుడి కోసం కొంచెం వెలుతురు తీసుకునేది. నెమ్మదిగా చంద్రుని కాంతి పెరగసాగింది. అది చాలా ఆనందంగా ఉంది!

కానీ ఒక రోజు, చంద్రుడిని చూసి, తనను తాను చూసుకున్నాడు సూర్యుడు. చంద్రుడు తన కాంతిని దొంగిలిస్తున్నాడని సూర్యుడు గ్రహించాడు! తన కాంతి పెట్టెకి కాపలాగా ఆ రాత్రంతా మేల్కొని ఉండాలని నిర్ణయించుకున్నాడు.



గుడ్లగూబ రావటం, చంద్రుని కోసం వెలుతురు తీసుకోవటం సూర్యుడు చూశాడు. గుడ్లగూబ వెనకాలే వెళ్లి చంద్రునికి అది తన వెలుతురును ఇవ్వడం సూర్యుడు చూశాడు. దానిని చంద్రుడు తీసుకోవటం చూశాడు. వెంటనే, "నా వెలుతురును ఎందుకు దొంగిలించావు?" చంద్రుడిని నిలదీశాడు సూర్యుడు.

"నా కంటే నువ్వు చాలా ప్రకాశవంతంగా ఉన్నావు! అందుకే!" అన్నాడు చంద్రుడు.


అప్పుడు, చంద్రుడి నుండి తన వెలుతురును సూర్యుడు తీసేసుకున్నాడు. పగటిపూట నిద్రపోవాలని, రాత్రి మాత్రమే బయటకు రావాలని చంద్రుడిని ఆదేశించాడు.

"బాధపడకు! ప్రతి రాత్రి నీకు కొంత వెలుతురు తెస్తాను," అంటూ తన స్నేహితుడిని ఓదార్చింది గుడ్లగూబ.

అప్పటినుంచి గుడ్లగూబ అలాగే చేస్తోంది. ప్రతి రాత్రి సూర్యుని కాంతిని అది కొద్దిగా దొంగిలిస్తుంది. కాబట్టి చంద్రుడు ఎప్పుడూ ప్రకాశవంతంగా, అందంగా ఉంటాడు. తెల్లవారకముందే, కాంతిని గుడ్లగూబకు ఇస్తాడు చంద్రుడు. దానిని సూర్యుని పెట్టెలో తిరిగి ఉంచుతుంది గుడ్లగూబ.

ఇప్పటివరకు వాటిని సూర్యుడు కనుగొనలేదు!

స్థానిక అమెరికన్ కథ ఆధారంగా
నిరుపమ రాఘవన్ రాసిన కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

శిబి, గద్ద



చాలా కాలం క్రితం కాశీ దేశాన్ని శిబి రాజు పరిపాలించాడు. శిబి సత్యవంతుడు, న్యాయపరుడు. అందరి పట్ల ఆప్యాయత, దయ కనపరిచేవాడు. అన్ని జీవుల పట్ల సానుభూతి కలిగి ఉండేవాడు.

ఒక రోజు, రాజు తన తోటలో ఉన్నప్పుడు, ఒక పావురం వేగంగా ఎగురుతూ వచ్చింది. "నన్ను రక్షించు! నన్ను రక్షించు!" అని అరిచింది.



"భయపడకు! నేను నిన్ను రక్షిస్తాను," అని శిబి అన్నాడు. పావురాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఉన్నట్టుండి ఒక గద్ద అక్కడ వాలింది. "ఆ పావురాన్ని నాకు ఇవ్వు!" అని అది అంది.


"దానిని రక్షిస్తానని మాట ఇచ్చాను. నా మాట ఎప్పటికీ తప్పను," అని శిబి చెప్పాడు.

"ఈ పావురం నా ఆహారం. దీంతో నా కుటుంబం పొట్ట నిండుతుంది. నా కుటుంబానికి ఆహారం లేకుండా చేస్తావా?" అడిగింది గద్ద.

"నువ్వు చెప్పింది నిజమే! అయినప్పటికీ ఈ పావురం ఈ రోజు నీకు ఆహారం కాదు. నన్ను ఇంకేమైనా అడుగు. సంతోషంగా ఇస్తాను," అన్నాడు శిబి.

"ఈ చిన్న పావురం తప్ప నాకు ఇంకేమీ వద్దు," అని గద్ద అంది.

గద్దను ఒప్పించడానికి శిబి ప్రయత్నిచాడు. కానీ అది ఒప్పుకోలేదు. అది మొండిగా ఉంది. శిబి కూడా దానిని బతిమాలుతూనే ఉన్నాడు.




చివరికి, "నువ్వు పావురాన్ని కాపాడావు! దానికి సమానంగా నీ మాంసాన్ని ఇవ్వు," అంది గద్ద. శిబి వెంటనే అంగీకరించాడు.

ఈ వింత వివాదం వేగంగా వ్యాపించింది. తోటలో చాలామంది గుమిగూడారు. దేవతలు కూడా పైనుండి చూస్తున్నారు.

అక్కడకు ఒక త్రాసును తెచ్చారు. పావురాన్ని మెల్లగా తక్కెడలో ఒక వైపు ఉంచాడు శిబి.

తన తొడలోంచి కొంత భాగం కోసి రెండవ వైపు ఉంచాడు.



ఆశ్చర్యం! శిబి తొడ ముక్క కంటే పావురమే బరువుగా ఉంది, అటువైపు తక్కెడ పళ్లెం కిందకి ఉంది!

చూస్తున్న ప్రజలు ఆశ్చర్యపోయారు. కానీ శిబి తన తొడలోని మరొక ముక్కని తక్కెడలో పెట్టాడు.

కానీ ఇప్పటికీ పావురం ఉన్న పళ్లెమే కిందకి ఉంది!

తన శరీరంలో నుండి ముక్కలను తక్కెడలో వేస్తూనే ఉన్నాడు శిబి. కానీ పావురమే బరువుగా ఉంది.

చివరకు, రాజు తానే తక్కెడలో కూర్చున్నాడు. అప్పుడు, తక్కెడ పళ్లాలు రెండూ సమంగా ఉన్నాయి. "నీ కోరిక తీరింది కదా," అన్నాడు శిబి.

రాజు త్యాగం చూసి ప్రజలు చలించిపోయారు. "శిబి! శిబి!" అంటూ వాళ్లు జేజేలు పలికారు.

దేవతలు పువ్వులు చల్లారు. అతన్ని దీవించి, పొగిడారు.



"మరొక రాజు అయితే, 'అది ఒక చిన్న పక్షి మాత్రమే. నా జీవితం దానికంటే చాలా విలువైనది!' అని చెప్పి ఉండేవాళ్లు. కానీ మీ మాటకు మీరు కట్టుబడి ఉన్నారు. దాని ప్రాణానికి బదులుగా మీ జీవితాన్ని అర్పించారు. ప్రపంచం మిమ్మల్ని ఎప్పటికీ గౌరవిస్తుంది," దేవతలు అన్నారు.

అప్పుడు గద్ద, పావురం దేవతలుగా మారాయి. రాజును పరీక్షించడానికి వాళ్లు వచ్చారు! దేవతలు అందరూ శిబిని మరోసారి ఆశీర్వదించి, అదృశ్యమయ్యారు.

మహాభారతంలోని ఒక కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi **Telugu** K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi **Artist** Uma Krishnaswamy

45

విధేయులైన శిష్యులు

ఒక రోజు ఒక గురువు, ఆయన శిష్యులు పట్టణానికి బయలుదేరారు. వాళ్లు ఎద్దుల బండిలో వెళుతున్నారు.

గాలి మెల్లగా వీస్తోంది. వాతావరణం హాయిగా ఉంది. చుట్టూ ఉన్న పొలాల నుండి మంచి వాసనలు వస్తున్నాయి. బండి మెల్లటి కుదుపులతో వెళుతోంది. గురువు గారు నిద్రలోకి జారుకున్నారు.

ఎత్తుపల్లాల దారి రావడంతో బండి పెద్ద కుదుపులకు లోనయ్యింది. తలపై నుండి జారి గురువు తలపాగా నేలపై పడింది!

ఏం చేయాలో శిష్యులకు తెలియలేదు.

‘నన్ను అడగకుండా ఎప్పుడూ, ఏమీ చేయవద్దు,’ అని గతంలో గురువు గారు చెప్పారు.

దాంతో ఆ తలపాగాను వాళ్లు అక్కడే వదిలేశారు!



గురువు గారు కళ్లు తెరిచారు. "నా తలపాగా ఎక్కడ?" అని అడిగారు. జరిగినది శిష్యులు అతనికి చెప్పారు.


"మూర్ఖులు! పనికిరాని వాళ్లు!" అని గురువు తిట్టారు. "తలపాగా కింద పడటం చూశారు! దాన్ని ఎందుకు తీయలేదు? ఇక నుండి, పడిపోయినది ఏదైనా తీయాలి," అంటూ శిష్యులను ఆదేశించారు.

గురువు గారు కళ్లు మూసుకున్నారు. బండి నుండి ఏమీ పడిపోకుండా చూడటానికి శిష్యులు రెప్పవేయకుండా చూస్తున్నారు!

ప్రయాణం సాగుతోంది. అంతలో ఎద్దు పేడ వేసింది. ఏం చేయాలో శిష్యులకు తెలియలేదు.

ఆ పేడని బుట్టలో ఎత్తి, దానిని బండిలో పెట్టారు!

కాసేపటికి గురువు కళ్లు తెరిచారు. బండిలో ఉన్న పేడ బుట్టను చూశారు. "ఇది ఏమిటి?!" అంటూ ఆయన అరిచారు.



"పడిపోయినది ఏదైనా తీయమని మీరు చెప్పారు! అదే చేశాం!" అన్నారు శిష్యులు.


గురువు గారు తన చెవులను నమ్మలేకపోయారు. శిష్యులను బాగా తిట్టాడు. బండి నుండి పేడను కింద పడవేయించాడు. హమ్మయ్య!

ఇప్పుడు గురువు గారు రెండు జాబితాలు తయారు చేశారు: మొదటిది పడిపోతే తీయవలసిన వస్తువుల జాబితా, రెండవది పడిపోతే తీయకూడనివి. శిష్యులకు ఆ జాబితాలు ఇచ్చి, మళ్లీ నిద్రపోయారు గురువు గారు.

పొలాలు, గ్రామాలు, అడవి ప్రాంతాల గుండా ప్రయాణం సాగుతోంది. చాలా గతుకులు ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. అకస్మాత్తుగా బండి పెద్ద కుదుపుకు లోను కావడంతో గురువు ఒక గుంతలో పడిపోయారు!

"నన్ను బయటకు తీయండి!" అంటూ ఆయన అరిచాడు. ఏం చేయాలో శిష్యులకు తెలియలేదు. గురువు ఇచ్చిన జాబితాలను చూశారు.

"గురువు గారు! జాబితాలో మీ పేరు లేదు. కాబట్టి, మిమ్మల్ని మేం బయటకు తీయకూడదు!" అని శిష్యులు చెప్పారు.



గురువు గారు ఎంతగానో వేడుకున్నారు. కానీ శిష్యులు కదలలేదు. "మీరు మమ్మల్ని పరీక్షిస్తున్నారు! మీ మాట జవదాటం గురువు గారు!" అన్నారు శిష్యులు.

ఏం చెయ్యాలో గురువుకి తెలియలేదు. గుంత నుండి బయటపడే దారి కనిపించటంలేదు. అతను ఎంతో ఆలోచించాడు.

చివరికి, జాబితాలు ఇవ్వమని శిష్యులకు చెప్పారు. తరవాత కలం అడిగారు. బండి నుండి పడిపోతే తీయవలసిన జాబితాలో గురువు గారు తన పేరును చేర్చారు. ఆ జాబితాలను శిష్యులకు తిరిగి ఇచ్చారు.

"ఒకటి, రెండు, మూడు!" అంటూ గురువు గారిని గుంత నుండి బయటకు తీశారు శిష్యులు. ఆయన బండిలో కూర్చున్నారు.

ప్రయాణం కొనసాగింది. బండి మెల్లగా ఊగుతోంది. శిష్యులు ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నారు. వారిలో కొందరు నిద్రపోయారు. కానీ గురువు గారు మాత్రం కన్ను మూయలేదు!

భారత దేశ కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

46 చిలుక పొట్టలో రత్నాలు

ఒకప్పుడు ఒక వ్యాపారికి మాట్లాడే చిలుక ఉండేది. ఆ చిలుకను ఎంతో విలువైనదిగా భావించి, దానికి ఒక వెండి పంజరం కొన్నాడు. దాని తెలివైన మాటలు వింటూ గంటల తరబడి కూర్చునేవాడు.

అతని ప్రశ్నలన్నింటికీ చిలుక చక్కగా సమాధానం ఇచ్చేది. కానీ, "పంజరం నుండి నన్ను వదిలిపెట్టు. నాకు స్వేచ్ఛగా ఉండాలని ఉంది," అని ప్రతిసారీ అడిగేది.

"అది తప్ప ఏదైనా ఇస్తాను!" అని వ్యాపారి సమాధానం ఇచ్చేవాడు.

"నన్ను వదిలేస్తే మూడు కాలాతీత సూక్తులు చెబుతాను," అని ఒక రోజు చిలుక చెప్పింది.




‘జీవితకాల సమాధానాలకు బదులుగా మూడు సూక్తులు సరిపోతాయా?’ అనుకున్నాడు వ్యాపారి. తిరస్కరించడానికి నోరు తెరవబోయాడు.

‘చిలుకను పంజరంలోనే ఉంచితే, నేను అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇస్తుంది. కానీ నేను సరైన ప్రశ్నలు అడగకపోతే? ఆ మూడు కాలాతీత సూక్తులను ఎప్పటికీ వినలేను!’

దాంతో, "చిలుకా, నీకు స్వేచ్ఛను ఇస్తున్నాను!" అంటూ పంజరం తెరిచాడు. చిలుక బయటకు ఎగిరింది. అది వ్యాపారి చేతిపై కూర్చుంది. "పోయిన నిధి గురించి ఏడవకు అన్నది మొదటి సూక్తి," అని చిలుక చెప్పింది.

"నాకు కొత్తది ఏమీ చెప్ప లేదు!" అని వ్యాపారి అన్నాడు.

చిలుక ఇంటిపైకి ఎగిరింది.




"రెండవ సూక్తి: నువ్వు విన్న ప్రతిదాన్నీ నమ్మకు." "అది నాకు తెలుసు! నాకు తెలియనిది చెప్పు!" అంటూ వ్యాపారి ఆందోళన చెందసాగాడు.

చిలుక నవ్వింది. "నీకు తెలియనిది చెప్పనా? నా పొట్టలో విలువైన రాళ్లు ఉన్నాయి!"

ఇది నమ్మశక్యం కానిది. "విలువైన రాళ్లు ఉన్న నిన్ను వదిలిపెట్టాను! నేను ఎంత మూర్ఖుడిని! ఇందుకు నా జీవితాంతం చింతిస్తాను!" వ్యాపారి బాధపడసాగాడు.

"ఒక నిమిషం క్రితం 'పోయిన నిధి గురించి ఏడవకు,' అని చెప్పాను. ఇప్పుడు నువ్వు అదే చేస్తున్నావు," వెంటనే చిలుక అంది.



వ్యాపారి నోట మాట రాలేదు.

"తరవాత, 'నువ్వు విన్న ప్రతిదాన్ని నమ్మకు!' అని అన్నాను. కానీ నా కడుపులో విలువైన రాళ్లు ఉన్నాయని నువ్వు నమ్మావు!"

"నేను..." పక్షిని చూస్తూ చెప్పబోయాడు వ్యాపారి.

అతని మాటలను మధ్యలోనే ఆపి, "నా కడుపులో విలువైన రాళ్లు ఉంటే, మీ ఇంటి పైకప్పు వరకు ఎగరగలనా?" అంది చిలుక.

చిలుక నిజం మాట్లాడుతోంది!

వ్యాపారి తన మాటలను వెనక్కి తీసుకోగలిగితే! ఈ అద్భుతమైన పక్షి గంటల తరబడి అతన్ని అలరించింది. దానిని చంపాలని అతను ఎలా అనుకున్నాడు?

"నన్ను క్షమించు," అతను అన్నాడు.

"ఇదిగో నా మూడవ, చివరి సూక్తి: మాటలు చెవితో వినడానికి మాత్రమే కాదు, మనస్సు అర్థం చేసుకోవడానికి కూడా! వస్తాను! అర్థం చేసుకుంటూ వినడం గుర్తుంచుకో!" అంది చిలుక.



చిలుక ఎగిరిపోతుంటే వ్యాపారి నోరు తెరిచి చూస్తూ నిలబడిపోయాడు.



© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


సముద్రం దాటిన కుందేలు

ఒకప్పుడు సముద్రాన్ని ఇష్టపడే ఒక చిన్న కుందేలు ఉండేది. గంటల తరబడి ఒడ్డున కూర్చుని అలలను, సముద్ర పక్షులను, అలలపై తేలుతూ వచ్చే అన్ని వస్తువులను చూస్తూ ఉండేది.

నీటిలో కొంత దూరంలో ఒక చిన్న దీవి ఉంది. మేఘాలు లేదా పొగమంచుతో కొన్ని రోజులు ఈ దీవి కనపడేది కాదు. కానీ ఇతర రోజులలో కుందేలు దానిని స్పష్టంగా చూడగలిగేది.



ఆ దీవి చుట్టూనే కుందేలు ఆలోచనలు తిరిగేవి. 'అక్కడ ఎవరు నివసిస్తున్నారు? ఆడుకోటానికి అందమైన తోటలు, పొలాలు ఉంటాయా?'




ఇప్పుడు సముద్రం వైపు కుందేలు చూస్తున్నప్పుడల్లా, దాని చూపు దీవి పైనే ఉండేది. అక్కడికి వెళ్లాలనే కోరిక దాని హృదయంలో పెరుగుతోంది. కానీ ఎలా?

కుందేలు అలా సముద్రం వైపు చూస్తూ ఉండటం ఒక రోజు ఒక సొరచేప గమనించింది. "మిత్రమై, ఏం చూస్తున్నావు?" అని సొరచేప అడిగింది.

"ఆ దీవిని చూస్తూ ఉన్నాను. ఇది చాలా అందంగా ఉంది! నువ్వు అక్కడికి వెళ్లావా?"

"వెళ్లాను. అది నిజంగా అందంగా ఉంటుంది. అక్కడ సముద్ర తీరాలు, అడవులు, పూలతో నిండిన పొలాలు ఉన్నాయి," అంది సొరచేప.



కోరికతో కుందేలు హృదయం పొంగిపోతోంది. సొరచేప చాలా బలంగా ఉండి, కుందేలు చిన్నగా, బలహీనంగా ఉండటంతో సహాయం చేయమని సొరచేపను అడగడానికి అది భయపడింది.

కాబట్టి ఒక ప్రణాళిక అవసరమని కుందేలుకు తెలుసు. సొరచేపను మోసగించి సహాయం పొందాలని అది నిర్ణయించుకుంది. "సొరచేప మిత్రమా! నీకు ఎక్కువ బంధువులు ఉన్నారా, నాకా?" అని అడిగింది.

"నాకే ఎక్కువ అని కచ్చితంగా తెలుసు! నా బంధువులు సముద్రం అంతటా ఉన్నారు!" సొరచేప నవ్వుతూ చెప్పింది.

"వాళ్లని నాకు చూపిస్తావా? వాటిని పిలిచి వరసలో నిలబెడితే వాటిని లెక్కపెడతాను," అంది కుందేలు.



"తప్పకుండా," అంది సొరచేప.

త్వరలోనే సొరచేపలు వరసగా దీవి వరకు నిలబడ్డాయి.

"కుందేళ్ల కంటే సొరచేపలు ఎక్కువ ఉంటే నేను మీకు బహుమతి ఇస్తాను! కానీ సొరచేపల కంటే ఎక్కువ కుందేళ్లు ఉంటే, నువ్వు నాకు బహుమతి ఇవ్వాలి, సరేనా?" అంది కుందేలు.

"సరే!" అంది సొరచేప.

"వాటి వీపులపై నడుస్తూ మీ బంధువులను లెక్కిస్తాను," అని కుందేలు చెప్పింది.

కుందేలు జాగ్రత్తగా మొదటి సొరచేప వీపుపై అడుగుపెట్టి, "ఒకటి!" అని లెక్కించింది. అది జాగ్రత్తగా రెండవ సొరచేప వీపుపై అడుగుపెట్టి, "రెండు!" అని లెక్కించింది. అది దీవి వరకు అడుగులు వేస్తూ లెక్కిస్తూనే ఉంది. దాని కొత్త స్నేహితురాలు దాని పక్కనే ఈదుతూ సరిగ్గా లెక్కపెట్టడంలో సహాయపడింది.

చివరికి కుందేలు దీవిపై అడుగు పెట్టినప్పుడు అది చాలా ఉపశమనం పొందింది. అది సొరచేప వైపు తిరిగి,

"మిత్రమా, సొరచేపల కంటే కుందేళ్లు ఎక్కువ ఉన్నాయని అనుకుంటున్నాను. కానీ నాకు కచ్చితంగా తెలియదు. కాబట్టి దీవిలో నా బంధువులను లెక్కపెడతాను. లెక్క పూర్తి చేసిన తరవాత, నేను వచ్చి నిన్ను పిలుస్తాను. సరేనా?"


"సరే," అంది సొరచేప.

"నీ బంధువుల సంఖ్య మరిచిపోకు!" అని కుందేలు చెప్పింది. అప్పుడు అది దీవిని అన్వేషించడానికి పరిగెత్తింది.

కొన్ని వారాల తరవాత అది ఇంటికి తిరిగి వెళ్లాలని అనుకుంది. అది సముద్రతీరానికి వెళ్లి సొరచేపను పిలిచింది. కానీ అలలు మాత్రమే సమాధానం ఇచ్చాయి.

ఇంటికి ఎలా తిరిగి వెళ్లాలి? కుందేలు ఒక రాయి మీద కూర్చుని ఆలోచించింది... దానికి ఒక కొత్త ఆలోచన వచ్చింది...

జపనీస్ జానపద కథకి అనుసరణ



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi


L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

48

నేను ఎవరు?



పువ్వులు పైన నవ్వుతూనే ఉన్నాయి
కానీ, కాయలు నేలలో దాక్కున్నాయి!

సన్నని, నల్లని పొట్టులో దాక్కుంటాం
నానబెడితే, పొట్టు నుండి బయటకు వస్తాం
రుబ్బితే ఇడ్లీ, దోశ వేయడానికి సిద్ధం!

పొడపైన కాడ మీద ఊగుతూ నాట్యం చేస్తాను
తల వంచి
బంగారు కంకులను ఊపుతాను



మీగడ రంగు, లేదా ముత్యపు తెలుపులో ఉంటాను
నా నిండా నూనె ఉంది
నాలో మాంసకృత్తులు, విటమిన్లు మెండు
మీ ఒక్క చేతిలో వేలాది గింజలు నిండు!


ఈ చిన్న గోధుమ రంగు పూసలు -
వాటిని ఎవరు గుచ్చగలరు?
కింద పడితే ఎవరు ఏరగలరు?

మెత్తటి పసుపు పచ్చ దారాలు
లేత ఆకుపచ్చ శాలువాలు:
ఈ పొరల లోపల
ఒక బంగారు నిధి దాగుంది

తినలేకపోతే,
ఎంత బాధ!
దానిని తింటే,
ఎంత తీపి!



రాగి, చెరకు, వరి, నువ్వులు, వేరుశనగ,
మినుములు, మొక్కజొన్న








మట్టిలో పుడతాడు
మట్టిని తవ్వుతాడు
మట్టిలో తింటాడు -
అతను నేలను సారవంతం చేస్తాడు



నా పెద్ద కళ్లు అన్ని దిశలలో చూడగలవు
ఇంట్లో ఏ మూలకి అయినా ఎగరగలను
మీరు చేసే ఆహారాన్ని తినడానికి ఇష్టపడతాను
పారవేసే ఆహారాన్ని కూడా తినగలను
నాపై దాడి చేస్తే, తప్పించుకోగలను!

మట్టితో చేసిన కోటలో
చిన్న, తెల్ల జీవులు శ్రమిస్తాయి
లోపలికి చూడండి: చుట్టుకుని ఉన్న పాము ఉండవచ్చు!



నేను ఎగురుతాను, గెంతుతాను
పైకి, కిందికి దూసుకుని పోతాను
ముందుకు, వెనకకు దూకుతాను
ఎగిరేటప్పుడు, వాలినప్పుడు
నా రెక్కలు విప్పుకుని ఉంటాయి!




ప్రకాశవంతంగా, రంగురంగులుగా, పట్టు లాగా మెత్తగా
కాగితంలా పలచగా, ఎంతో అందంగా
రెక్కలు విప్పి వేచి ఉంటాను, పూల తేనె తాగుతాను
ఏది పువ్వు రేకు, ఏది నా రెక్క?

చిన్న పాములా కనిపిస్తాను
గోధుమ, ఎరుపు రంగులలో ఉంటాను
వందల కాళ్లు ఉంటాయి
కుడితే మీకు నొప్పి పుడుతుంది

లెక్కలేనన్ని జతల జతల కాళ్లు
కానీ, చాలా నెమ్మదిగా నడుస్తాను
రాలిన ఆకులను తింటాను
నన్ను తాకితే, చుట్టలాగా ముడుచుకుంటాను

దీపాల లాగా కలిసి ఎగురుతాం
చీకటిలో మిణుకుమిణుకుమంటూ ఉంటాం
మా వెంటపడటం అందరూ ఇష్టపడతారు!

దారాన్ని నేస్తాను
గూడు అల్లుకుంటాను
ఏమీ తినకుండా
విశ్రాంతి తీసుకుంటాను



వందలాది మంది ఉన్న భవనంలో
అన్ని అధికారాలు ఒక మహిళవే



గోధుమ రంగులో ఉంటాం
నెర్రలలో దాక్కుంటాం
రాత్రి వేళ బయటకు వస్తాం-
లైటు వేస్తే పారిపోతాం


అది చాలా చిన్నది
దట్టమైన అడవిలో తిరుగుతుంది
ఇష్టమొచ్చినట్టు వేటాడుతుంది
అడ్డుకునేవాళ్లు ఎవరూ లేరు



మా పరివారాన్ని పోషించడానికి
విశ్రాంతి లేకుండా శ్రమిస్తాం
ఎంతో బరువులు ఎత్తుతాం
ఒకరికొకరు సహాయం చేసుకుంటూ కలిసి పనిచేస్తాం
ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటాం

ఆ మొరటు వైద్యుడు వచ్చి ఇంజెక్షన్ ఇచ్చాడు
తన రుసుముగా రక్తం తాగి వెళ్లిపోయాడు


చీమ, ఈగ, దోమ, రోకలిబండ, మిణుగురు పురుగు, సీతాకోకచిలుక, పేను,
చెదపురుగు, తూనీగ, సాలీడు, రాణి తేనెటీగ, వానపాము, కాళ్లజెర్రి, బొద్దింక



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi **Telugu** K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi **Artist** Uma Krishnaswamy



49

పక్షి, చిన్న అమ్మాయి

ఒక చెట్టు, ఒక పక్షి మంచి స్నేహితులు. ఒక రోజు చెట్టు పూలు పూయసాగింది. అది చాలా సంతోషంగా ఉంది. దాంతో అది పక్షికి రెండు అందమైన పువ్వులను ఇచ్చింది.

ఒక పువ్వును తన గూడులో ఉంచి, మరొక పువ్వుతో పక్షి ఎగిరిపోయింది. 'ఈ పువ్వును ఇంకొకరికి ఇస్తాను. వాళ్లు సంతోషిస్తారు!' అని అనుకుంది.

కొంతసేపటి తరవాత పక్షి ఒక అందమైన తోటను చూసింది. అక్కడ చాలా రకాల పువ్వులు ఉన్నాయి! ఆహా! ఆ పువ్వుల సువాసనతో గాలి నిండిపోయింది.

ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్న తోటమాలిని పక్షి చూసింది. అది ఇలా అనుకుంది,


‘ఈ తోటమాలికి పువ్వులంటే చాలా ఇష్టం. ఈ పువ్వును అతనికి ఇవ్వనా?’

పక్షి ఎగిరి కిందకు దిగి ఒక కొమ్మపై కూర్చుంది. తోటమాలి దానిని చూసి, "నీ దగ్గర ఉన్న పువ్వు చాలా బాగుంది! దాన్ని నాకు ఇవ్వు! అందరూ చూసేలా ఒక గిన్నెలో పెడతాను. నా తోట ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని వాళ్లు అనుకుంటారు."



ఇది విన్న పక్షి కోపంగా ఎగిరిపోయింది. కానీ త్వరలోనే అది మామూలుగా మారి మళ్లీ వెతకసాగింది.

కొంతసేపటి తరవాత అది చాలా అందమైన రంగులను చూసింది! దగ్గరగా వెళ్లి చూస్తే ఒక వ్యక్తి బట్టపై ఎంబ్రాయిడరీ చేస్తున్నాడు.




'ఈ మనిషి అందాన్ని ఆస్వాదిస్తాడు. అతనికి ఈ పువ్వు ఇస్తాను,' అని పక్షి అనుకుంది. అది కిందకి ఎగిరి, అతని దగ్గర కూర్చుంది.


ఆ పక్షిని చూసి ఆ మనిషి సంతోషించాడు. "నీ దగ్గర చాలా అద్భుతమైన పువ్వు ఉంది! దాన్ని నాకు ఇవ్వు. నా ఎంబ్రాయిడరీలో ఇలాంటి ఆకృతి లేదు. దానిని చేరిస్తే, నా ఎంబ్రాయిడరీ ప్రపంచంలోనే అత్యుత్తమమైనది అవుతుంది. ఈ వస్త్రాన్ని రాజుకు బహుమతిగా ఇస్తాను. నా గురించి అందరికీ తెలుస్తుంది!" అని అతను అన్నాడు.

పక్షికి మళ్లీ కోపం వచ్చి ఎగిరిపోయింది. అప్పుడు, కిందకి చూస్తే, పావురాల గుంపు కనిపించింది. ఒక స్త్రీ వాటికి గింజలు వేస్తోంది. 'ఈమెకి పక్షులంటే చాలా ఇష్టం అనిపిస్తోంది. ఆమెకు ఈ పువ్వు ఇస్తాను,' అని పక్షి అనుకుంది.

అది ఎగిరి గింజలు తింటున్న పావురాల దగ్గర దిగింది. ఆ స్త్రీ ఆ పక్షిని చూసి, "నీ దగ్గర చాలా అందమైన పువ్వు ఉంది! దాన్ని నాకు ఇవ్వు. నేను దానిని దేవతలకు ఇస్తాను, నా కోరికలన్నీ తీరతాయి," అని అడిగింది.

కోపంతో మళ్లీ పక్షి ఎగిరిపోయింది.





అకస్మాత్తుగా ఒంటరిగా నడుస్తున్న ఒక చిన్న అమ్మాయిని ఆ పక్షి గమనించింది. ఆమె నీటి కుండను మోస్తోంది. పక్షి ఎగిరి ఆమె భుజంపై కూర్చుంది. ఆ అందమైన పువ్వును ఆమె జడలో పెట్టింది.

ఆ పక్షిని చూసిన అమ్మాయి ఆశ్చర్యపోయింది. తన జడలో పువ్వు పెట్టడం చూసి మరింత ఆశ్చర్యపోయింది.



"నీకు, ఈ పువ్వులా అందంగా ఉన్న నీ ప్రయత్నానికి ఈ పువ్వుని ఇస్తున్నాను," అని పక్షి ఆమెతో చెప్పింది.

సుష్మితా బెనర్జీ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

నా పేరు ఏమిటి?

వెచ్చని ఎండ ఉన్న రోజున, ఈ అనే ఈగ ఒక పొలంలో సందడి చేస్తోంది. అకస్మాత్తుగా అది దాని పేరు మరిచిపోయింది! ఆ ఈగ ఒక దూడ వద్దకు ఎగిరి, "బొద్దుగా ఉన్న దూడా! నా పేరు ఏమిటి?" అని అడిగింది.

"నాకు తెలియదు. మా అమ్మని అడుగు!" అని దూడ అంది. దాంతో ఆవు వద్దకు ఎగిరి, "బొద్దుగా ఉన్న దూడ తల్లీ! నా పేరు ఏమిటి?" అని ఆ ఈగ అడిగింది.

"నాకు తెలియదు. నన్ను మేపే కాపరిని అడుగు," అని ఆవు అంది. దాంతో ఆవుల కాపరి వద్దకు ఎగిరి, "బొద్దుగా ఉన్న దూడ, దూడ తల్లి, ఆవును మేపే కాపరీ! నా పేరు ఏమిటి?" అని ఆ ఈగ అడిగింది.

"నాకు తెలియదు. నా చేతిలో కర్రని అడుగు," అని కాపరి అన్నాడు. దాంతో కర్రపై కూర్చుని,

బొద్దుగా ఉన్న దూడ
దూడ తల్లి
ఆవును మేపుతున్న కాపరి
కాపరి చేతిలో కర్రా!
నా పేరు ఏమిటి?
అని అడిగింది ఈగ.

“నాకు తెలియదు. కానీ నన్ను ఇచ్చిన ఆ చెట్టును అడగు," అని కర్ర అంది. దాంతో చెట్టు వద్దకు ఎగిరి, ఈగ ఇలా పాడింది,



బొద్దుగా ఉన్న దూడ...

కర్రను ఇచ్చిన ఓ చెట్టూ!

నా పేరు ఏమిటి?

"నాకు తెలియదు, నా కొమ్మలలో ఉన్న కొంగను అడుగు," అని చెట్టు చెప్పింది. దాంతో కొంగ వద్దకు ఎగిరి, ఈగ ఇలా పాడింది,

బొద్దుగా ఉన్న దూడ...

చెట్టులో ఉన్న ఓ కొంగా!

నా పేరు ఏమిటి?

"నాకు తెలియదు. నేను నివసించే చెరువును అడుగు," అని కొంగ చెప్పింది. దాంతో చెరువు వద్దకు ఎగిరి, ఈగ ఇలా పాడింది,

బొద్దుగా ఉన్న దూడ...

కొంగ నివసించే ఓ చెరువూ!

నా పేరు ఏమిటి?


"ఈ పెద్ద చేపను అడుగు," అని చెరువు చెప్పింది. దాంతో చేప వద్దకు ఎగిరి, ఈగ ఇలా పాడింది,

బొద్దుగా ఉన్న దూడ...

చెరువులో ఈత కొడుతున్న ఓ చేపా!

నా పేరు ఏమిటి?

"నాకెలా తెలుస్తుంది? నన్ను పట్టే జాలరిని అడుగు," అని చేప అంది. దాంతో జాలరి వద్దకు ఎగిరి, ఇలా పాడింది ఈగ,



బొద్దుగా ఉన్న దూడ...

ఓ చేపలు పట్టే జాలరీ!

నా పేరు ఏమిటి?

"నా చేపలు పెట్టే కుండను అడుగు," అని జాలరి అన్నాడు. దాంతో చేపలు పెట్టే కుండ వద్దకు ఈగ ఎగిరి,

బొద్దుగా ఉన్న దూడ...

ఓ చేపలు పెట్టే కుండా!

నా పేరు ఏమిటి?

"వెళ్లి నన్ను చేసిన కుమ్మరిని అడుగు," దాంతో కుమ్మరి దగ్గరకు ఎగిరి, ఈగ ఇలా పాడింది,

బొద్దుగా ఉన్న చిన్న దూడ...

కుండలు చేసే ఓ కుమ్మరీ!

నా పేరు ఏమిటి?

"నాకు తెలియదు. నేను ఉపయోగించే మట్టిని అడుగు," కుమ్మరి అన్నాడు. దాంతో మట్టి వద్దకు ఎగిరి, ఈగ ఇలా పాడింది,

బొద్దుగా ఉన్న దూడ...

ఓ కుమ్మరి ఉపయోగించే బంకమట్టీ!


నా పేరు ఏమిటి?


"నాకు తెలియదు. నా మీద పెరిగే గడ్డిని అడుగు," అని మట్టి అంది. దాంతో ఆ గడ్డి మీదకి ఎగిరి, ఈగ ఇలా పాడింది,

బొద్దుగా ఉన్న దూడ...

మట్టి మీద పెరిగే పచ్చ గడ్డీ

నా పేరు ఏమిటి?





"నాకు తెలియదు! నన్ను మేస్తున్న గుర్రాన్ని అడుగు," అని గడ్డి అంది. దాంతో ఆ గుర్రం వైపు ఎగిరి, ఇలా పాడింది ఈగ,

బొద్దుగా ఉన్న దూడ
దూడ తల్లి
ఆవును మేపుతున్న కాపరి
కాపరి చేతిలో కర్ర
కర్రను ఇచ్చిన చెట్టు
చెట్టులో ఉన్న కొంగ
కొంగ నివసించే చెరువు
చెరువులో ఈత కొట్టే చేప
చేపలు పట్టే జాలరి
చేపలను పెట్టే కుండ
కుండలు చేసే కుమ్మరి
కుమ్మరి ఉపయోగించే మట్టి
మట్టిలో పెరిగే పచ్చ గడ్డి
పచ్చ గడ్డి మేసే ఓ గుర్రం!
నా పేరు ఏమిటి?

"ఈఈఈఈ," అని గుర్రం సకిలించి, "ఎగిరిపో, ఎగిరిపో, ఎగిరిపో, ఎగిరిపో!" అని అంది.

“అదే నా పేరు!" అని ఆ ఈగ అంది. "ఈ, ఈ, ఈ" అని పాడుతూ సంతోషంగా ఎగిరిపోయింది.

తమిళ జానపద కథ
(తమిళంలో 'ఈ' అనే పదానికి ఈగ అని అర్థం)

© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

కోతుల నాయకుడు, రాక్షసుడు

ఒకసారి ఒక కోతి గుంపు కొత్త నివాసం ఏర్పరచుకోవడానికి సుదూర అడవికి వెళ్లింది. కోతుల నాయకుడు వారితో ఇలా చెప్పాడు, "ఈ అడవిలోని చెరువులలో ఒకటి చాలా ప్రమాదకరమైనది. అందులో ఒక భయంకరమైన రాక్షసుడు ఉన్నాడు! నన్ను అడగకుండా ఆ చెరువు నీళ్లు తాగడానికి ప్రయత్నించవద్దు!"

ఆ ప్రాంతంలోని అన్ని చెరువులను నాయకుడు పరిశీలించాడు. చెరువులు సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తరవాత, వాటి నుండి తాగడానికి కోతులకు అనుమతి ఇచ్చాడు. కోతులు తమ కొత్త ప్రాంతంలో స్థిరపడ్డాయి.

ఒక రోజు అడవిలోని కొత్త ప్రాంతానికి కోతులు వెళ్లాయి. అది చాలా దూరం ఉంది. "అమ్మా, నాకు దాహం వేస్తోంది!" అని ఒక చిన్న కోతి చెప్పింది.





"నాకు ఒక చెరువు కనిపిస్తోంది. అక్కడ కొంచెం నీరు తాగుదాం," అని ఆలోచించకుండా తల్లి సమాధానం ఇచ్చింది.

"ఆగు! చెరువు దగ్గరికి వెళ్లవద్దు! నాయకుడి హెచ్చరికను మరిచిపోయారా?" అని మరొక కోతి అంది.

కోతుల నాయకుడు అక్కడికి వచ్చాడు. "మీకు నీళ్లు కావాలా? నేను పరీక్షించేవరకు ఆగండి," అని అన్నాడు.

చెరువు అంచుకు వెళ్లి దానిని నిశితంగా పరిశీలించాడు. "అడుగుజాడలు అన్ని నీటిలోకి వెళుతున్నాయి. అవి బయటకు రావడం లేదు. రాక్షసుడు నివసించే చెరువు ఇదే అయి ఉండాలి!" నాయకుడు అన్నాడు.

అన్ని కోతులను పిలిచి, "అందరూ వినండి. ఈ చెరువు ప్రమాదకరమైనది. ఎవరూ దాని దగ్గరకు వెళ్లవద్దు," అని చెప్పాడు.

నాయకుడు మాట పూర్తయ్యిందో, లేదో, "హహాహాహాహా!" అంటూ భయంకరంగా నవ్వుతూ ఒక రాక్షసుడు నీటి నుండి పైకి లేచాడు. "చెరువులోకి వచ్చినవాళ్లని మింగేస్తాను," అని బెదిరించాడు.

"చెరువులోకి దిగితేనే మమ్మల్ని మింగేస్తావు. మాలో ఎవరూ అలా చేయరు," అని కోతుల నాయకుడు ప్రశాంతంగా సమాధానం చెప్పాడు.

"అప్పుడు మీరందరూ చనిపోతారు! నీళ్లు లేకుండా బతకగలరా?" అన్నాడు రాక్షసుడు.

"చెరువులోకి దిగకుండానే నీటిని తాగుతాం," అన్నాడు కోతుల నాయకుడు.

"అది ఎలా సాధ్యం?" రాక్షసుడు అడిగాడు.

"చూస్తూ ఉండు," నాయకుడు అన్నాడు.

తరవాత వెదురు బొంగులను సేకరించడానికి కొన్ని కోతులను పంపాడు. అవి తెచ్చిన బొంగులను తనిఖీ చేశాడు. వాటిలో కొన్ని మొత్తం బోలుగా ఉన్నాయి. వాటిని ఉంచుకుని, మిగిలిన వాటిని పక్కన పెట్టాడు నాయకుడు.




తరవాత, బోలుగా ఉన్న వెదురు బొంగులు అన్నింటినీ కలిపి పొడవైన గొట్టం తయారు చేశాడు. గొట్టం ఒక చివరను చెరువులో ఉంచాడు. నీరు బయటకు వచ్చే వరకు రెండవ చివర నుంచి పీల్చాడు.

ఇప్పుడు అన్ని కోతులు కడుపు నిండా నీటిని తాగగలిగాయి. అవి నీటితో ఆడుకున్నాయి కూడా! "హమ్మయ్య, ఇప్పుడు బాగుంది!" చిన్న కోతి అంది.

రాక్షసుడు చాలా నిరాశ చెందాడు. చెరువులోకి దిగి మాయమయ్యాడు. "మా తెలివైన నాయకుడికి జయహో!" అంటూ కోతులన్నీ అరిచాయి.

ఒక జాతక కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

52 మేరీ సంతోషంగా ఉంది

దీప గదిలోకి వచ్చినప్పుడు మేరీ ఒక కాగితం పట్టుకుని ఉంది. "ఓహ్, ఒక బొమ్మ! నేను చూడవచ్చా?" అడిగింది దీప.


తరవాత ఆమె తన స్నేహితురాలి ముఖం వైపు చూసింది. మేరీ కళ్లు నీటితో నిండిపోయాయి! దీప ఆశ్చర్యపోయింది. "ఏడవకు! ఏమైంది?" అడిగింది దీప.

"మీ తోటలో బొమ్మ గీస్తున్నాను. రఘు నా బొమ్మను చూసి నవ్వాడు, దీపా!" అంటూ మేరీ ఏడ్చింది.



"అయ్యో, మేరీ!" అంది దీప. కన్నీళ్లను ఆపుకోవడానికి ప్రయత్నించింది మేరీ. "నా బొమ్మ బాగోలేదని అతను చెప్పాడు! నేను ఇంకెప్పుడూ మరో బొమ్మని గీయను! ఎప్పటికీ!" చెప్పింది మేరీ.

మేరీ నుండి బొమ్మని తీసుకుని, దానిని నిశితంగా చూసి, "కానీ, ఈ బొమ్మ అద్భుతంగా ఉంది!" అని దీప చెప్పింది.



"అద్భుతం! నా తెలివితక్కువ తమ్ముడు మాటలకు నువ్వు ఏడవకు! గుర్తుంచుకో, మనం అందరం మన కోణం నుండి ప్రపంచాన్ని చూస్తాం. అందరం ఒకేలా చూడం, ఒకేలా ఆలోచించం. అందుకే మన బొమ్మలు వేరు వేరుగా ఉంటాయి. నీ మనసులోకి వచ్చింది నువ్వు గీస్తూనే ఉండు!" ఆమె మళ్లీ చెప్పింది.


మేరీ తన ముఖాన్ని తుడుచుకుంది. ఆమె ఊరట చెందటంతో దీప సంతోషించింది.

తరవాతి వారం, దీప వాళ్ల ఇంటికి బంధువులు వచ్చారు. వాళ్లతో కలిసి ఒక రోజు మేరీ, దీప బీచ్‌కి వెళ్లారు. పెన్సిళ్లు, కాగితం, పెయింట్లు, బ్రష్‌లు తీసుకుని వెళ్లారు.

బీచ్ అంతా సందడిగా ఉంది. కొంతమంది జాలర్లు తమ పడవలను మరమ్మతు చేసుకుంటున్నారు. మరికొందరు తాము పట్టుకున్న చేపలను తీసుకుని వస్తున్నారు. మేరీ, దీప, బంధువులు సంతోషంగా ఉన్నారు! ఎవరికి కావలసినవి వాళ్లు తీసుకుని బొమ్మలు వేయసాగారు.

మేరీ మాత్రమే సంశయిస్తోంది. 'నాకు బాగా గీయటం రాదు!' అని ఆమె అనుకుంది. కాసేపు ఇతరులను గమనించింది. కానీ త్వరలోనే ఆమె కూడా బొమ్మ వేయటంలోమునిగిపోయింది.


చివరికి వాళ్లందరూ బొమ్మలు వేయటం పూర్తి చేశారు. పెయింటింగ్‌లు ఆరిన తరవాత ఒకరి తరవాత ఒకరు వాటిని చూడసాగారు. ఆశ్చర్యం!



వారి ముందు ఒకటే దృశ్యం ఉంది. కానీ ప్రతి ఒక్కరూ దానిని తమదైన రీతిలో గీసి, రంగులు వేశారు. దీప చెప్పిన మాటలు మేరీకి గుర్తుకు వచ్చాయి. "అందరం ఒకేలా చూడం, ఒకేలా ఆలోచించం. అందరం ఒకేలా బొమ్మలు గీయం!"

'దీప చెప్పింది నిజమే!' ఆమె అనుకుంది. ఆమె తన చిత్రాన్ని తీసుకుంది. దాని గురించి ఆమె ఒక కథ చెప్పసాగింది. దీప, ఇతరులు ఆశ్చర్యపోయారు. "నువ్వు ఎంత అద్భుతమైన కథకురాలివి, మేరీ!" వాళ్లు అన్నారు. ఆ రోజు మేరీకి చాలా సంతోషకరమైన రోజు.

అప్పటి నుండి, మేరీ తనకు కనిపించిన విధంగా వస్తువులను గీస్తోంది. ఇతరులు ఏం అంటారో అన్న ఆందోళన ఆమెలో లేదు. ఆమె ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆమె తనలా ఉండటం ఇష్టపడుతోంది. బొమ్మలను పూర్తి చేసిన తరవాత, వాటి గురించి చాలా కథలు చెబుతుంది!



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

భూమి బద్దలౌతోంది!


ఒక రోజు ఒక చిన్న కుందేలు తాటి చెట్టు నీడలో నిద్రపోతోంది.

అంతలో ఒక తాటి పండు ఆకుల గుండా రాలింది. అది ఒక బండరాయికి తగిలి 'ఢాం' అంటూ శబ్దం వచ్చింది.

ఉలిక్కిపడి కుందేలు మేల్కొంది. "అయ్యో, భూమి బద్దలౌతోంది!" అంటూ అది పరిగెత్తసాగింది.

దానితోపాటు అన్ని కుందేళ్లు పరిగెత్తసాగాయి. అవి ఎందుకు పరిగెత్తుతున్నాయో దేనికీ తెలియదు!

అవి పరిగెత్తడం ఒక జింక చూసింది. "మీరందరూ ఎందుకు పరిగెత్తుతున్నారు? ఏదైనా మిమ్మల్ని వెంబడిస్తోందా?" జింక అడిగింది. "భూమి బద్దలౌతోంది! పరిగెత్తు! పరిగెత్తు!" అని చిన్న కుందేలు చెప్పింది. దాంతో జింక పరిగెత్తసాగింది.




దారి పక్కన ఒక ఎలుగుబంటి నిలబడి ఉంది. "జింకా, ఎందుకు పరిగెత్తుతున్నావు?" అది అడిగింది.

"భూమి బద్దలౌతోంది! నువ్వు కూడా పరిగెత్తు!" అని జింక అంది. ఎలుగుబంటిని దాటి పెద్ద పెద్ద గెంతులతో అది పరిగెత్తుతోంది.


దాంతో ఎలుగుబంటి పరిగెత్తసాగింది. "బంటి సోదరా! ఏం జరిగింది? ఎందుకు పరిగెత్తుతున్నావు?" ఒక నక్క అడిగింది.

"భూమి బద్దలౌతోంది! నిన్ను నువ్వు కాపాడుకో!" పరిగెత్తుతూనే ఎలుగుబంటి జవాబు ఇచ్చింది.

కాసేపటికి ఆ పరుగులో మరిన్ని జంతువులు చేరాయి. నక్క తరవాత అడవి దున్న వచ్చింది. తరవాత పంది, ఖడ్గమృగం, ఏనుగు, పులి చేరాయి.




వాటిని సింహం చూసింది. ‘ఇది ఏమిటి? పులి, జింక, ఎలుగుబంటి, పంది, నక్క, కుందేలు అన్నీ కలిసి పరిగెత్తుతున్నాయి?’ అని అది అనుకుంది.



"ఆగండి! మీరందరూ ఎందుకు పరిగెత్తుతున్నారు?" అడిగింది సింహం.

"భూమి బద్దలౌతోంది! పరిగెత్తండి!"

‘భూమి బద్దలౌతోందా? నేను నమ్మను. ఈ జంతువులు గందరగోళంలో ఉన్నాయి. ఏ కారణంగానో భయాందోళనకు లోనయ్యాయి... దీన్ని ఆపాలి!’ అనుకుంది సింహం.



అప్పుడు అది గర్జించింది. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, మూడు సార్లు: "గాండ్రు! గాండ్రు! గాండ్రు!"

దాంతో పరిగెత్తుతున్న జంతువులు ఆగాయి. "భూమి బద్దలౌతోందని మీకు ఎవరు చెప్పారు?" అని సింహం అడిగింది.

పులి ముందుకు వచ్చి, "నాకు ఏనుగు చెప్పింది," అని చెప్పింది. "భూమి బద్దలౌతోందని నీకు ఎవరు చెప్పారు?" అని ఏనుగును అడిగింది సింహం. "నాకు ఖడ్గమృగం చెప్పింది," అని ఏనుగు అంది.


అప్పుడు ఖడ్గమృగం, పంది, అడవి దున్న, నక్క, ఎలుగుబంటి, జింక ఒకదాని పేరు మరొకటి చెప్పాయి. చివరికి కుందేలు వంతు వచ్చింది. "భూమి బద్దలవ్వడం నేనే విన్నాను!" అని అది చెప్పింది.

"ఆ శబ్దం విన్న ప్రదేశాన్ని నాకు చూపించు," అని సింహం అడిగింది. తాటి చెట్టు వైపు నడిపించింది కుందేలు. అక్కడ కిందపడి, పగిలిపోయిన తాటి పండు అందరికీ కనపడింది.

అప్పుడే తాటి ఆకుల గుండా పెద్ద శబ్దంతో మరొక తాటి పండు నేలపై పడింది. అది 'ఢాం' అంటూ పగిలిపోయింది.

"కుందేలు విన్న శబ్దం ఇదే," అని సింహం నవ్వింది. దానితోపాటే కుందేలు కూడా నవ్వింది. అప్పుడు జంతువులన్నీ ఆ నవ్వుతో జతకలిపాయి. "ఎంత తెలివి తక్కువతనంగా ప్రవర్తించాం!" అని ఒకదానితో ఒకటి ఆ విషయం చెప్పుకుంటూ, నవ్వుతూనే ఉన్నాయి.

జాతక కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi


L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

54

ప్రకృతి అద్భుతాలు



అది ఒక అందమైన రోజు. పొలం పైన గాలి మెల్లగా వీస్తోంది. రైతు తన కొడవలిని కింద పెట్టి బాదం చెట్టు నీడలో కూర్చున్నాడు. పచ్చగా పెరుగుతున్న వాటిని అతను ఆనందంగా చూశాడు.

'పుచ్చకాయల తోట చాలా అందంగా ఉంది! ఆ పండిన పండ్లను తీసుకుని వెళ్లటానికి ఒకటి, రెండు రోజులు పడుతుంది!' అని తనలో తాను అనుకున్నాడు.

ఒక ఉడత అతనిని చూసి కిచకిచలాడింది. బాదం చెట్టు కొమ్మలలోకి రైతు చూశాడు. అక్కడక్కడా వేలాడుతున్న బాదం కాయలను అతడు చూశాడు.

ఉన్నట్టుండి అతను పెద్దగా నవ్వసాగాడు. 'ప్రకృతి తల్లి చూడు- పుచ్చకాయకి సన్నటి తీగని ఇచ్చింది. అదే చిన్న బాదం కాయకి పెద్ద చెట్టుని ఇచ్చింది!' అతను అన్నాడు




అలా అంటూ అతను చెట్టు కాండాన్ని తట్టాడు. అకస్మాత్తుగా, ఒక బాదం కాయ నేరుగా అతని నెత్తి మీద పడింది!

రైతు దిగ్భ్రాంతికి లోనయ్యాడు. అప్పుడు అతను ఇలా అన్నాడు, "ఆహ్! బాదం చెట్టు కాయలు పుచ్చకాయ అంత ఉంటే, నేను చచ్చిపోయేవాడిని! భలే తప్పించుకున్నాను!"

ప్రకృతి వింతలను మెచ్చుకుంటూ అతను చెట్టు కింద కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు.

ఇరాస్ కథ



యాత్రికుడు, కొబ్బరికాయలు

బజారుకి మార్కోస్ కొబ్బరికాయలు తీసుకుని వెళుతున్నాడు. అతను తొందరలో ఉన్నాడు. దారిలో ఒక పిల్లవాడిని చూసి, తన గుర్రాన్ని ఆపి, "బజారుకి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుంది?" అని అడిగాడు.

కుప్పగా ఉన్న కొబ్బరికాయల వైపు బాలుడు సాలోచనగా చూసి, "వేగంగా వెళితే నీకు చాలా సమయం పడుతుంది. కానీ, నెమ్మదిగా వెళితే తొందరగా చేరుకుంటావు," అని అన్నాడు.

'ఈ పిల్లవాడికి పిచ్చి ఉన్నట్టు ఉంది!' పిల్లవాడిని చూస్తూ రైతు అనుకున్నాడు. తన గుర్రాన్ని వేగంగా నడిపిస్తూ అతను ముందుకు సాగాడు. దాంతో సమస్య వచ్చింది! గుర్రం పైనుండి కొబ్బరికాయలు కిందకి పడసాగాయి!



పాపం రైతు, గుర్రాన్ని ఆపి, కొబ్బరికాయలు ఏరుకోటానికి అటూ, ఇటూ పరిగెత్తాడు. వాటిని గుర్రం మీద పెట్టి, వేగంగా ముందుకు సాగాడు. ఓహ్! మరిన్ని కొబ్బరికాయలు కింద పడిపోయాయి! అవి అన్ని వైపులకి దొర్లాయి.

గుర్రాన్ని ఆపాడు మార్కోస్. పడిపోయిన కాయలను ఏరి మళ్లీ వాటిని గుర్రం మీద పెట్టాడు. ఇప్పుడు అతను పరిగెత్తసాగాడు, గుర్రాన్ని కూడా అదిలించాడు. అయితే, గుర్రం ముందు కాళ్లు పైకి లేపి దాని మీద ఉన్న కొబ్బరికాయలు అన్నింటినీ కింద పడేసింది!

మార్కోస్‌కి ఏడుపు వచ్చినంత పని అయ్యింది. బాలుడి మాటల గురించి అప్పుడు ఆలోచించాడు. 'నాకు అర్థమైంది!' అని అతను అనుకున్నాడు.

కొబ్బరికాయలు అన్నింటినీ గుర్రం మీద గట్టిగా కట్టి, దానిని ప్రేమతో నెమ్మదిగా నడిపించసాగాడు. అయినప్పటికీ, అతను బజారుకి సమయానికి చేరుకున్నాడు.

కొబ్బరి కాయలు అన్నింటినీ అమ్మిన తరవాత మార్కోస్ తన గుర్రానికి మంచి యాపిల్ పండు తినిపించాడు. తరవాత అతను సంతోషంగా ఇంటికి బయలుదేరాడు.

ఫిలిప్పీన్స్ జానపద కథ ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

ఖర్చు పెట్టనివాడు, అప్పు ఇవ్వనివాడు

ఒక నది పక్కన ఉన్న ఒక గ్రామంలో ఇద్దరు పక్కపక్కనే ఉండేవాళ్లు. వాళ్లు ఎప్పుడూ గొడవ పడుతుండేవాళ్లు. అది ఆస్తి లేదా డబ్బు వంటి వాటి గురించి కాదు. వాళ్ల భిన్న మనస్తత్వాల కారణంగా స్నేహంగా ఉండలేకపోయావాళ్లు.

ఒకడు మరొకరికి సహాయం చేయడానికి ఒక్క పైసా కూడా ఇవ్వడు. రెండవ వాడు తన కోసం కూడా ఒక్క పైసా ఖర్చుపెట్టటానికి ఇష్టపడేవాడు కాదు. వస్తువులను అప్పుగా తీసుకోవాలని అనుకునేవాడు.

మొదటి వాడికి "అప్పు ఇవ్వనివాడు" అని, రెండవ వాడికి "ఖర్చు పెట్టని వాడు" అని గ్రామస్తులు వాళ్లకి మారుపేర్లు పెట్టారు.

ఒక వర్షపు రోజు, అప్పు ఇవ్వనివాడు ఇంటికి వస్తున్నప్పుడు, ఖర్చు పెట్టనివాడు బయటకు వెళుతూ, "నాకు గొడుగు లేదు, నీ గొడుగు ఇవ్వు," అని అడిగాడు.





కానీ అప్పు ఇవ్వనివాడు, "నా గొడుగు ఇస్తే, నువ్వు ఎప్పటికీ ఒకటి కొనవు. ఇంటిని వదిలి వెళ్లలేనంత ముసలివాడివి అయ్యే వరకు నువ్వు గొడుగులు బదులు తీసుకుంటూనే ఉంటావు!" అన్నాడు

ఖర్చుపెట్టని వాడు అయినా బయటకు వెళ్లాడు. అతను పూర్తిగా తడిసిపోయాడు కానీ గొడుగు మాత్రం కొనలేదు!

మరొకసారి, ఇద్దరూ పోస్టాఫీసులో కలుసుకున్నారు. ఖర్చు పెట్టనివాడు ఒక ఉత్తరం రాయాలి. అప్పు ఇవ్వనివాడిని పెన్ను ఇవ్వమని అతను అడిగాడు. కానీ అప్పు ఇవ్వనివాడు ఏం చెప్పాడో మీరు ఊహించగలరా?

"నీకు వస్తువులు ఇస్తూ ఉంటే, నీ వ్యక్తిత్వం ఎప్పటికీ బాగుపడదు! ఇంటికి వెళ్లి నీ పెన్ను తెచ్చుకో!"

ఖర్చు పెట్టనివాడు ఇంకొకరి పెన్ను అడిగి తీసుకున్నాడు. 'ఆ అప్పు ఇవ్వనివాడికి ఒక రోజు గుణపాఠం నేర్పుతాను!' అతను తనలో తాను అనుకున్నాడు.

త్వరలోనే అతనికి ఆ అవకాశం వచ్చింది. వాళ్లిద్దరూ పక్క ఊరికి వెళుతున్నారు. నదిపై వంతెన దాటుతుండగా, అప్పు ఇవ్వని వాడి కాలు జారింది. అతను నదిలో పడిపోయాడు!

"కాపాడండి! కాపాడండి! నాకు ఈత రాదు!" అంటూ అతను అరిచాడు.

"నిన్ను కాపాడితే నువ్వు ఎప్పటికీ ఈత నేర్చుకోలేవు! నీ మంచి కోసమే నీకు సహాయం చెయ్యటం లేదు!" అంటూ అప్పు ఇవ్వనివాడిని నీటిలో వదిలి, ఖర్చు పెట్టనివాడు వెళ్లబోయాడు!




ఆ మాటలు అప్పు ఇవ్వనివాడి గుండెకు గుచ్చుకున్నాయి. అతనికి తన మాటలే అందులో వినిపించాయి. దాంతో అతను ఖర్చు పెట్టనివాడికి క్షమాపణలు చెప్పాడు. "నన్ను క్షమించు! నీకు చాలాసార్లు నీతి బోధ చేశాను. మళ్లీ ఎప్పుడూ అలా చేయను! దయచేసి నన్ను మునిగిపోనివ్వవద్దు!" అంటూ అతను అరిచాడు.

వెంటనే, ఖర్చు పెట్టనివాడు నీటిలోకి దూకాడు. తన పొరుగువాడిని పట్టుకుని నది ఒడ్డుకు లాగాడు. అతన్ని ఇంటికి తీసుకునివెళ్లి వేసుకోడానికి పొడి బట్టలు ఇచ్చాడు. అతనికి టీ కాసి ఇచ్చాడు. తరవాత అతను కూడా పొడి బట్టలు వేసుకున్నాడు. ఎండలో కూర్చోడానికి ఇద్దరూ బయటికి వెళ్లారు.

త్వరలోనే ఇద్దరు పొరుగువారు మంచి స్నేహితులుగా మారారు. సరదా కోసమే వాళ్లు గొడవపడేవాళ్లు. నెమ్మదిగా వారిద్దరిలో మార్పు రాసాగింది. దాంతో గ్రామస్తులు వారిని వారి అసలైన పేర్లతో మురుగన్, కంధన్ అని పిలవసాగారు.

తమిళ కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


తప్పిపోయిన చంద్రుడు

ఆ పాప కళ్లల్లో కన్నీళ్లు తిరుగుతున్నాయి. ఆమె ముఖం పక్కకు తిప్పుకుంది.

"కన్నమ్మా, అంత బాధపడకు! నీ పుట్టినరోజుకు ముందే నేను తిరిగి వస్తాను!" అని ఆమె తండ్రి సున్నితంగా అన్నాడు. కానీ కన్నమ్మ ముఖం ఇటు తిప్పుకోలేదు.

"చూడు! గుడి గోపురం వెనక చంద్రుడు ప్రకాశిస్తున్నాడు! ఈ రాత్రి గుండ్రంగా, ఎంత అందంగా ఉన్నాడో చూడు. త్వరలోనే అది తన అందమైన గుండ్రని ఆకారాన్ని కోల్పోతుంది. అది చిన్నగా అవుతుంటుంది. సన్నని చంద్రవంకగా మారుతుంది. తరవాత అది పూర్తిగా అదృశ్యమవుతుంది," అని అతను అన్నాడు.

అది ఆసక్తికరంగా అనిపించింది! తండ్రివైపు కన్నమ్మ ముఖం తిప్పింది. చల్లని చంద్రకాంతిలో ఆమె కంటి నీరు మెరిసింది. ఓహ్, చంద్రుడు చాలా అందంగా ఉన్నాడు! ఆమె మానసిక స్థితిలో మార్పును గ్రహించి, "చంద్రుడు మళ్లీ నెమ్మదిగా పెరుగుతాడు. అది దాని అందమైన గుండ్రని ఆకారాన్ని తిరిగి పొందేనాటికి నీ పుట్టినరోజు వస్తుంది!" చెప్పాడు నాన్న.



"చంద్రుని ఆకారాన్ని బట్టి ప్రజలు నెలని లెక్కిస్తారని నీకు తెలుసా? నిజానికి, 'month' అనే పదం 'moon' నుండి వచ్చింది! నెలని మనం 'moonth' అనడం మొదలుపెట్టాలి," ఆమెను నవ్వించడానికి తండ్రి ప్రయత్నించాడు.


కన్నమ్మ నవ్వింది! "నేను లేనప్పుడు నువ్వు చంద్రుని క్యాలెండర్ తయారు చేస్తే బాగుంటుంది. క్యాలెండర్ పేజీలా గోడపై గళ్లు గీయి. మొదటి చతురస్రంలో, ఈ రాత్రి చంద్రుడు ఉన్నట్టు గుండ్రంగా గీయి," ఆమె తండ్రి చెప్పాడు.

"ప్రతి రాత్రి, చంద్రుని ఆకారాన్ని గమనించు. రేపు రాత్రి కొద్దిగా తేడాగా ఉంటుంది. రెండవ చతురస్రంలో కొత్త ఆకారాన్ని గీయి. ప్రతి రాత్రి చంద్రుడి ఆకారం మారుతూ ఉంటుంది. గళ్లను ఆ ఆకారాలతో నింపుతూ ఉండు. నీ క్యాలెండర్ పూర్తయ్యేలోపు నేను తిరిగి వస్తాను!" అని తండ్రి హామీ ఇచ్చాడు.

రైలు రావటంతో కన్నమ్మ తండ్రి అందులోకి ఎక్కాడు. కన్నమ్మ సంతోషంగా చేయి ఊపుతోంది. ఊరట చెందిన ఆమె తండ్రి తిరిగి చేయి ఊపాడు.

కన్నమ్మకి అప్పగించిన పని సవాళ్లతో కూడుకున్నది. మొదట గళ్లు గీయాలి! పక్కింటి అబ్బాయి తంబి సహాయం చేయడానికి సంతోషంగా ఒప్పుకున్నాడు. వారిద్దరూ కలిసి గళ్లు గీశారు.

రాత్రి కావటం కోసం కన్నమ్మ ఆత్రంగా వేచి ఉంది. తరవాత గుడి గోపురం వైపు చూస్తూనే ఉంది. చాలాసేపు వేచి చూసిన తరవాత, చివరకు, చంద్రుడు కనిపించాడు!



కానీ ఒక్క నిమిషం! అది ఇవ్వాళ కూడా గుండ్రంగా కనిపించింది! కన్నమ్మ చాలా నిరాశ చెందింది. ఆమె మళ్లీ పైకి చూసింది. నాన్న చెప్పింది నిజమే! చంద్రుడు పూర్తిగా గుండ్రంగా లేడు!

సుద్ద ముక్కను తీసుకుని చంద్రుడి ఆకారం గీయడానికి గోడ దగ్గరకి కన్నమ్మ పరిగెత్తింది. కానీ చంద్రుడు ఏ వైపు పూర్తిగా గుండ్రంగా లేడు? ఆమె మరిచిపోయింది. ఆమె చూడటానికి తిరిగి వెళ్లింది. ఇప్పుడు ఆమెకు తెలుసు! పూర్తిగా గుండ్రంగా లేని చంద్రుడి మొదటి బొమ్మని గీసింది.

మరుసటి సాయంత్రం తన పని గురించి ఆమె దాదాపు మరిచిపోయింది. అప్పుడు తంబి పరిగెత్తుకుంటూ వచ్చాడు. "చంద్రుడు మరింత చిన్నగా అయ్యాడు! వచ్చి చూడు!" అని అతను పిలిచాడు. అవును చిన్నగా అయ్యాడు! చంద్రుని రెండవ బొమ్మని కన్నమ్మ జాగ్రత్తగా గీసింది.

మూడవ రాత్రి గోపురం పైన చంద్రుడు కనిపించలేదు. ఆమె ఆశ్చర్యపోయింది. ఆమె లోపలికి వెళ్లింది. పడుకునే ముందు ఆమె మళ్లీ బయటకు వచ్చింది. మునుపటి రాత్రి కంటే కొంచెం చిన్నగా చంద్రుడు ఉన్నాడు!

రూపు మార్చే చంద్రుడు! గుండ్రంగా లేని చంద్రుని మూడవ బొమ్మని కన్నమ్మ గీసింది. క్యాలెండరు గళ్లు నిండిపోతున్నాయి!

నాల్గవ, ఐదవ రాత్రులలో వర్షం పడింది. దాంతో రెండు గళ్లను ఖాళీగా ఉంచాల్సి వచ్చింది. ఆరవ రాత్రి, ఆకాశం స్పష్టంగా ఉంది. కన్నమ్మ బయటకు వెళ్లినప్పుడు, వందలు, కాదు వేల నక్షత్రాలు ఆకాశంలో మెరుస్తున్నాయి. కానీ చంద్రుడు ఎక్కడా లేడు! చూడటానికి ఆమె మళ్లీ మళ్లీ బయటకు వెళ్లింది. చంద్రుడు లేడు, చంద్రుడు లేడు, చంద్రుడు లేడు!

అప్పటికే రాత్రి 11 గంటలు అయింది. కన్నమ్మ కళ్లు మూతలు పడిపోతున్నాయి. ఒక రాక్షసుడు చంద్రుడిని దొంగిలించాడని ఆ రాత్రి ఆమె కల కన్నది. ఆమె ఉలిక్కిపడి మేల్కొంది. చంద్రుడు ఎక్కడికి వెళ్లాడు?

రేపు తిరిగి వస్తాడా?

రాలేదు! మరుసటి రాత్రి కూడా రాలేదు! చంద్రుడిని నిజంగానే దొంగిలించి ఉంటారు! "చంద్రుడిని దొంగిలించిన వ్యక్తి కచ్చితంగా దానిని తిరిగి ఇస్తాడు. దానిని మోస్తూ తిరగలేడు కదా!" అన్నాడు తంబి.

కన్నమ్మ తనలో తాను నవ్వుకుంది. ఆ రాత్రి మళ్లీ ఆమె మేల్కొని ఉండటానికి ప్రయత్నించింది. కానీ ప్రయోజనం లేకపోయింది. చంద్రుడు కనిపించలేదు! ఆమె నిద్రలోకి జారుకుంటుండగా అమ్మ గొంతు వినిపించింది, "నాన్న రేపు ఇంటికి వస్తాడు." మాయా కత్తితో రాక్షసుడి నుండి చంద్రుడిని కాపాడినట్లు ఆమె కల కన్నది!

మరుసటి రోజు ఉదయం కన్నమ్మ నిద్రమత్తులో ఇంటి నుండి బయటకు నడిచింది. చల్ల గాలికి ఆమెకు పూర్తిగా మెలకువ వచ్చి ఆకాశం వైపు చూసింది. "అమ్మా! చంద్రుడు తిరిగి వచ్చాడు! చంద్రుడు తిరిగి వచ్చాడు!" అని ఆమె అరిచింది. కన్నమ్మ తల్లి తలుపు దగ్గరకు వచ్చి చూసింది. "చంద్రుడు చాలా సోమరి, తెల్లవారుతుండగా మాత్రమే బయటకు వచ్చాడు!" అని ఆమె అంది. వాళ్లిద్దరూ నవ్వారు. చంద్రుడు ఇప్పుడు సగమే ఉన్నాడు! అంతేకాకుండా అది ఆలయ గోపురం పైన కాకుండా, సరిగ్గా వాళ్ల నెత్తి మీద ఉంది.

దూరంగా ఇంటికి వస్తున్న తండ్రిని కన్నమ్మ చూసింది. ఇప్పుడు సంతోషంగా ఉంది. నాన్న తిరిగి వచ్చాడు. చంద్రుడు దొరికాడు. గోడ-క్యాలెండర్ వేచి ఉంది. బొమ్మలు, ప్రశ్నలతో కన్నమ్మ మనసు నిండిపోయింది. సోమరి చంద్రుని కోసం ఆమె ఇప్పుడు తెల్లవారుజామున వెతుకుతోంది!

నిరుపమ రాఘవన్



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

డమ్ డమ్ డప్పు!

డమ్ డమ్, డమ్ డమ్... వరండా నుండి దూకి శబ్దం వస్తున్న వైపు పరిగెత్తాడు రాజు. మలుపు తిరిగి రంగులతో, సంగీత వాయిద్యాలతో ఒక ఊరేగింపు వస్తోంది!

రాజు తిరిగి ఇంటికి పరిగెత్తాడు. "అమ్మా! అమ్మా! నాకు ఒక డప్పు కొనిపెట్టవా!" అతను అడిగాడు. అమ్మ బజారుకి బయలుదేరుతోంది. "చూస్తాను, రాజు," ఆమె చెప్పింది.

బజారులో ఆమె తెచ్చినవి అమ్మేసి ఇంటికి కావలసిన పిండి, ఉప్పు వంటివి కొంది. కానీ... డప్పు కొనడానికి డబ్బు మిగలలేదు! బరువైన హృదయంతో ఆమె ఇంటికి బయలుదేరింది.

దారి పక్కన ఒక మంచి చెక్క ముక్క పడి ఉంది. అది నున్నగా, ముదురు రంగులో ఉంది. దానితో ఆడుకోటానికి రాజు ఇష్టపడవచ్చు. అమ్మ దానిని ఇచ్చినప్పుడు రాజు చాలా సంతోషించాడు. దానిని గాలిలోకి విసిరి పట్టుకున్నాడు. ఆ చెక్క ముక్క బాగుంది!


ఆ చెక్క ముక్కతో ఆడుకోటానికి రాజు బయటికి వెళ్లాడు. దారి పక్కన పొయ్యిలో పిడకలు పెడుతున్న ముసలామెను రాజు గమనించాడు.



పొయ్యి నుండి పొగ మబ్బు లాగా పైకి లేస్తోంది. నిప్పు రాజుకోవటం లేదు! ముసలామె కళ్లల్లో నీళ్లు చూశాడు రాజు. "అమ్మమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాడు రాజు.

"నేను ఏడవడం లేదు! ఈ పిడకలు తడిగా ఉన్నాయి. నిప్పు రాజుకోవటం లేదు, వంట చేయలేను!" అని ముసలామె అంది.

"నా దగ్గర ఒక మంచి కట్టె ఉంది. దీనితో నిప్పు రాజేయవచ్చు," అన్నాడు రాజు. ముసలామె చాలా సంతోషించింది! ఆమె కట్టె ముక్క తీసుకుని, తరవాత రాజుకు ఒక రొట్టె ఇచ్చింది.



రొట్టె తీసుకుని రాజు ముందుకుసాగాడు. కొద్దిసేపటి తరవాత అతనికి ఒక కుమ్మరి, అతని కుటుంబం కనిపించింది. కుమ్మరి కొడుకు ఏడుస్తున్నాడు.


"బాబు ఎందుకు ఏడుస్తున్నాడు?" అడిగాడు రాజు. "అతనికి ఆకలిగా ఉంది!" అని కుమ్మరి సమాధానం చెప్పాడు. "నా దగ్గర ఒక రొట్టె ఉంది! తీసుకోండి!" అన్నాడు రాజు. "నువ్వు మంచి పిల్లవాడివి! ఈ కుండ తీసుకో," రాజుని దీవిస్తూ చెప్పింది కుమ్మరి భార్య.

ఆ కుండతో నడుచుకుంటూ వెళుతున్నాడు రాజు. కొంతసేపటి తరవాత అతను ఒక నది ఒడ్డుకు వచ్చాడు. అక్కడ అతనికి బట్టలు ఉతికే భార్యాభర్తలు కనిపించారు.

"మన కుండ పగిలిపోయింది! నీళ్లు మరిగించడానికి మన దగ్గర మరో కుండ లేదు. బట్టలు ఎలా ఉతకాలి?"

"చింతించకు! ఈ కుండ తీసుకో!" అన్నాడు రాజు. బట్టలు ఉతికే వ్యక్తి రాజుకి పదే పదే కృతజ్ఞతలు చెప్పాడు. అతనికి ఒక ఉన్ని చొక్కా ఇచ్చాడు.

చొక్కా చాలా బాగుంది! రాజు దానిని వేసుకున్నాడు. తాను చాలా అందంగా ఉన్నానని అనుకుంటూ ముందుకు నడుస్తున్నాడు! కొంతసేపటికి అతను ఒక వంతెన వద్దకు వచ్చాడు.




దాని నీడలో చలికి వణుకుతూ ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతని వద్ద చొక్కా లేదు! రాజు ఆశ్చర్యంగా ఆ వ్యక్తి వైపు చూశాడు. తరవాత తన ఉన్ని చొక్కా తీసి అతనికి ఇచ్చాడు.

"నువ్వు మంచివాడివి! నీకు ఏదైనా ఇవ్వాలని అనుకుంటున్నాను. ఇదిగో! నా గుర్రాన్ని తీసుకో!" అని అతను అన్నాడు.

తన కొత్త గుర్రంతో వెళుతుండగా రాజుకి ఒక పెళ్లి బృందం కనిపించింది. కుటుంబ సభ్యులు నిట్టూరుస్తూ, ఆందోళన చెందుతున్నారు. దేని కోసం వేచి చూస్తున్నామని తన తల్లిని ఒక చిన్న అమ్మాయి అడిగింది. "గుర్రం లేకుండా మనం బయలుదేరలేం!" అని ఆమె తల్లి చెప్పింది.

"ఈ గుర్రం తీసుకో!" అని రాజు అన్నాడు. వారందరి ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి! రాజుకి పెళ్లికొడుకు కృతజ్ఞతలు చెప్పి, "నీకు ఏదైనా ఇవ్వనివ్వు!" అని అన్నాడు.



పెళ్లివారితో ఉన్న సంగీతకారుల బృందం వైపు రాజు ఆశగా చూశాడు. వాళ్ల వాయిద్యాలు పక్కన పెట్టి ఉన్నాయి. తమని వాయించడానికి ఎదురుచూస్తున్నట్టుగా అవి ఉన్నాయి! "మీ వాద్యకారులను అడిగి ఒక డప్పు ఇస్తారా?" అని రాజు అన్నాడు.

"సంతోషంగా!" అన్నాడు పెళ్లికొడుకు. అతను సంగీతకారులను డప్పు అడిగి రాజుకి ఇచ్చాడు! దానిని డమ్ డమ్, డమ్ డమ్, డమ్ అని వాయిస్తూ సంతోషంగా ఇంటికి వెళ్లాడు రాజు!

ఉత్తర భారతదేశ జానపద కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


ఎవరి తోక?


ఎండగా ఉన్న ఒక రోజు, ఒక చిన్న కోతి చెట్టు మీద నుండి దూకి చుట్టూ చూసింది. అకస్మాత్తుగా అది అదిరిపడింది. నేలపై ఒక తోక పడి ఉంది!

"ఇది ఎవరి తోక? నేను కనుక్కోవాలి!" అంటూ తోకను తీసుకుని అడవి దారిలో నడవసాగింది కోతి.

దగ్గరలోని చెరువు నుండి ఒక చేప పైకి లేచింది. "ఇది నీ తోకా?" అని చిన్న కోతి అడిగింది.

"అది నా తోక కాదు! నా తోక లేకుండా నేను ఇలా ఈదగలనా?" అంటూ నీటిని నెట్టడానికి తోకను ఆడిస్తూ చేప వెళ్లిపోయింది|






'అయితే ఇది ఎవరి తోక?' అని చిన్న కోతి ఆలోచనలో పడింది. సమాధానంగా అన్నట్టు, "టక్! టక్! టక్!" అన్న శబ్దం వచ్చింది. పురుగుల కోసం చెట్టును కొడుతూ వడ్రంగిపిట్ట చేస్తున్న శబ్దం అది!

"ఇది నీ తోకా?" అని చిన్న కోతి అడిగింది.

"ఇదిగో నా తోక. నీకు కనిపించడం లేదా? అది లేకుండా నేను చెట్టు మీద ఇలా కూర్చోగలనా?" అని వడ్రంగిపిట్ట అంది. పురుగుల కోసం బెరడు కింద వెతుకుతూ పైకి, కిందికి, పక్కలకు దూకుతూ దాని గట్టి తోకతో చెట్టు కాండం మీద నిలబడుతోంది.

అప్పుడు ఒక ఉడత చెట్టు కాండం నుండి కిందికి దిగింది. చిన్న కోతి పక్క నుండి ఒక కాయను తీసుకోడానికి పరిగెత్తింది.

"ఇది నీ తోకనా?" అని చిన్న కోతి అడిగింది. "కాదు! ఇదిగో నా అందమైన తోక! ఈ బొచ్చు తోకతో నేను కొమ్మలలో దూకగలను, కిందకి దిగగలను!" అని ఉడత అంది.



చిన్న కోతి చెట్టు కొమ్మల్లోకి చూసింది. పైకి ఎక్కి ఆడుకోవాలని దానికి ఉంది! కానీ ఈ తోకని దాని యజమానికి ఇవ్వాలి. చిన్న కోతి ముందుకు నడవసాగింది.

"ఎక్కడికి వెళుతున్నావో చూసుకో!" అని ఒక గొంతు వినిపించింది. చిన్న కోతి కిందికి చూసింది.

అక్కడ కోపంగా ఉన్న తేలు కనిపించింది!

"ఇది నీ తోకేమో కొంచెం చెబుతావా?" అని చిన్న కోతి అడిగింది.

"నా తోక కనబడటం లేదా?" అని బదులు ఇచ్చింది తేలు. తన తోకను చిన్న కోతికి చూపించి, "నిన్ను కుడితే నొప్పితో ఏడుస్తావు! పారిపో! పారిపో!" అని హెచ్చరించింది.

చిన్న కోతి అక్కడి నుంచి పరిగెత్తింది.

అప్పుడు తన పిల్లలతో వెళుతున్న ఒక తల్లి కుందేలు దానికి కనపడింది. కోతిని చూసి బొరియలోకి దూకి అవన్నీ మాయమయ్యాయి.


"కుందేలూ! నీ తోక కోసం వెదుకుతున్నావా?" అని చిన్న కోతి అడిగింది.

తల్లి కుందేలు బొరియ నుండి బయటకు వచ్చింది. "ఇదిగో నా తోక. నేను దానిని ఎలా ఊపుతానో చూడు!" అని చెప్పింది.

చిన్న కోతి ఆశ్చర్యపోయింది. "గోధుమ, బూడిద రంగులో నీ బొచ్చు ఉంది, కానీ తోక తెల్లగా ఉంది. అది చాలా చిన్నగా, మెత్తగా ఉంది!"

"అవును, నిజమే! పరిగెత్తేటప్పుడు, దానిని పక్కలకు ఊపుతాను. దాంతో శత్రువుల దృష్టి మరలి, నేను తప్పించుకుంటాను!" అని కుందేలు చెప్పింది.

'ఎంత ఉపయోగకరమైన తోక!' అని చిన్న కోతి అనుకుంది.



అప్పుడే ఏదో కొత్త జీవి వచ్చింది. అది తోక లేని బల్లి! చిన్న కోతి దాని దగ్గరకు పరిగెత్తింది. "నాకు నీ తోక దొరికింది! ఇదిగో!"

"అది నా తోకే. కానీ, ఇప్పుడు నాకు దాని అవసరం లేదు," అని బల్లి అంది.


"నీకు దాని అవసరం లేదా? అది ఎలా సాధ్యం? తోక లేకుండా చేప ఈదలేదు, వడ్రంగిపిట్ట చెట్టు కాండం మీద నిలబడలేదు, ఉడత కిందకు దూకలేదు, తేలు తనను తాను రక్షించుకోలేదు, కుందేలు తన వేటాగాళ్ల నుండి తప్పించుకోలేదు. నేను చెట్లలో ఊగలేను! అందరికీ తోక కావాలి!" అని చిన్న కోతి అడిగింది.

"నాకూ తోక కావాలి. కానీ నిన్న ఒక పాము నన్ను పట్టుకోబోయింది. దాంతో నా తోకను విడిచిపెట్టవలసి వచ్చింది. అది నేలపై మెలికలు తిరుగుతుండటంతో పాము దానిని పట్టుకుంది. దాంతో నేను పారిపోయాను!" అని బల్లి అంది.

"అది అద్భుతం! కానీ నీకు తోక తిరిగి ఎందుకు వద్దు?" అని చిన్న కోతి అడిగింది.

"చూడు! నాకు కొత్త తోక పెరుగుతోంది!" అని బల్లి అంది.

"ఓహ్! నీ దగ్గర అన్నిటికంటే అద్భుతమైన తోక ఉంది!" అని చిన్న కోతి అరిచింది.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

జాతరలో

ఆ రోజు మా తరగతిలో చాలా సందడిగా ఉంటి! గంట మోగిన తరవాత, నేను వీలైనంత వేగంగా ఇంటికి వెళ్లాను. "అమ్మా! అమ్మా! వచ్చే వారం మాకు స్కౌట్ క్యాంప్ ఉంది. నేను వెళ్లవచ్చా?" అమ్మని అడిగాను.

"దాని గురించి వివరంగా చెప్పు," అని అమ్మ అంది.

"ప్రతి సంవత్సరం పట్టణంలో జాతర జరుగుతుంది. ఊళ్ల నుండి చాలా మంది వస్తారు. వచ్చినవాళ్లకి ఎటు వెళ్లాలో చెబుతూ వారు క్షేమంగా ఉండేలా చూడాలి," అని చెప్పాను.

"బాగుంది, మణి. కానీ, ఇంటికి దూరంగా నువ్వు ఒక్క రాత్రి కూడా ఉండలేదు. నేను ఎంతో ఆందోళన చెందుతాను!" అమ్మ చెప్పింది.

"కమల, రహీం, ఇంకా చాలామంది వస్తున్నారు. నన్ను కూడా వెళ్లనివ్వు," అమ్మకు భరోసా ఇస్తూ అడిగాను.




"సరే, వాళ్లు కూడా వెళుతున్నట్లయితే..." మాట పూర్తి చెయ్యనివ్వకుండా ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాను. "మా అమ్మ మంచిది!" నేను సంతోషంగా అన్నాను.

వెళ్లవలసిన రోజున మేమందరం బడి మైదానంలో కలుసుకున్నాం. మా బరువైన సంచులను బస్సులో పెట్టాం. చేతులు ఊపుతూ టాటా చెబుతుండగా బడి గేటు నుండి బస్సు బయటకు వచ్చింది. త్వరలోనే మేం ప్రధాన రహదారిపైకి వచ్చాం. పట్టణం చేరుకునే వరకు పాటలు పాడుతూనే ఉన్నాం.

అక్కడికి చేరుకునేసరికి దాదాపు చీకటి పడింది. మేం అంతా చూస్తూ ఉన్నాం! ఆహార దుకాణాలు, రకరకాల వస్తువుల దుకాణాల చుట్టూ ప్రజలు గుమిగూడి ఉన్నారు. ఒకేసారి ఇంత మందిని, ఇంత సందడిని నేను ఎప్పుడూ చూడలేదు.

బస్సు దిగిన వెంటనే, మమ్మల్ని ఒక పెద్ద మైదానానికి తీసుకుని వెళ్లారు, అక్కడ వేయడానికి గుడారాలు సిద్ధంగా ఉన్నాయి. తరవాత మరుసటి రోజు చెయ్యవలసిన పనుల ప్రకారం మమ్మల్ని బృందాలుగా చేశారు.

కమల చాలా ఉత్సాహంగా ఉంది. ఆమె వైద్య సిబ్బందికి సహాయం చేయబోతోంది. రవాణా పోలీసులకు రహీం సహాయం చేయబోతున్నాడు. ఇది విని మేమందరం నవ్వుకున్నాం. మా బడిలో అతనిని మించిన ఫుట్‌బాల్ ఆటగాడు లేడు. అతన్ని చూస్తేనే సమస్యలు సృష్టించాలని అనుకునే ఎవరైనా భయపడతారు.



నాకు ఇచ్చిన పనితో నేను కూడా సంతోషంగా ఉన్నాను. కొత్తవాళ్లకు ఎటు వెళ్లాలో చెప్పటం నా పని. మనుషులను చూడటం, వారి మాటలు వినడం నాకు ఇష్టం. ఇప్పుడు వాటికి మంచి అవకాశం దొరికింది.


మరుసటి రోజు త్వరగా గడిచిపోయింది. అయినప్పటికీ అది ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చింది! మేం చాలా కష్టపడి పనిచేశాం, చాలా నేర్చుకున్నాం. గుడారాలకు తిరిగి వచ్చే సమయానికి మేం బాగా అలసిపోయాం.

తిరిగి వస్తున్నప్పుడు రహీం, నేను ఆ రోజు జరిగిన వాటి గురించి మాట్లాడుకున్నాం. ఎప్పటిలాగానే, అతనికి చెప్పడానికి ఒక సరదా కథ ఉంది. అతను చెప్పటం పూర్తి చేసే సమయానికి గుడి మెట్ల దగ్గర నిలబడి ఉన్న ఒక అవ్వని చూశాం. ఆమె వద్ద ఒక బరువైన సంచి ఉంది. ఆమెకు సహాయం చేయడానికి మేం పరిగెత్తాం.

రహీం ఆమె సంచిని తీసుకున్నాడు, ఆమె చేయి పట్టుకుని మెట్లు ఎక్కటానికి నేను సహాయం చేశాను. "మంచి అబ్బాయిలు," ఆమె మమ్మల్ని దీవించింది. మా విధిని నిర్వర్తించినందుకు మేం సంతోషించాం.

అకస్మాత్తుగా నీటిలో ఏదో పడిన శబ్దం వినిపించింది. ఒక చిన్న పిల్లవాడు చెరువులో పడిపోయాడు! రహీం మెట్లు దిగి, తన చెప్పులను వదిలేసి నీటిలోకి దూకాడు. ఈదుకుంటూ పిల్లవాడిని చేరుకుని అతనిని సురక్షితంగా తీసుకువచ్చాడు.

ఇప్పుడు నా వంతు. నేను బాలుడిని ఇసుక మీద పడుకోబెట్టి ప్రథమ చికిత్స చేశాను. అదృష్టవశాత్తూ, అతను ఎక్కువ నీరు మింగలేదు.




ఇంతలో చూడటానికి జనం గుమిగూడారు. "ఆ అబ్బాయికి గాలి కావాలి! దయచేసి దూరం జరగండి!" అని బిగ్గరగా అంటూ రహీం వాళ్లని వెనక్కి నెడుతున్నాడు. అంతలో ఆ అబ్బాయి అమ్మానాన్నలు అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. ఆ అబ్బాయిని వాళ్ల నాన్న ఎత్తుకుని గట్టిగా హత్తుకున్నాడు.

పట్టణ ఆసుపత్రి దగ్గరలో ఉంది. ఆ కుటుంబాన్ని రహీం, నేను అక్కడికి తీసుకునివెళ్లాం. పిల్లవాడిని డాక్టర్ పరీక్షిస్తుండగా మేం ఆత్రుతగా వేచి ఉన్నాం. చివరికి, అతను పైకి చూసి, నవ్వాడు. "మీరు మంచి పని చేశారు! సమయానికి అతన్ని నీటిలో నుండి బయటకు తీశారు. ప్రథమ చికిత్స చేయడంతో అతనికి ఏం కాలేదు!" తల్లిదండ్రులు కన్నీటితో మాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రి నుండి వస్తుండగా కమలను చూశాం. ఎవరినో ఆమె చక్రాల కుర్చీలో తీసుకుని వెళుతోంది. మమ్మల్ని చూసి కాసేపు ఉండమన్నట్టు చేయి ఊపింది. ఒక నిమిషంలో మా దగ్గరకి వచ్చింది. మేం కలిసి నడుస్తున్నాం.

మేమంతా చాలా చేశాం, చాలా చూశాం! స్కౌట్స్‌లో నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించాం! చెప్పడానికి మాలో ప్రతి ఒక్కరికి చాలా కథలు ఉన్నాయి.


రాత్రి చాలాసేపు మేల్కొని కబుర్లు చెప్పుకున్నాం.




P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

నేను ఎవరు?





చెట్టు ఒకటి
స్తంభాలు ఎన్నో

ఒక చిన్న ముళ్ల చెట్టుని
నా నిండా మెరిసే పసుపుపచ్చని బంతులు
నా ఆకులు ఆకుపచ్చగా మెరుస్తూ, వాసన వస్తాయి
నా పండ్లు పుల్లని రసంతో నిండి ఉంటాయి
నీళ్లు, చక్కెర, ఉప్పు కలుపుకుని మీరు తాగాలి

పెద్ద ఆకులు, గొట్టంలాంటి కాడ, పొడవైన చెట్టు
పసుపుపచ్చ, నారింజ రంగులో ఉండే
మెత్తటి కండగల తియ్యటి పండు
మిరియాల లాంటి నల్లటి విత్తనాలు

ఆకులు ఉన్నాయి - కానీ కొమ్మలు లేవు
పువ్వులు ఉన్నాయి - కానీ వాసన లేదు
పళ్లు ఉన్నాయి - కానీ నాటడానికి విత్తనాలు లేవు
పెద్ద కాండం - కానీ కట్టడానికి కలప కాదు
చుట్టూ చిన్న మొక్కలు చాలా ఉంటాయి!

గుత్తులుగా ముత్యపు తెల్లని పువ్వులు
వేలాడే పొడవాటి, సన్నని ఆకుపచ్చ కాయలు
వండుకునే లేత ఆకుపచ్చ ఆకులు
తినడానికి ఈ చెట్టుపై పండిన పళ్లు ఉండవు!

మరీ చిన్న, మరీ పెద్ద కాని చెట్టుని
లేత ఆకుపచ్చ రంగులో పుల్లని పండు,
గాడి ఉండి ఇది ముక్కలుగా అవుతుంది,
వాటిల్లో విటమిన్ సి మెండు



పొడవు చెట్టును, పెద్ద ఆకులు పండితే ఎర్రగా మారతాయి
కంటి ఆకారంలో ఉండే గింజ
దాని బయటి పెంకు పగలకొట్టడం కష్టం
దానిని తింటే ఎంతో ఆరోగ్యం

ఎర్రటి ఎరుపు పువ్వులు
వందల ముళ్లతో ఉండే కొమ్మలు
ఎండి, పగిలిపోయే కాయలు
గాలికి చిన్న పారాచూట్ల లాగా ఎగిరే గింజలు
అవి చెట్టు చుట్టూ పడి తెల్లటి తివాచీ లాగా ఉంటాయి

దాని హృదయ ఆకారపు ఆకుల కింద
చల్లని, ఆహ్లాదకరమైన నీడ



నేను పట్టణాలు, పల్లెల్లో పెరుగుతాను
అందరికీ నీడను ఇస్తాను
నా పువ్వులు ఎర్రగా ఉంటాయి
వాటితో చాలా అందంగా ఉంటాను!



దాని పెద్ద ఆకులు గాలికి ఊగుతున్నప్పుడు-
బాగా శబ్దం చేస్తాయి!
కొమ్మలు లేకుండా కాండం నిటారుగా ఉంటుంది!
నల్లని పీచుని కోసి
నీళ్లతో ఉండే తియ్యటి గుజ్జును తినండి

గుండ్రటి చిన్న కాయలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి
పండితే ఎరుపు రంగులో ఉంటాయి
పైగుజ్జు తిని గట్టి గింజను ఊసెయ్యండి -
దాని ముళ్ల కొమ్మలతో జాగ్రత్తగా ఉండండి!

ఆకాశాన్ని అంటుకుంటున్నట్టు పొడవైన చెట్లు
వాటి సువాసన అంతటా వ్యాపిస్తుంది
సన్నటి ఆకులను నలిపి నుదుటిపై రుద్దండి
మీ తలనొప్పి అప్పుడు మాయమైపోతుంది

సముద్రపు ఇసక తీర ప్రాంతాలలో ఉంటాను
సూదులు లాంటి సన్నని ఆకులు ఉంటాయి
నా కొమ్మలు గుర్రపు తోక లాగా కనిపిస్తాయి
నా కాయలు చిన్న, ముళ్ల బంతులు
చూడటానికి బాగుంటాయి - కానీ తినటానికి పనికిరానివి!

నిటారుగా, బలంగా పెరుగుతాను
పెద్ద ఆకులు దడికి వాడతారు
ఆకుల ఈనెలతో చీపిరి కడతారు
తలపై ఉన్న కుండలలో
తియ్యటి నీళ్లు అందిస్తాను



పుల్లని కాయలు, పండు వంటలకు రుచిని ఇస్తాయి
రోడ్డు పక్కన పెద్దగా పెరిగి నీడని ఇస్తాను
ఊరి పక్క తోపులలో కూడా కనిపిస్తాను
వంపు తిరిగిన కాయలు ఊరిస్తూ వేలాడుతుంటాయి

నా లోతైన వేర్లు నన్ను లంగరు వేస్తాయి
దృఢమైన ముదురు ఆకులు నన్ను చల్లగా ఉంచుతాయి
నేను నా భారీ సరుకును మందపాటి కాండం మీద మోస్తాను
కత్తిరించినప్పుడు అవి జిగట పాలను స్రవిస్తాయి
నా పండ్లు వేల మందికి ఆహారం ఇస్తాయి

లేత ఆకులు చాలా సున్నితంగా ఉంటాయి
తెల్లటి పువ్వుల గుత్తులుగా పూస్తాయి
పచ్చి కాయలు ఉప్పుతో తింటే బాగుంటాయి
పండినప్పుడు నాకు సాటి ఎవరూ లేరు -
పళ్లల్లో నేను రాజుని!



నా బెరడు చేదుగా ఉంటుంది
నా ఆకులు చేదుగా ఉంటాయి
నేను మొత్తంగా చేదుగా ఉంటాను!
పురుగులను, వ్యాధులను దూరంగా ఉంచుతాను

తాటి చెట్టు, మామిడి చెట్టు, బాదం, ఉసిరి, వేప, బూరుగ దూది చెట్టు, సరుగుడు, అరటి, కొబ్బరి చెట్టు, రేగు చెట్టు, చింత చెట్టు, తురాయి, బొప్పాయి చెట్టు, రావి, పనస చెట్టు, యూకలిప్టస్ (జామాయిల్ చెట్టు), మర్రి, మునగ చెట్టు, నిమ్మ చెట్టు

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

61 బీర్బల్ ఎందుకు ఆలస్యంగా వచ్చాడు?

ఒక రోజు అక్బర్ తన మంత్రి బీర్బల్ రాజభవనానికి వచ్చే వరకు వేచి ఉన్నాడు. బీర్బల్ ఆ రోజు చాలా ఆలస్యంగా వచ్చాడు. దాంతో అక్బర్ కోపంగా ఉన్నాడు. బీర్బల్ వచ్చినప్పుడు, "ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చావు?" అక్బర్ అడిగాడు.

"ఓ రాజా! నేను బయలుదేరినప్పుడు నా కొడుకు ఏడవడం మొదలుపెట్టాడు. అతనిని ఊరుకోబెట్టి వచ్చేసరికి ఆలస్యం అయ్యింది," అన్నాడు బీర్బల్.

"నువ్వు తమాషా చేస్తున్నావా? ఏడుస్తున్న పిల్లవాడిని ఊరుకోబెట్టటానికి ఇంత సమయం పడుతుందా?" అన్నాడు అక్బర్. "నిజం, రాజా! ఏడుస్తున్న పిల్లవాడిని ఊరుకోబెట్టటం చాలా కష్టం," అన్నాడు బీర్బల్.

"కష్టమా? పిల్లవాడి ఏడుపుని నేను తేలికగా ఆపగలను!" గొప్పలు పోయాడు అక్బర్.




"అలాగా? అయితే, ఒక చిన్న నాటకం వేద్దామా? నేను పిల్లవాడి పాత్రను పోషిస్తాను. మీరు నాన్నగారిగా ఉండండి," అన్నాడు బీర్బల్.

"నేను నీ సవాలును ఒప్పుకుంటున్నాను. మొదలుపెట్టు," అన్నాడు అక్బర్.

బీర్బల్ నేలమీద పడుకుని చిన్న పిల్లవాడి లాగా ఏడవడం మొదలుపెట్టాడు.

"కొడుకా, ఎందుకు ఏడుస్తున్నావు?" అని తండ్రి అక్బర్ అడిగాడు. అతని గొంతు మెత్తగా, కరుణతో నిండి ఉంది.

"వా! వా! నాకు చెరకుగడలు కావాలి!" అంటూ బాల బీర్బల్ ఏడ్చాడు.



"ఏడవకు! చెరకుగడలు ఇస్తాను," అని తండ్రి అక్బర్ అన్నాడు. సేవకులకు చెప్పటంతో ఒక నిమిషంలో వాళ్లు కొన్ని చెరకుగడలతో వచ్చారు.




బాల బీర్బల్ చెరకుగడలను చూసి కాళ్లు, చేతులు నేలకేసి కొడుతూ ఏడుపు పెంచాడు. "వా! వా!" ఆ శబ్దం భరించలేనిదిగా ఉంది!

"ఇదిగో చెరకుగడ. ఇంకా ఎందుకు ఏడుస్తున్నావు?" అని తండ్రి అక్బర్ అడిగాడు.

"అది చిన్న ముక్కలుగా కావాలి!" బాల బీర్బల్ ఏడ్చాడు. "వా, వా!"

"అంతేనా? ఇప్పుడే దాన్ని ముక్కలు చేసి ఇస్తాను!" తండ్రి అక్బర్ అన్నాడు.

అక్బర్ సేవకులు చెరకును చిన్న ముక్కలుగా చేశారు. వాటిని పిల్లవాడికి ఇచ్చారు. కానీ బాల బీర్బల్ ముక్కలను తీసుకుని విసిరివేశాడు. నేలను కొడుతూ మరింత గట్టిగా ఏడవసాగాడు. "వా! వా! వా!"



తండ్రి అక్బర్ దిగ్భ్రాంతి చెందాడు. "ఇప్పుడు ఎందుకు ఏడుస్తున్నావు? నువ్వు అడిగిన చెరకు ముక్కలు నీ దగ్గర ఉన్నాయి!" అతను అడిగాడు.

"ఆ ముక్కలను మళ్లీ కలుపు! నాకు చెరకుగడ కావాలి!" అంటూ బాల బీర్బల్ ఏడ్చాడు.

దాంతో, అక్బర్ సహనం కోల్పోయాడు. "చెరకు ముక్కలను మళ్లీ ఎలా కలుపుతారు? ముక్కల నుండి చెరకుగడను తయారు చేయడం సాధ్యం కాదు!"

అప్పుడు బీర్బల్ మాటలలోని నిజం అతనికి అర్థం అయ్యింది. "నువ్వు చెప్పింది నిజమే, మిత్రమా! ఏడుస్తున్న పిల్లవాడిని ఓదార్చడం అంత తేలిక కాదు," ఒప్పుకున్నాడు అక్బర్.

బీర్బల్ నవ్వాడు. బట్టల దుమ్ము దులుపుకుంటూ పైకి లేచాడు. "ఈ ఉదయం నా కొడుకు ఇలాగే ప్రవర్తించాడు. ఏం చేయాలో నాకు తెలియలేదు! నిజానికి, ఇంటి నుండి నేను బయలుదేరినప్పుడు అతను ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు."

అక్బర్ బాధపడ్డాడు. "ఈ క్షణమే ఇంటికి తిరిగి వెళ్లి కొడుకును ఊరడించు!" అని అన్నాడు.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh
Artist Uma Krishnaswamy


నందరియా త్యాగం

కళ్లు మూసుకోండి. ప్రవహించే పెద్ద నదిగా మిమ్మల్ని మీరు ఊహించుకోండి. అది గంగా నది. చూడండి! నది ఒడ్డున ఒక పెద్ద మామిడి చెట్టు ఉంది. కోతుల గుంపు ఆ పండ్లను తింటూ ఉంది. అంత మంచి భోజనం దొరికే చోట నివసించడం వాటి అదృష్టం!

అయినప్పటికీ, ఆ దళానికి నాయకుడు అయిన నందరియా ఆందోళన చెందుతున్నాడు. మామిడి చెట్టు కొమ్మలలో ఒకటి నదిపై చాలా దూరం విస్తరించి ఉంది. ఒక మామిడి పండు నీటిలో పడితే?

"నదిమీదకి వేలాడుతున్న ఈ కొమ్మను చూడండి. దాని నుండి ఒక్క మామిడి కాయను కూడా నీటిలో పడనివ్వకూడదు.

"నీటిలోకి మామిడి పండు పడితే, అది మనుషుల చేతుల్లోకి వెళ్లవచ్చు. అంత రుచికరమైన పండును ఇచ్చే చెట్టును వెతకడానికి మనుషులు ప్రయత్నిస్తారు. వాళ్లు ఇక్కడికి వచ్చి మనల్ని తరిమివేస్తారు," బృంద సభ్యులతో చెప్పాడు నందరియా.



"ఈ కొమ్మను జాగ్రత్తగా చూస్తూ ఉండండి! పండిన ప్రతి కాయనీ వెంటనే కోయాలి! మామిడి పండును నీటిలో పడనివ్వకండి!" నందరియా హెచ్చరించాడు.

కానీ, ఒక మామిడి పండు నదిలో పడటం ఎవరూ చూడలేదు. అది ప్రవాహంలో మునుగుతూ, తేలుతూ కిందకు కొట్టుకుపోయింది. చేతులు మారుతూ అది రాజు వద్దకు చేరింది. 'ఈ మామిడి ఎక్కడి నుండి వచ్చింది?' దాని రుచి, వాసనను ఆనందిస్తూ ఆశ్చర్యపోయాడు రాజు. తన సైనికులతో కలిసి చెట్టును కనుక్కోడానికి బయలుదేరాడు.

అక్కడికి చేరుకున్న రాజు, అంత పెద్ద చెట్టుని, దాని నిండా ఉన్న పండ్లని చూసి ఆశ్చర్యపోయాడు. అయితే, చీకటి పడుతుండటంతో శిబిరం వేయాలని నిర్ణయించుకున్నాడు. "మీ ఆయుధాలు పక్కన పెట్టి ఉదయం వరకు విశ్రాంతి తీసుకోండి. అప్పుడు మామిడి పండ్లను కోద్దాం," సైనికులకు రాజు చెప్పాడు.




రాత్రి చీకటిగా ఉంది. ఆకాశాన్ని మేఘాల దుప్పటి కప్పేసింది. చంద్రుడు నిద్రపోయి చాలాసేపు అయ్యింది. నిద్రపోతున్న సైనికుల మధ్య నుంచి జాగ్రత్తగా వెళ్లి నందరియా, అతని బృందం చెట్టు ఎక్కాయి. పొట్టలు నిండేవరకు పళ్లు తిన్నాయి.

విందులో పడి తమ కింద సైన్యం నిద్రపోతున్న విషయాన్ని కోతులు మరిచిపోయాయి. వారి నిశ్శబ్దం గుసగుసలుగా, గుసగుసలు కబుర్లుగా మారాయి. రాజు కాపలాదారులు రాజును మేల్కొల్పారు. "చెట్టు నిండా కోతులు ఉన్నాయి! ఏం చెయ్యమన్నారు?" రాజుని అడిగారు.

"సైనికులను నిద్రపోనివ్వండి. తెల్లవారుజామున కోతులను తరిమివేద్దాం," అని రాజు జవాబు ఇచ్చాడు.

రాజు ప్రణాళికలను రెండు కోతులు విని నందరియా వద్దకు పరిగెత్తాయి. "ప్రమాదం! ప్రమాదం! సైనికులు మనందరినీ తరిమికొట్టాలని అనుకుంటున్నారు! ఏమి చేద్దాం?"

"సైనికుల నుండి మిమ్మల్ని రక్షిస్తాను," అని నందరియా సమాధానం ఇచ్చాడు. ఒక పొడవైన తీగను తీసుకుని దాని ఒక చివరను మామిడి చెట్టుకు బిగించాడు. మరొక చివరను అతను తన నడుముకు కట్టుకున్నాడు. ఒక్క దూకుతో అతను నదిని దాటాడు.



అయ్యో! తీగ చిన్నగా అయ్యింది. నందరియా ఎదురుగా ఉన్న ఒక చెట్టును పట్టుకున్నడు. కానీ తీగను దానికి కట్ట లేకపోయాడు. పర్వాలేదు! కొమ్మను పట్టుకుని తన శరీరంతో వంతెన పూర్తి చేశాడు!

తరవాత తన బృందాన్ని పిలిచాడు: "త్వరగా! త్వరగా! తీగ మీద నడిచి, నా శరీరం మీద కాలు పెట్టి చెట్టు మీద నుంచి దిగి అవతలి ఒడ్డుకు చేరుకోండి. త్వరగా రండి, ఇప్పుడు మొదలుపెడితేనే అందరూ తప్పించుకోగలుగుతారు!"

కోతులు ఒక్కొక్కటిగా నది అవతలి వైపుకి దాటుతున్నాయి. చివరి కోతి నందరియా వీపుపై బలంగా దూకి సురక్షితంగా చెట్టును అందుకుంది. కానీ నందరియా కొమ్మపై పట్టు కోల్పోయాడు! అంత ఎత్తు నుండి జారుతూ నది ఒడ్డున పడిపోయాడు.

కోతులు తప్పించుకోవడాన్ని రాజు చూస్తూనే ఉన్నాడు. ఇప్పుడు అతను నందరియా వద్దకు పరిగెత్తాడు. కానీ అతను చేయగలిగింది ఏమీ లేదు. దాని ప్రాణం పోతూ ఉంది. "నీ గురించి ఆలోచించకుండా నీ వాళ్లను రక్షించావు. ఇంతటి త్యాగాన్ని నేను ఎప్పుడూ చూడలేదు," అన్నాడు రాజు.


"తనకంటే తన ప్రజల సంక్షేమానికి ఒక రాజు ప్రాధాన్యత ఇవ్వాలి. నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తించాను," బదులు ఇచ్చాడు నందరియా.

"కోతుల రాజా, నీకు వందనాలు. నీ చివరి కోరిక చెబితే దానిని తీరుస్తాను," ఏడుస్తూ చెప్పాడు రాజు.

"మనుషుల బాధ లేకుండా నా కోతులు స్వేచ్ఛగా జీవించనివ్వండి," తన చివరి మాటగా నందరియా చెప్పాడు.

దాంతో, "ఇకపై ఈ చెట్టు నందరియా కోతులకే పరిమితం చేయాలి. దాని కాయలను ఎవరూ, ఎప్పటికీ కోయకూడదు," అని రాజు ప్రకటించాడు. అతను, అతని సైన్యం ఆ ప్రదేశం నుండి వెనక్కి బయలుదేరారు.

జాతక కథ



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi


Artist Uma Krishnaswamy

63 తెనాలి రాముడు, ఇంద్రజాలికుడు

ఒక రోజు ఒక ఇంద్రజాలికుడు విజయనగరానికి వచ్చాడు. రాజభవనంలో అనేక అద్భుతమైన మాయలు చేశాడు. ప్రజలు మంత్రముగ్ధులై చూశారు. సమయం గడిచిపోతున్నట్లు వాళ్లు గమనించలేదు.

ఇంద్రజాలికుడు ఒక ఖాళీ బుట్టను నేలపై బోర్లించాడు. తరవాత దానిని పైకి లేపాడు. పూఫ్! అక్కడ ఒక మామిడి మొక్క ఉంది!

బల్ల మీద ఖాళీ పంజరాన్ని ఉంచాడు. తరవాత పంజరం తలుపు తెరిచాడు. ఒక పావురం బయటకు ఎగిరింది! అందరూ విపరీతంగా చప్పట్లు కొట్టారు!



మంత్రగాడు కొన్ని చిన్న రాళ్లను తీసుకున్నాడు. జాప్! అవి బంగారు నాణేలుగా మారాయి! తరవాత అతను తన కళ్లు గట్టిగా మూసుకున్నాడు. రాజు వేలి నుండి ఒక ఉంగరం ఎగిరిపోయింది. అది నేరుగా ఇంద్రజాలికుడు వద్దకు వచ్చింది!

ప్రజలకు ఆ వినోదం నచ్చింది! ఇంద్రజాలికుడి ప్రతిభను రాజు కూడా మెచ్చుకున్నాడు. వెండి పళ్లెం నిండా అతనికి బహుమతులు ఇచ్చాడు.

కానీ ఇంద్రజాలికుడు బహుమతుల కంటే ఎక్కువ కోరుకున్నాడు. అతను ఒక ప్రణాళికతో విజయనగరానికి వచ్చాడు. "ఇంద్రజాలంలో నన్ను మించిన వాళ్లు ఎవరైనా ఇక్కడ ఉన్నారా? అలా అయితే, ఈ బహుమతులు అన్నింటినీ నేను వదులుకుంటాను!" అని అతను అన్నాడు. ఎవరూ ముందుకు అడుగు పెట్టలేదు. అంత నైపుణ్యం ఉన్న ఇంద్రజాలికుడిని సవాలు చేయడానికి ఎవరూ ధైర్యం చేయలేదు.



అప్పుడు, "నన్ను ఎవరూ ఓడించలేకపోతే, నేను విజయనగరం నుండి బయలుదేరినప్పుడు మీ తెలివైన మంత్రి తెనాలి రాముడు నాతో రావాలి!" అని ఇంద్రజాలికుడు అన్నాడు.

అందరితో పాటు మాంత్రికుడి ప్రదర్శనను తెనాలి రాముడు ఆస్వాదిస్తున్నాడు. అతని పేరు వినపడగానే అతను ఆశ్చర్యపోయాడు. అతను రాజు వైపు చూశాడు, అతని ముఖం ఆందోళనతో నిండి ఉంది. 'ఈ ఇంద్రజాలికుడిని ఓడించడానికి నేను ఒక దారిని కనుక్కోవాలి,' అని అతను అనుకున్నాడు.

కొంతసేపటి తరవాత, "ఓ మాంత్రికుడా! మీ సవాలును అంగీకరిస్తున్నాను! మీరు చేయలేని ఇంద్రజాలాన్ని నేను చేస్తాను," అతను అన్నాడు.

"నేను నా ఇంద్రజాలాన్ని ప్రదర్శించిన తరవాత, మీరు దానిసే ప్రదర్శించాలి. కానీ, నేను కళ్లు మూసుకుని చేస్తాను, మీరు కళ్లు తెరిచి చేయాలి. సరేనా?"

ఇంద్రజాలికుడు సంకోచించాడు. తెనాలి రాముడు చాలా తెలివైనవాడు! అతను ఏదో ఎత్తుగడ వేస్తున్నాడు. అయినప్పటికీ... కళ్లు మూసుకుని చేసినది కళ్లు తెరిచి చేయడం చాలా తేలిక కదా? "అది చాలా తేలిక! నేను ఒప్పుకుంటున్నాను!" అని అతను అన్నాడు.

తెనాలి రాముడు ఒక పూల కుండీ దగ్గర నిలబడి ఉన్నాడు. రెండు చేతుల్లోకి కొంత మట్టిని తీసుకున్నాడు. తరవాత తన కళ్లు గట్టిగా మూసుకున్నాడు. తన కనురెప్పల మీద నెమ్మదిగా మట్టిని పోశాడు. తరవాత ఒక గుడ్డతో తన కళ్లను తుడుచుకున్నాడు. అప్పుడు, మాంత్రికుడి వైపు తిరిగి, "నీ కళ్లు తెరిచి ఈ ఇంద్రజాలం చెయ్యి!" అని అన్నాడు.



ఇంద్రజాలికుడు కంగు తిన్నాడు. అతని నోట మాట రాలేదు. తెనాలి రాముడు ముందు తల వంచాడు. ఇక విజయనగరం వదిలిపెట్టి వెళ్లిపోయాడు.

"హుర్రే! తెనాలి రాముడు మళ్లీ విజయం సాధించాడు!" అని ప్రజలు మెచ్చుకున్నారు.

"నువ్వు మా గౌరవాన్ని నిలబెట్టావు!" అన్నాడు రాజు. తెనాలి రాముడికి ఎన్నో బహుమతులు ఇచ్చాడు.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

అప్పు, దాని స్నేహితులు



అప్పు అనే చిన్న ఏనుగుకి అడవిలో చాలా మంది స్నేహితులు ఉన్నారు. వాటితో ఆడుకోవడం అది ఇష్టపడేది. కానీ ఈ రోజు అప్పు దాని స్నేహితుల దగ్గరకు వెళ్లలేదు. అది మాట్లాడకుండా ఒంటరిగా కూర్చుని ఉంది.

దానిని చూడటానికి అప్పు స్నేహితులు వచ్చాయి. దానిని ఓదార్చడానికి అవి ప్రయత్నించాయి.



లకుముకి పిట్ట: హలో, అప్పు. మాతో ఆడుకోవడానికి రాలేదు. కారణం నాకు చెప్పవా?

తల వంచి, తొండాన్ని నేలకి తాకిస్తూ అప్పు నిశ్శబ్దంగా నిలబడి ఉంది.

లకుముకి పిట్ట: నీ పొడవైన, వేలాడే తొండం నిన్ను బాధపెడుతోంది కదా?



అప్పు (తలను అడ్డంగా ఊపుతూ): లేదు! నా తొండం అంటే నాకు చాలా ఇష్టం! నేను దానితో చాలా పనులు చేయగలను! దాని వల్ల మంచి పనివాడినని పేరు తెచ్చుకున్నాను!

కొమ్మల్లో ఊగుతూ కోతి వచ్చింది.

కోతి: నా లాగా చెట్ల కొమ్మలలో ఊగలేవు కాబట్టి నీ చిన్న తోక వల్ల బాధపడుతున్నావు కదా?

అప్పు (కాలితో నేలను కోపంగా తట్టి): నాకు చిన్న తోక ఉంది, కానీ అది నాకు ఉపయోగపడుతుంది! నేను నీ లాగా చెట్ల కొమ్మలలో ఊగాలని అనుకోవటం లేదు!



జింక: నాకు తెలుసు! నీ పెద్ద కాళ్ల వల్ల బాధపడుతున్నావు కదా? నీ కాళ్లు నా లాగా అందంగా, సన్నగా లేవు.


అప్పు (కళ్లు తిప్పుతూ): లేదు, లేదు! నా కాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. అవి బలంగా, గొప్పగా ఉన్నాయి. అవి అలా ఉండటమే నాకు ఇష్టం!

ఎగురుతూ నెమలి అక్కడికి వచ్చింది.

నెమలి: నీ బూడిద రంగు కారణంగా బాధపడుతున్నావు, కదా? నా అందమైన ఈకలపై ఉన్నటువంటి మెరిసే ఆకుపచ్చ, నీలం రంగులు నీకు కావాలి.

అప్పు (బిగ్గరగా నవ్వుతూ): అస్సలు కాదు! నాకు నా బూడిద రంగు చాలా ఇష్టం. అది మెరుస్తూ ఉండకపోవచ్చు, వేటగాళ్ల నుండి దాక్కోటానికి అది సహాయపడుతుంది.

కోతి పైకి, కిందికి దూకసాగింది.



కోతి: అయితే నీ కష్టాన్ని మరిచిపో! మాతో రా! చెరకు గడలు తినబోతున్నాం.

అప్పు (అయిష్టంగా): లేదు! నాకు ఏమీ తినాలని లేదు. నేను చాలా లావుగా ఉన్నాను!



అప్పు ఏడవడం మొదలుపెట్టింది.


జింక: అదేనా నీ సమస్య? కానీ నువ్వు అస్సలు లావుగా లేవు! ఏనుగు శరీరం ఎంత పెద్దదిగా, బలంగా ఉండాలో అంతే ఉన్నావు నువ్వు!

అప్పు (నవ్వడానికి ప్రయత్నిస్తూ): లావుగా లేనా? మూడు రోజులుగా ఒక్క ముక్క కూడా తినలేదు! కానీ కొంచెం బరువు కూడా తగ్గలేదు!

అకస్మాత్తుగా వాటికి ఒక అరుపు వినిపించింది. "సహాయం చేయండి! నాకు సహాయం చేయండి!" అప్పును వదిలి ఆ శబ్దం వైపు జంతువులు పరిగెత్తాయి. అక్కడ ఒక నక్క ఏడుస్తోంది! అది ఒక చెట్టు కింద చిక్కుకుపోయింది!

నక్క: అమ్మో... అబ్బా...!! నాకు సహాయం చేయండి!

చెట్టును నెట్టడానికి కోతి, నెమలి, జింక ప్రయత్నించాయి. కానీ అవి ఒక్క కొమ్మను కూడా కదలించలేకపోయాయి!



అన్నీ: పాపం నక్క! ఏదో ఒక విధంగా దీన్ని రక్షించాలి!

అవి అప్పు దగ్గరకి పరిగెత్తుకుంటూ వెళ్లి నక్క చిక్కుకున్న చోటుకి తీసుకుని వచ్చాయి.

అప్పు (దాని తొండం ఊపుతూ): మీరందరూ పక్కకి జరగండి! నన్ను ప్రయత్నించనివ్వండి!


అప్పు తన తొండంతో చెట్టును పక్కకి లాగేసింది.

అందరూ: యే! బాగా చేశావు! చూడు, అప్పూ! నువ్వే మాత్రమే నక్కను కాపాడగలిగావు!

కోతి: ఇప్పుడు, నీకు అర్థమైందా? నువ్వు పెద్దగా ఉండటం వల్లే అడవిలో అత్యంత బలవంతమైన జంతువువి అయ్యావు!

అప్పు (ఘీంకరిస్తూ): అవును! అవును! ఇప్పుడు, తినడానికి వెళదాం. ఈ పని వల్ల నాకు బాగా ఆకలి వేస్తోంది!

పారో ఆనంద్ రాసిన కథ ఆధారంగా



© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

మా నాయకుడు




ఒకప్పుడు దట్టమైన అడవి ఉండేది. అక్కడ చాలా జంతువులు కలిసి నివసించేవి. వాటి నాయకుడు సింహం.

అన్ని జంతువులు సింహాన్ని గౌరవించేవి. వాటికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాని సలహా కోసం వచ్చేవి. ప్రతి సమస్యను సింహం తెలివిగా పరిష్కరించేది. దాని నిర్ణయాలను ఇష్టపూర్వకంగా అంగీకరించేవి.

ఒక రోజు వేటగాళ్ల గుంపు అడవిలోకి ప్రవేశించింది. జంతువులన్నీ భయపడిపోయాయి! అవి సింహం వద్దకు పరిగెత్తాయి. "వేటగాళ్లు వస్తున్నారు! వేటగాళ్లు వస్తున్నారు!" అని దానికి చెప్పాయి.

సింహం తన గుహ నుండి బయటకు వచ్చి, "ఇక్కడే ఉండండి. ప్రశాంతంగా ఉండండి. నేను వేటగాళ్లతో పోరాడి వాళ్లని తరిమివేస్తాను," అని చెప్పింది.

కొంతసేపటికి వేటగాళ్లను సింహం కనుగొంది. అది గర్జిస్తూ వాళ్లపైకి దూకింది. వేటగాళ్లలో కొందరు పరిగెత్తారు. కానీ, పోరాడటానికి కొందరు ఉండిపోయారు.



వాళ్లు సింహాన్ని గాయపరిచారు! కానీ తన దాడిని సింహం ఆపలేదు. చివరకు, అది వేటగాళ్లను ఓడించింది. వాళ్లు వీలైనంత వేగంగా అడవి నుండి పారిపోయారు.

సింహానికి కృతజ్ఞతలు చెప్పడానికి అన్ని జంతువులు పరిగెత్తాయి. కానీ ఇది ఏమిటి? సింహం నొప్పితో వణుకుతోంది. దాని కాళ్లు విరిగిపోయాయి! తిరిగి తన గుహకు చేరుకోవడానికి దానికి జంతువులు సహాయం చేశాయి. సింహానికి తగ్గిపోతుందని అవి ఆత్రుతగా ఎదురు చూశాయి.

చాలా రోజులు గడిచాయి. కానీ సింహం కాళ్లు నయం కాలేదు. దాంతో జంతువులు దానికి చక్రాల కుర్చీని తెచ్చాయి. ఆ కుర్చీలో కూర్చుని నెమ్మదిగా అడవి అంతా సింహం తిరుగుతోంది. ప్రతి రోజూ దానికి ఆహారం తెచ్చి, దాని బాగోగులను జంతువులు చూసుకునేవి.

దీనితో కొంతకాలానికి కొన్ని జంతువులు విసిగిపోయాయి. అవి సింహానికి ఆహారం తీసుకురావడం మానేశాయి. సహాయం, సలహాలు అడగడం కూడా మానేశాయి.




కానీ చాలా జంతువులు సింహం పట్ల విశ్వాసంతో ఉన్నాయి. వాటిని చూడటానికి సింహం ఎప్పుడూ ఆసక్తిగా ఉండేది. అడవి వార్తలను అది ఆసక్తిగా వినేది, వాటి సమస్యలను పరిష్కరించేది. తనకి చేతనైన విధంగా వాటికి సహాయపడేది.

ఒక రోజు అడవి చాలా నిశ్శబ్దంగా అనిపించింది. సింహం ఒంటరిగా కూర్చుని ఉంది. కొంతసేపటికి ఇతర జంతువులను వెతుకుతూ అది బయలుదేరింది. అది తన చక్రాల కుర్చీలో అడవి గుండా మెల్లగా వెళుతోంది.

కాసేపటికి జంతువులు అన్నీ దానికి కనిపించాయి. అవన్నీ ఒకే చోట సమావేశం అయ్యాయి. వాటి చర్చను సింహం జాగ్రత్తగా విన్నది.

"మనం కొత్త నాయకుడిని ఎన్నుకోవాల్సిన సమయం వచ్చింది!" అని ఒక జంతువు చెప్పింది! "లేదు, లేదు!" అని మరొక జంతువు అంది.

"మన సమస్యలను సింహం ఎల్లప్పుడూ పరిష్కరిస్తుంది," అని మరొకటి అంది.



"కానీ గతంలో ఉన్నంత బలం ఇప్పుడు దానికి లేదు! మనల్ని ప్రమాదం నుండి అది ఎలా కాపాడుతుంది?" అని ఇంకొకటి అంది.

"సింహం శరీరం బలహీనంగా ఉంది. కానీ దాని మనస్సు ఇప్పటికీ బలంగా ఉంది. అడవి పద్ధతులలో దానికి చాలా అనుభవం ఉంది. కాబట్టి కష్ట సమయాల్లో ఇప్పటికీ అది మనకి ఉపయోగపడుతుంది," ఒక ముసలి జంతువు చెప్పింది.


జంతువులు కొంతసేపు ఆలోచించాయి. తరవాత, సింహాన్ని తమ నాయకుడిగా ఉంచుకోవాలని అవన్నీ నిర్ణయించాయి.

ఈ చర్చను అంతా సింహం విన్నది. ఇప్పుడు అది తన గుహకు తిరిగి వచ్చింది. తన చక్రాల కుర్చీలో మౌనంగా కూర్చుని, వేచి ఉంది.

కాసేపటికి ఎవరో ఒక సమస్యతో వచ్చారు. దానికి మంచి పరిష్కారాన్ని సింహం కనుగొంది. తరవాత, రెండు కుందేళ్లు తమ మధ్య గొడవ గురించి చెప్పాయి. దానిని కూడా సింహం తేలికగా పరిష్కరించింది. కొద్దిసేపటి తరవాత మరొకరు ఆహారం తెచ్చారు.

ఆ రోజు సాధారణ రోజుగా మారింది. అడవిలో సామరస్యత వెల్లివిరిసింది.

విద్యా సాగర్ (చెన్నై) బడి పిల్లల నాటకం ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


తామర కోపంగా ఎందుకు ఉంది?

'అన్ని తేనెటీగలు ఎక్కడికి వెళతాయి? ఈ రోజు వాటిని అనుసరించి కనుగొంటాను!' ఉత్సుకతతో బజ్‌జ్‌మంటూ, ఒక చిన్న తేనెటీగ తుట్టె నుండి బయలుదేరింది.

వెంటనే ఆ చిన్న తేనెటీగ ఒక తామర చెరువు వద్దకు వచ్చింది. అక్కడ అది ఒక అందమైన తామర పువ్వును చూసింది. ఒక్కసారిగా దాని మీదకు దూకింది. తామర వణికిపోయింది. పువ్వు నుండి ఒక రేకు విడిపోయింది. దాంతో తామరకు కోపం వచ్చింది. "నీకు తేనె ఇవ్వను! వెళ్లిపో!" అని అది అంది.

'తామరకు కోపం ఎందుకు వచ్చింది?' అని ఆ చిన్న తేనెటీగ ఆశ్చర్యపోయింది. అది వీలైనంత వేగంగా ఎగిరిపోయింది.

చిన్న తేనెటీగ ఒక చెట్టు కొమ్మపై వాలింది. ఆకుల గుండా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. సూర్య కిరణాలను చూసి తేనెటీగ ఇలా అంది,





అందమైన తామర

నాకు తేనె ఇవ్వలేదు.

ఓ, ప్రకాశవంతమైన సూర్య కిరణాలు,

దాని మనసు మార్చగలరా?



"చింతించకు! తామరపై ప్రకాశించి దానిని సంతోషపరుస్తాం," అన్నాయి సూర్య కిరణాలు. తామర పువ్వుపై బంగారు కిరణాలు ప్రకాశించాయి. అది తన రేకులను విప్పింది.

కానీ అది ఆ చిన్న తేనెటీగకు తేనె ఇవ్వలేదు!



అయ్యో! ఆ చిన్న తేనెటీగ కొద్దిసేపు తామర దగ్గర తిరుగుతూనే ఉంది. తరవాత అది విచారంగా ఎగిరిపోయింది.

ఇప్పుడు చెరువు మీదుగా పిల్ల గాలి వీచసాగింది.
ఆ చిన్న తేనెటీగ దానితో ఇలా అంది,

అందమైన తామర


నాకు తేనె ఇవ్వలేదు.

ఓ, సున్నితమైన పిల్ల గాలి,

దాని మనసు మార్చగలవా?

"చింతించకు! తామరపై వీచి దానిని తాజాగా, చల్లగా అనిపించేలా చేస్తాను," అని గాలి సమాధానం ఇచ్చింది.

పువ్వుపై సున్నితంగా గాలి వీచింది. తామర ఆనందంతో తన రేకులను ఊపింది. కానీ అది ఆ చిన్న తేనెటీగకు తేనె ఇవ్వలేదు!



పాపం చిన్న తేనెటీగ! 'తామర కోపాన్ని తగ్గించడానికి ఏం చేయాలి?' అని అనుకుంది. అప్పుడే కొన్ని మేఘాలు ఆకాశంలో కదిలాయి.

తేనెటీగ వాటి నీడలను చూసి పైకి చూసింది. అది ఇలా అంది,

అందమైన తామర
నాకు తేనె ఇవ్వలేదు.
ఓ, నల్లటి వర్షపు మేఘాల్లారా,
దాని మనసు మార్చగలరా?



"చింతించకు. తామర మీద వర్షం కురిపించి దానికి చక్కగా స్నానం చేయిస్తాం," అని మేఘాలు అన్నాయి. చెరువుపై మెల్లగా వర్షం కురిసింది. మొక్కలన్నీ సంతోషించాయి, తాజాగా అయ్యాయి. వర్షపు చినుకులలో తామర స్నానం చేసింది. దానికి కూడా తాజాగా అనిపించింది.

కానీ అది చిన్న తేనెటీగకు తేనె ఇవ్వలేదు!

చిన్న తేనెటీగ చాలా అలసిపోయింది! అది విచారంగా, నిశ్శబ్దంగా తిరుగుతోంది. కాసేపటికి, చెట్టు కొమ్మపై నిద్రపోతున్న గుడ్లగూబని చూసింది.

అది గుడ్లగూబతో,

అందమైన తామర

నాకు తేనె ఇవ్వలేదు.

ఓ, తెలివైన, అందమైన గుడ్లగూబా,


దాని మనసు మార్చగలవా?

"దగ్గరకి రా, నీకు ఒక రహస్యం చెబుతాను" అని చిన్న తేనెటీగతో గుడ్లగూబ చెప్పింది. గుడ్లగూబ దగ్గరకు చిన్న తేనెటీగ ఎగిరింది. చిన్న తేనెటీగ చెవిలో గుడ్లగూబ గుసగుసలాడింది. గుడ్లగూబ చెప్పింది ఇంకెవరూ వినలేదు!

ఇప్పుడు చిన్న తేనెటీగ ఆశతో చెరువు వైపు తిరిగి ఎగిరింది. చాలా, చాలా మెల్లగా అది తామర పువ్వు మీద వాలింది. "నాకు కొంచెం తేనె ఇస్తావా?" అని చాలా మర్యాదగా అడిగింది.

దాంతో తామర కోపం తగ్గిపోయింది. అది చిన్న తేనెటీగను స్వాగతించింది. "నీకు ఎంత కావాలంటే అంత తీసుకో!" అని అది చెప్పింది.

చిన్న తేనెటీగ ప్రపంచంలోని గొప్ప రహస్యాన్ని నేర్చుకుంది!



P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

67 గాంధీ తాత

అక్టోబర్ 2వ తేదీ గాంధీజీ పుట్టినరోజు. నేను, నా తమ్ముడు ఆయనకు "పుట్టినరోజు శుభాకాంక్షలు!" చెప్పి, దండలు ఇవ్వడానికి వెళ్లాం. ఆశ్రమం కిక్కిరిసి ఉంది. అందరూ ఖాదీ బట్టలు వేసుకుని ఉన్నారు. టోపీలు కూడా ఖాదీతో చేసినవే!

మేం గాంధీజీ దగ్గరికి వెళ్లి ఆయనకు దండలు వేశాం. గాంధీజీ నవ్వారు. "ఈసారి నాకు నిజంగా మంచి బహుమతి తెస్తారా?" అని అడిగారు.

"మీకు ఏ బహుమతి కావాలి? చెప్పండి తాతా!"



"మీ చేతులతో వడికిన నూలు దండను నాకు తెస్తారా?" అని నవ్వుతూ అడిగారు.


"కానీ చరఖాతో నూలు వడకడం మాకు రాదు!" అన్నాడు తమ్ముడు. "మీకు నేర్పించమని మీ అమ్మానాన్నలను అడగండి," అని గాంధీజీ సమాధానం ఇచ్చారు.

ఇంటికి వెళ్లే దారిలో, "మనం నూలు వడకడం నేర్చుకోవాలని గాంధీ తాతా ఎందుకు కోరుకుంటున్నారు?" తమ్ముడు నన్ను అడిగాడు.

నాకు చేతనైనంత బాగా గాంధీజీ ఆలోచనను వివరించాను. "ఖాదీ వస్త్రం నేయడం వల్ల గ్రామాల లోని కుటుంబాలకు ఆదాయం లభిస్తుంది. మనం విదేశాల నుండి బట్టలు కొంటే, వాళ్లకి పని తక్కువగా ఉంటుంది. అందుకే గాంధీ తాత మనల్ని నూలు వడికి, ఖాదీ బట్టలు వేసుకొమ్మని కోరుకుంటున్నారు."

ఇంటికి చేరుకున్న తరవాత మా ఆశ్రమ సందర్శన గురించి అమ్మకు చెప్పాం. గాంధీజీ, స్వాతంత్ర్య పోరాటం గురించి ఆమె కొంచెం వివరించింది. "బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం గాంధీజీ పోరాడుతున్నారు. ఈ ప్రయత్నంలో ఖాదీ ఒక ముఖ్యమైన భాగం," ఆమె చెప్పింది.

ఆ రోజే మేం చరఖాను ఉపయోగించడం ప్రారంభించాం.



రైలులో గాంధీజీ భారత దేశం అంతటా ప్రయాణించేవారు. ఒకసారి మదురైకి రైలులో వెళ్లారు. ఆయన చాలా మందితో మాట్లాడి ఖాదీని ఉపయోగించమని కోరారు. "ఖాదీ చాలా ఖరీదైనది. పేదవాళ్లం దానిని కొనలేం," అని వాళ్లు చెప్పారు. ఆ సమాధానం ఆయనను బాధపెట్టింది.

మదురైలో, చాలా మంది రైతులు గోచీ మాత్రమే కట్టుకుని పొలాల్లో పని చేయటం గాంధీజీ చూశారు. వాళ్ల పేదరికం చూసి ఆయన బాధపడ్డారు.

ఒక రోజు ఆయన నదిలో స్నానం చేయడానికి వెళ్లాడు. ఒక స్త్రీ, ఆమె బిడ్డ అక్కడ ఉన్నారు. ఆ స్త్రీ తన చీరలో సగం నదిలో ఉతుకుతోంది. మిగిలిన సగం ఆమె శరీరం చుట్టూ ఉంది. ఆమె దగ్గర ఒకే ఒక్క చీర ఉంది! అది కూడా చిరిగిపోయి ఉంది!



ఆ స్త్రీ పేదరికం గాంధీజీని తీవ్రంగా బాధించింది. తన శాలువాను ఆమెకు ఇచ్చాడు. తన వద్ద ఉన్న బట్టల గురించి ఆలోచించాడు.

'దేశంలో చాలా మంది పేదలు ఉండగా, నేను రకరకాల చొక్కాలు ఎలా వేసుకోగలను? అది సరైనది కాదు.'

అతని మనసులో తుఫాను చెలరేగింది. 1921 సెప్టెంబర్ 22న ఎప్పుడూ వేసుకునే తన దుస్తులను వదిలివేసి సాధారణ తెల్లటి కురచ పంచె మాత్రమే కట్టుకోసాగారు.

ఒకసారి ఒక చిన్న పిల్లవాడు సబర్మతి ఆశ్రమంలో గాంధీజీని చూడటానికి వచ్చాడు. "తాతా, మీరు చొక్కా ఎందుకు వేసుకో లేదు? మీ కోసం ఒకటి కుట్టమని మా అమ్మని అడగనా?" అని అడిగాడు.

గాంధీజీ నవ్వి, "మీ అమ్మ నాకు ఎన్ని చొక్కాలు కుట్టగలదు?" అని అడిగారు.

"తాతా, మీకు ఎన్ని చొక్కాలు కావాలో చెప్పు. మీ కోసం కుట్టమని అమ్మని అడుగుతాను."

"నాకు నలభై కోట్ల తమ్ముళ్లు, చెల్లెళ్లు ఉన్నారు," అని గాంధీజీ అన్నారు. "వాళ్లు చొక్కాలు లేకుండా ఉండగా, నేను చొక్కా ఎలా వేసుకోగలను?" అని ఆయన ఆప్యాయంగా అడిగారు.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

68 నీటి బిందువు ప్రయాణం



ఒకసారి ఒక మట్టి కుండ ఎండలో కూర్చుంది. దాని నిండా నీళ్లు ఉన్నాయి. ఒక బిందువు ఉపరితలంపైకి తేలింది.

ఆ బిందువుని సూర్యకిరణాలు తాకాయి. కాంతి వైపు పైకి లేవడానికి అది ప్రయత్నించింది. కుండ అంచు వెంట పాకుతూ, అది పైకి లేచింది!




ఒక్క క్షణం, ఆ బిందువు భయపడింది. అప్పుడు అది సూర్యుడిని చూసింది! నీటి ఆవిరిగా అది ఆనందంగా ఆకాశంలోకి లేచింది.

ఆ బిందువు ఆవిరిగా పైకి తేలుతూ, తరవాత కొన్ని తెల్లటి మేఘాల మధ్య ఘనీభవించింది. అది ఇతర బిందువుల వైపు చూసింది. అవన్నీ అదే విధంగా ఆకాశంలోకి లేచాయి. సూర్యుడిని ఎలా చేరుకోవాలి అని దగ్గరలో ఉన్న బిందువులను అడిగింది. కానీ ఎవరికీ తెలియదు.

మేఘాల మధ్య చాలా రోజులు ఆ బిందువు తిరిగింది. అటూ, ఇటూ తేలియాడింది. ఒక రోజు ఒక కొత్త మేఘం వస్తుండటం అది చూసింది. ఈ మేఘం తెల్లగా లేదు. అది పెద్దదిగా, నల్లగా ఉంది. ఆ కొత్త మేఘం మీదకి బిందువు దూకింది.





ఆ రాత్రి ఆ నల్లటి మేఘం అశాంతితో ఉంది. అది మెలికలు తిరిగింది. ఉరుములతో వణికిపోయింది. తప్పు ప్రదేశానికి వచ్చానని ఆ బిందువు గ్రహించింది.

పైకి లేచిన గాలి ఆ బిందువును మేఘం నుండి ఎగరేసింది. వర్షపు చినుకుల ప్రవాహం మధ్య అది పడిపోయింది. మెరుపులు మెరిశాయి! ప్రవహిస్తున్న వాగులో వర్షపు చినుకులు పడ్డాయి.

నీటి అలలను ఆ బిందువు అనుభూతి చెందింది. అకస్మాత్తుగా అది పర్వతం అంచు నుంచి విసిరివేయబడింది! పర్వతం అంచు నుంచి ఆ ప్రవాహం కిందకి జారింది. అది బండరాళ్ల మధ్య వేగంగా ప్రవహించింది. తెల్లటి నీటి తుంపరలు గాలిలోకి చిమ్మాయి! వాగు ప్రవహిస్తూనే ఉంది.



ఆ ప్రవాహం ఎక్కడికి వెళుతోందని దగ్గరలో ఉన్న ఇతర బిందువులను ఆ బిందువు అడిగింది. "పెద్ద నదిలో చేరడానికి అది పరిగెడుతోంది," అని అవి అన్నాయి.


అదిగో పెద్ద నది. అది విశాలంగా, నిండుగా ఉంది. రెండు ఒడ్డుల మీదా చెట్లు నీటిపైకి వంగి ఉన్నాయి. ఆకుల మధ్య సూర్యకాంతి మెరుస్తోంది.

ఆ నీటి బిందువు ఆనందంగా చూసింది. నీటి ప్రవాహాన్ని అది ఆస్వాదించింది. ఆ ప్రయాణం దానికి ఎంతో బాగుంది! కానీ ఆ ప్రయాణం ఎక్కువ కాలం ఉండదని కూడా దానికి తెలుసు.


ఇప్పుడు, సముద్రంలోకి నది ప్రవహించింది. ఆ బిందువును సముద్ర జలాలు చుట్టుముట్టాయి.

అలల కింద నుండి, ఆకాశం వైపు ఆ బిందువు చూసింది. అక్కడ తెల్లటి మేఘాలు తేలుతున్నాయి. మట్టి కుండ నుండి ఆ తెల్లటి మేఘాలను చేరిన విధానాన్ని ఆ బిందువు గుర్తుచేసుకుంది. ఇప్పుడు, అది సూర్యుడిని చూసింది.

ఇప్పుడు ఏం చేయాలో ఆ బిందువుకి తెలిసింది. అది నీటి ఉపరితలంపైకి చేరుకుంది. పైకి చూస్తూ, వెచ్చని సూర్యకాంతిని అనుభవించింది. మళ్లీ, అది నీటి ఆవిరిలా ఆకాశంలోకి లేచింది.







ఇప్పుడు అది సూర్యుడిని ఉత్సాహంగా చూసింది. రాత్రి అయినప్పుడు, నక్షత్రాల కాంతిలో ఓలలాడింది.

ఒక రోజు ఆ బిందువు భూమి వైపు చూసింది. అది పుట్టిన సముద్రాన్ని చూసింది. అది నదిని, ఉరకలెత్తుతున్న వాగుని చూసింది. అది దాటిన ప్రతి ప్రదేశం దాని ముందు మెరుస్తూ ఉంది.

ఆ బిందువు చుట్టూ చిన్న మేఘాలు గుమిగూడసాగాయి. అది పైకి లేచి ఆకాశంలో ఎత్తైన ప్రదేశానికి చేరుకుంది.

అప్పుడు అది పొగమంచుగా కరిగిపోయింది. పొగమంచు వ్యాపించి చుట్టుపక్కల గాలిలో కలిసిపోయింది.

క్రిస్టోఫర్ ఇ. జోన్స్ రాసిన "ఒక నీటి చుక్క" కథ ఆధారంగా

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh


L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

69

సూర్యుడితో ఆడుకున్న పిల్లవాడు










హనుమంతుడు చిన్నప్పుడు చాలా కొంటె కోతి. అతను దేనినైనా ఆటగా చేసేవాడు! అమ్మ అంజన అతన్ని అస్సలు నియంత్రించలేకపోయేది.

ఒకసారి తన ముఖం మీద సూర్యకిరణాలు పడటం హనుమంతుడు గమనించాడు. అతను ఆకాశం వైపు చూశాడు. అక్కడ సూర్యుడు ఉన్నాడు! అది పెద్ద ఎర్రటి పండులాగా ఉంది. దానిని పట్టుకోటానికి పైకి, పైకి, ఇంకా పైకి ఎగిరాడు. "నేను నిన్ను తినబోతున్నాను!" అని అతను అన్నాడు.




సూర్యుడికి అది నచ్చలేదు. తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. కానీ హనుమంతుడు అతడిని ఆకాశం అంతటా వెంబడించాడు. పగలు రాత్రిగా మారింది, రాత్రి పగలుగా మారింది. వెంబడించడం కొనసాగింది. హనుమంతుడికి ఎంత మంచి ఆట!

తనకి సహాయం అవసరమని సూర్యుడికి తెలుసు. ఇంద్రుడిని పిలిచాడు. జరుగుతున్నది చూసి ఇంద్రుడికి చాలా కోపం వచ్చింది. మెరుపుతో హనుమంతుడి మీద దాడి చేశాడు! హనుమంతుడి ఊపిరి ఆగిపోయింది. అతను కింద పడసాగాడు.

హనుమంతుని తండ్రి అయిన వాయు, అతన్ని గాలిలో పట్టుకున్నాడు. "చిన్న పిల్లవాడిని ఇంతలా ఎలా కొట్టావు?" ఇంద్రుడిపై మండిపడ్డాడు.

గాలి దేవుడు అయిన వాయు లోతైన శ్వాస తీసుకుని ప్రపంచంలోని గాలినంతా పీల్చుకున్నాడు. దాంతో తుఫానులు, ప్రచండ గాలులు, సుడిగాలులు భూమిని చుట్టుముట్టాయి. పర్వతాలు కూడా ఊగసాగాయి! ప్రజలంతా భయపడి, పరిగెత్తసాగారు.

అప్పుడు, "నా కొడుకుకు శ్వాసను తిరిగి ఇవ్వు, నేను గాలిని ప్రపంచానికి తిరిగి ఇస్తాను," అన్నాడు వాయుదేవుడు.



హనుమంతుడిని పాతాళ లోకంలోకి తీసుకుని వెళ్లి వేచి ఉన్నాడు.

గాలులు ఆగిపోయాయి. చెట్లు, పువ్వులు, పొదలు, తీగలు, ప్రజలు, జంతువులు- అన్ని జీవులు ఊపిరాడక కొట్టుకుంటున్నాయి.

కాసేపటికి ఎక్కడా శబ్దం లేదు. గాలి లేకపోవటంతో భూమి మీద జీవం చనిపోతోంది.

దేవతలు భయాందోళన చెందసాగారు. "ఇంద్రుడిని క్షమించు," అని వేడుకుంటూ, హనుమంతునికి తిరిగి ప్రాణం పోశారు.


హనుమంతుడు క్షేమంగా ఉండటానికి వరాలు కూడా ఇచ్చారు:

"ఉరుములు, మెరుపులు నీకు ఎలాంటి హాని కలిగించవు!"

"కావాలనుకున్న చోటుకి నువ్వు ఎగరగలుగుతావు!"

"నీ ఆకారాన్ని, పరిమాణాన్ని నీ ఇష్టానుసారంగా మార్చుకోవచ్చు!"

ఆ విధంగా హనుమంతుడికి ప్రత్యేక శక్తులను ఇచ్చి, దేవతలు ఆశీర్వదించారు.





కానీ వాయుదేవుడు సంతృప్తి చెందలేదు. "ఈ ప్రత్యేక శక్తులను ఎలా ఉపయోగించుకోవాలో నా కొడుకుకి తెలుస్తుందా? తెలివితేటలు లేకుండా అవి పనికిరావు," అని దేవతలతో వాయు అన్నాడు.

"చింతించకండి! హనుమంతుడు తన జ్ఞానానికి, బలానికి ప్రసిద్ధి చెందుతాడు!" అని దేవతలు అన్నారు.

చివరికి వాయుదేవుడు గాలిని బయటకు వదిలాడు. తేలికపాటి గాలులు వీచసాగాయి. భూమి అంతటా ప్రజలు, జంతువులు, మొక్కలు తిరిగి జీవం పోసుకున్నాయి.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi **Telugu** K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi **Artist** Uma Krishnaswamy


మూడు ఈకలు


ఒక రోజు ఒక రుషి, "ఈ రోజు నువ్వు అడవికి వెళ్లి మూలికలు సేకరించాలి. ఈ మూడు ఈకలను నీతో తీసుకుని వెళ్లు. అవి నిన్ను ప్రమాదం నుండి కాపాడతాయి," అని తన శిష్యుడికి చెప్పి, మూడు ఈకలను ఇచ్చాడు.

మూలికలు సేకరిస్తూ అడవిలో తిరుగుతూ ఉన్నాడు శిష్యుడు. కొన్ని గంటల తరవాత అతనికి బాగా అలసిపోయినట్లు అనిపించింది. కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నాడు. ఉన్నట్టుండి, "అబ్బాయి! నాతో ఇంటికి రా. నీకు మంచి విందు వడ్డిస్తాను. తరవాత కావలసినంత సేపు విశ్రాంతి తీసుకోవచ్చు," అంటూ ఒక వృద్ధురాలి మాటలు వినిపించాయి. అతనిని చూసి ఆమె తియ్యగా నవ్వింది.

ఆ బాలుడిని ఒక పెద్ద భవనానికి వృద్ధురాలు తీసుకుని వెళ్లింది. దాని గోపురాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'అడవిలో ఇన్ని అద్భుతాలు ఉన్నాయని నాకు తెలియదు!' అనుకున్నాడు బాలుడు. ఆమెను అనుసరించి అతను లోపలికి వెళ్లాడు. అంతలోనే, "హా హ హ!" అంటూ వృద్ధురాలి స్థానంలో ఒక భయంకరమైన మాంత్రికుడు నిలబడ్డాడు!

"నీ కోసం భోజనమా? కాదు, నాకు రుచికరమైన విందు!" అంటూ మాంత్రికుడు నవ్వాడు. శిష్యుడు వణికిపోయాడు. తప్పించుకోవడానికి ఏదైనా దారి ఉందా?





అప్పుడు, అతనికి ఆ మూడు ఈకలు గుర్తుకు వచ్చాయి. అతను ఒక పథకం వేశాడు. "ఇప్పుడు నన్ను తినవద్దు, నేను మురికిగా ఉన్నాను. ముందు నన్ను స్నానం చేయనివ్వు. తరవాత నీ దగ్గరకు శుభ్రంగా, మంచి వాసనతో తిరిగి వస్తాను!" అని మాంత్రికుడితో అన్నాడు.

స్నానాల గదిలో శిష్యుడు ఒక ఈకను నేలపైకి విసిరి, "మాంత్రికుడు పిలిచినప్పుడల్లా, నేనే అన్నట్లు సమాధానం చెప్పు," అని అన్నాడు. తరవాత అతను కిటికీలోంచి దూకి వీలైనంత వేగంగా పారిపోయాడు.

తొందరగా రమ్మని శిష్యుడిని మాంత్రికుడు పిలిచాడు. "వస్తున్నాను!" అని సమాధానం వచ్చింది, కానీ శిష్యుడు స్నానాల గది నుండి బయటకు రాలేదు!

మాంత్రికుడు మళ్లీ పిలిచినప్పుడు, అదే సమాధానం వచ్చింది. కానీ మళ్లీ శిష్యుడు బయటకు రాలేదు! ఆకలితో ఉన్న మాంత్రికుడు ఇక వేచి ఉండలేకపోయాడు. తన మాంత్రిక శక్తులతో తలుపు పగలగొట్టాడు. స్నానాల గదిలో ఎవరూ లేరు! మాంత్రికుడు కోపంతో ఊగిపోయాడు. "నిన్ను పట్టుకుంటాను!" అని అరుస్తూ అతను భవనం నుండి బయటకు పరిగెత్తాడు.

తన వెనక మాంత్రికుడు రావటం శిష్యుడు విన్నాడు. అతను మరొక ఈకను పట్టుకుని, "నాకు, మాంత్రికుడికి మధ్య నదిని సృష్టించు!" అని అన్నాడు. వెంటనే అక్కడ ఒక నది ఉప్పొంగి, మాంత్రికుడు కొట్టుకునిపోయేలా చేసింది! 'నేను తప్పించుకున్నాను!' అని శిష్యుడు నిట్టూర్చాడు.

కానీ అంతలోనే, "గ్లగ్, గ్లగ్," అంటూ నీటి శబ్దం వచ్చింది. వెనక్కి తిరిగి చూసిన శిష్యుడికి ఒక భయంకరమైన దృశ్యం కనపడింది! మాంత్రికుడు తన నోరు వెడల్పుగా తెరిచి నదిని తాగేస్తున్నాడు! నీరు అతని నోటిలోకి వేగంగా వెళ్లిపోతోంది.

శిష్యుడు మూడవ ఈకను తీసుకున్నాడు. "నా వెనక బడబాలనం సృష్టించు," అని అతను ఆదేశించాడు. వెంటనే ఒక పెద్ద మంట లేచింది. కానీ మళ్లీ మాంత్రికుడు తన నోరు వెడల్పుగా తెరిచాడు. ఊష్! అతను మింగిన నీళ్లన్నీ బయటకు వచ్చాయి. స్‌స్‌స్‌మంటూ మంట ఆరిపోయింది.



చెట్ల గుండా ఆవిరి మేఘాలు పైకిలేచాయి. అవి సుడులు తిరుగుతూ మాయమయ్యాయి.

పాపం శిష్యుడు! ఇప్పుడు పరిగెత్తడం తప్ప అతను చేయగలిగింది ఏమీ లేదు. తల వంచి గాలిలాగా పరిగెత్తాడు. ఎలాగైతేనేం అతను రుషి ఇంటికి చేరుకున్నాడు.

మాంత్రికుడు అతని వెనకే ఉన్నాడు. అతను తలుపు దగ్గర ఆగి, "నీ శిష్యుడిని ఇస్తావా? లేక నిన్ను తినమన్నావా?" అని రుషిని అడిగాడు.


"నీ వల్ల కాదు! నీ మంత్రానికి ప్రతిమంత్రాన్ని వేయగలను! ఒక పోటీ పెడదాం. నువ్వు గెలిస్తే, నా శిష్యుడిని తీసుకోవచ్చు," అని రుషి జవాబు ఇచ్చాడు.

"సరే. మొదలుపెట్టు," అని మాంత్రికుడు అన్నాడు.

"ఈ భవనం అంత ఎత్తు పెరగగలవా?" అని రుషి అడిగాడు. వెంటనే అంత ఎత్తు ఎదిగాడు మాంత్రికుడు. కానీ ఆ రుషిని అది అంతగా ఆకట్టుకోలేదు. "ఎవరైనా పెద్దగా అవుతారు. కానీ, నువ్వు బఠాణీ గింజంత అవ్వగలవా?" అని అతను అన్నాడు.

"అది చాలా తేలిక," అని వెంటనే బఠాణీ గింజంత మారిపోయాడు మాంత్రికుడు. ఆ రుషి దానిని నోటిలో వేసుకున్నాడు. పెద్ద చప్పుడు చేస్తూ, దానిని మింగేశాడు.

దాంతో ఆ దుష్ట మాంత్రికుడి కథ ముగిసింది!



జపనీస్ జానపద కథ ఆధారంగా

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy





71

పక్షుల గూళ్ళు

పక్షులు! తమ అద్భుతమైన రంగులతో మన కళ్లను అబ్బురపరుస్తాయి! తమ పాటలతో మనల్ని ఉత్సాహపరుస్తాయి! వాటి గూళ్లు ఎంతో అందంగా ఉంటాయి!

చాలా పక్షులు గూళ్లలో నివసించవు. ముఖ్యంగా పిల్లల కోసం వాటిని తయారు చేస్తాయి. అవి గూటిలో గుడ్లు పెట్టి, పొదుగుతాయి. అక్కడ పిల్లలకు ఆహారం ఇస్తాయి. పిల్లలు ఎగరగలిగేంత వరకు గూడులోనే ఉంటాయి. అప్పుడు మొత్తం కుటుంబం ఎగిరిపోతుంది.



కొన్ని పక్షులు ఒకసారి కట్టిన గూటిని మళ్లీ సంవత్సరం ఉపయోగిస్తాయి. కానీ కాకి లాగా చాలా పక్షులు ప్రతిసారీ కొత్త గూటిని కడతాయి. అందుకే ముక్కులలో పుల్లలతో కాకులు తరచు కనబడతాయి. భద్రత కోసం చెట్టుపై వీలైనంత ఎత్తులో, గిన్నె ఆకారపు గూళ్లను అవి కడతాయి.

అన్ని పక్షుల గూళ్లు గిన్నె ఆకారంలో ఉండవని మీకు తెలుసా? అనేక రకాల గూళ్లు ఉన్నాయి. కొన్ని కుట్టినవి, కొన్ని అల్లినవి. కొన్ని కేవలం నేలలో తవ్వినవి!



ఆకులపోతడు తన గూడును కుడుతుంది. రెండు వేలాడుతున్న ఆకులకు రంధ్రాలు చేసి, వాటిని నారతో కలిపి కుడుతుంది. చుట్టూ ఉన్న ఆకులతో ఈ గూడు కలిసిపోతుంది. దాని పక్క నుంచి నడిచినా మనకి అనుమానం రాదు!




గిజిగాడు తన గూడును ఎలా తయారు చేస్తుంది? ఒక కొమ్మ కొన వద్ద బలమైన ముడి వేస్తుంది. తరవాత అది మరిన్ని పీచులతో ఒక పెద్ద బంతిని అల్లుతుంది. పూర్తయిన గూడు తలకిందులుగా ఉన్న కుండలా కనిపిస్తుంది. దాని పొడవైన మెడ కిందకి వేలాడుతుంది, అందువల్ల వేటాడే జంతువులు లోపలికి వెళ్లలేవు.

వడ్రంగిపిట్ట, కొమ్ముకసిరి వంటి కొన్ని పక్షులు చెట్ల తొర్రలను గూళ్లుగా ఉపయోగిస్తాయి. కొమ్ముకసిరి! ఎప్పుడైనా దానిని చూశారా? దాని తలపై పెద్ద, నారింజ రంగు టోపీ, పొడవైన, నారింజ రంగు ముక్కు ఉంటాయి. అది ఎగిరినప్పుడు, దాని రెక్కలు పెద్ద శబ్దం చేస్తాయి. చూడటానికి ఎంతో బాగుంటుంది!





తల్లి కొమ్ముకసిరి గుడ్లు పెట్టడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, అది చెట్టు తొర్ర లోపలికి వెళుతుంది. గాలి, ఆహారం కోసం ఒక చిన్న కంత వదిలి మిగిలినదంతా తండ్రి పక్షి పూడ్చివేస్తుంది. లోపలే ఉంటూ పిల్లలను తల్లి పెంచుతుంది. కొంత కాలానికి ఆహారం తీసుకురావడంలో తండ్రికి సహాయం చేయడానికి తల్లి బయటకు వచ్చినప్పుడు, గూడులోని చెత్తను ఉపయోగించి గోడను పిల్లలు తిరిగి నిర్మిస్తాయి. ఏమి చేయాలో వాటికి ఎలాగో తెలుస్తుంది!

అన్ని పక్షులు తమ సొంత గూళ్లు తయారు చేసుకుంటాయా? లేదు, కోకిల లాగా కొన్ని పక్షులు ఇతర పక్షుల గూళ్లలో గుడ్లు పెడతాయి. కొన్ని నేలపై కూడా గుడ్లు పెడతాయి!



అన్నింటికంటే అద్భుతమైన పక్షులలో ఒకటైన లకుముకి పిట్ట నేలమీద గూడు కడుతుంది. లకుముకి పిట్ట చేపలు పడుతున్నప్పుడు చూశారా? కిందికి ఉన్న ఒక కొమ్మపై కూర్చుని, నీటిలోకి చూస్తూ ఉంటుంది. ఉన్నట్టుండి నీటిలోకి దూకి, మీరు, "ఒకటి, రెండు, మూడు!" అనే లోపు దాని ముక్కులో చేపతో కొమ్మపైకి తిరిగి వస్తుంది!






గుడ్లు పెట్టే సమయంలో లకుముకి పిట్ట చెరువు దగ్గర ఇసుకలో సొరంగం లాగా తవ్వుతుంది. గుడ్లు పెట్టిన తరవాత, వాటిని పొదగటంలో ఆడ పక్షికి మగ లకుముకి పిట్ట సహాయం చేస్తుంది. గుడ్లు పొదిగిన తరవాత తల్లిదండ్రులు ఇద్దరూ వంతులవారీగా పిల్లలకు ఆహారం తీసుకువస్తాయి. నాలుగు నెలలు ఈ విధంగా తల్లిదండ్రులు శ్రమిస్తాయి!

చాలా, చాలా ఆకర్షణీయమైన పక్షులు ఉన్నాయి. నిశ్శబ్దంగా ఉండి గమనిస్తే, వాటి గురించి మనం చాలా నేర్చుకోవచ్చు.

మీ దగ్గర ఏ పక్షులు నివసిస్తాయి?



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

72

నేను ఎవరు?



అనేక రకాలుగా వచ్చే పండుని
ఆకుపచ్చ, పసుపు, లేదా ఎరుపు, లావు లేదా సన్నం,
తక్షణ చిరుతిండి కోసం తొక్క తీయండి,
విటమిన్లతో నిండి తియ్యగా ఉంటాను.

ఆకుపచ్చ గోలీలు, అందమైన గాజు గోలీలు
తీగల మీద గుత్తులుగా వేలాడుతూ ఉంటాను!


మీ నాలుకను ఊదా రంగుకి మారుస్తాను
పళ్లను నీలం రంగులోకి మారుస్తాను!
చెట్టు మీద ముదురు నీలంలో మెరుస్తూ ఉంటాను
ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాను.



మందపాటి తోలు ఉన్న బంతిని
రసం నిండిన అరలు ఉంటాయి
వాటిని ఒక్కొక్కటిగా తినండి,
లేదా రెండు చెక్కలుగా కోసి
పోషకాల రసాన్ని పిండండి.

పిల్లలు వాటిని చెట్టు నుండి కోస్తారు
చిలుకలు వాటిని ఇష్టంగా తింటాయి
గట్టిగా ఉండే ఎన్నో విత్తనాలు
ఆకుపచ్చ లేదా పసుపు పచ్చరంగు, నా వాసన ఎంతో బాగు

పెద్ద బంతి లాగానూ, కోడి గుడ్డు ఆకారంలోనూ ఉంటాను
ఆకుపచ్చ, నల్లని రంగులలో ఉంటాను
సగానికి కోస్తే ఎర్రని ముఖంలో నల్ల మచ్చలు
సన్నని ముక్క తింటే వేసవిలో ఎంతో హాయి



అందమైన గుండ్రని పండుని
ఎరుపు, ఆకుపచ్చ రంగులలో ఉంటాను
కశ్మీర్, సిమ్లాలో పెరుగుతాను
లోపలి తెల్లటి కండ ఎంతో తియ్యన

పండిన పండు పుల్లగా ఉంటుంది
గుల్ల పగలగొట్టి, గింజ వేరు చెయ్యండి
గుజ్జు పిసికి వంటలో ఉపయోగించండి
ఇత్తడి పాత్రలను మెరిపించండి

ఎరుపు లేదా పసుపు పచ్చ పండ్ల గుత్తులు
ఎండినప్పుడు చర్మం ముడతలు, ముడతలు
నమిలి తింటే ఎంతో తియ్యన
మధ్యలో గట్టి గింజ, జాగ్రత్త అన్నా!

వెయ్యి ఆకుపచ్చ కళ్లపై కిరీటంలా తొడిమ
ముళ్ల లాంటి కవచం
జిగట పాలు, పీలికల మధ్య
స్వర్గాన్ని తలపించే తియ్యటి తొనలు!



ఆకుపచ్చ, మెత్తని అతుకుల తోలు
నల్లటి, పూసలను దాచిన
తెల్లటి, తియ్యటి గుజ్జు




ఎర్రటి పెట్టెలో
పసుపు పచ్చ గదులు
విలువైన రత్నాల పూసలు

ద్రాక్ష, నారింజ, సీతాఫలం, నల్ల నేరేడు, ఖర్జూరం,
పుచ్చకాయ, జామ, యాపిల్, పనస, చింతపండు,
అనాస, అరటి, దానిమ్మ



మీ వేలు ఆకారంలో
ఆకుపచ్చగా, పొడవుగా ఉంటాను
అడ్డంగా కోస్తే ఐదు గదుల ముత్యాల పెట్టె
వండితే రుచికరమైన కూరతో విందు అవుతాను

నారింజ రంగు
శంఖాకారం -
నేలలో పెరుగుతాను
మీ కంటి చూపును పెంచుతాను



గుండ్రంగా, ఆకుపచ్చగా ఉంటాను
ఆకులతో నిండి ఉంటాను
కోసి, ఉడకేసి కూర చేయండి
లేదా పచ్చిగా సలాడ్‌లా తినండి

ముళ్లు ఉండే కొమ్మలు
తెలుపు, ఆకుపచ్చ లేదా ఊదా రంగు కాయలు
కోడిగుడ్డు ఆకారం
కిరీటం లాంటి తొడిమ

నన్ను కోస్తే
మిమ్మల్ని ఏడిపిస్తాను




ఆకుపచ్చ మొక్కల మడి
కొన్ని ఆకులను కోసి, కడగండి
రుచికరమైన, ఆరోగ్యకరమైన కూర చేయండి
ఆకులు మళ్లీ పెరిగే వరకు వేచి ఉండండి



నక్షత్రాల లాంటి తెల్లని పువ్వులు
మెలితిరిగే సున్నితమైన తీగలు
పందిరి నుండి వేలాడే
పొడవైన, మెలికలు తిరిగే పాములు!

నా ఆకులు ఏనుగు చెవుల లాంటివి
నా దుంపలు కుండల లాంటివి
అవి మట్టిలో దాక్కుంటాయి
మట్టి రంగులో ఉంటాయి

పొడవాటి గదిలో
ఆకుపచ్చ పూసల బారు



ఆకుపచ్చగా, చాలా చేదుగా ఉంటాను
కానీ మందు బిళ్లని కాదు
పిల్లలు నా నుండి పారిపోతారు
కానీ ఆహారంగా నేను పరిపూర్ణం

నేల మీద పాకే తీగ, పసుపుపచ్చ పువ్వులు
పుచ్చకాయంత పెరుగుతాను
కానీ, బూడిద రంగులో ఉంటాను
రుచిగా లేకపోవచ్చు, కానీ మీ ఆరోగ్యానికి మంచిదానిని

పాలకూర, పొట్లకాయ, వంకాయ, బూడిద
గుమ్మడి, బెండకాయ, క్యాబేజీ, కంద, క్యారెట్,
ఉల్లిపాయ, బఠాణీలు, కాకరకాయ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

మాట్లాడని వక్త

ముల్లా నస్రుద్దీన్ తెలివైన వ్యక్తి. ఆయన మంచి వక్త కూడా. ప్రజలను నవ్వించగలడు, ఆలోచింపజేయగలడు.

ఒకసారి ఒక సమావేశంలో మాట్లాడమని ఆయనని అడిగారు. వెళ్లాలని ఆయనకి లేదు. ప్రజలతో కలవాలని లేదు. చివరకు, సమావేశానికి వెళ్లడానికి ఒప్పుకున్నాడు, కానీ మాట్లాడకుండా ఉండటానికి ఉపాయం ఆలోచించాడు.



ఆ రోజు రానే వచ్చింది. సమావేశ స్థలానికి ముల్లా వెళ్లాడు. ఆయన నిలబడి, "నేను ఏమి చెప్పబోతున్నానో మీ అందరికీ తెలుసా?" అని అడిగాడు.


"నాకు తెలియదు... నాకు తెలియదు," అని అక్కడి వాళ్లు అన్నారు. దాంతో ముల్లాకు కోపం వచ్చింది. "ఏమీ తెలియని వాళ్లతో మాట్లాడటానికి నేను సిద్ధంగా లేను!" అంటూ ఇంటికి బయలుదేరాడు.

శ్రోతలు కలవరపడ్డారు. వాళ్లలో కొందరు ముల్లా నస్రుద్దీన్ వెంట పరిగెత్తారు. "మమ్మల్ని క్షమించు!" అని వాళ్లు వేడుకున్నారు. తదుపరి సమావేశానికి అతన్ని ఆహ్వానించారు. వెళ్లడానికి ముల్లా ఒప్పుకున్నాడు.



ముల్లాకి కోపం తెప్పించకూడదని ప్రజలు అనుకున్నారు. వాళ్లంతా ఒక ఆలోచన చేశారు.

సమావేశం మొదలయ్యింది. మళ్లీ ముల్లా, "నేను ఏమి చెప్పబోతున్నానో మీకు తెలుసా?" అని అడిగాడు. ఈసారి అందరూ, "నాకు తెలుసు! నాకు తెలుసు!" అంటూ అరిచారు.



"మీకు ఇప్పటికే తెలిసిన దాని గురించి నేను ఎందుకు మాట్లాడాలి?" అని ముల్లా అడిగాడు. అలా అని అతను ఇంటికి వెళ్లిపోయాడు.

ఎంత నిరాశ! అక్కడ ఉన్న ప్రజలు ఈసారి ఏమి చేయాలో చర్చించుకున్నారు. "ముల్లాను అర్థం చేసుకున్నాం!" అని ఒకరితో ఒకరు చెప్పుకున్నారు. వాళ్లు ఒక కొత్త ప్రణాళిక వేసుకున్నారు.

తదుపరి సమావేశం ప్రారంభమైంది. "నేను ఏమి చెప్పబోతున్నానో మీకు తెలుసా?" అని ముల్లా అడిగాడు. సగం మంది ప్రజలు, "మాకు తెలుసు! మాకు తెలుసు!" అని అన్నారు. మిగిలిన సగం మంది, "మాకు తెలియదు! మాకు తెలియదు!" అన్నారు.

"సరే, అయితే! తెలియని వాళ్లకి తెలిసిన వాళ్లు చెప్పాలి!" అని చెప్పి ముల్లా నస్రుద్దీన్ వెళ్లిపోయాడు.

ప్రజలు నోరు వెళ్లబెట్టారు!



© Katha Jharna 2008

P. Saraswati   V. Vijayakanthi

L. S. Saraswathi   S. Rajalakshmi

Publisher   Rajalakshmi Srinivasan Memorial Foundation


Telugu   K. Suresh

Artist   Uma Krishnaswamy

74 యుకియో, తిమింగలం

యుకియో ఒక జాలరి కొడుకు. అమ్మా, నాన్నలతో కలిసి అతను సముద్ర తీరంలో ఉండేవాడు. ఇంటి పనులు లేదా బడి పనులు లేనప్పుడు, తీరం దగ్గరి రాతి కొలనులను అన్వేషించడానికి ఇష్టపడేవాడు. అక్కడ అతను నక్షత్ర చేపలు, పీతలు, కొన్నిసార్లు సముద్ర స్పాంజ్‌లను కూడా చూసేవాడు.

ఒక రోజు యుకియోకి ఒక వింత శబ్దం వినిపించింది. అది ఏమిటో చూడటానికి వెళ్లాడు. అక్కడ రాళ్ల మధ్య చిక్కుకుపోయిన ఒక పెద్ద తిమింగలం ఇసుకపై తోకను కొడుతోంది.




"పాపం, తిమింగలం! నీళ్లు లేకుండా నువ్వు జీవించలేవు!" అన్నాడు యుకియో. అతను ఒక్క క్షణం ఆలోచించాడు. తరవాత, "నీకు సహాయం చేస్తాను!" అని అతను అన్నాడు.

ఒక బక్కెట్టు పట్టుకుని సముద్రంలోకి పరిగెత్తాడు యుకియో. దానిని నీటితో నింపి తిమింగలం వద్దకు తిరిగి పరిగెత్తాడు. అతను జాగ్రత్తగా తిమింగలం తలపై నీళ్లు పోశాడు. అతను మళ్లీ బక్కెట్టు నిండా నీళ్లు తెచ్చి తిమింగలం వీపు మీద పోశాడు. మళ్లీ పాత్రను నింపి తిమింగలం తోకపై నీళ్లు పోశాడు.

తిమింగలంతో, "నువ్వు పెద్దదానివి. అయితే ఏమిటి? నీకు వెయ్యి బకెట్ల నీళ్లు తెస్తాను!" అని అన్నాడు యుకియో.

అతను సముద్రంలోకి తిరిగి పరిగెత్తాడు. అతను పాత్రను నింపి మళ్లీ పరిగెత్తాడు. "తోకకు మూడు బకెట్లు! వీపుకి నాలుగు బకెట్లు! తలకు ఐదు బకెట్లు!" అంటూ లెక్కపెడుతూ, యుకియో నీళ్లు పోస్తున్నాడు. అయినప్పటికీ, తిమింగలం చర్మంలోని కొన్ని భాగాలు ఎండిపోతున్నాయి. యుకియో పరిగెత్తి, పరిగెత్తి నీళ్లు పోస్తూనే ఉన్నాడు.


ఉన్నట్టుండి అతనిని నీరసం కమ్ముకుంది. అతను ఇసుక మీద పడిపోయాడు! కదలలేనంతగా అతను అలసిపోయాడు!



కానీ అతని మనసులో "...వెయ్యి బకెట్ల నీళ్లు...
వెయ్యి బకెట్ల నీళ్లు..." అనే మాటలు మెదిలాయి.
అతను పైకి లేచి సముద్రంలోకి తిరిగి
పరిగెత్తాడు. అతను మళ్లీ ఆగలేదు. అప్పుడు...

"చాలు!" అన్న మాటలు వినిపించాయి. యుకియో చుట్టూ
చూశాడు. అక్కడ అతని తాత ఉన్నాడు! చాలా మంది
గ్రామస్తులు కూడా ఉన్నారు!

"నువ్వు చాలా కష్టపడి పని చేశావు. ఇప్పుడు, విశ్రాంతి
తీసుకో," అతనితో తాత చెప్పాడు. ఒక పెద్ద రాయి కింద
నీడలోకి యుకియోను తీసుకుని వెళ్లాడు.



గ్రామస్థులు అందరూ పాత్రలు, తువ్వాళ్లు తీసుకుని వచ్చారు. తమ పాత్రలతో నీళ్లు తెచ్చి తిమింగలం మీద పోశారు. తువ్వాళ్లను తడిపి దాని వీపుపై పరిచారు. చివరికి తిమింగలం అంతా తడిగా అయ్యింది. కానీ గ్రామస్తులు ఆగలేదు. వాళ్లు సముద్రపు పోటు వచ్చే వరకు పని చేస్తూనే ఉన్నారు.

ఇప్పుడు అలలు తిమింగలం తోకను తాకుతున్నాయి. దాని శరీరం కొద్దికొద్దిగా ఇసుక పైన పైకి లేచింది. చివరికి, ఒక పెద్ద అల లోపలికి దూసుకుని వచ్చింది. అది తిమింగలాన్ని రాళ్లపైకి ఎత్తి సముద్రంలోకి తీసుకుని వెళ్లింది.

ప్రజలు సంతోషంతో చప్పట్లు చరిచారు. తిమింగలం ఈదుకుంటూ దూరంగా వెళ్లడం వాళ్లు చూశారు. తరవాత తమ వస్తువులను తీసుకుని నవ్వుతూ, మాట్లాడుకుంటూ ఇంటికి తిరిగి వెళ్లసాగారు. మరి యుకియో? తాత చేతుల్లో అతను గాఢ నిద్రలో ఉన్నాడు.

"వెయ్యి బకెట్ల నీళ్లు" అనే జపనీస్ కథ ఆధారంగా.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy


ఒక బియ్యం గింజ

ఒకప్పుడు సంతోషకరమైన, సంపన్న రాజ్యం ఉండేది. దాని నేలలు సారవంతమైనవి, పంటలు బాగా పండేవి. రాజ్యంలోని సరస్సులు, నదులు స్వచ్ఛమైన నీటితో నిండి ఉండేవి. ప్రతి సంవత్సరం ధాన్యాన్ని ప్రజలు సమృద్ధిగా పండించేవాళ్లు.

ఆచారం ప్రకారం, అదనపు బియ్యాన్ని రాజు గిడ్డంగులలో నిల్వ చేసేవాళ్లు. చాలా సంవత్సరాలు పంటలు బాగుండటంతో బియ్యం నిల్వలు బాగా పెరిగిపోయాయి. గిడ్డంగులు అన్నీ దాదాపు నిండిపోయాయి.

కానీ ఒక సంవత్సరం వానలు పడలేదు. దాంతో కరువు దాపురించింది. "గిడ్డంగులను తెరిచి నిల్వ చేసిన బియ్యాన్ని ప్రజలకు ఇచ్చే సమయం ఇది," అని రాజుతో మంత్రులు అన్నారు.

కానీ రాజు అందుకు నిరాకరించాడు! "నేను బియ్యం ఇస్తే నా అతిథులకు ఆహారం ఎలా పెట్టాలి?" అని అతను అడిగాడు. దాంతో ప్రజలు ఆకలితో అలమటించసాగారు.



ఒక రోజు ముఖ్యమైన సందర్శకులు రాజును చూడటానికి వచ్చారు. ఒక విందు ఏర్పాటు చేశారు. రాజభవనానికి బియ్యం బస్తాలను ఏనుగులు తీసుకుని వెళుతున్నాయి.

ఏనుగుల ఊరేగింపును రాధ అనే అమ్మాయి చూస్తోంది. నేలపైకి పడుతున్న బియ్యం ధారను ఆమె గమనించింది. ఒక బుట్టకి రంధ్రం ఉంది! చిందుతున్న బియ్యాన్ని తన లంగాలో పట్టుకోవడానికి రాధ పరిగెత్తింది. ఏనుగుల పక్కన నడుస్తూ, పడిపోతున్న గింజలను పట్టుకుంది.

ఊరేగింపు రాజభవనానికి చేరుకుంది. అక్కడ, కాపలాదారులు, "నీకు ఈ బియ్యం ఎక్కడ దొరికింది? దీనిని ఏమి చేస్తావు?" అని రాధని అడిగారు.


"ఒక బుట్ట నుండి బియ్యం కారుతోంది. దీనిని రాజుకు ఇస్తాను," ఆమె వాళ్లతో చెప్పింది.

రాజుకు సమాచారం అందింది. "ఆ చిన్న అమ్మాయి నిజాయితీపరురాలు. ఆమెను నా దగ్గరకు తీసుకుని రండి!" అని రాజు అన్నాడు. కాపలాదారులు అలాగే చేశారు.

రాధతో, "చిన్నా, నువ్వు నిజాయితీగా ప్రవర్తించావు. నీకు బహుమతి ఇస్తాను. నువ్వు ఏది అడిగినా ఇస్తాను!" అని రాజు అన్నాడు.

"నేను బహుమతి కోసం రాలేదు. కానీ మీరు ఇవ్వాలని అనుకుంటే, దయచేసి ఒక్క బియ్యం గింజ ఇవ్వండి!" అని రాధ చెప్పింది.

ఆమె వైపు చూస్తూ, "కానీ నేను రాజుని! నీకు మంచి బహుమతి ఇవ్వాలి. ఒక్క బియ్యం గింజ సరిపోదు!" అని రాజు అన్నాడు.




"అయితే ముప్పై రోజులపాటు బియ్యం ఇస్తారా? ఈ రోజు ఒక బియ్యపు గింజ ఇవ్వండి. రేపు, రెండు గింజలు ఇవ్వాలి. ఆ తరవాత రోజు నాలుగు గింజలు. ప్రతిరోజూ మునుపటి రోజు కంటే రెట్టింపు ఇవ్వాలి."

"నీకు కావలసింది అంతేనా? మళ్లీ ఆలోచించుకో," అని రాజు అన్నాడు. అంతే చాలు అని రాధ చెప్పింది. 'ఈ చిన్న బహుమతి ఇవ్వటం కష్టం కాదు,' అని రాజు అనుకున్నాడు. "నిన్ను అభినందిస్తున్నాను!" రాధతో చెప్పాడు.

ఆ రోజు, రాధ తన ఒక బియ్యపు గింజను ఇంటికి తీసుకుని వెళ్లింది. మరుసటి రోజు, రెండు గింజలు తన ఇంటికి తీసుకుని వెళ్లింది. ఆ తరవాత రోజు, నాలుగు గింజలు ఇచ్చారు. పదవ రోజు, 512 బియ్యం గింజలు ఇచ్చారు. అంటే షుమారుగా ఒక పిడికెడు బియ్యం.


పదహారవ రోజు, రాధకి రెండు బుట్టల బియ్యం అందింది. వీటిలో 32,768 గింజలు ఉన్నాయి. ఆ రోజు, 'ఇంత ఇవ్వాల్సి వస్తుందని ఊహించలేదు!' రాజు తనలో తాను అనుకున్నాడు. ఇరవై నాలుగవ రోజు, రాధకి 83,88,608 గింజలు ఉన్న ఎనిమిది బుట్టల బియ్యం అందింది.

ఇరవై ఏడవ రోజు, ఆమెకు అరవై నాలుగు బుట్టల బియ్యం అందింది. వీటిని ముప్పై రెండు ఏనుగుల వీపులపై తీసుకువచ్చారు. వాటిలో 6,71,08,864 గింజలు ఉన్నాయి.



'బియ్యం సంఖ్య ఇంతగా ఎలా పెరుగుతోంది?' అని రాజు ఆందోళన చెందాడు. అతను ఇంకా ఎంత ఇవ్వాల్సి వస్తుంది? కానీ అతను మాట ఇచ్చాడు. ఆ చిన్న అమ్మాయి లాగా నిజాయితీగా ఉండలేడా?

ముప్పైవ రోజు వచ్చింది. రెండు వందల యాభై ఆరు ఏనుగులు 53,68,70,912 బియ్యపు గింజలను రాధ ఇంటికి తీసుకుని వెళ్లాయి.



ఇప్పుడు రాజు ధాన్యాగారాలు ఖాళీ అయ్యాయి! అతను రాధని రాజభవనానికి పిలిపించి, "ఇంత బియ్యంతో ఏం చేస్తావు?" అని అడిగాడు.

రాధ ఇలా జవాబు ఇచ్చింది, "ఆకలితో ఉన్నవారికి - మీకు కూడా ఇస్తాను, రాజా! కానీ ఇక నుండి, మీకు అవసరమైనంత బియ్యం మాత్రమే ఉంచుకోండి. అలా చేస్తానని మాట ఇస్తారా?"

రాజు గర్వం తగ్గింది! "అలాగే చేస్తాను," అని అతను మాట ఇచ్చాడు.

రాధకి మొత్తం ఎంత బియ్యం వచ్చింది? 107,37,41,823 గింజలు!

దీనిని మీరే సరిచూసుకోవచ్చు. క్యాలెండర్‌లో 30 రోజులు ఉన్న నెల పేజీని తీసుకోండి. నెలలో మొదటి రోజు గడిలో 1 అని రాయండి. రెండవ రోజు గడిలో 2 గింజలు అని రాయండి. తరవాతి గడిలో, 4 రాయండి. ప్రతి రోజు రాధకి ఎన్ని గింజలు వచ్చాయో లెక్కించి గడులను పూరించండి.

అన్ని గడులలోని సంఖ్యలను కలిపితే, రాజు నుండి రాధకి ఎన్ని గింజలు వచ్చాయో మీకు తెలుస్తుంది.

భారతీయ జానపద కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

76 మాయా గులకరాయి



ఒకప్పుడు ఒక పిల్ల ఎలుగుబంటి తన అమ్మానాన్నలతో అడవిలో నివసించేది. ఆడుకోటానికి నదికి వెళ్లడం ఆ చిన్న ఎలుగుబంటి ఇష్టపడేది. దారిలో విత్తనాలు, ఈకలు, రాళ్లు, అందమైన గులకరాళ్లు వంటి ఎంతో ఆసక్తికరమైన వస్తువులను అది చూసేది.

ఆ చిన్న ఎలుగుబంటికి గులకరాళ్లు చాలా ఇష్టమైనవి. చాలా గులకరాళ్లను అది సేకరించింది!

ఒక రోజు, సూర్యకాంతిలో ఎర్రగా మెరిసే ఒక గులకరాయి ఆ చిన్న ఎలుగుబంటికి దొరికింది. భలే! దానిని తీసుకుని నడవసాగింది. అకస్మాత్తుగా సూర్యుడిని మబ్బులు కప్పేశాయి. చినుకులు పడుతున్నాయి. దారి బురదగా మారింది. 'వర్షం ఆగిపోతే బాగుండు!' అని చిన్న ఎలుగుబంటి అనుకుంది. అద్భుతం! వాన ఆగిపోయింది!

'నాకు ఒక మాయా గులకరాయి దొరికింది! నా చేతిలో పట్టుకుని ఏది కోరితే అది జరుగుతుంది!' అని చిన్న ఎలుగుబంటి అనుకుంది. అమ్మానాన్నలకు ఆ గులకరాయిని చూపించడానికి ఇంటికి వెళుతోంది. కానీ, ఇంటికి వెళ్లే దారిలో ఒక పెద్ద సింహం ఉంది! పిల్ల ఎలుగుబంటి భయంతో వణికిపోయింది. అప్పుడు అది,





‘సింహం తినడానికి ఇష్టపడని రూపంలోకి మారగలను!’ అని ఆలోచించి, ‘ఒక రాయిగా మారితే బాగుండును!’ అని కోరుకుంది. మరుక్షణం అది ఒక రాయిగా మారిపోయింది. చిన్న ఎలుగుబంటిని ఇప్పుడు సింహం తినలేదు!

కానీ మాయా గులకరాయి పక్కకి పడిపోయింది. ‘అయ్యో, రాయి రూపంలో చిక్కుకుపోయాను!’ అని చిన్న ఎలుగుబంటి బాధపడింది.

ఇంతలో, చిన్న ఎలుగుబంటి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నాయి. "చీకటి పడుతోంది! మన బిడ్డ ఇంకా తిరిగి రాలేదు," అని తల్లి ఎలుగుబంటి అంది. అడవిలో నడుస్తూ ఇతర జంతువులను, "మా ఎలుగుబంటి పిల్లను చూశారా?" అని అవి అడుగుతున్నాయి, కానీ ఎవరూ చూడలేదు.

ప్రతి రోజూ అవి అలా వెదుకుతూనే ఉన్నాయి. ప్రతి రోజు అవి సమాచారం కోసం అన్ని జంతువులను అడుగుతూనే ఉన్నాయి. పాపం ఎలుగుబంట్లు! అవి విచారంగా మారాయి. కానీ వెతకటం ఆపలేదు.





ఒక మధ్యాహ్నం, నదికి వెళ్లే దారిలో ఉన్న ఒక పెద్ద రాయిపై అవి కూర్చున్నాయి. "కొంచెం విశ్రాంతి తీసుకుని మళ్లీ వెదుకుదాం," అని అవి అనుకున్నాయి. ఆ రాయి వాటి ముద్దుల ఎలుగుబంటి పిల్ల అని వాటికి ఎలా తెలుస్తుంది!

తల్లిదండ్రులను చూసి ఆ పిల్ల ఎలుగుబంటి చాలా సంతోషంగా ఉంది! అది కదలలేదు, మాట్లాడలేదు కాబట్టి ఆ విషయం వాటికి చెప్పలేకపోయింది.

అప్పుడు, తల్లి ఎలుగుబంటి దారిలోని గులకరాళ్లను సేకరించసాగింది. "ఈ గులకరాళ్లను మన పిల్ల చూసి ఉంటే వాటిని ఇంటికి తెచ్చేది!" అని అది అంది.

అప్పుడు తండ్రి ఎలుగుబంటి గులకరాళ్లు సేకరించసాగింది. వాటి హృదయాల నిండా జ్ఞాపకాలతో, కొన్ని అందమైన గులకరాళ్లను సేకరించి రాయి మీద పెట్టాయి. ఆ గులకరాళ్లలో ఒకటి ఆ పిల్ల ఎలుగుబంటి కనుగొన్న మాయా గులకరాయి!

తన బిడ్డ చేసే విధంగా ఆ గులకరాళ్లను తల్లి ఎలుగుబంటి గుండ్రంగా అమర్చింది. రాతిపై ఎండ పడి అది వేడెక్కింది, ఆ వేడిమికి గులకరాళ్లు మెరుస్తున్నాయి.

అద్భుతం! ఆ రాయి ఉన్న చోట ఇప్పుడు తమ ముద్దుల ఎలుగబంటి నిలబడి ఉంది! అంతసేపూ, 'అమ్మా, నాన్నా, ఇది నేనే! ఓహ్, నేను ఎలుగుబంటిని అయితే ఎంత బాగుంటుంది!' అని అనుకుంటూ ఉంది. మాయా గులకరాయి రాయి మీద ఉండటంతో దాని మాయాజాలం పని చేసింది!

ఇప్పుడు చుట్టూ ఆనందం నెలకొంది. బిడ్డను ఎత్తుకుని అమ్మానాన్నలు గట్టిగా కౌగిలించుకున్నాయి. దానిని గాలిలోకి ఎగరేసి, పట్టుకున్నాయి. మూడూ చాలా సేపు ఆడుకుని ఇంటికి బయలుదేరాయి.

విలియం స్టీగ్ రాసిన సిల్వెస్టర్ అండ్ ది మ్యాజిక్ పెబల్ ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

జాలరి, భూతం


సముద్ర తీరాన ఉన్న ఒక గ్రామంలో ఒక పేద జాలరి నివసించేవాడు. ప్రతి రోజు తెల్లవారుజామున అతను సముద్రంలో చాలా దూరం పడవ నడిపేవాడు. అతను ఎప్పుడూ తనకు కావలసినన్ని చేపలను మాత్రమే పట్టుకునేవాడు.

జాలరి యవ్వనంలో ఉన్నప్పుడు రోజుకు మూడుసార్లు మాత్రమే వల వేస్తానని నిర్ణయించుకున్నాడు. అప్పటి నుండి అన్ని సంవత్సరాలలో అతను అలాగే చేస్తున్నాడు.

ఈ రోజు మొదటిసారి బరువైనది ఏదో పడింది. చాలా కష్టపడి దానిని పడవలోకి లాగాడు. అయ్యో! అది అప్పుడే చనిపోయిన జంతు కళేబరం.

నిట్టూర్చి, అతను వలలోంచి దానిని తీసి మళ్లీ నీటిలో పడేశాడు. రెండవసారి కూడా బరువైనది పడటంతో వలను పడవలోకి లాగడానికి చాలా కష్టపడ్డాడు. ఈసారి ఒక పెద్ద మట్టి కుండ ఉంది.

కుండలో బంగారం ఉంటుందా? లేక వెండి నాణాలు ఉంటాయా? అయ్యో! రాళ్లు, బురద, గాజు పెంకులతో అది నిండి ఉంది.





"దేవుడా! ఈ రోజు కనీసం ఒక చేపైనా పడేలా చెయ్యి!" అని కోరుకుంటూ మూడవసారి వల విసిరాడు.

ఈసారి మునుపటి దానికంటే చాలా బరువుగా ఉంది. ఆశ్చర్యం! దానిలో ఒక చిన్న ఇత్తడి పాత్ర మాత్రమే ఉంది. కానీ జాలరి సంతోషించాడు. 'ఈ అందమైన జాడి అమ్మితే ఈ రోజు అన్నానికి సరిపోతుంది!' అని అనుకున్నాడు.

త్వరగా, పడవను ఒడ్డుకు చేర్చాడు. పడవ నుండి బయటకు దూకాడు. తరవాత జాడి తెరిచి, చూశాడు.

అకస్మాత్తుగా జాడి నుండి నల్లటి పొగ మబ్బు లాగా పైకి లేచింది. పొగ నెమ్మదిగా ఆకాశంలోకి లేస్తుండటంతో జాలరి భయంతో వెనక అడుగు వేశాడు. ఆ పొగ భూతం లాంటి ఆకారంలోకి మారడం అతను భయంతో చూశాడు. దాని తల మబ్బులలో ఉంది! కళ్లు వజ్రాల లాగా మెరుస్తున్నాయి! నోరు ఒక పెద్ద గుహ లాగా ఉంది!

జాలరి కాళ్లు, చేతులు వణకసాగాయి. పాపం! అతను విగ్రహంలా నిలబడి చూస్తూ ఉన్నాడు.

"నిన్ను చంపబోతున్నాను!" అని భూతం చెప్పింది.

"నన్నా? నిన్ను జాడి నుండి రక్షించాను. నన్ను ఎందుకు చంపాలని అనుకుంటున్నావు?" జాలరి అడిగాడు.

"ఎందుకో చెప్పి, నిన్ను చంపుతాను!" అని భూతం బదులు ఇచ్చింది. "జాడీని తెరిచిన వ్యక్తికి గొప్ప సంపద బహుమతిగా ఇద్దామని మొదటి వంద సంవత్సరాల పాటు అనుకున్నాను. కానీ ఎవరూ రాలేదు!



"నన్ను కాపాడిన వ్యక్తికి బహుమతులు ఇద్దామని తరవాతి వంద సంవత్సరాలపాటు అనుకున్నాను. కానీ, ఎవరూ రాలేదు.

"అప్పుడు, నన్ను కాపాడిన వ్యక్తికి చావుని మాత్రమే ఇస్తానన్న నిర్ణయానికి వచ్చాను!"

"ఇది న్యాయమా? మంచి పనికి ఇలాంటి శిక్షా?" అని జాలరి అడిగాడు. అతను పరిగెత్తడానికి ప్రయత్నించాడు. కానీ, అతని కాళ్లు అతనికి సహకరించలేదు. అతను భయంతో గడ్డకట్టుకుపోయాడు!

జాలరిపైకి భూతం వస్తోంది. ఎటువంటి అడుగుజాడలు లేకుండా పొగలాగా కమ్ముకుంటోంది. ఇంకొక్క క్షణంలో అతనిని చేరుకుంటుంది.

జాలరి తీవ్రంగా ఆలోచించాడు. చివరి క్షణంలో, ఆ భూతం కళ్లల్లోకి సూటిగా చూస్తూ, "ఓ పరాక్రమశాలి! నువ్వు చాలా పెద్దగా ఉన్నావు! నీ తల ఆకాశాన్ని తాకుతోంది, నీ కాలి గోరు కూడా ఈ జాడి కంటే పెద్దది!" అని అన్నాడు.

భూతం గర్వంతో ఉబ్బిపోయింది.

"కానీ ఒక ప్రశ్న నన్ను వేధిస్తోంది. ఇంత కాలం అక్కడే ఉండటం మాట అటుంచి, ఆ జాడీలో అసలు ఎలా పట్టావు?" అని జాలరి అడిగాడు.

వెంటనే, "నీకు చూపిస్తాను," అని భూతం అంది. అది చిన్నగా మారసాగింది. జాడి కంటే చిన్నగా మారి దానిలోకి వెళ్లింది. వెంటనే జాలరి దాని మూత గట్టిగా బిగించాడు.

"కాపాడు! కాపాడు! నన్ను బయటకు తీస్తే నిన్ను ధనవంతుడిని చేస్తాను!" అని భూతం మొరపెట్టుకుంది.

"ఇంకా వెయ్యి సంవత్సరాలు అక్కడే ఉండు!" అని అంటూ ఆ జాడిని తిరిగి సముద్రంలోకి విసిరేశాడు జాలరి. తన ఆకలిని మరచిపోయి, ఇంటికి బయలుదేరాడు. బతికి ఉన్నందుకు సంతోషించాడు!

1001 అరేబియన్ రాత్రులు నుండి ఒక కథ



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy


జ్ఞానమే సంపద

ఒకప్పుడు ముగ్గురు అన్నదమ్ములు పాఠశాలలో బాగా చదువుకుని చాలా తెలివైనవాళ్లుగా ఎదిగారు. అయినా, వాళ్ల చదువు ముగిసే సమయానికి, వాళ్లందరూ జ్ఞానం కోసం దాహంతో ఉన్నారు.

వాళ్లు తమ తండ్రితో, "మాకు నక్షత్రాలు, గ్రహాల గురించి తెలుసు. మొక్కలు, జంతువులు ఎలా పెరుగుతాయో తెలుసు. పురాతన కథలను చదివాం. ఇప్పుడు మరింత నేర్చుకోవాలని అనుకుంటున్నాం," అని అన్నారు.

"పిల్లల్లారా! పుస్తకాల నుండి నేర్చుకోగలిగినది నేర్చుకున్నారు. మీరు ప్రపంచాన్ని చూడవలసిన సమయం ఇది!" అని తండ్రి జవాబు ఇచ్చాడు.

దాంతో, సోదరులు తమ ప్రయాణానికి కావలసినవి సర్దుకున్నారు. వాళ్లు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, వాళ్ల నాన్న కన్నీళ్లతో వాళ్లను కౌగిలించుకున్నాడు.



ప్రయాణానికి కొంత డబ్బు వాళ్లకి ఇచ్చాడు. ప్రతిదీ నిశితంగా గమనించి వాళ్లు చూసిన వాటిని గుర్తుంచుకోవాలని చెప్పాడు. తరవాత వాళ్లని ఆశీర్వదించి పంపించాడు.

ముగ్గురు అన్నదమ్ములు చాలా దూరం ప్రయాణించారు. వాళ్లు చాలా విషయాలు నేర్చుకున్నారు. చాలా సాహసాలు చేశారు!

ఎండిపోయి, దుమ్ముతో కూడిన దారిలో వాళ్లు ఒకసారి ఒక సిపాయిని కలిశారు...

1వ సోదరుడు: అయ్యా! మీరు ఒంటె కోసం చూస్తున్నారా?

2వ సోదరుడు: అది ఎడమ కంటిలో గుడ్డిదా?

3వ సోదరుడు: దానిపై ఒక స్త్రీ వెళుతోందా?

సిపాయి: ఆగండి! మీరు నా ఒంటెను ఎక్కడ చూశారు?

1వ సోదరుడు: మేం దానిని చూడలేదు!

సిపాయి: మరి దాని గురించి మీకు అంతగా ఎలా తెలుసు? అబద్ధాలకోరులు! దొంగలు! రాజు వద్దకు పదండి!

సిపాయి వాళ్లని రాజు న్యాయస్థానానికి తీసుకుని వెళ్లాడు. తన ఒంటెను వాళ్లు దొంగిలించారని రాజుకు అతను చెప్పాడు.

రాజు: యువకుల్లారా! మీరు మా సిపాయి ఒంటెను ఎప్పుడూ చూడలేదని చెబుతున్నారు. అయినప్పటికీ మీకు దాని గురించి అన్నీ తెలుసు. వివరించండి!

ముగ్గురు సోదరులు: రాజా! మేం దొంగలు కాదు! తార్కిక నైపుణ్యం, జ్ఞానం ద్వారా ఒంటె గురించి తెలుసుకున్నాం.

రాజు తోపాటు సభికులు అందరూ నవ్వసాగారు.

రాజు: తార్కిక నైపుణ్యం, జ్ఞానం అంటారా? అదీ చూద్దాం!

అతను తన సేవకులతో ఏదో గుసగుసలాడాడు. వాళ్లు సభ నుండి బయటకు వెళ్లి పెద్ద పెట్టెను తీసుకుని తిరిగి వచ్చారు. దీన్ని వాళ్లు రాజు ముందు ఉంచారు.

రాజు: ఇప్పుడు మీ నైపుణ్యాలను మాకు చూపించండి. పెట్టె లోపల ఏముంది?

1వ సోదరుడు: అది తేలికైనది.

2వ సోదరుడు: అది గుండ్రంగా ఉంది.

3వ సోదరుడు: అది దానిమ్మ!

రాజు పెట్టెను తెరిచాడు.

రాజు: అద్భుతం! ఎలా తెలుసుకున్నారు?



1వ సోదరుడు: పెట్టె పెద్దది అయినప్పటికీ మీ మనుషులు దానిని తేలికగా మోసుకుని వచ్చారు. కాబట్టి, దాంట్లో తేలికైనది ఉండాలని నాకు తెలుసు.

2వ సోదరుడు: పెట్టెలో ఏదో దొర్లటం నేను విన్నాను. కాబట్టి, అది గుండ్రంగా ఉంటుందని నాకు తెలుసు.

3వ సోదరుడు: ఈ సభ బయట దానిమ్మ తోట ఉంది. మీ సేవకులు వెళ్లి, త్వరగా తిరిగి వచ్చారు. కాబట్టి, పెట్టెలో దానిమ్మ ఉందని నేను ఊహించాను.

రాజు: బాగా చెప్పారు! ఇప్పుడు, ఒంటె గురించి చెప్పండి.

1వ సోదరుడు: దారిలో ఒంటె కాలి ముద్రలు చూశాను. కాబట్టి ఒక ఒంటె ఆ దారిలో వెళ్లిందని నాకు తెలుసు.

2వ సోదరుడు: దారికి కుడి వైపున పెరుగుతున్న గడ్డి, పొదలను ఇటీవలే తిన్న ఆనవాళ్లు ఉన్నాయి. కానీ ఎడమ వైపున ఉన్న వాటిని తిన్న గుర్తులు కనిపించలేదు. కాబట్టి ఒంటె ఎడమ కంటిలో గుడ్డిదని నేను ఊహించాను.

3వ సోదరుడు: దారి పక్కన ఒంటె కూర్చుందని నేను గమనించాను. అక్కడ ఒక స్త్రీ చెప్పుల ముద్రలు చూశాను. కాబట్టి దానిపై ఒక స్త్రీ స్వారీ చేస్తోందని ఊహించాను.

సభికులు అందరూ చప్పట్లు కొట్టారు.

రాజు: యువకుల్లారా, ఇటువంటి జ్ఞానం, నైపుణ్యాలు నేను ఇప్పటివరకు చూడలేదు. మిమ్మల్ని నా సలహాదారులుగా నియమిస్తున్నాను!

ఆసియా జానపద కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy


79 పంచుకోండి, సమంగా పంచుకోండి

ఒకప్పుడు రాము, సోము అనే అన్నాతమ్ముళ్లు ఉన్నారు. వాళ్లు కలిసి శాంతియుతంగా జీవించేవాళ్లు. కానీ ఒక రోజు...

"మన దగ్గర ఉన్న ఆవు, మామిడి చెట్టు, దుప్పటి సమానంగా పంచుకుందాం. సరేనా?" రాముతో అన్నాడు సోము. దానికి రాము ఒప్పుకున్నాడు.

"అయితే, ఆవు ముందు భాగాన్ని నువ్వు తీసుకో, వెనక భాగాన్ని నేను తీసుకుంటాను. మామిడి చెట్టు కింది భాగాన్ని నువ్వు తీసుకో, పైభాగాన్ని నేను తీసుకుంటాను. దుప్పటి విషయానికొస్తే, పగటిపూట నువ్వు దానిని వాడుకో, రాత్రి నేను దానిని వాడుకుంటాను. సరేనా?" అడిగాడు సోము. "అలాగే చేద్దాం," అమాయకంగా అన్నాడు రాము.





అప్పటి నుండి ఆవుకి మేత రాము పెట్టేవాడు. కానీ సోము దాని పాలు పితికి, వాటిని అమ్ముకునేవాడు. మామిడి చెట్టుకు రాము నీళ్లు పోసేవాడు, కానీ సోము పండ్లు కోసుకునేవాడు.

పగటిపూట రాముకు దుప్పటి వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. రాత్రి అతను మెలకువగా, వణుకుతూ పడుకునేవాడు. దుప్పటి చుట్టుకుని సోము హాయిగా, వెచ్చగా నిద్రపోయేవాడు.

ఏం జరుగుతోందో ఒక వృద్ధుడు గమనించాడు. రాముని పిలిచి చెవిలో ఏదో గుసగుసలాడాడు. రాము ముఖంలో భావాలు మారిపోయాయి! అతను బిగ్గరగా నవ్వి ఇంటికి పరిగెత్తాడు.


మరుసటి రోజు దుప్పటి మీద రాము నీళ్లు పోశాడు. ఆ రాత్రి దుప్పటి ఇంకా తడిగానే ఉంది. సోము దానిని అస్సలు ఉపయోగించలేకపోయాడు! అతను వణుకుతూ మేల్కొని ఉన్నాడు. మరునాటి ఉదయం, "దుప్పటి మీద నీళ్లు ఎందుకు పోశావు?" రాముని అడిగాడు సోము.

"పగటిపూట దుప్పటి నాది. దానిని ఏమైనా చేస్తాను!" అని రాము అన్నాడు.

సోము ఆవు పాలు పితకడం ప్రారంభించినప్పుడు, రాము దాని తాడును లాగాడు. ఆవు కోపంగా సోముని తన్నటంతో పాలు ఒలికిపోయాయి.

"నీకు ఏమైంది?! పిచ్చి పట్టిందా?" అని అరిచాడు సోము.


"ఆవు ముందు భాగం నాది. తాడు లాగితే నీకు ఏమైంది?" అని రాము సమాధానం చెప్పాడు.



కోపంతో అలసిపోయి మామిడి చెట్టు నీడలో పడుకున్నాడు సోము. ఒక్కసారిగా, "టక్, టక్!" అని గొడ్డలి చప్పుడు వచ్చింది. అదిరిపడి సోము కళ్లు తెరిచాడు. రాము చెట్టుకు అవతలి వైపు నిలబడి ఉన్నాడు. అతను దానిని నరికివేస్తున్నాడు! "ఏం చేస్తున్నావు?" అని సోము అరిచాడు.

"చెట్టు అడుగు భాగం నా సొంతం. నేను దానిని నరికేస్తున్నాను!" అని రాము అన్నాడు.

తన తమ్ముడిని ఇకపై మోసం చేయలేనని సోముకు అర్థమైంది. ఆ రోజు నుండి వాళ్లిద్దరూ ఆవు పాలు, మామిడి పండ్లను అమ్మి, డబ్బును సమానంగా పంచుకోసాగారు. దుప్పటి విషయానికి వస్తే, సోము దానిని ఒక రాత్రి, మరుసటి రాత్రి రాము వంతులవారీగా ఉపయోగించసాగారు.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

ఉడత చారలు

రాక్షస ప్రభువు రావణుడు శక్తివంతమైన రాజు. ఒక రోజు అతను రాముడి భార్య సీతను అపహరించి, తన ఎగిరే రథంలో లంకా రాజ్యానికి తీసుకుని వెళ్లాడు.

సీతను రక్షించడానికి రాముడు సముద్రం దాటవలసి ఉంది! సముద్ర తీరంలో తన కోతుల సైన్యంతో అతను నిలబడ్డాడు. దాటలేని సముద్ర నీటిని చూస్తూ, సముద్ర రాజును సహాయం కోసం అడగాలని నిర్ణయించుకున్నాడు.

"సముద్రం గుండా మాకు ఒక మార్గం తెరవండి!" రాముడు వేడుకున్నాడు. కానీ సముద్ర రాజు అతని ప్రార్థనలను పట్టించుకోలేదు. కోపంతో, రాముడు నీటిమీదకి బాణాలు వేశాడు. అన్ని చేపలు, ఇతర సముద్ర జీవులు కలవరపడ్డాయి.

అప్పుడు అలల నుండి సముద్ర రాజు పైకి లేచాడు. "ప్రకృతిలో ఉన్న ప్రతిదానికీ దాని శాశ్వత రూపం, చట్టాలు ఉంటాయి. నేను నా లోతులను, నా అలల కదలికను తగ్గించలేను, ఆపలేను. కాబట్టి, నా మీదుగా ఒక వంతెనను మీ సైన్యం నిర్మించడానికి అనుమతిస్తాను," రాముడితో సముద్రుడు అన్నాడు.



దాంతో వంతెన నిర్మించమని తన సైనికులను రాముడు ఆదేశించాడు. వాళ్లు పెద్ద పెద్ద బండరాళ్లను తీసుకురాసాగారు. వంతెనను తొందరగా పూర్తి చేయడానికి వాళ్లు విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు.


ఇవన్నీ జరుగుతుండగా ఒక ఉడత వంతెన ఉన్న ప్రదేశానికి వచ్చింది. అది తన నోటిలో చాలా గులకరాళ్లను మోసుకుని వెళుతోంది. వాటిని జాగ్రత్తగా బండరాళ్ల మధ్య ఉంచింది. ముందుకు, వెనకకు పరిగెడుతూ, అది వీలైనన్ని గులకరాళ్లను సేకరించి రాళ్ల మధ్య వేస్తోంది.

రాముడు దానిని గమనించి, ‘ఆ చిన్న ఉడత ఏం చేస్తోంది?’ అని ఆశ్చర్యపోయాడు.

కానీ, ఉడతను గమనించిన కోతులు దానిపై అరిచాయి. "ఏయ్, బుడతా! నువ్వు చాలా చిన్నవాడివి, మాతో కలిసి పనిచేయలేనంత బలహీనుడివి. వెళ్లిపో!"

ఉడత నిటారుగా నిలబడింది.






"నేను వంతెనను నిర్మించడంలో సహాయం చేస్తున్నాను," అని ఉడత చెప్పింది.

కోతులు పెద్దగా నవ్వుతూ ఉడతను ఎగతాళి చేశాయి. "ఇంత హాస్యాస్పదమైన విషయం ఎప్పుడైనా విన్నారా?" అవి ఒకదానినొకటి అడిగాయి.

కానీ ఉడత తనను తాను సమర్థించుకుంది. "రాళ్లు నాకు చాలా బరువుగా ఉన్నాయి. నేను మోయగలిగేది గులకరాళ్లే. కాబట్టి అవే తెస్తున్నాను. సీతను రక్షించడంలో నేను కూడా సహాయం చేయాలని అనుకుంటున్నాను."

ఉడతను దారి నుండి తోసేసి కోతులు తమ పనిని తిరిగి ప్రారంభించాయి. కానీ ఉడత గులకరాళ్లను తెచ్చి రాళ్ల మధ్య ఉంచుతూనే ఉంది.



ఇది చూసిన కోతులలో ఒకటి కోపంగా ఉడతను ఎత్తి విసిరివేసింది. ఉడత ఆకాశంలోకి పైకి లేచింది. "రామా!" అని అది అరిచింది. అది తిరిగి భూమిపై పడుతుండగా, రాముడు దానిని పట్టుకున్నాడు. దోసిటిలో ఉన్న దానిని దగ్గరగా చూశాడు.

తరవాత అతను కోతులను తన వద్దకు పిలిచాడు. "మీరు శక్తివంతులు, ఈ ఉడత బలహీనమైనది. కానీ ప్రతి ఒక్కరూ తమ సహజ బలం, నైపుణ్యం ప్రకారం పనిచేస్తారు.

"బలహీనులకు గొప్ప అంకితభావం ఉండవచ్చు. మనకు వారి సహాయం కూడా అవసరం. గుర్తుంచుకోండి, బండరాళ్ల మధ్య ఉంచిన చిన్న గులకరాళ్లు వాస్తవానికి వంతెనను బలపరుస్తాయి."

రాముడు ఉడతను చేతిలో పట్టుకున్నాడు. అతను దాని వీపును ప్రేమగా నిమిరాడు. అతని వేళ్లు దాని వీపు మీద మూడు నల్లటి చారలను మిగిల్చాయి. ఉడతల వీపుపై నేటికీ మనం చూసే చారలు ఇవే అని అంటారు.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

జీవ జాలం

ఒకప్పుడు ఒక చిన్న నల్ల పిల్లి అడవిలో నివసించేది. పాపం! అది ఎప్పుడూ భయపడేది. అది ఎక్కడకి వెళ్లినా ఒక జంతువును మరో జంతువు తినడం కనిపించేది! కాబట్టి, అది పొదల్లో దాక్కుని రోజులు గడిపేది.


ఒక మధ్యాహ్నం ఒక ముంగిస వచ్చింది. అది తన తీక్షణమైన కళ్లతో నల్ల పిల్లిని చూడసాగింది. పిల్లి భయపడింది.

పిల్లి: నువ్వు నన్ను తినబోతున్నావా?

ముంగిస: లేదు! నేను నీ తోక వైపు చూస్తున్నాను. దానికి పాములాంటి చారలు ఉన్నాయి. అందుకే దానిని చూస్తూ ఉండిపోయాను.

పిల్లి: నేను పాము కాదు! నేను పిల్లిని! కాబట్టి... నువ్వు నన్ను చంపబోవడం లేదు?

ముంగిస: నువ్వు నా స్నేహితుడివి! నేను స్నేహితుడిని ఎప్పుడూ చంపను!







పిల్లి: నిజంగానా? ప్రతి రోజు జంతువులను ఇతర జంతువులు తినడం చూస్తాను. కీటకాలను సాలెపురుగులు తింటాయి. సాలెపురుగులను చిన్న పక్షులు తింటాయి. చిన్న పక్షులను డేగలు తింటాయి... చంపడానికి అంతం లేదు!

ముంగిస: విను. జంతువులు తమ స్నేహితులను తినవు. అవి తమ ఆహారాన్ని మాత్రమే తింటాయి. అది ప్రకృతి నియమం.

పిల్లి: ప్రకృతి? నాకు ప్రకృతి గురించి ఏమీ తెలియదు!

ముంగిస: ఏమిటి? కానీ నువ్వు ఎలుకలను తింటావు. ఎలుక నీ స్నేహితుడా?

పిల్లి: కాదు, అది నా శత్రువు!



ముంగిస: అది నీకు శత్రువు ఎలా అయ్యింది? అది నిన్ను ఏం చేసింది?

పిల్లి: అది నన్ను ఏమీ చేయలేదు. నేను నా జీవితమంతా ఎలుకలను తింటున్నాను. నేను దాని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు.

ముంగిస: అదే ప్రకృతి. ఎలుక నీ సహజ ఆహారం.

పిల్లి: అలాగా! అయితే, నీకు కూడా సహజ ఆహారం ఉందా?

ముంగిస: ఉంది, పాములు! నేను పాములను తింటూ పెరిగాను. నేను దాని గురించి ఆలోచించను. నేను దానిని సహజంగానే చూస్తాను.

పిల్లి: పాము నీ శత్రువా?

ముంగిస: అవును! చంపగలిగితే పాము నన్ను చంపుతుంది.

అప్పుడే ఒక నక్క అటుగా వచ్చింది. పిల్లి, ముంగిస చటుక్కున ఒక చెట్టుపైకి ఎక్కాయి.

ముంగిస: శుభోదయం, నక్క గారూ! మమ్మల్ని తినాలని అనుకుంటున్నావా?

నక్క: అస్సలు కాదు! నేను తినడానికి చంపను.

పిల్లి: అప్పుడు నువ్వు మిగతా జంతువుల కంటే భిన్నమైనదానివి!

నక్క: నిజంగా కాదు. సింహం వేటకు వెళ్లే వరకు నేను వేచి ఉంటాను. సింహం తిన్న తరవాత, నేను నా వంతు తీసుకుంటాను. ప్రతి జంతువు నా స్నేహితుడే – దానిని సింహం పట్టుకుంటే తప్ప.

పిల్లి: సింహం మమ్మల్ని తింటుందా?

నక్క: లేదు, నేను అలా అనుకోను. అది పెద్ద జంతువులను ఇష్టపడుతుంది.

అంతలో ఒక నల్ల తాచుపాము ఒక ఎలుకను వెంబడిస్తూ పక్కనుంచి వెళుతోంది. ముంగిస చెట్టు నుండి అరుస్తూ దూకి పాముపై దాడి చేసింది. అవి పోరాడాయి. కాసేపటికి పాము చనిపోయింది. పొదల్లో నుండి ఎలుక బయటకు వచ్చింది.



ఎలుక: ముంగిస మామా! నన్ను కాపాడావు! ధన్యవాదాలు!

ముంగిస: అది ఏమీ కాదు. ఏ ముంగిసైనా అలాగే చేస్తుంది.

పిల్లి: (చెట్టు నుండి దిగి) నేను చాలా గందరగోళంలో ఉన్నాను. పాము నీ శత్రువు, కాబట్టి మీరు ఒకరినొకరు చంపుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ ఎలుక నీ స్నేహితుడు. నేను కూడా నీ స్నేహితుడినే. కానీ నేను ఎలుకలను చంపుతాను. ఇది నాకు అర్థం కాలేదు.

ముంగిస: అదే ప్రకృతి. స్నేహం ఉంది. శత్రుత్వం ఉంది. మనం అందరం జీవజాలంలో అల్లుకున్న పోగులం!

పిల్లి: నువ్వు చాలా తెలివైనవాడివి. నీకు అన్నీ తెలుసు! నువ్వు మంచి స్నేహితుడివి!

ఎలుక: అవును, నువ్వు మంచి స్నేహితుడివి!

ముంగిస: మీ ఇద్దరితోనూ స్నేహం చేయడం నాకు సంతోషంగా ఉంది. కానీ ఇప్పుడు, పిల్లి మిత్రుడికి ఆకలిగా అనిపించక ముందే ఎలుక మిత్రమా నువ్వు పారిపోవాలి!

ఎలుక: ధన్యవాదాలు! వెళ్లొస్తాను!

అడ్రియెస్ ఫోస్టర్ పాటర్ రాసిన కథ ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy



తగ్గిన బరువు

82


దూరప్రాంత పట్టణంలో పనికి వెళ్లాడు హాన్స్. అక్కడ ఏడు సంవత్సరాలు పనిచేశాడు. "అమ్మని చూడాలని అనుకుంటున్నాను. ఆమె మా స్వగ్రామంలోనే ఉంది. దయచేసి నా జీతం నాకు ఇవ్వండి," అని తన యజమానితో అన్నాడు.

"ఏడు సంవత్సరాలు నమ్మకంగా, కష్టపడి పని చేశావు. ఇదిగో, నీ జీతం తీసుకో," అంటూ అతనికి ఒక బంగారం ముద్దని ఇచ్చాడు యజమాని.

బంగారాన్ని ఒక గుడ్డలో చుట్టి, తలపై పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు హాన్స్. దారిలో, ఒక పెద్ద గుర్రంపై స్వారీ చేస్తున్న వ్యక్తిని అతను చూశాడు. "గుర్రం మీద నా ప్రయాణాన్ని ముగించడం ఎంతో ఆనందంగా ఉంటుంది!" అని హాన్స్ పైకే అనుకున్నాడు. ఇది విన్న గుర్రం మీద స్వారీ చేస్తున్న వ్యక్తి, "నువ్వు ఇంత బరువుతో ఎందుకు నడుస్తున్నావు?" అని అడిగాడు.

"నాకు వేరే దారి లేదు. ఈ బంగారాన్ని మా అమ్మ దగ్గరకి తీసుకుని వెళ్లాలి," అని హాన్స్ బదులు ఇచ్చాడు.

"అయితే, నాకు బంగారాన్ని ఇచ్చి నా గుర్రాన్ని తీసుకుని వెళ్లు. ఇది నిన్ను త్వరగా ఇంటికి చేరుస్తుంది!" అని అతను అన్నాడు. హాన్స్ సంతోషంగా అతనికి బంగారు దిమ్మెను ఇచ్చి గుర్రాన్ని తీసుకున్నాడు. కానీ అతను ఎక్కి పగ్గాలు లాగినప్పుడు, గుర్రం దౌడు తీసింది! హాన్స్ గోతిలో పడిపోయాడు!




దగ్గరలో పని చేస్తున్న ఒక రైతు హాన్స్ గుర్రాన్ని పట్టుకుని, గుంత నుండి బయటకు రావడానికి అతనికి సహాయం చేశాడు. అతనికి కృతజ్ఞతలు తెలిపాడు హాన్స్. "ఈ గుర్రం నన్ను గుంతలోకి విసిరేసింది! నేను మళ్లీ దానిపై స్వారీ చేయను. కానీ, మీ ఆవు ఎంతో ప్రశాంతంగా ఉంది! అలాంటి జంతువు అంటే నాకు చాలా ఇష్టం!" అన్నాడు హాన్స్.

"నీకు ఆవు కావాలంటే తీసుకో. బదులుగా నీ గుర్రాన్ని నాకు ఇవ్వు," అన్నాడు రైతు. హాన్స్ సంతోషంగా రైతుకు తన గుర్రాన్ని ఇచ్చి ఆవును తీసుకున్నాడు. ఆవును తోలుతూ, అతను తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించాడు.

ఆ రోజు చాలా వేడిగా ఉంది! హన్స్‌కు చాలా దాహం వేసింది. 'ఈ ఆవు కొంచెం పాలు ఇస్తే...' అని అనుకున్నాడు. అతను పాలు పితకడానికి కూర్చున్నాడు. కానీ ఆవు బెదిరిపోయి అతడిని తన్నింది! హాన్స్ కింద పడిపోయాడు. అతనికి ఆవు పాలు దక్కలేదు!

అతను కళ్లు తెరిచి తన ఆవు కోసం చుట్టూ చూశాడు. ఏమీ జరగనట్లు అది ప్రశాంతంగా మేస్తోంది! అప్పుడు ఒక వ్యక్తి అతని దగ్గరకు వచ్చాడు. తాడుతో కట్టిన మేక అతనితో ఉంది. పైకి లేవటానికి హాన్స్‌కు ఆ వ్యక్తి సహాయం చేశాడు.





"ఆ ఆవు పాలు ఇవ్వదు, పైగా తన్నుతుంది! నా ఆవుకు బదులుగా మీ మేకను ఇస్తారా?" హాన్స్ అడిగాడు.

ఆ వ్యక్తి ఒప్పుకున్నాడు. దాంతో, అతనికి ఆవును ఇచ్చి మేకను తీసుకున్నాడు హాన్స్. మేకను నడిపిస్తూ అతను మళ్లీ ప్రయాణం కొనసాగించాడు.

దారిలో ఒక కోడితో ఉన్న వ్యక్తిని హాన్స్ చూశాడు. అతను, 'ఇంట్లో కోడి ఉంటే బాగుంటుంది. అది మనకు తినడానికి గుడ్లు ఇస్తుంది. కొన్ని గుడ్లను పొదిగేందుకు ఉంచితే, త్వరలో చాలా కోడిపిల్లలు వస్తాయి!' అని అనుకున్నాడు. దాంతో, ఆ వ్యక్తిని, "ఈ మేకకు బదులుగా మీ కోడిని ఇస్తారా?" అడిగాడు హాన్స్. ఆ వ్యక్తి వెంటనే ఒప్పుకున్నాడు.

ఇప్పుడు హాన్స్ త్వరగా నడిచాడు. ఆ కోడి అస్సలు బరువు లేదు! ఇంటికి ఇంకొంచెం దూరం ఉంది. ఒక వ్యక్తి తలపై సానబెట్టుకునే రాయితో కనిపించాడు.





అతను ఇబ్బంది పడుతుండటం హాన్స్ చూశాడు. అతని మీద జాలిపడ్డాడు! అతనికి బంగారు దిమ్మె, గుర్రం, ఆవు, మేక గురించి చెప్పాడు.

"ఆ చిన్న కోడి దొరికినందుకు నువ్వు చాలా అదృష్టవంతుడివి! నా సానబెట్టేరాయి తీసుకుని దానిని ఇస్తావా? దీంతో చాలా కత్తులను పదును పెట్టవచ్చు, చాలా డబ్బు సంపాదించవచ్చు," అని ఆ వ్యక్తి అన్నాడు.

మన మంచి హాన్స్ అందుకు అంగీకరించాడు! ఆ వ్యక్తి కోడితో వెళ్లిపోయాడు. సానబెట్టుకునే రాయిని తలపైకి ఎత్తుకుని భారంగా నడుస్తున్నాడు. ఎలాగో ఒక పెద్ద బావి వద్దకు వచ్చాడు.

బావి గోడపై రాయిని ఉంచి నీళ్లి తాగడానికి తిరిగాడు హాన్స్. అయ్యో! అలా తిరగడంతో రాయికి చెయ్యి తగిలి అది బావిలో పడిపోయింది! "నా బరువులు అన్నీ తగ్గిపోయాయి!" అంటూ తన తల్లిని కలవడానికి ఇంటికి పరిగెత్తాడు హాన్స్!



జర్మన్ జానపద కథ ఆధారంగా

© Katha Jharna 2008

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi


Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

బంగారు ముంగిస

యుద్ధం ముగిసిన తరవాత, పాండవులు గొప్ప వేడుకలు నిర్వహించారు. అన్ని దేశాల రాజులను యుధిష్ఠిరుడు ఆహ్వానించాడు. అతను సామాన్య ప్రజలకు బహుమతులు ఇచ్చాడు, దానధర్మాలు చేశాడు. సంగీతం, నృత్యం తోపాటు అందరికీ తగినంత ఆహారం ఉంది.

ఈ ఆనందం మధ్యలో ఒక ముంగిస ఉత్సవ మందిరంలో కనిపించింది. అందరూ ఆశ్చర్యంగా చూశారు. ముంగిస శరీరం సగం బంగారు రంగులో ఉంది. మిణుకుమిణుకుమనే కాంతిలో అది మెరుస్తోంది.





నిశ్శబ్దంగా ముంగిస పాకుతూ వెళ్లింది. అది చక్రవర్తిని చేరుకున్నప్పుడు, "ధర్మరాజా! ఇది నిజంగా అద్భుతమైన పండగ. నీ సంపదను పంచి, బహుమతులు కుమ్మరించావు, దానధర్మాలు చేశావు," అని చెప్పింది.

ముంగిసకు యుధిష్ఠిరుడు నమస్కరించాడు.

"అయితే, నీ దాతృత్వం పరిపూర్ణమైనది కాదు," చెప్పింది ముంగిస

"ఎందుకు? ఇక్కడ ఏం లోపించింది? నేను ఎక్కడ విఫలమయ్యాను?" అని యుధిష్ఠిరుడు అడిగాడు.

"నీ దాతృత్వం కంటే గొప్పగా ఉన్న ఒక పేదవాడి గురించి నాకు తెలుసు! నా వళ్లు సగం బంగారం అయిన కథ వినండి, మీరు అర్థం చేసుకుంటారు."

అప్పుడు ముంగిస తన కథను ప్రారంభించింది:

నేను చెప్పే వ్యక్తి చాలా పేద గ్రామీణుడు. పొలంలో కష్టపడి పనిచేసినప్పటికీ, చాలా కొంచెం ధాన్యం మాత్రమే వచ్చేది. దీనితోనే కుటుంబ సభ్యులు బతికేవాళ్లు. అయితే, ఎన్నో సంవత్సరాలుగా వాళ్లు ఆకలి అంచున జీవిస్తున్నారు.

అప్పుడు, భయంకరమైన కరువు వచ్చింది. ఒకప్పుడు చాలా తక్కువ ఉన్న చోట, ఇప్పుడు ఏమీ లేదు. మొత్తం కుటుంబం మూడు రోజులు ఆకలితో ఉంది. నాల్గవ రోజు, ఆ పేద గ్రామస్తుడికి కొన్ని గింజలు దొరికాయి. వాటిని అతను ఇంటికి తీసుకువచ్చి పిండి చేశాడు. సాయంత్రం భోజనం తయారు అయ్యింది.

అప్పుడే ఒక సన్యాసి ఆ ఇంటికి వచ్చాడు. "నాకు ఆకలిగా ఉంది," అని అతను చెప్పాడు. పేద గ్రామస్తుడు అతనికి తన వాటా ఆహారం ఇచ్చాడు. కానీ సన్యాసి సంతృప్తి చెందలేదు. అతను మరింత ఆహారం కావాలని అడిగాడు. గ్రామస్థుడి భార్య అతనికి తన వాటా ఇచ్చింది.

సన్యాసి మరింత అడిగాడు. గ్రామస్థుడి కొడుకు తన వాటాను వదులుకున్నాడు. ఆ సన్యాసి దాన్ని తిన్నాడు. ఇంకా కావాలని అన్నాడు! ఇప్పుడు కోడలు తన భాగాన్ని వదులుకుంది.

చివరకి, సన్యాసి కడుపు నిండింది. తరవాత అతను, "ఆకలితో ఉన్నప్పటికీ మీరు నాకు సంతోషంగా అన్నం పెట్టారు. రాజు దాతృత్వం కంటే మీ దాతృత్వం గొప్పది!" అని వారిని ఆశీర్వదించి అదృశ్యమయ్యాడు.

"ఇదంతా నా కళ్లతో చూశాను," అని ముంగిస కొనసాగించింది.



"తరవాత, నేను ఇంటి నుండి బయటకు వెళ్లాను. నేల మీద ఉన్న పిండి కొంత నా వంటికి అంటుకుంది. నా శరీరంలోని ఆ భాగం బంగారు రంగులోకి మారింది.

"అప్పటి నుండి నేను చాలా ప్రదేశాలు తిరిగాను. మిగిలిన సగం శరీరం బంగారు రంగులోకి మారడం కోసం దొర్లేదానిని. కానీ, ఇప్పటివరకు మిగిలిన సగం బంగారు రంగులోకి మారలేదు.

"ఈ రోజు మీ విజయ వేడుకకు ఆశతో వచ్చాను. నేను ఈ ప్రాంగణంలో దొర్లుతూ వచ్చాను. కానీ, మిగిలిన సగ భాగం బంగారంగా మారలేదన్నది మీరే చూశారు.

"మీ దాతృత్వం దారి చూపే కాంతిగా వెలుగుతుంది. కానీ నా కథలోని పేదవాడి దాతృత్వానికి అది సరిపోదు."

యుధిష్ఠిరుడికి నమస్కరించి ముంగిస అదృశ్యమైంది. నోట మాట లేకుండా శ్రోతలు అలా నిలబడిపోయారు.



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi


Telugu K, Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

నేను ఎవరు?


మెరిసే పసుపు రంగు బంతి
ఏ ఆట కోసం కాదు
మీ నోటిలో పెట్టుకోండి
దాని తీపిని ఆస్వాదించండి!



మూడు మూలల ఇంటి లోపల
బంగాళాదుంప, మసాలా మిశ్రమం
ప్రతి ఒక్కరూ ఇష్టంగా తింటారు

గుండ్రటి, లోతు తక్కువ గిన్నెలలో
ఆవిరితో ఉడుకుతాయి
సాంబారు, పచ్చడి, కారం-
దేనితోనైనా బాగుంటాయి


శనగపప్పు, బెల్లం ఉడకబెట్టు
ఆరినాక ఉండలా చుట్టు
దోసె పిండిలో ముంచి నూనెలో వేయించు
వేడిగా ఉన్నప్పుడే కమ్మగా ఆరగించు!



గోధుమ పిండితో నన్ను చేస్తారు
గుండ్రంగా, చదునుగా ఉంటాను
మరిగే నూనెలో దూకితే
లావుగా పొంగిపోతాను!

చిక్కుపడిన తాడులా గుండ్రంగా ఉంటాను
నూనెలో వేయించి చక్కెర పాకంలో వేస్తారు
వేడిగా తినడం మంచిది - త్వరపడండి! త్వరపడండి!

నిప్పు పైన ఒక గుండ్రని, నల్ల పళ్లెం
పళ్లెం పైన పలచటి, తెల్లటి వృత్తం
ఆగండి! ఇది కాలి, గోధుమ రంగులోకి మారుతోంది...
ఆలుగడ్డ మసాలా పెట్టండి, తినటానికి సిద్ధం!




బియ్యం, పాలు, చక్కెర
వీటితో పలచగా ఉండేలా వండుతారు
ఏలకలు, జీడిపప్పు వేస్తారు
వేడుకలు, పండగలలో తప్పకుండా ఉంటాను

బియ్యం, పెసరపప్పు కలిపి వండుతారు
తీపి కోసం బెల్లం కలుపుతారు
ఏలకలు, నెయ్యి, పప్పులతో రుచిగా ఉంటాను

చుట్లు చుడుతూ నూనెలో వేయిస్తారు:
కరకరలాడుతూ రుచిగా ఉంటాను
పళ్లను అప్పుడప్పుడు పరీక్షిస్తాను!

గుండ్రంగా, మధ్యలో చిల్లుతో ఉంటాను
బయట కరకరలాడుతూ, లోపల మెత్తగా ఉంటాను
సాంబారు, పచ్చడితో తింటారు
పెరుగు కలిపి ఉంచితే నా పేరు, రుచి మారిపోతాయి



కాగితం పొరలతో చుట్టినట్లు ఉంటాను
లోపల చెక్కర లేదా బెల్లం పొడితో ఉంటాను

ఇడ్లీ, దోస, పొంగలి, లడ్డూ, జిలేబీ, పూర్ణం, పూతరేకులు,
మురుకులు, వడ, పూరీ, సమోసా, పాయసం

నన్ను బాగా వాయించు!
నేను సంగీతం వినిపిస్తాను!
ఇద్దరం కలిసి ఇలాగే ఆడదాం!





నేను ఎగరగలను - కానీ డేగను కాదు
కిందకి వాలతాను - కానీ గుడ్లగూబను కాదు
రంగురంగులవాడిని - కానీ చిలుకను కాదు
పిల్లలు నాతో ఆడుకోటానికి ఇష్టపడతారు!

ఈ పురాతన ఆట కోసం
మనకు కావలసిందల్లా
తాడు, కొంతమంది స్నేహితులు
నువ్వు నాతో ఆడతావా?


గాలిలో పైకి చాలా ఎత్తుకు వెళతాను
చెట్ల చిటారు కొమ్మలను చేరుకుంటాను
కిందికి వస్తాను, మళ్లీ పైకి వెళతాను!
పైకి కిందికి, పైకి కిందికి, పైకి కిందికి

నా చుట్టూ తాడు చుట్టండి
ఒడుపుగా కిందకి విసరండి-
ఒంటి కాలి మీద గిర్రున తిరుగుతాను





వేళ్లతో తడితే
పైకి వెళతాను
సూదితో గుచ్చితే
బూమ్ అంటూ పగులుతాను!




ఈ చెక్క ఇంట్లో పద్నాలుగు గదులు ఉన్నాయి
అక్కడ ఎవరు ఉన్నారు? నాట్యం చేసే డెబ్బై పిల్లలు!

చిన్నగా ఉన్న దేనినైనా-
మీ కళ్లకు పెద్దగా కనపడేలా చేస్తాను!

ఊగుతూ, గిరగిరా తిరుగుతూ
నా ఏనుగులు, గుర్రాలు
పిల్లల్ని వినోదపరుస్తాయి



నా కాళ్లు నడవవు, చేతులు చప్పట్లు కొట్టవు
నోరు మాట్లాడదు, వేళ్లు చిటికెలు వేయవు
పిల్లలు దగ్గరలో ఉన్నప్పుడు ప్రాణం పోసుకుంటాను
వాళ్లు నాతో ఆడుకుంటారు, ఎంతో ముద్దు చేస్తారు



నన్ను పైకి విసిరేస్తే - తిరిగి కిందకి పడతాను
నేలకేసి కొడితే – మళ్లీ పైకి ఎగురుతాను

ఉయ్యాల, బెలూన్, బొమ్మ, బంతి, భూతద్దం, రంగులరాట్నం,
గాలిపటం, తాడాట, వామనగుంట, బొంగరం, డప్పు

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation


P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

85 టమాటలన్నీ ఎక్కడ ఉన్నాయి?




మోహన్ తోట చాలా బాగుంది. టమోటా మొక్కలు బాగా పెరిగాయి. వాటి పండ్లు గట్టిగా, ఎర్రగా ఉన్నాయి. మోహన్ తన టమోటాల గురించి చాలా గర్వపడ్డాడు!

ఒక రోజు ఒక జింక తోటలోకి వచ్చింది. మోహన్ దానిని భయపెట్టడానికి ఒక రాయిని తీసుకున్నాడు. కానీ అతని భార్య, "జింకను కొట్టవద్దు! అది కొన్ని టమోటాలను తిని వెళ్లిపోతుంది," అని చెప్పింది.

కానీ మోహన్ ఆమెను నమ్మలేదు. తోట చుట్టూ కంచె కట్టాడు. "ఇప్పుడు టమోటాలు సురక్షితంగా ఉన్నాయి," అని అతను అనుకున్నాడు.





అప్పుడు తోటకు పక్షులు గుంపులుగా రావడం ప్రారంభించాయి. అవి టమోటాల విందు చేసుకున్నాయి! పాపం మోహన్, "నా టమోటాలను ఎవరూ కొనరు!" అని ఆందోళన చెందసాగాడు.


మరుసటి రోజు తెల్లవారుజామున తోటకు వెళ్లి పండిన టమోటాలు అన్నింటినీ కోసుకున్నాడు. వాటన్నింటినీ ఒక బండిలోకి ఎక్కించి పట్టణానికి బయలుదేరాడు. ఎద్దు వేగంగా వెళ్లేలా అదిలించసాగాడు.

పట్టణంలో, మోహన్ తన బండిని ఆపి టమోటాలు తీసుకోవడానికి వెళ్లాడు. అయ్యో! బండి ఖాళీగా ఉంది! "నా టమోటాలు ఎక్కడ ఉన్నాయి?" అతను విలపించాడు. తరవాత పరీక్షగా చూశాడు. ఆ! బండి వెనక ఒక రంధ్రం ఉంది! ఆ రంధ్రం గుండా టమోటాలన్నీ పడిపోయాయి!

మోహన్ ఏడుస్తూ కూర్చోకుండా, "నా టమోటాలన్నింటినీ కనుగొంటాను!" అని శపథం చేశాడు. అతను బండిని తిప్పి వెనక్కి వెళ్లాడు. కానీ అతనికి ఒక్క టమోటా కూడా కనపడలేదు!

ఇది చాలా గందరగోళంగా ఉంది. అప్పుడు మోహన్ రెండు జింక పిల్లలను గమనించాడు. అవి టమోటాలను ఇష్టంగా తింటున్నాయి!

దారి పక్కన పెరుగుతున్న పొదపైన చెట్టు పక్క నుంచి బండిని పోనిచ్చాడు. "చీప్, చీప్, చీప్..." తన పైన ఉన్న కొమ్మలలోకి మోహన్ చూశాడు. అక్కడ పక్షి గూడు ఉంది. తల్లి, తండ్రి పక్షులు తమ పిల్లలకు టమోటాలు తినిపిస్తున్నాయి!



అదే చెట్టు మరొక కొమ్మపై, కొన్ని ఉడతలు కబుర్లు చెప్పుకోవడం అతను చూశాడు. అవి కూడా టమోటాలను తింటున్నాయి! 'నా టమోటాలు నాకు తిరిగి దొరకవు,' అతను తనలో తాను అనుకున్నాడు.

ఇప్పుడు ఎద్దును అదిలించకుండా దాని వేగంలో వెళ్లనిచ్చాడు. వంపులు తిరిగిన దారిలో బండి నెమ్మదిగా వెళుతోంది. కొంతసేపటి తరవాత అది ఒక చిన్న ఇంటి దగ్గరకు వచ్చింది. లోపల పిల్లలు నవ్వుతూ ఆడుకుంటున్న శబ్దం మోహన్‌కి వినిపించింది.

ఆ శబ్దానికి ఆకర్షితుడై, బండిని ఆపాడు. ఎంత చక్కటి దృశ్యం! పిల్లలందరి చేతుల్లో టమోటాలు ఉన్నాయి. వారి ముఖాలు చిరునవ్వులతో వెలిగిపోతున్నాయి. "నా విలువైన టమోటాలు ఈ లోకంలోకి ఎంత ఆనందాన్ని తెచ్చాయి!" అనుకున్నాడు మోహన్.

తన టమోటాలు పోవవడం ఇప్పుడు అతన్ని బాధపెట్టడం మానేసింది. తేలికైన హృదయంతో అతను ఇంటికి చేరుకున్నాడు.



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

మూడు బంగారు బొమ్మలు



విజయనగరం ఉత్సాహంతో కళకళలాడుతోంది. ఆ నగరానికి వచ్చిన ఒక పండితుడు తనతో పాటు మూడు బంగారు బొమ్మలను తీసుకువచ్చాడు. మూడు బొమ్మలు సరిగ్గా ఒకేలా కనిపించాయి. వాటిని చూసిన ప్రతి ఒక్కరూ అవి ఒకేలా ఉన్నాయని భావించారు.

"ఈ మూడు బొమ్మలు ఒకేలా కనిపిస్తాయి. కానీ, వాటిలో ప్రతి ఒక్కటి మిగతా రెండింటి కంటే ప్రత్యేకమైనవి," అని పండితుడు అన్నాడు.

"ఎవరైనా బొమ్మల మధ్య తేడాలను కనుగొనగలిగితే, అతనికి బొమ్మలతో పాటు 10,000 బంగారు నాణాల బహుమతిని ఇస్తాను. బొమ్మల మధ్య తేడాలను పది రోజుల లోపల ఎవరూ కనుగొనలేకపోతే, మీరు నాకు 10,000 బంగారు నాణాలు ఇవ్వాలి!" అని అతను ప్రకటించాడు,

ఇది రాజుకు అతను విసిరిన సవాలు. అందుకు రాజు ఒప్పుకున్నాడు.

రాజ్యం అంతటా సందడి, గుసగుసలు వ్యాపించాయి! బొమ్మలను ప్రదర్శనలో ఉంచారు. వాటిని చూడటానికి ప్రజలు గుమిగూడారు.

తొమ్మిది రోజులు గడిచిపోయాయి. కానీ తేడాలను ఎవరూ గుర్తించలేదు.

రాజు ఆందోళన చెందాడు. 'ఈ పండితుడు బహిరంగంగా విజయాన్ని ప్రకటిస్తాడు. ఓటమిని ఒప్పుకోవటం నేను భరించలేను!' అని అతను అనుకున్నాడు.

"ఓ రాజా, ప్రశాంతంగా ఉండండి. బొమ్మల మధ్య తేడాలను సమయం లోపల కనుగొంటాను," అని తెనాలి రామలింగడు అన్నాడు.

మరుసటి రోజు, తెనాలి రామలింగడు స్వయంగా వచ్చి బొమ్మలను పరిశీలించాడు. ఒక గుంపు గుమిగూడింది. రాజ్య గౌరవాన్ని వాళ్ల తెలివైన మంత్రి ఎలా నిలబెడతాడు?



కొంతసేపటి తరవాత, తెనాలి రామలింగడు సభ నుండి బయటకు వెళ్ళి సన్నని పుల్లతో తిరిగి వచ్చాడు. దానిని అతను మొదటి బొమ్మ చెవిలో పెట్టాడు. అతను పుల్లను పెట్టినప్పుడు, అది బొమ్మ రెండవ చెవి నుండి బయటకు వచ్చింది!

అతను రెండవ బొమ్మ చెవిలో పుల్లను పెట్టాడు. ఈసారి అది బొమ్మ నోటి ద్వారా బయటకు వచ్చింది!

కానీ, మూడవ బొమ్మ చెవిలో పుల్లను పెట్టినప్పుడు, అది బయటకు రాలేదు!



తెనాలి రామలింగడు పండితుడి వైపు తిరిగి, "నువ్వు ఎదురు చూస్తున్న తేడాలు ఇవే: మొదటి బొమ్మ మూర్ఖుల గురించి చెపుతుంది. మూర్ఖుడి చెవిలోకి వెళ్లేది మరొక చెవిలో నుండి వస్తుంది. రెండవ బొమ్మ సామాన్యుల గురించి చెపుతుంది. వారు ఏమి విన్నా అది వాళ్ల నోటి నుండి వస్తుంది.

"మూడవ బొమ్మ మనకు తెలివైన వ్యక్తిని చూపిస్తుంది. తెలివైన వ్యక్తి మాట్లాడే ముందు ఆలోచిస్తాడు. ఈ వ్యక్తి ఏమి విన్నా అది మొదట మనస్సులో ఉంటుంది."

పండితుడి నోట మాట రాలేదు. అతను తెనాలి రాముడికి నమస్కరించి మూడు బంగారు బొమ్మలను అతనికి ఇచ్చాడు. తరవాత అతనికి నాణాల సంచిని ఇచ్చాడు. జనం హర్షధ్వానాలు చేశారు.

వెంటనే రెండు బహుమతులను రాజుకు అందజేశాడు తెనాలి రామలింగడు. అతనికి పది వేల బంగారు నాణాలు ఇచ్చి సన్మానించాడు రాజు.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

87 మా తోట

నీలి ఆకాశం... పిల్ల గాలులు... లేత ఎండ... గాలికి ఊగుతున్న అనేక రంగుల పూలతో నిండిన తోట! గులాబీ, మల్లె, బంతి పువ్వు, కమలం, చేమంతి, మందార- ఇవన్నీ తోటలో కలిసి ఉన్నాయి.

పువ్వుల మధ్య పొదలు, గడ్డి, పాకే తీగలు ఉన్నాయి! అన్ని వన్నెల ఆకుపచ్చతో పువ్వుల రంగులు ఇంకా మెరిసిపోతున్నాయి, వాటి అందాన్ని మరింత పెంచుతున్నాయి.

అక్కడ ఉండే వాళ్లు తమ తోట గురించి ఎంతో గర్వ పడతారు!



ఒక రోజు తోటమాలి ఒక కొత్త పూల మొక్కను తెచ్చాడు. దానిని తోట మధ్యలో నాటాడు. దానివి అసాధారణమైన ఎరుపు రంగు పువ్వులు. ఇతర పువ్వులు నిరాశ చెందాయి! కొత్త ఎర్ర పువ్వును అవి ఇష్టపడలేదు.

కొత్త పువ్వు ఒంటరిగా మిగిలిపోయింది. అది నిశ్శబ్దంగా దుఃఖిస్తోంది.

ఒక రోజు, ఒక చిన్న, తెల్ల గులాబీ దానిని గమనించింది. "నువ్వు ఎక్కడి నుండి వచ్చావు?" అని అది అడిగింది.

ఎర్రటి పువ్వు ముఖం విప్పారింది. చిన్న, తెల్ల గులాబీకి తాను వచ్చిన సుదూర ప్రదేశం గురించి చెప్పింది. చిన్న, తెల్ల గులాబీ ఆసక్తిగా వింది. ఎర్రటి పువ్వుకు అది ఇక్కడి వివరాలు చెప్పింది: రుతువులలో మార్పులు, నేలల్లో తేడాలు, అన్ని మొక్కల వివరాలు. త్వరలో రెండు పువ్వులూ మంచి స్నేహితులు అయ్యాయి. అవి ప్రతి రోజూ చాలా విషయాలు మాట్లాడుకునేవి. వాటి స్నేహం రోజురోజుకీ పెరుగుతోంది.

అలా ఉండగా ఒక రోజు తోటమాలి చాలా కొత్త మొక్కలను తెచ్చాడు. తోటలోని మొక్కలు ఆందోళన చెందసాగాయి. వాటి అందమైన తోట వివిధ రకాల పూలతో నిండిపోతుందా? అవి ఆందోళనతో వేచి ఉన్నాయి.

"మీరు అంతగా ఎందుకు చింతిస్తున్నారు? ఈ పువ్వులు మన తోటలోకి వచ్చాయి. త్వరలో అవి మన స్నేహితులు అవుతాయి!" అని చిన్న, తెల్ల గులాబీ చెప్పింది. దాని మాటలు కొన్ని పువ్వులకు ఓదార్పును ఇచ్చాయి!

తేనె తాగడానికి తేనెటీగలు, సీతాకోకచిలుకలు వచ్చినప్పుడు, కొన్ని పువ్వులు, "కొత్త పువ్వుల వద్దకు వెళ్లవద్దు. అవి మా స్నేహితులు కాదు!" అని అరిచేవి.

కానీ తేనెటీగలు, సీతాకోకచిలుకలు చాలా తోటలను చూశాయి. "మీరు ఎంత అదృష్టవంతులు! ఇక్కడ మీకు సారవంతమైన నేల ఎంతో ఉంది. తాజా గాలులు, నీరు, సూర్యకాంతి ఉన్నాయి. చాలా రకాల పురుగులు కూడా ఉన్నాయి!" అని అవి సమాధానం ఇచ్చాయి.


ఇప్పటికే కొత్త మొక్కలు బాగా పెరుగుతున్నాయి. సూర్యకిరణాలు ప్రతి పువ్వును కాంతివంతం చేస్తున్నాయి. వాన చినుకులు వాటిని తడుపుతున్నాయి. పిల్ల గాలులు వాటిని తాజాగా చేస్తున్నాయి. తోట అద్భుతంగా ఉంది!

తోటను చూడటానికి దగ్గర, దూరాల నుండి ప్రజలు వస్తున్నారు.

పాత పువ్వుల భయాలు పోయాయి. "తెల్ల గులాబీ, తేనెటీగలు, సీతాకోకచిలుకలు అన్నీ నిజమే చెప్పాయి!" అని అవి గ్రహించాయి. "కొత్త పువ్వులు మాకు ఎటువంటి హాని చేయలేదు! అవి మా స్థానాన్ని ఆక్రమించలేదు!"

ఇప్పుడు తోట ప్రశాంతంగా ఉంది, స్నేహంతో ఐక్యంగా ఉంది. "ఎన్ని రంగులో చూడండి! ఎన్ని రకాల పువ్వులో! ఇంత అద్భుతమైన తోటను మేం ఎప్పుడూ చూడలేదు!" అని సందర్శకులు ఆశ్చర్యపోతారు.

అడ్రియెస్ ఫాస్టర్ పాటర్ రాసిన కథ ఆధారంగా



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

88 మూర్ఖులు కావాలి!

అక్బర్, బీర్బల్ వాదులాడుకుంటున్నారు. "ఒక వ్యక్తి జ్ఞానో కాదో తేలికగా చెప్పవచ్చు. కానీ మూర్ఖులను గుర్తించడం అంత తేలిక కాదు," అన్నది అక్బర్ వాదన.

"జ్ఞానుల కంటే మూర్ఖులను గుర్తించడం తేలిక," అన్నది బీర్బల్ వాదన.

"రేపు మధ్యాహ్ననికి ఎనిమిది మంది మూర్ఖులను చూపిస్తే, వాళ్లకి బహుమతులు ఇస్తాను. మీకు కూడా బహుమతి ఉంటుంది!" అన్నాడు అక్బర్.

దాంతో మరునాటి ప్రశాంత శీతాకాలపు ఉదయాన మూర్ఖుల కోసం వెతుకుతూ బీర్బల్ బయలుదేరాడు.



అతను చూసిన మొదటి వ్యక్తి గాడిదపై స్వారీ చేస్తున్నాడు. ఆ వ్యక్తి తన తలపై ఒక పెద్ద మూటను మోస్తున్నాడు. "గాడిద వీపుపై కాకుండా నీ తలపై మూటను ఎందుకు పెట్టుకున్నావు?" అని బీర్బల్ అడిగాడు.

"నా గాడిద చాలా సంవత్సరాలుగా నాకు సేవ చేసింది. ఇప్పుడు అది ముసలిది అయ్యి దాని బలాన్ని కోల్పోయింది. దాని మీద ఎక్కువ బరువు వెయ్యకూడదని మూటను నెత్తి మీద పెట్టున్నాను," అని ఆ వ్యక్తి జవాబు ఇచ్చాడు.

బీర్బల్ నవ్వాడు. "ఈ మధ్యాహ్నం రాజభవనానికి రా. రాజు నీకు బహుమతి ఇస్తాడు," అని చెప్పి ముందుకు సాగిపోయాడు.

కొంతసేపటి తరవాత అతనికి ఒక రైతు, అతని కొడుకు కనిపించారు. ఒక పొలంలో వాళ్లు ఏదో వెతుకుతున్నారు. వాళ్ల దగ్గరకు వెళ్లి, "ఏం వెతుకుతున్నారు?" అని బీర్బల్ అడిగాడు.

"పాతిపెట్టిన మా సొమ్ము కోసం వెతుకుతున్నాం," రైతు అన్నాడు.

"గుర్తుగా ఏమీ పెట్టలేదా?" అని బీర్బల్ అడిగాడు.

"పొలంలో నాట్యం చేస్తున్న నెమలి దగ్గర మేం గుంత తవ్వాం," అని కొడుకు అన్నాడు.

బీర్బల్ నవ్వుతూ వాళ్లని రాజభవనానికి రమ్మని చెప్పాడు. కొంచెం దూరం వెళ్లిన తరవాత దారి మధ్యలో గొడవ పడుతున్న ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వాళ్లని ఆపి, "మీరు ఎందుకు గొడవ పడుతున్నారు?" అని బీర్బల్ అడిగాడు. ఆ వ్యక్తుల్లో ఒకతను, "ఒక ఎద్దు ఉంటే బాగుంటుందని ఇతనికి చెప్పాను. నా ఎద్దు మీదకి పులిని పంపిస్తానని అతను బెదిరిస్తున్నాడు!" అని చెప్పాడు. "నీ ఎద్దును నా పులి తినేలా తప్పకుండా చేస్తాను," అని రెండవ వ్యక్తి అన్నాడు.

బీర్బల్ చుట్టూ చూసి, "నీ పులి ఎక్కడ ఉంది?" అని అడిగాడు.

"దేవుడిని వరం అడగాలని అనుకుంటున్నాం. నేను ఎద్దును అడుగుతానంటే, ఇతను పులిని అడుగుతాడంట. నా ఎద్దు చనిపోవాలని అతను కోరుకుంటున్నాడు," అని మొదటి వ్యక్తి అన్నాడు.

బీర్బల్ నవ్వాడు. వాళ్లిద్దరినీ రాజభవనానికి రమ్మని చెప్పాడు.

కొంచెం దూరం వెళ్లేసరికి బురద గుంటలో పడిపోయిన వ్యక్తి కనిపించాడు. ఆ మనిషి తన చేతులను గాలిలో పట్టుకుని ఉన్నాడు. అతనికి సహాయం చేయడానికి బీర్బల్ చేయి చాపాడు. "నా చేతులను ముట్టుకోవద్దు! నేను చేస్తున్న బీరువా కొలతలు ఇప్పుడే తీసుకున్నాను. నా చేతులను కదిలిస్తే వాటిని మరచిపోతాను," అని ఆ వ్యక్తి అన్నాడు.



అతన్ని కూడా రాజభవనానికి రమ్మని బీర్బల్ చెప్పాడు.

మధ్యాహ్నం అయింది. సభికులందరూ ఉన్నారు. బీర్బల్ పిలిచిన ఆరుగురు వ్యక్తులు తాము చేసిన పని వివరించారు. అందరూ నవ్వుతుంటే, వాళ్లు గందరగోళంగా చుట్టూ చూశారు. అక్బర్ బహుమతులు ఇవ్వటంతో వాళ్లు సంతోషంగా వెళ్లిపోయారు.

బీర్బల్ వైపు తిరిగి, "మీకు బహుమతి లేదు! ఎనిమిది మంది మూర్ఖులను తెమ్మంటే మీరు ఆరుగురిని మాత్రమే తెచ్చారు!" అని అన్నాడు అక్బర్.

"మూర్ఖుల కోసం వెతుకుతూ సగం రోజు గడిపిన నేను ఏడవ మూర్ఖుడిని! ఎనిమిదవ మూర్ఖుడు..." అంటూ వాక్యం పూర్తి చెయ్యలేదు బీర్బల్.

"మూర్ఖులను వెదకమని మిమ్మల్ని పంపిన నేనే ఎనిమిదవ మూర్ఖుడిని!" అని అక్బర్ అన్నాడు. రాజభవనం నవ్వులతో ప్రతిధ్వనించింది.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

మేక పిల్ల సాహసం

ఒకప్పుడు ఒక మేక పిల్ల తన అమ్మా, నాన్నలతో అడవిలో ఉండేది. ఈ మేక పిల్ల గుహను వదిలి బయటి ప్రపంచాన్ని చూడాలని అనుకునేది. కానీ దాని అమ్మా, నాన్నా, "అడవిలో సింహాలు, పులులు ఉన్నాయి. నువ్వు ఒంటరిగా బయటకు వెళ్లకూడదు!" అని చెప్పేవి.

ఒక రోజు మేక పిల్లకి ఏమీ తోచటం లేదు. దాని అమ్మా, నాన్నలు మేత కోసం బయటకు వెళ్లాయి. 'ఎంతసేపు ఇలా ఉండాలి?' అది బాధపడింది.

మెల్లగా అది బయటకి చూసింది. పక్షులు పాడుతున్నాయి. చెట్లలో ఉడతలు కిచకిచలాడుతున్నాయి. పిల్ల గాలికి ఆకులు ఆడుతున్నాయి. మేక పిల్ల మంత్రముగ్ధురాలైంది! అది బయటికి అడుగు పెట్టింది.

చెట్ల మధ్య నడుస్తూ, మేక పిల్ల అడవిని ఆసక్తిగా చూసింది. ప్రతి కొత్త దృశ్యం దానిని మరింత దూరం తీసుకుని వెళ్లింది. చీకటి పడే వరకు అది అలా తిరుగుతూనే ఉంది.

ఇప్పుడు ఇంటికి వెళ్లే సమయం అయ్యింది. కానీ మేక పిల్లకు దారి తెలియలేదు! అది ఏం చేయాలి? అది ఒక నిమిషం ఆలోచించి, దాక్కోవడానికి సురక్షితమైన స్థలం కోసం వెతకసాగింది.






ఓహ్! ఇక్కడ ఒక గుహ ఉంది! ఆ మేక పిల్ల లోపలికి తొంగి చూసింది. గుహ ఖాళీగా ఉంది. అది అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకుంది. ఏ క్షణంలోనైనా దాని అమ్మా, నాన్నలు దాని కోసం వెతుకుతూ వస్తాయి. ఆ మేక పిల్లకి ఆ నమ్మకం బలంగా ఉంది.

అది ఒక నక్క గుహ అని దానికి తెలియదు! నక్క బయటకు వెళ్లింది. అప్పుడే అది తిరిగి వచ్చింది. మరొక జంతువు ఉనికిని గ్రహించి, గుహ ప్రవేశ ద్వారం వద్ద ఆగి, "ఎవరక్కడ! నా గుహ నుండి బయటకు రా!" అని పిలిచింది.

అమ్మా, నాన్నలు ఉంటే ఎంతో బాగుండేదని పిల్ల మేక ఎంతగానో అనుకుంది! కానీ అప్పుడు దానికి ఒక ఆలోచన వచ్చింది. అది లోతైన స్వరంతో బిగ్గరగా మాట్లాడసాగింది: "ఓయ్! నేను సింహ రాజు మామను! నేను రాత్రికి పులులను తింటాను! వెళ్లి నాకు యాభై పులులను తీసుకునిరా!"

నక్క వణికిపోయింది. 'నా గుహలో ఒక రాక్షసుడు నివాసం ఏర్పరచుకున్నాడు!' అని అనుకుంది. దాంతో అది పులుల నాయకుడు వద్దకు పరిగెత్తింది.




"పులి మామా! నా ఇంట్లో ఒక భయంకరమైన జంతువు ఉంది. భోజనానికి యాభై పులులను తెమ్మని అడుగుతోంది!" అని నక్క చెప్పింది.

"యాభై పులులను ఎలాంటి జంతువు తింటుంది?"

"పులి మామ, అది చాలా పెద్దది!" అని నక్క అంది.

"దాన్ని తరిమివేస్తాను. వెంటనే అక్కడికి నన్ను తీసుకుని వెళ్లు!" అని పులుల నాయకుడు అడిగింది.





ఇంతలో మేక పిల్ల అమ్మా, నాన్నలు తమ బిడ్డ కోసం వెతుకుతున్నాయి. దాని అడుగుజాడలను అనుసరించి నక్క గుహకి అవి చేరుకున్నాయి.

మేక పిల్లను చూసి అవి ఎంతో సంతోషించాయి! జరిగినదంతా వాటికి మేక పిల్ల చెప్పింది. నక్క త్వరలో తిరిగి వస్తుందని హెచ్చరించింది. అది ఒక పులిని కూడా తీసుకుని రావచ్చు!

తప్పించుకోవడానికి మేకలకు ఒక ఉపాయం కావాలి. అవి చాలా ఆలోచించాయి.

త్వరలోనే నక్క తిరిగి వస్తున్న శబ్దం వినిపించసాగింది. కానీ ఆ కొత్త శబ్దం ఏమిటి? లోగొంతుకలో గుర్రుమెటోంది! అది మెల్లగా దగ్గర అవుతోంది. అది బిగ్గరగా గర్జించింది. కాసేపటికి ఆ శబ్దం గుహను నింపింది! మూడు మేకలు గుహలో మరింత లోపలికి వెళ్లాయి.



నక్క మళ్లీ తన గుహలో వింత జంతువుల ఉనికిని గ్రహించింది. కానీ అది సవాలు విసిరే లోపే, "ఆఆఆఆఆ! ఆఆఆఆఆ!" అనే భయంకరమైన కేక వినిపించింది. పిల్ల మేక చెవిని తల్లి మేక లాగుతోంది!


ఇప్పుడు తండ్రి మేక లోతైన స్వరంతో, "ఎందుకు ఏడుస్తున్నావు, బిడ్డా?" అని అడిగింది. తల్లి మేక కూడా తన స్వరాన్ని మార్చుకుంది. "నా ముద్దుల బిడ్డకి ఆకలిగా ఉంది!" అని ఆమె అంది. "ఇది ఇప్పటికే ఏనుగు, ఎలుగుబంటి, గేదెను తింది. చివరిగా దానికి రుచికరమైన పులి కావాలంట!"

"అంతేనా? కాస్త ఆగండి. దగ్గరలో చాలా పులులు ఉన్నాయి! చాలా పులులను తీసుకునిరమ్మని ఒక నక్కకు చెప్పాను!" అన్నాడు తండ్రి.

దాంతో నక్క, పులి నాయకుడు వణికిపోయాయి. "ఏనుగులను, ఎలుగుబంట్లను, గేదెలను ఆ పిల్ల మింగేసింది! గుహలోకి వెళితే నన్ను ఏం చేస్తుందో?" అంటూ పులి నాయకుడు అక్కడినుంచి వేగంగా పారిపోయింది.

నక్క విషయానికొస్తే - ఏమి జరుగుతుందో చూడటానికి వేచి ఉండకుండా పరుగు తీసింది.

భారతీయ జానపద కథ



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

శ్రవణుడు

శ్రవణుడి తల్లి, తండ్రి ముసలివాళ్లు, చూపులేనివాళ్లు. కానీ వాళ్లకి ప్రేమించే కొడుకు శ్రవణుడు ఉన్నాడు. శ్రవణుడు వాళ్లని చాలా బాగా చూసుకునేవాడు. వాళ్ల అవసరాలన్నింటినీ తీర్చడానికి ప్రయత్నించేవాడు. ఒక రోజు శ్రవణుడి తల్లిదండ్రులు తీర్థ యాత్ర చేయాలన్న తమ కోరికను వ్యక్తం చేశారు. వాళ్లు సురక్షితంగా ప్రయాణించడానికి ఏం చేయాలి అని రాత్రంతా శ్రవణుడు ఆలోచించాడు.

చివరికి, అతను ఒక ప్రణాళికను రూపొందించాడు. వెంటనే దానిని అమలు చేశాడు. మొదట, అతను రెండు పెద్ద బుట్టలను ఒక బలమైన కావిడి బద్దకు కట్టాడు. తరవాత తన తల్లిదండ్రులను ఆ బుట్టల్లో కూర్చోబెట్టాడు.





కావిడిని తన భుజానికి ఎత్తుకున్నాడు. ఇప్పుడు వాళ్లు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారు!

వారు బయలుదేరినప్పుడు ఇతర గ్రామస్తులు వాళ్లని ఆశీర్వదించారు. పండ్లు, పువ్వులతో వాళ్లని సాగనంపారు.

ఈ ప్రయాణంలో శ్రవణుడు, అతని తల్లిదండ్రులు నగరాలు, పర్వతాలు, నదులు దాటుకుంటూ వెళ్లారు. ఎక్కడికి వెళ్లినా వాళ్లకి మంచితనం ఎదురయ్యింది. "ఎంత మంచి కొడుకు!" అని ప్రజలు ఆశ్చర్యపోయేవాళ్లు.

శ్రవణుడు ప్రశాంతమైన ముఖాన్ని, అతని తల్లిదండ్రుల ప్రశాంతమైన చిరునవ్వులను చూసినప్పుడు వాళ్ల కళ్లల్లో నీళ్లు తిరిగేవి.


తాము ప్రయాణిస్తున్న అద్భుతమైన ప్రదేశాలలోని ప్రజలను, దృశ్యాలను తన తల్లిదండ్రులు చూడాలని శ్రవణుడు కోరుకున్నాడు. వాళ్లకి ప్రతిదీ వివరించడానికి అతను ప్రయత్నించేవాడు. వినడం వాళ్లకి కూడా ఇష్టంగా ఉండేది. కష్టాలు, సవాళ్లను పక్కన పెడితే, ఇది ఒక ఆహ్లాదకరమైన ప్రయాణం.

ఒక రోజు వాళ్లు దట్టమైన అడవి గుండా వెళుతున్నారు. ఎంత అందమైన ప్రదేశం! పక్షుల పాటలు గాలిలో నిండిపోయాయి. జింకలు దూకుతున్నాయి. కుందేళ్లు వాటి బొరియలలోకి, బయటికి గెంతుతున్నాయి. చెట్ల మధ్య చిన్న మొక్కలు ఊగుతున్నాయి. శ్రవణుడు నడుస్తూ తన తల్లిదండ్రులకు ఇవన్నీ వివరిస్తున్నాడు.

అకస్మాత్తుగా పక్షుల పాటల స్థానంలో ఆందోళనతో కూడిన అరుపులు వినిపించసాగాయి. జింకలు చెల్లాచెదురుగా పరిగెత్తాయి. కుందేళ్లు మాయమయ్యాయి. ఇప్పుడు శ్రవణుడు జాగ్రత్తగా నడిచాడు.

వాళ్ల ముందు ఏ ప్రమాదం పొంచి ఉంది?

చీకటిపడుతుండటంతో ఆగాలని నిర్ణయించుకున్నాడు శ్రవణుడు. తల్లిదండ్రులను ఒక చెట్టు దగ్గర మెల్లగా దించాడు.



అయ్యో! వాళ్ల నీటి కుండ ఖాళీగా ఉంది. "నేను నీళ్లు తెస్తాను. మీరు నిశ్శబ్దంగా కూర్చోండి," అని శ్రవణుడు అన్నాడు.

అతను వడివడిగా నడిచాడు. కాసేపటికి, ఉరకలేస్తున్న వాగు శబ్దం అతనికి వినిపించింది. శ్రవణుడు కుండను వాగులో ముంచాడు. "గుడ, గుడ,"మంటూ శబ్దం చేస్తూ కుండ నిండుతోంది.

కోసల రాజు దశరథుడు కూడా ఆ రోజు అడవిలో ఉన్నాడు. అతను వేట కోసం అక్కడ ఉన్నాడు. శ్రవణుడి కుండలోకి నీళ్లు ప్రవహిస్తున్న శబ్దాన్ని దశరథుడు విన్నాడు. ఆ వాగులో ఒక పెద్ద జంతువు నీళ్లు తాగుతోందని అతను భావించాడు. ఆ వైపు అతను తన విల్లు నుండి బాణం వేశాడు. ఒక వ్యక్తి అరుపు వినిపించినప్పుడు అతను ఆశ్చర్యపోయాడు.

దశరథుడు ఆ శబ్దం వైపు పరిగెత్తాడు. గాయపడిన శ్రవణుడిని అతడు చూశాడు. "నన్ను క్షమించు మిత్రమా! ఈ వాగు నుండి ఒక జంతువు నీళ్లు తాగుతోంది అనుకుని బాణం వేశాను," అన్నాడు రాజు.

శ్రవణుడు మాట్లాడటానికి ఇబ్బంది పడ్డాడు. "నా గురించి చింతించకు! ఈ కుండను నా తల్లి, తండ్రి వద్దకు తీసుకుని వెళ్లు. వాళ్లు దాహంతో ఉన్నారు. వాళ్లు వృద్ధులు, అంధులు. కాబట్టి తాగడానికి వాళ్లకి సహాయం చేయండి," చెప్పాడు శ్రవణుడు.

"ఎంత ప్రేమగల కొడుకు! తల్లిదండ్రుల కోసం అతను ఎంతో త్యాగం చేశాడు! అంత గొప్ప వ్యక్తిని నేను చంపాను!" దశరథుడు దుఃఖంలో మునిగిపోయాడు.

"త్వరగా! నీళ్లు తీసుకుని వెళ్లు!" అని శ్రవణుడు చెప్పి చనిపోయాడు. శ్రవణుడి మృతదేహాన్ని తన భుజం మీద వేసుకున్నాడు దశరథుడు. మరో చేత్తో నీటి కుండను తీసుకున్నాడు. శ్రవణుడు చూపించిన వైపుకి నెమ్మదిగా వెళ్లాడు.

అడుగుల చప్పుడు విని, శ్రవణుడి తల్లిదండ్రులు, "వచ్చావా! ఇంత ఆలస్యం అయ్యింది ఏమిటి? నీ గురించి ఆందోళన చెందుతున్నాం!" అన్నారు.

దశరథుడు సిగ్గుపడ్డాడు! వణుకుతున్న చేతులతో, అతను నీటి కుండను శ్రవణుడి తల్లిదండ్రులకు ఇచ్చాడు. తరవాత శ్రవణుడు చనిపోయిన సంగతి వాళ్లకి చెప్పాడు.

శ్రవణుడి తల్లిదండ్రులు ఎంతగానో ఏడ్చారు. వాళ్ల ఏడుపులు అడవిలో ప్రతిధ్వనించాయి. వాళ్లని ఓదార్చడానికి దశరథుడు ప్రయత్నించాడు. "ఇక నుండి నన్ను మీ కొడుకుగా చూడండి. వచ్చి, నా కుటుంబంతో ఉండండి," అతను అన్నాడు.

కానీ, వాళ్లు అందుకు ఒప్పుకోలేదు. "ఈ దుఃఖాన్ని మేం భరించలేం. శ్రవణుడు లేకుండా మేం జీవించలేం," అని వాళ్లు అన్నారు. అంతేకాదు, "నీ ప్రియమైన కుమారుడు నీకు దూరమైనప్పుడు మా బాధను అర్థం చేసుకుంటావు," అంటూ వాళ్లు చనిపోయారు.

చాలా సంవత్సరాల తరవాత, తప్పనిసరి పరిస్థితుల్లో దశరథుడిని వదిలి అతని కొడుకు రాముడు అడవులకు వెళ్లాడు. దశరథుడు తన దుఃఖాన్ని భరించలేకపోయాడు. శ్రవణుడి తల్లిదండ్రుల మాటలు అతని చెవుల్లో మారుమోగాయి.

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

వేణు గానం

ఒకప్పుడు పింగ్ అనే ధనవంతుడైన వ్యాపారి ఉండేవాడు. పాపం! ఏం చేయాలో తెలియనంత డబ్బు అతని దగ్గర ఉండేది.

రోజంతా అతను డబ్బు విషయాల్లో మునిగి ఉండేవాడు. అతని పిల్లలు ఆడుకోటానికి పిలిస్తే, "సమయం లేదు, సమయం లేదు!" అని సమాధానం ఇచ్చేవాడు.

పింగ్ భార్య అతని గురించి ఆందోళన చెందేది. "నువ్వు తినవు, నిద్రపోవు. నువ్వు జబ్బుపడితే ఏం జరుగుతుంది? నీ పని అంతా వృధా అవుతుంది!"

పింగ్ ఇంటి పక్కన ఒక చిన్న గుడిసె ఉంది. ఈ గుడిసెలో భార్య, ఇద్దరు పిల్లలతో లీ ఉండేవాడు. లీ ఒక కూలీ. ప్రతి ఉదయం తెల్లవారుజామున అతను పొలం పనికి వెళ్లేవాడు. సాయంత్రం అలసిపోయి ఇంటికి తిరిగి వచ్చేవాడు.

కానీ, వేడి నీళ్లతో స్నానం చేసి, టీ తాగిన తరవాత, వేణువు వాయించేవాడు లీ. అతని భార్య, పిల్లలు పాడుతూ, నాట్యం చేసేవాళ్లు. ఆ సమయంలో వాళ్లు ఎంతో ఆనందంగా ఉండేవాళ్లు.

ఒక రోజు పింగ్ భార్య, "లీ, అతని కుటుంబం చాలా పేదవాళ్లు. అయినప్పటికీ వాళ్లు ఎంతో సంతోషంగా ఉన్నారు. లీ లాగా మనం సంతోషంగా ఎందుకు లేం?" అని అంది.





పింగ్ ఒక్క క్షణం ఆలోచించాడు.

తరవాత, "సమయం ఉంది కాబట్టి వాళ్లు సంతోషంగా ఉన్నారు," అని అన్నాడు.

అతను లీని పిలిపించి, "నువ్వు ప్రతి రోజూ కష్టపడటం చూస్తున్నాను. నీకు సహాయం చేయాలని అనుకుంటున్నాను," అని చెప్పాడు. తరవాత లీకి నాణేల సంచిని అందజేసి, "దయచేసి నీ పొరుగు స్నేహితుడి నుండి ఈ బహుమతిని స్వీకరించు," అని అన్నాడు.

డబ్బు సంచి అందుకున్న క్షణం నుండి లీకి ప్రశాంతత లేదు. అతను నాణేలను లెక్కించసాగాడు. కానీ, మధ్యలో లెక్క తప్పటంతో మళ్లీ మొదలు పెట్టాల్సి వచ్చేది. లీ భార్య లేదా అతని కూతుళ్లు అతని వేణువును తెస్తే, "సమయం లేదు! సమయం లేదు!" అని అనేవాడు.


కొత్త సమస్యలు తలెత్తాయి. డబ్బును ఎక్కడ దాచాలి? దానిని ఒక కుండలో, ఒక పెట్టెలో, ఒక అరలో ఉంచి చూశాడు. చివరికి, అతను డబ్బు సంచిని బావిలో దాచాడు.

మరో రోజు, మరొక ఆందోళన. 'డబ్బును ఎలా ఖర్చు చేయాలి?' లీ ఆలోచించాడు. 'ఒక ఎద్దును కొనాలా? నాగలిని కొనాలా?' బావి నుండి సంచిని తీసి, నాణేలను ఆరబెట్టి, వాటిని లెక్కించాడు. ఆ రాత్రి అలసిపోయి పడుకునేటప్పటికి బాగా పొద్దుపోయింది.



సమయం గడిచిపోతోంది. నాణేలను లెక్కించి, వాటి స్థానాన్ని మార్చి, వాటిని ఎలా ఖర్చు చేయాలో ఆలోచించేవాడు. రోజు ముగిసేసరికి వేణువు వాయించలేనంతగా లీ అలసిపోయేవాడు.

ఒక ఉదయం లీ మేల్కొన్నప్పుడు, పాత అలవాటు ప్రకారం ఇంటి నుండి బయటకు వెళ్లాడు. చల్లని గాలిని పీల్చుకున్నాడు, ఉదయపు ఎండని ఆస్వాదించాడు. అలసిపోయిన అతని ముఖంలోకి చూస్తూ, "డబ్బు ఒక్కటే అత్యంత విలువైనది కాదు. ప్రేమ, ఆప్యాయత మరింత విలువైనవి," అతని భార్య చెప్పింది.



ఏం చేయాలో అప్పుడు లీకి అర్థం అయ్యింది!

అతను ఆ రోజు వెదురు బొంగులను కోసి, డజను వేణువులను తయారు చేశాడు. నాణేల సంచితో పాటు వాటిని పింగ్ ఇంటికి తీసుకుని వెళ్లాడు. "ఈ డబ్బు నా శాంతిని హరించింది," అని అంటూ పింగ్‌కు ఆ సంచిని తిరిగి ఇచ్చాడు. తరవాత పింగ్‌కు వేణువులను ఇచ్చాడు. "మా ఆశీర్వాదాలతో వీటిని తీసుకోండి," అని అతను అన్నాడు.

పింగ్, అతని భార్య తమ పనులలో మునిగి ఉన్నారు.

అకస్మాత్తుగా, పింగ్ అదృష్టం మారిపోయింది. లెక్కించడానికి అతని వద్ద డబ్బు లేకుండా పోయింది! సమయం చాలా భారంగా గడుస్తోంది. ఒక రోజు అతనికి ఒక అరలో మరచిపోయిన వేణువును గమనించాడు. పింగ్ దానిని తీసుకుని వాయించసాగాడు. అతని భార్య, పిల్లలు ఆనందంతో అతని చుట్టూ చేరారు.

అప్పటి నుంచి, పింగ్, అతని కుటుంబం ప్రతి రాత్రి వేణువును వాయించేవాళ్లు. పిల్లలతో గడిపే ప్రతి క్షణాన్ని ఆస్వాదించడం పింగ్ నేర్చుకున్నాడు.

సామెత చెప్పినట్లుగా, "గొప్ప నిధి బంగారం కాదు, ఆనందం."

చైనా కథ



© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

రాజు, ఉడత

ఒకప్పుడు ఒక గొప్ప రాజు ఉండేవాడు. అతను ఎన్నో యుద్ధాలు చేశాడు! ఎంతో సంపద గెలిచాడు! చరిత్రలో అతికొద్ది మంది పాలకులు మాత్రమే అతనికి సాటి రాగలరు. ఒక రోజు, రాజభవనంలో నడుస్తున్నప్పుడు, రాజు తన అత్యంత నమ్మకమైన మంత్రితో, "నేను అన్ని విధాలుగా అందరికంటే ఉన్నతుడిని. కాబట్టి, నా సమక్షంలో ఎవరూ తనను తాను గొప్పగా చెప్పుకోకూడదు," అన్నాడు.



వృద్ధ మంత్రి ఆశ్చర్యపోయాడు. "ఓ రాజా, నన్ను క్షమించండి! ప్రజలు తమ విజయాల గురించి గొప్పలు చెప్పుకోటానికి ఇష్టపడతారు. అందులో హాని ఎక్కడ ఉంది? మీ సమక్షంలో వాళ్లు గర్వంగా మాట్లాడితే, దానిని వదిలేయండి. అది చాలా చిన్న విషయం," అతను అన్నాడు.

రాజు మౌనంగా ఉండిపోయాడు! అప్పుడు ఒక పరుషమైన స్వరం అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది. ఒక చెట్టు మీద ఒక నాణెం పట్టుకుని ఉడత కూర్చుని అరుస్తూ ఉంది.

ఉడత వైపు రాజు ఆసక్తిగా చూశాడు. అకస్మాత్తుగా అది పాడసాగింది!

సంపద విషయంలో నేనంటే రాజుకి అసూయ,

ఇది అందరికీ తెలుసయ్య!

ఈ వెర్రి పాటకు రాజుకి కోపం వచ్చి, ఉడతను పట్టుకోటానికి దూకాడు. అది తన నాణెం పడేసి పారిపోయింది. నాణాన్ని ఒడుపుగా పట్టుకుని మంత్రి వద్దకు నవ్వుతూ తిరిగి వచ్చాడు రాజు. "మీ సలహాను పాటిస్తాను," అని అతను మాట ఇచ్చాడు.



కానీ, ఆ సాయంత్రం రాజు వినోదాలలో ఉండగా, అదే ఉడత కనిపించింది! అది పైనుండి దూకి ఇలా పాడింది,

రాజు కాదు, దొంగ అతను! దీని గురించి నేను పాడతాను!

పాపం, రాజు! ఇచ్చిన మాట మరచిపోయి, ఉడతను వెంబడించడానికి లేచాడు. కానీ అతిథులు అందరూ చూస్తూ ఉండటంతో చాలా కష్టం మీద తన కోపాన్ని అణుచుకున్నాడు. ఉడత అదృష్టం!

రాజభవనంలో ఉదయం దానాలు చేస్తారు. మరుసటి రోజు ఉదయం, ఉడత అక్కడకు వచ్చి ఇలా పాడింది,

రాజు ఎంతో దానశీలుడు! అందులో నా డబ్బు ఉందని చెప్పడు!

"ఆ ఉడతను ఎవరైనా పట్టుకుంటారా?" అని రాజు గర్జించాడు. కానీ ఉడత పారిపోయింది.

భోజన సమయంలో, అది వచ్చి ఇలా పాడింది,

నా నాణెంతో తింటున్న ఆహారం
నీ వంటికి అవుతుంది సారం!







రాజు కోపంతో లేచాడు. ఉడతను పట్టుకోటానికి ప్రయత్నించాడు కానీ, అది దూకి, అందకుండా వెళ్లిపోయింది. అతను మధ్యాహ్నం ఒంటరిగా, దిగులుగా గడిపాడు.

సాయంత్రం ఉపాహార సమయంలో తినకుండా ఉడత కోసం వేచి ఉన్నాడు రాజు. అది వచ్చి ఇలా పాడింది:

ఓ రాజా, తినండి! నా సంపదను ఎలా ఖర్చు చేయాలో

ఆలోచిస్తూ ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి!

దీనిని ఏమాత్రం భరించ లేకపోయాడు రాజు.

అతను ఉడత వైపు జాగ్రత్తగా గురిపెట్టి, నాణాన్ని బలంగా విసిరాడు.



నాణెం తగలకుండా ఉడత పక్కకి దూకింది. దానిని తీసుకుని ఇలా పాడింది,

రాజు నాకు భయపడిపోయాడు! నా నాణెం నాకు తిరిగి ఇచ్చాడు!

రాజు రాత్రంతా మేల్కొని ఉన్నాడు. ఉదయం, "నా రాజ్యంలో ఉడత అన్నది లేకుండా చెయ్యబోతున్నాను!" అని మంత్రికి చెప్పి, సైన్యాధ్యక్షులను పిలవమని ఆదేశించాడు. అతనికి నచ్చచెప్పటానికి మంత్రి ప్రయత్నించాడు. "రాజ్యంలో ఉడతలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటన్నింటినీ ఎలా పట్టుకుంటాం?" అని అతను అన్నాడు.


"నా సైనికులు ప్రపంచంలోనే అత్యుత్తమమైన వాళ్లు. అన్ని ఉడతలను పట్టుకుంటారు!" అని రాజు జవాబు ఇచ్చాడు.

"నిజమే, కానీ సైనికుల గురించి ఆలోచించండి. ఇంత చిన్న, నిస్సహాయ జీవులను చంపడానికి వాళ్లు అంగీకరిస్తారా? అంతేకాకుండా, ఉడతలపై యుద్ధం చేసిన రాజుగా మిమ్మల్ని గుర్తుంచుకోవాలని కోరుకుంటున్నారా?" అంటూ మంత్రి వాదించాడు.

దాంతో యుద్ధ ప్రణాళికలను రాజు మానుకున్నాడు. "నేను నవ్వుల పాలవుతాను!" అతను అంగీకరించాడు. "కానీ నేను ఏం చేయాలి?"







"రాజా! ఉడతను పట్టించుకోకండి! మొదటి నుంచి ఆ పని చేసి ఉంటే, మీ ప్రశాంతతను కోల్పోయేవాళ్లు కాదు," అని మంత్రి అన్నాడు.

అల్పాహారం చేస్తుండగా ఉడత వచ్చినప్పుడు, రాజు ఇలా పాడాడు,


ఉడతకు రాజు సరిపోలడు, ప్రపంచంలోని జ్ఞానులు ఇదే చెప్పారు!

ఉడత నిర్ఘాంతపోయింది! అది మారు మాట్లాడకుండా రాజభవనం నుండి వెళ్లిపోయి, మళ్లీ ఎప్పుడూ కనిపించలేదు.

భారతీయ జానపద కథ (మనోజ్ దాస్ తిరిగి చెప్పిన దాని ఆధారంగా)

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation
Telugu K. Suresh
Artist Uma Krishnaswamy





కోతలు

అది పౌర్ణమి రాత్రి. జంతువులన్నీ సంబరాలు చేసుకుంటున్నాయి. "ఈ రాత్రి మన ముఖ్య అతిథి... వయస్సులో పెద్ద జంతువు! అదెవరో ముందుకు రావాలి," అని ఎలుగుబంటి పిలిచింది.

"అది నేనే!", "అది నేనే!" అని అన్ని వైపుల నుండి అరుపులు వచ్చాయి. అనేక జంతువులు ఆసక్తిగా ఎలుగుబంటి దగ్గరకు వచ్చాయి.

నిజంగా పెద్దవాళ్లు ఎవరో ఎలా కనిపెట్టాలో ఎలుగుబంటికి తెలియలేదు.

కోతికి ఒక ఆలోచన వచ్చింది. "ఒక పోటీ పెడదాం. తాము పెద్దవాళ్లం అని నిరూపించుకోవాలి," అని అది చెప్పింది. ఇతర జంతువులు అందుకు ఒప్పుకున్నాయి. దాంతో పోటీ మొదలయ్యింది.





"నేను ఈ అడవికి వచ్చినప్పుడు, ఇక్కడ వేరే జంతువులు లేవు. నేను ఒంటరిగా తిరిగాను," మొదట చెప్పింది ఏనుగు.

"ఆహా! నేను ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు, అస్సలు అడవి లేదు! చెట్లను నాటి, వాటిని పెంచింది నేనే," రెక్కలు ఆడిస్తూ చిలుక అంది.


"నిజమే! నువ్వు విత్తనాలు నాటడం నేను చూశాను! సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను వేలాడదీసి అప్పుడే ఆకాశం నుండి నేను నిచ్చెన దిగుతున్నాను," ముందుకు అడుగులు వేస్తూ అంది జింక.

అన్ని జంతువులు జింకను మెచ్చుకున్నాయి. ఇతనే అందరిలోకి ముసలివాడు అని అనుకున్నాయి.

అంతలో నక్క లేచి నిలబడింది. చాలా ముసలిది అన్నట్టు మెల్లగా నడుస్తూ ముందుకు వచ్చింది.

"సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను ఆకాశంలో వేలాడదీయడానికి జింక ఎక్కిన నిచ్చెనను నేనే తయారు చేశాను! చెట్టును నరికి పట్టీలకు మెట్లు నేనే బిగించాను. అది చాలా పెద్ద పని! జింక కోసం నిచ్చెనను సమయానికి పూర్తి చేశాను," అది చెప్పింది.





జంతువులన్నీ చప్పట్లు కొట్టాయి. 'పోటీలో నక్క కచ్చితంగా గెలుస్తుంది,' అని అవి అనుకున్నాయి.

అకస్మాత్తుగా ఏడుపు శబ్దం వినిపించింది. అది కప్ప. కళ్ళు తుడుచుకుంటూ, విచారంగా తల ఊపుతూ అది ఇలా అంది,

"నా చిన్నప్పుడు ఒక ప్రాణ స్నేహితుడు ఉండేవాడు- ఇక్కడున్న ఈ నక్కకు అతను తాత.

"ఒక రోజు నా స్నేహితుడు నాకు బహుమతిగా ఒక పండు ఇచ్చాడు. ఆ పండు విత్తనం చెట్టుగా పెరిగింది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను వేలాడదీయడానికి జింక ఎక్కిన నిచ్చెనను తయారు చేయడానికి నక్క ఉపయోగించిన కలప ఆ చెట్టు నుంచే వచ్చింది!


"నా చిన్ననాటి స్నేహితుడిని చూసి చాలా కాలం అయింది. ఇప్పుడు, చాలా జ్ఞాపకాలు నన్ను కమ్ముకుంటున్నాయి! అందుకే ఏడుస్తున్నాను."

కప్ప మాటలను జంతువులు అన్నీ శ్రద్ధగా విన్నాయి. అది మాట్లాడటం అయిపోయినప్పుడు, నక్క కూడా తన కన్నీళ్లను తుడుచుకుంది. కప్ప కథ అన్నిటినీ అంతగా కదిలించివేసింది!

కప్పను ముఖ్య అతిథిగా జంతువులు ఏకగ్రీవంగా ప్రకటించాయి. ఇప్పుడు అది నిజమైన కన్నీళ్లు పెట్టుకుంది – ఆనందంతో వచ్చే కన్నీళ్లు!

పౌర్ణమి విందు బాగా జరిగింది.

అన్ని జంతువులు దానిని ఎంతో ఆస్వాదించాయి. వాటిల్లో చాలా ఆకాశం వైపు చూస్తూ చాలా సమయం గడిపాయి.



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

టప్, టప్!

అది తుఫాను రాత్రి. వర్షం కుండపోతగా కురుస్తోంది. గాలికి చెట్ల కొమ్మలు ఊగిపోతూ ఉన్నాయి. గుహలు, బొరియలలో జంతువులు దాక్కున్నాయి. కానీ...



ఒక పులి మాత్రం అడవి నుండి బయటకు వచ్చి గ్రామంలోకి పరిగెత్తింది. తడవకుండా ఉండటానికి అది ఒక గుడిసె చూరు కిందకి చేరింది.

గుడిసె లోపల ఒక వృద్ధురాలు తనలో తాను, "నేను ఈ 'టప్, టప్'తో చాలా విసిగిపోయాను!" అని అనుకోవడం పులి విన్నది.

పడుతున్న చుక్కలకు దూరంగా ఆమె బల్లలు, పెట్టెలను జరుపుతుండటంతో అవి ఒకదానికొకటి ఢీకొన్నాయి. "బూమ్, బూమ్, బామ్, బామ్!" ఆ శబ్దం గుడిసె గోడలను కదిలించింది. "ఈ 'టప్, టప్!' ఎవరు?" పులి భయపడసాగింది.

అదే సమయంలో భోలేనాథ్ తన గాడిద కోసం వెతుకుతున్నాడు. చీకటిలో, కుండపోత వర్షంలో అతనికి ఏమీ కనపడటం లేదు. 'ఓహ్! అమ్మమ్మ గుడిసె దగ్గర దాక్కున్నది ఏమిటి? అది నా గాడిద అయి ఉండాలి!' అని అతను అనుకున్నాడు.

పులి దగ్గరకి పరిగెత్తి దాని చెవిని తిప్పాడు భోలేనాథ్. "నేను నీ కోసం అంతటా వెతికాను! నువ్వు ఇక్కడ ఉన్నావా!" అంటూ కోపంతో అరచి అతను పులి వీపు మీదకి దూకాడు. వేగంగా నడవటానికి దాని డొక్కల్లో తన్నాడు.

ఈ కొత్త అనుభవాలకు భయపడుతూ ప్రతి ఆదేశాన్ని పులి పాటించింది. ఇంటికి చేరుకున్న తరవాత దానిని కట్టేసి లోపలికి వెళ్లాడు భోలేనాథ్.

మరుసటి రోజు తెల్లవారింది. వెలుతురు బాగా వచ్చింది. భోలేనాథ్ భార్య ఇంటి నుండి బయటకు వచ్చింది. పులిని చూడగానే, "ఆఆఆఆఆ!" అంటూ ఆమె అరిచింది. భోలేనాథ్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. "ఊఊఊ!" అంటూ అతను కూడా అరిచాడు. భార్యను తిరిగి ఇంట్లోకి లాగాడు. తలుపు మూసేశాడు.

ఇప్పుడు గ్రామస్తులు పరిగెత్తుకుంటూ వచ్చారు. పులిని చూడగానే, వాళ్లు కూడా భయంతో అరిచారు. వాళ్లు అన్ని వైపులకి పారిపోయారు.



పాపం పులి! అంతా అరుపులు, గందరగోళంగా ఉంది! దానిని కట్టేసిన తాడును అది కొరికేసింది. తరవాత అడవిలోకి పరిగెత్తింది.

ఇంతలో, పులిపై భోలేనాథ్ స్వారీ చేసిన వార్త గ్రామంలో వ్యాపించింది. "అంతే కాదు! పులి చెవిని కూడా తిప్పాను!" అంటూ అతను గొప్పలు చెప్పుకున్నాడు. పులితోపాటు అతని భయం కూడా పారిపోయింది. ఇప్పుడు అతనికి గర్వంగా అనిపించింది. పులిపై స్వారీ చేశాడంటే తనకి ఎంత ధైర్యం!

పులిపై భోలేనాథ్ స్వారీ వార్త గ్రామం దాటి ఆ ప్రాంతం అంతా వ్యాపించింది. చివరికి అది రాజు చెవులకు చేరింది. అతని రాజ్యంలో అంతటి వీరుడు ఉండటం ఎంత అద్భుతం!

భోలేనాథ్‌ని సభకి రాజు పిలిచాడు. అతనిపై బహుమతుల వర్షం కురిపించాడు. "నువ్వు నిజంగా గొప్పవాడివి!" అని మెచ్చుకున్నాడు. ఇప్పుడు, భోలేనాథ్ గ్రామంలో పేరు, ప్రఖ్యాతలు ఉన్న మనిషి. అందరూ అతన్ని గౌరవించేవాళ్లు, అభినందించేవాళ్లు. భోలేనాథ్ సంతోషంగా ఉన్నాడు!

కొన్ని నెలలు గడిచాయి. అకస్మాత్తుగా శత్రు సైన్యాలు రాజ్యంపైకి దండెత్తాయి. రాజు సైన్యం తీవ్ర ఒత్తిడికి గురైంది. అప్పుడు భోలేనాథ్‌ను రాజు గుర్తుచేసుకున్నాడు. "పులిపై స్వారీ చేసిన వీరుడిని పిలవండి. అతనికి యుద్ధ గుర్రాన్ని ఇవ్వండి. అతను మన శత్రువుల దుమ్ము దులిపేస్తాడు!" అని సేవకులను పంపించాడు రాజు.

రాజు ఆజ్ఞ విని భోలేనాథ్ భయపడిపోయాడు. "నేను సాధారణ రైతుని! సైన్యానికి వ్యతిరేకంగా ఎలా పోరాడగలను?" అని అతను అన్నాడు. కానీ వేరే మార్గం లేకపోయింది. దాంతో ఎలాగో కష్టపడి గుర్రాన్ని ఎక్కాడు.



వెంటనే అతను, "నేను పడిపోతాను!" అంటూ అరిచాడు! ఒక పొడవైన తాడు తీసుకుని గుర్రానికి అతనిని భార్య గట్టిగా కట్టివేసింది.

ఆ గుర్రం గాలిలా శత్రు సైన్యం వైపు పరిగెత్తసాగింది! పాపం, దాన్ని ఎలా ఆపాలో భోలేనాథ్‌కు తెలియలేదు! దిక్కుతోచక ఒక చెట్టు కొమ్మను పట్టుకున్నాడు. కూకటివేళ్లతో చెట్టు మొత్తం అతని చేతిల్లోకి వచ్చింది! అతని బిగించిన చేతిలో అది ఒక పెద్ద ఈటె లాగా ఉంది. భయంతో అతను గట్టిగా అరిచాడు.

భోలేనాథ్ రావటం శత్రు సైనికులు చూశారు. "అతన్ని చూడండి! మొత్తం చెట్టును ఈటె లాగా ఉపయోగిస్తున్నాడు!" అని ఒకడు అన్నాడు. "ఇంతటి భయంకరమైన గుర్రాన్ని నేను ఇప్పటివరకు చూడలేదు!" అని మరొకడు అన్నాడు. మరో సైనికుడు, "అతని యుద్ధ కేక వినండి! మీదకు దూకుతున్న పులి లాగా అరుస్తున్నాడు!" అని అన్నాడు.



'ఓహ్! ఇతను పులిని స్వారీ చేసిన వీరుడు అయి ఉండాలి!' అని వాళ్లు అనుకున్నారు. అప్పుడు, వాళ్లందరూ తమ ప్రాణాల కోసం పరిగెత్తారు.

చివరికి, గుర్రం ఆగిపోయింది. భోలేనాథ్‌ను కట్టిన తాడును అది కొరికింది. భోలేనాథ్ చేతిలోంచి చెట్టు జారిపోయింది. అతను నేలపై పడ్డాడు.

'నేను బతికే ఉన్నాను!' అని అతను ఆశ్చర్యపోయాడు. గుర్రపు పగ్గాలు తీసుకుని నడవసాగాడు. జన్మలో మళ్లీ గుర్రపు స్వారీ చెయ్యడు.

అలా నడుస్తుండగా, ప్రజలు తన వైపే చూస్తుండటం అతను గమనించాడు. "మొత్తం సైన్యాన్ని ఓడించిన వ్యక్తి! అయినప్పటికీ ఒక సాధారణ వ్యక్తిలా నేలపై ఎలా నడుస్తున్నాడో చూడండి!" అని వాళ్లు అంటున్నారు. అతనిని మెచ్చుకుంటూ జేజేలు పలికారు.

భారతీయ జానపద కథ

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy

యుధిష్ఠిరుడు, యక్షుడు

పాండవుల పన్నెండేళ్ల వనవాసం ముగియబోతోంది. వాళ్లు అడవిలో ఒక జింకను వెంబడిస్తున్నారు. ఆ జింక వాళ్లని చాలా దూరం తీసుకుని వెళ్లి మాయమయ్యింది...

అలసిపోయిన పాండవులు విశ్రాంతి తీసుకోటానికి కూర్చున్నారు. తప్పించుకున్న జింక గురించి దిగులుగా చర్చించుకుంటున్నారు. వాళ్లని ఉత్సాహపరిచేందుకు ఏదో ఒక పని చెప్పాలని యుధిష్ఠిరుడు గ్రహించాడు. దాంతో, అతను నకులుడిని పిలిచి ఇలా చెప్పాడు,

"తమ్ముడూ, నాకు దాహం వేస్తోంది."

"నేను వెళ్లి నీళ్లు తెస్తాను," అంటూ నకులుడు లేచాడు.

అతను ఒక చెట్టు ఎక్కి చుట్టూ చూశాడు. కొంత దూరంలో ఒక చెరువు ఉంది. చెట్టు నుండి దిగి అక్కడికి వెళ్లాడు. చెరువు దగ్గరకు వెళ్లేసరికి అతనికి భయంకరమైన దాహం వేసింది. తాగడానికి దోసిటిలోకి నీళ్లు తీసుకున్నాడు. అప్పుడు అతనికి ఒక స్వరం వినిపించింది!

"ఆగు! నా ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన తరవాత నీళ్లు తాగు," అని అది చెప్పింది. కానీ నకులుడు ఆ స్వరాన్ని పట్టించుకోలేదు. ఒక గుక్క నీళ్లు తాగాడు. వెంటనే అతను చనిపోయాడు!





నకులుడు తిరిగి రాకపోవడంతో, వెతకడానికి సహదేవుడిని పంపాడు యుధిష్ఠిరుడు. సహదేవుడు చెరువు వద్దకు వచ్చి దాహంతో కొట్టుకుపోయాడు. తాగటానికి దోసటిలోకి నీళ్లు తీసుకున్నాడు. ఒక స్వరం అతనిని హెచ్చరించింది. తన కవల సోదరుడి లాగే, సహదేవుడు దానిని పట్టించుకోకుండా నీళ్లు తాగాడు. అతను కూడా చనిపోయాడు!

తరవాత అర్జునుడు వచ్చాడు. తన సోదరులు నేలపై కదలకుండా పడి ఉండటం చూశాడు. అతను నివ్వెరపోయి నిలబడి ఉండగా, తనను సవాలు చేసే స్వరం విన్నాడు. తన సోదరులను చంపిన శత్రువు ఇతడేనని అర్జునుడు గ్రహించాడు!

"అదృశ్య శత్రువా! నిన్ను ఏమి చేస్తానో చూడు!" అన్నాడు అర్జునుడు. అప్పుడు అతనికి దాహం వేసింది. "కొంచెం నీళ్లు తాగిన వెంటనే మనం పోరాడదాం," అని అన్నాడు. నీళ్లు తాగగానే అతను చనిపోయి, పడిపోయాడు.

ఆత్రుతగా వేచి ఉన్న తరవాత, భీముడి వైపు తిరిగి, "ప్రియమైన సోదరా! అర్జునుడు గొప్ప వీరుడు. ఇంకా తిరిగి రాలేదు. ఏదో భయంకరమైన సంఘటన జరిగి ఉండాలి. వెంటనే వెళ్లి చూడు. అలాగే, నీళ్లు తీసుకుని రా! నేను దాహంతో చనిపోతున్నాను!" అన్నాడు యుధిష్ఠిరుడు. ఏమీ మాట్లాడకుండా వెంటనే బయలుదేరాడు భీముడు. చెరువు వద్దకు చేరుకున్నప్పుడు తన తమ్ముళ్లు అక్కడ పడి ఉండటం చూశాడు. అకస్మాత్తుగా అతనికి ఒక స్వరం వినిపించింది. భీముడు దాని బెదిరింపును ధిక్కరించి నీళ్లు తాగాడు. తన సోదరుల లాగానే అతనూ చనిపోయాడు.

చివరికి దాహం, ఆందోళనతో యుధిష్ఠిరుడు బయలుదేరాడు. తన సోదరులు అక్కడ పడి ఉండటం చూసి అతను ఏడవసాగాడు. వాళ్ల వద్దకు పరిగెత్తి వాళ్ల ముఖాలను నిమిరాడు. "ఇన్ని సంవత్సరాల వనవాసాన్ని ఇందుకే భరించామా? నా గుండె బద్దలౌతోంది. ఈ లోకంలో నేను ఎలా ఉండగలను!"

అప్పుడు, "నీ తమ్ముళ్లు నా మాటలను వినకుండా నీళ్లు తాగారు. తమ అహంకారానికి వాళ్లు మూల్యం చెల్లించుకున్నారు. మీ దాహం తీర్చుకునే ముందు మీరైనా నా ప్రశ్నలకు సమాధానం చెప్పండి," అంటూ ఒక స్వరం వినిపించింది.

అది యక్షుడి గొంతు అని యుధిష్ఠిరుడు గ్రహించాడు.

"మీ ప్రశ్నలు అడగండి," అని అతను అన్నాడు.

యక్షుడు: గొడవలో ఉన్నవారిని ఏది రక్షిస్తుంది?

యుధిష్ఠిరుడు: ధైర్యం.

-ఒకరు జ్ఞాని ఎలా అవుతారు?

-జ్ఞానుల సహవాసంతో.

-పోషణలో భూమి కంటే గొప్పది ఏది?

-తల్లి.

- గాలి కంటే వేగవంతమైనది ఏమిటి?

-మనస్సు.

-ప్రయాణికుని ప్రాణ స్నేహితుడు?

-నేర్చుకోవడం.

-ఆనందం అంటే ఏమిటి?

-మనస్సు, పనుల మధ్య సామరస్యం; మంచి ప్రవర్తన.

-అందరూ ప్రేమించాలంటే మనిషి ఏం వదులుకోవాలి?


-గర్వం.

-దుఃఖాన్ని కాకుండా ఆనందాన్ని ఇచ్చే నష్టం ఏమిటి?

-కోపాన్ని పోగొట్టుకోడం.

-ధనవంతుడు కావటానికి మనిషి ఏం వదులుకోవాలి?

-కోరిక.



-విజయానికి మొదట కావలసింది ఏమిటి?

-నిరంతర కృషి.



-లాభాలలో ఉత్తమమైనది ఏది?

-ఏ వ్యాధీ లేకపోవడం.

-మరణం తరవాత మనిషికి తోడు ఎవరు?

-మరణం తరవాత ధర్మం మాత్రమే వెంట వస్తుంది.

-ప్రపంచంలో గొప్ప అద్భుతం ఏమిటి?

-జీవులు చనిపోవడం ప్రతిరోజు మానవులు చూస్తారు. అయినప్పటికీ, శాశ్వతంగా జీవించాలని వాళ్లు కోరుకుంటారు.

ఈ విధంగా యుధిష్ఠిరుడిని యక్షుడు చాలా ప్రశ్నలు అడిగాడు. వాటన్నింటికీ యుధిష్ఠిరుడు సమాధానం ఇచ్చాడు. చివరగా, "నీ సమాధానాలకు నేను సంతోషిస్తున్నాను! నీ సోదరులలో ఒకరిని ఎన్నుకో. నేను అతన్ని తిరిగి బతికిస్తాను," అని యక్షుడు అన్నాడు.

"నకులుడు కావాలి," అని యుధిష్ఠిరుడు అన్నాడు.

యక్షుడు తన నిజ రూపంతో అతని ముందు నిలబడ్డాడు! అతను, "ధర్మరాజా! నకులుడు ఎందుకు? నీ సోదరుడు భీముడికి 16,000 ఏనుగుల బలం ఉంది! నీ సోదరుడు అర్జునుడు విలు విద్యలో సాటిలేనివాడు. వాళ్లని కాదని నకులుడిని ఎందుకు ఎన్నుకున్నావు?"

"నా తండ్రికి ఇద్దరు భార్యలు- కుంతి, మాద్రి. నేను కుంతి కొడుకుని. మాద్రి కుమారులలో ఒకరు బతకాలని నేను కోరుకుంటున్నాను. అందుకనే నకులుడిని ఎన్నుకున్నాను."

"యుధిష్ఠిరా, నిన్ను చూసి గర్విస్తున్నాను! నువ్వు నిజంగా గొప్పవాడివి. ప్రతి పనిలో నువ్వు ధర్మాన్ని అనుసరిస్తావు. అందుకే, నీ సోదరులు అందరి ప్రాణాలను తిరిగి ఇస్తున్నాను," అని యక్షుడు చెప్పి అదృశ్యం అయ్యాడు.

రాజాజీ మహాభారతం లోని కొన్ని భాగాల ఆధారంగా

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi


L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh


Artist Uma Krishnaswamy

నేను ఎవరు?

నేలపై ఒక గీతని
మొదలూ లేదూ, చివరా లేదు
కానీ చాలా వచ్చి కలుస్తుంటాయి,
చాలావిడిపోతుంటాయి




ప్రతి రోజూ రెండు ప్రదేశాల మధ్య తిరుగుతుంటాను
మారుతూ ఉండే అనేక ముఖాలను చూస్తాను
చాలా మందిని ఎక్కించుకుంటాను, దింపివేస్తాను
వాళ్ల గమ్యాలను చేరుకోవడంలో సహాయం చేస్తాను



చేప లాగా నాకు రెక్కలు లేవు
తోక కూడా లేదు
తెరచాపలో గాలితో
నీటిలో దూసుకునిపోతాను

అవి ఎప్పటికీ విడిపోవు - కానీ స్నేహితులు కావు
అవి ఎప్పటికీ కలవవు - కానీ శత్రువులు కావు



కూర్చుని తొక్కితే
గుండ్రంగా తిరుగుతాను
ఇంధన ఖర్చు లేకుండా
అన్ని చోట్లూ తిప్పుతాను!




రెండు గీతల మీద
చప్పుడు చేస్తూ పరిగెడతాను, కూ, కూ!
అడవులు, కొండలు, నదులు దాటేస్తాను
ఊళ్లల్లో ఆగుతాను! కూ, కూ!
హాయ్! బై! కూ, కూ!


నేను నడవాలంటే నన్ను తన్నాలి!

రెండు గుండ్రని చక్రాలు తిరుగుతున్నాయి
రెండు బలమైన మెడలు లాగుతున్నాయి
ఎనిమిది పొడవైన కాళ్లు ముందుకు నడుస్తున్నాయి
అన్నీ చూస్తూ ఒక రైతు నన్ను నడుపుతున్నాడు



ఆకాశంలో ఎంతో ఎత్తులో విహరిస్తుంది
రెక్కలు చూడండి మెరుస్తుంటాయి
తోక పొడవుగా, నిటారుగా ఉంటుంది
చూస్తుండగానే చుక్క లాగా మారుతుంది!





మీ దృష్టిని ఆకర్షించడానికి అరుస్తాను
తరవాత మీ చెవిలో గుసగుసలాడతాను




మీరు చెప్పే ప్రతిదాన్ని తీసుకుంటాను
మీట నొక్కినప్పుడు
అదంతా తిరిగి అప్పజెపుతాను


ఎన్నో రకాలుగా ప్రయాణం చేసి
చాలా దూరం నుంచి వచ్చాను!
సంతోషాల కబుర్ల కోసం
నా కోసం ఎదురు చూస్తారు

నన్ను కొన్న తరవాత అతికిస్తారు
అతికించిన తరవాత ముద్ర వేస్తారు!

నా కొమ్ము సన్నగా, పొడవుగా ఉంటుంది!
గాలిలోని సంకేతాలను పట్టుకుని
అన్ని చోట్ల నుండి వార్తలను వినిపిస్తాను


ప్రయాణంలో దుమ్ముతో నిండి ఉంటాను
మీ తలుపు వద్దకు వస్తాను
నన్ను లోపలికి తీసుకునివెళ్లి
నా మాటలను ఆనందిస్తారు





ఈ మ్యాజిక్ పెట్టెలో
విశాల ప్రపంచాన్ని చూడగలం!


దూర దూర సందేశాలు
ఈ మెరిసే డబ్బాలో కలిసిపోతాయి
ఆ తరవాత వేరే వేరే చోట్లకి వెళతాయి



ఒక బటన్ నొక్కితే
వెళ్లే ఉత్తరాన్ని

ఉదయం సూర్యుడితో వస్తాను
నన్ను చూసి చాలా సంతోషిస్తారు!
మీ వంతు పూర్తయిన తరవాత
నన్ను ఇతరులతో పంచుకోవచ్చు -
అందరికీ కావలసినంత నాలో ఎల్లప్పుడూ ఉంటుంది

సైకిలు, బస్సు, ఎడ్ల బండి, స్కూటరు, రోడ్డు, రైలు పట్టాలు, పడవ,
రైలు, విమానం, పోస్ట్‌మ్యాన్, ఇ-మెయిల్, టెలివిజన్, వార్తాపత్రిక,
పోస్ట్ బాక్స్, రేడియో, టెలిఫోన్, ఉత్తరం, ఆడియో రికార్డర్, స్టాంపు



Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

Telugu K. Suresh

L. S. Saraswathi S. Rajalakshmi

Artist Uma Krishnaswamy

97 టోటోచాన్



ఒకప్పుడు జపాన్‌లో చాలా అసాధారణమైన పాఠశాల ఉండేది. టోటోచాన్ అనే చిన్న అమ్మాయి అక్కడ చదువుకుంది. ఆ బడి తన జీవితాన్ని మార్చివేసిందని ఆమె భావించింది. దాని గురించి అందరికీ తెలియజేయాలని ఆమె అనుకుంది. అందుకే ఆ పాఠశాల గురించి ఒక పుస్తకం రాసింది.

ఆ పాఠశాల పేరు టోమో గకుయెన్. కానీ ఆ పుస్తకం పేరు 'టోటోచాన్: ది లిటిల్ గర్ల్ ఎట్ ది విండో'. ఆమె తన పుస్తకానికి టోమో గకుయెన్ అని కాకుండా టోటోచాన్ అని పేరు ఎందుకు పెట్టింది? మీరు ఏ పుస్తకం తీసుకుంటారు? పాఠశాల గురించిన పుస్తకమా లేక కిటికీ దగ్గర కూర్చున్న చిన్న అమ్మాయి గురించిన పుస్తకమా?

టోమో గకుయెన్ పాఠశాలలో గేటు దిమ్మల కోసం రెండు మొక్కలు ఉన్నాయి. వేర్లు, ఆకులు ఉన్న గేటు దిమ్మలను ఊహించుకోండి! పాఠశాల మైదానం చుట్టూ గోడ లేదు. బదులుగా మరిన్ని చెట్లు! చెట్లు, వాటి దగ్గర పూల మడులు.

అటువంటి ప్రాంగణం లోపల, తరగతి గదులు కూడా ప్రత్యేకంగా ఉండాలి కదా? అవును, అవి ప్రత్యేకమైనవే! టోమో గకుయెన్ పాఠశాలలోని అన్ని తరగతి గదులు పాత రైలు బోగీలు. ప్రతి తరగతికి ఒకటి చొప్పున ఆరు బోగీలు ఉన్నాయి. ఈ బోగీలను శుభ్రం చేసి, రంగులు వేశారు. బయటకి రైలు పెట్టెల లాగానే ఉంటాయి! కానీ లోపల బల్లలు, కుర్చీలు, బ్లాక్‌బోర్డులు అమర్చి ఉంటాయి.

టోటోచాన్ తన తరగతి గది కిటికీ వద్ద కూర్చుని బయటకు చూసేది. రైలు కదులుతున్నట్లు ఆమె ఊహించుకునేది. అన్ని రకాల దృశ్యాలు ఆమె కళ్ల ముందు కదులుతూ ఉండేవి. కానీ ఆమె ఎక్కువసార్లు అలా చేసేది కాదు. కారణం: అలా చూస్తూ ఉంటే పాఠాలు వినలేదు కదా!

టోమో గకుయెన్ పాఠశాలలో పాఠాలు సరదాగా ఉండేవి! మొదట, ఉపాధ్యాయులు బ్లాక్‌బోర్డ్‌పై అంశాల జాబితాను రాసేవారు. తరవాత ఏమి చదవాలో పిల్లలు ఎంచుకుంటారు.



టోటోచాన్ మొదటి తరగతిలో, పిల్లలందరూ వేరు వేరు పనులు చేసేవాళ్లు. కొందరు అక్షరాలు రాయడం నేర్చుకునేవాళ్లు. ఒక అమ్మాయి ఎల్లప్పుడూ చదువుతూ కనిపిస్తుంది. ఇతర పిల్లలు బొమ్మలు గీసేవాళ్లు. కొందరు వ్యాయామం కూడా చేసేవాళ్లు. వాళ్లందరూ ఎంతో ఏకాగ్రతతో పనిచేసేవాళ్లు. టోటోచాన్ పాఠశాలలో ఎవరూ ఎప్పుడూ విసుగు చెందలేదు!

కొన్నిసార్లు పాఠశాల ప్రాంగణం బయట కూడా కార్యకలాపాలు ఉండేవి. విద్యార్థులను తరచుగా విహారానికి ఉపాధ్యాయులు తీసుకునివెళ్లేవాళ్లు. దారి పక్కన గలగల పారే సెలయేరు ఉంది. ఆ దారిలో చెర్రీ చెట్ల నీడ ఉంది. అది గుడికి దారి.

గుడిలో, విద్యార్థులు చెరువు చుట్టూ నడిచేవాళ్లు. అక్కడ ఉన్న చిన్న నల్ల గులకరాళ్లతో తొక్కుడుబిల్ల ఆడేవాళ్లు. అక్కడ ఉన్న పెద్ద విగ్రహాలను ఆశ్చర్యంగా చూసేవాళ్లు. వాళ్లు అలసిపోయే వరకు ఆడుకునిచ్చేవాళ్లు. ఈ విహారాలంటే టోటోచాన్‌కి ఎప్పుడూ ఇష్టంగా ఉండేది!



కొన్నిసార్లు పాఠశాల మొత్తం ఆడిటోరియంలో గుడారాలు వేసేవాళ్లు. వాళ్లు రాత్రి అక్కడే గడిపేవాళ్లు. పాఠశాలలోని యాభై మంది విద్యార్థులలో దాదాపు అందరూ ఈ రాత్రిపూట విహారయాత్రలకు వచ్చేవాళ్లు.

ఒక రోజు ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులతో, "మీకు ఒక పరీక్ష పెడతాను. ఇది ధైర్య పరీక్ష. మీలో కొందరు దెయ్యం వేషం వేసుకుంటారు. వాళ్లు గుడి ప్రాంగణంలో దాక్కుంటారు. మిగిలిన వాళ్లు దయ్యాలను వెతకటానికి వెళతారు."


"దెయ్యం వేషం ఎవరు వేస్తారు?" అని ఆయన అడిగాడు. ఏడుగురు పిల్లలు చేతులు ఎత్తారు.

పరీక్ష రోజు వచ్చింది. సాయంత్రం పిల్లలు ఆడిటోరియంలో తమ గుడారాలు వేసుకున్నారు. దెయ్యం వేషాలతో ఏడుగురు పిల్లలు వచ్చారు. వాళ్లు దాక్కోటానికి గుడి ప్రాంగణం లోకి వెళ్లారు.

వెళుతూ, వెళుతూ ఇతర విద్యార్థులను వెక్కిరించారు. "మిమ్మల్ని నిజంగా భయపెట్టబోతున్నాం!" అని వాళ్లు అన్నారు. మిగిలిన వాళ్లు జట్లుగా విడిపోయారు. టోటోచాన్ బృందంలో ఐదుగురు ఉన్నారు.

దెయ్యాలను వేటాడే వాళ్లతో, "మీరు దయ్యాలను కనుక్కోలేకపోయినా పరవాలేదు. వెనక్కి తిరిగి వచ్చెయ్యండి," అని ఉపాధ్యాయుడు చెప్పాడు. (పరీక్షలో తప్పినా విద్యార్థులకు శిక్ష లేకపోవడం టోమో గకుయెన్ పాఠశాలలోని మంచి విషయాలలో ఒకటి!)

సమయం అయ్యింది. జట్లు సిద్ధంగా ఉన్నాయి. "దయ్యాలను" వెతకడానికి బృందాలు బయలుదేరాయి. టోటోచాన్ బృందం నెమ్మదిగా నడుస్తోంది. చుట్టూ చీకటిగా ఉంది. కొంతమంది పిల్లలు భయంతో వణుకుతున్నారు. చెట్లలో గాలి శబ్దం చేసినప్పుడు వాళ్లు, "బా!" అంటూ ఏడ్చారు. అడుగు తడబడితే, 'దెయ్యం నన్ను పడేసింది!' అని అనుకున్నారు. స్నేహితుడు చేయి పట్టుకుంటే, ఉలిక్కిపడి, 'అది దెయ్యం చేయి!' అని అనుకున్నారు.



త్వరలోనే వాళ్లందరూ విసిగిపోయారు. తన బృందంతో కలిసి పాఠశాలకు టోటోచాన్ తిరిగి పరిగెత్తింది. ఇతర బృందాలు కూడా వాళ్ల వెనకే వచ్చాయి! కొన్ని బృందాలు అప్పటికే అక్కడికి వచ్చేశాయి! పిల్లలలో ఎవరైనా దెయ్యాలను కనుగొన్నారా?

కొంతసేపటి తరవాత "దెయ్యాలలో" ఒకటి పరిగెత్తుకుంటూ వచ్చింది. అతను చిన్న పిల్లవాడు. అతను ఏడుస్తున్నాడు. అతన్ని కనుగొనటానికి ఎవరూ రాలేదు. దాంతో అతను భయపడ్డాడు. అతను గుడి దగ్గర నిలబడి ఉండటం చూసి ఒక ఉపాధ్యాయుడు అతన్ని తిరిగి పాఠశాలకు తీసుకువచ్చాడు.

అప్పుడే మరో "దెయ్యం" ఏడుస్తూ లోపలికి వచ్చింది. అతను ఒక దెయ్యం-వేటగాడితో ఉన్నాడు. అతను కూడా ఏడుస్తున్నాడు! దెయ్యం-వేటగాడు వస్తున్నట్లు విని అతన్ని భయపెట్టడానికి అతని మీదకు దూకాడు. కానీ వాళ్లిద్దరూ ఒకరినొకరు ఢీకొన్నారు! ఇద్దరూ భయపడ్డారు! ఈ కథ చెప్పినప్పుడు మిగతా పిల్లలందరూ నవ్వారు. వెంటనే "దెయ్యాలు" కూడా నవ్వాయి.



చివరగా వార్తాపత్రికలతో తయారు చేసిన బట్టలతో ఉన్న "దెయ్యం" వచ్చింది. అది చాలా కోపంగా ఉంది. "ఎవరూ నన్ను కనుగొనడానికి ఎందుకు రాలేదు?" అని అది అడిగింది.

ఆ పిల్లవాడి చేతులు, కాళ్లు దోమల కాటుతో నిండి ఉన్నాయి. "దోమ కాట్లతో నిండిన దెయ్యం!" అంటూ పిల్లలు నవ్వారు. పాపం, ఆ "దెయ్యం" కూడా వాళ్లతో నవ్వకుండా ఉండలేకపోయింది.

ఆ రోజు నుండి, టోటోచాన్‌కి, ఆ బడి పిల్లలకి దెయ్యం అంటే భయం పోయింది. ఎందుకంటే, దెయ్యాలు కూడా భయపడతాయి!

టెట్సుకో కురొయనాగి జ్ఞాపకాలకి డోరతీ బ్రిటన్ అనువాదం ఆధారంగా
బొమ్మలు: చిహోరో ఇవాసాకి

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

జ్ఞాపకాలు

ప్రియమైన మంజు,

గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన' చదవడం ఇప్పుడే పూర్తి చేశాను. చాలా ఉత్తేజితుడిని అయ్యాను!

గాంధీజీ చిన్నతనంలో జరిగిన విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. బడిలో చదివిన ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమానికి ముందునాటి సంగతులు. గాంధీజీ జీవితం గురించి ఈ పుస్తకం ద్వారా చాలా నేర్చుకున్నాను.

అతని బాల్యం చాలా ఆసక్తికరంగా ఉంది! ప్రతి అనుభవం అతనిపై బలమైన ముద్ర వేసింది. ఉదాహరణకు, పన్నెండేళ్ల వయసులో అతను శ్రవణుడు గురించి ఒక పుస్తకం చదివాడు. నువ్వు శ్రవణుడు గురించి విన్నావా? అతని తల్లిదండ్రులకు చూపు లేదు. ప్రతిదానికీ వాళ్లు కొడుకుపై ఆధారపడేవాళ్లు. వారి సేవలకు శ్రవణుడు అంకితం అయ్యాడు. శ్రవణుడు గురించి ఒక చిత్ర ప్రదర్శనను కూడా యువ గాంధీ చూశాడు. తన తల్లిదండ్రులను కావిడి బుట్టలలో కూర్చోబెట్టి మోస్తున్న శ్రవణుడి బొమ్మ కూడా వాటిల్లో ఉంది!

శ్రవణుడి కథ గాంధీజీని తీవ్రంగా కదిలించింది. శ్రవణుడితో సమానంగా తన తల్లిదండ్రులను చూసుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు.



గాంధీజీని తీవ్రంగా కదిలించిన మరో కథ సత్య హరిశ్చంద్రుడి కథ. తండ్రి అనుమతితో, అతని గురించి నాటకం చూడటానికి వెళ్లాడు. ఆ నాటకాన్ని చూడటానికి గాంధీజీ మళ్లీ మళ్లీ వెళ్లాడు. ఒక్కసారి కూడా అతనికి విసుగు అనిపించ లేదు! కథలోని దృశ్యాలు అతని మనసులో నిలిచిపోయాయి. వాటి గురించే ఎప్పుడూ ఆలోచించాడు.

హరిశ్చంద్రుడు ఎన్నో బాధలుపడ్డాడు! ఆయన కుటుంబం మొత్తం బానిసలుగా అమ్ముడుపోయింది! అయినప్పటికీ తన మాట తప్పలేదు. ఆయన లాగా ఉండాలని గాంధీజీ కోరుకున్నాడు. 'హరిశ్చంద్రుడి లాగా అందరూ నిజాయితీగా ఎందుకు ఉండరు?' అని ఆయన అనుకునేవాడు. ఆ ప్రశ్న ఆయన మనసును పగలు, రాత్రీ వెంటాడేది.

హరిశ్చంద్రుడు, శ్రవణుడు ఎప్పటికీ తనకు నిజమైన, సజీవ వ్యక్తులని గాంధీజీ తన పుస్తకంలో రాశారు.

తాను బడిలో ఉన్నప్పుడు జరిగిన విషయాలను గాంధీజీ ప్రస్తావించారు. కానీ ఇవి పూర్తిగా భిన్నమైనవి. తరవాత చాలా చింతించే కొన్ని పనులు ఆయన చేశారు.

ఉన్నత పాఠశాలలో గాంధీజీకి ఇతరులు ఇష్టపడని ఒక స్నేహితుడు ఉండేవాడు. అతని నుండి దూరంగా ఉండమని గాంధీకి అందరూ చెప్పారు. "అతనివి చెడు అలవాట్లు," అని చెప్పారు. కానీ గాంధీజీ ఆ మాటలు వినలేదు, పట్టించుకోలేదు.

క్రమంగా గాంధీజీపై ఈ స్నేహితుడు బలమైన ప్రభావాన్ని చూపసాగాడు. అతని మనస్సు మారసాగింది. ఈ ఇద్దరూ కలిసి ఉన్నప్పుడు సిగరెట్లు తాగటం వంటి చెయ్యకూడని కొన్ని పనులు చేసేవాళ్లు.

ఈ స్నేహం ముగిసిన తరవాత కూడా, తప్పు అని తెలిసి కూడా కొన్ని పనులను గాంధీజీ చేస్తూనే ఉన్నాడు. అతను డబ్బును కూడా దొంగిలించాడు!

కానీ చివరికి అతని మనస్సాక్షి తిరుగుబాటు చేసింది. ఈ కాలం చివరిలో అతని మనసులోని గందరగోళాన్ని గాంధీజీ వివరించారు. అది అతను భరించలేనంతగా మారిపోయింది. మళ్లీ ఎప్పుడూ దొంగిలించకూడదని అతను నిర్ణయించుకున్నాడు. తండ్రి దగ్గర తన తప్పు ఒప్పుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు. అతను ఇలా రాసుకున్నాడు:

...మాట్లాడే ధైర్యం నేను చేయలేదు... అతనికి బాధ కలిగిస్తానని భయపడ్డాను. కానీ తప్పదని భావించాను. తప్పు ఒప్పుకోకుండా ప్రక్షాళన జరగదు.

చివరికి దానిని రాసి, తండ్రికి ఇచ్చి, అతని క్షమాపణ అడగాలని నిర్ణయించుకున్నాను. దానిని ఒక కాగితంపై రాసి అతనికి అందజేశాను. ఇందులో నా నేరాన్ని ఒప్పుకోవడమే కాకుండా, దానికి తగిన శిక్షను కోరాను. నా నేరానికి తనను తాను శిక్షించుకోవద్దన్న అభ్యర్థనతో ముగించాను. భవిష్యత్తులో ఎప్పుడూ దొంగతనం చేయనని కూడా నేను ప్రతినబూనాను.



ఆ కాగితం మా నాన్నకి
అందజేసేటప్పుడు నాలో వణుకు పుట్టింది.
అప్పుడు అతను ఫిస్టులాతో బాధపడుతూ
మంచానికే పరిమితం అయి ఉన్నాడు. అతని మంచం ఒక సాధారణ చెక్క పలక. అతనికి ఆ కాగితం ఇచ్చి ఎదురుగా కూర్చున్నాను.

అతను దానిని చదివాడు. కన్నీటి బిందువులు అతని బుగ్గల నుండి జారి, కాగితాన్ని తడిపాయి. ఒక్క క్షణం ఆలోచనలో కళ్లు మూసుకుని, ఆ కాగితాన్ని చించివేశాడు. దానిని చదవడానికి లేచి కూర్చున్నవాడు మళ్లీ పడుకున్నాడు. నేను కూడా ఏడ్చాను. నా తండ్రి వేదనను నేను చూడగలిగాను. నేను చిత్రకారుడిని అయితే ఆ రోజు దృశ్యాన్ని ఈనాటికీ గీయగలను. అది ఇప్పటికీ నా మనస్సులో అంత స్పష్టంగా ఉంది.

ప్రేమతో కూడిన ఆ ముత్యాల బిందువులు నా హృదయాన్ని శుభ్రపరిచాయి, నా పాపాన్ని కడిగివేశాయి. అలాంటి ప్రేమను అనుభవించిన వ్యక్తి మాత్రమే అది ఏమిటో తెలుసుకోగలడు.

అహింసలో నాకు ఇది ఒక పెద్ద పాఠం. అందులో తండ్రి ప్రేమ తప్ప మరేమీ అప్పుడు నేను చదవలేకపోయాను, కానీ, అది స్వచ్ఛమైన అహింస అని ఇప్పుడు నాకు తెలుసు. అలాంటి అహింస సర్వవ్యాప్తంగా మారినప్పుడు, అది తాకిన ప్రతిదాన్ని మార్చివేస్తుంది. దాని శక్తికి పరిమితి లేదు.

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi
L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh
Artist Uma Krishnaswamy

99 విక్రమాదిత్యుడి సింహాసనం


పురాతన కాలంలో భారత దేశంలోని గొప్ప నగరాల్లో ఉజ్జయిని ఒకటి. చాలా మంది జ్ఞానులు, కవులు అక్కడికి వచ్చారు. మహాకవి కాళిదాసు కొంత కాలం ఉజ్జయినిలో నివసించాడు. విక్రమాదిత్యుడి పాలనా కాలంలో ఇది జరిగింది. అది ఒక అద్భుతమైన యుగం!


విక్రమాదిత్యుడు శక్తివంతమైన, సద్గుణవంతుడైన రాజుగా ఎంతో ప్రసిద్ధి చెందాడు. అందరి పట్ల చూపిన అపరిమిత కరుణకు అతని ప్రజలు అతన్ని ప్రేమించారు. కానీ విక్రమాదిత్యుడికి శాశ్వత కీర్తిని ఇచ్చిన లక్షణం అతని తీర్పులు. వివాదాన్ని అతను పరిష్కరించినప్పుడల్లా, ఇరు వర్గాలు సంతృప్తి చెందేవి. న్యాయం జరగటంతో వాళ్ల మధ్య వైషమ్యాలు కూడా తగ్గిపోయేవి.

విక్రమాదిత్య రాజ్యం చాలా సంవత్సరాలు వర్ధిల్లింది. కానీ, ఉజ్జయిని కూడా చివరికి కాలానికి లోబడాల్సి వచ్చింది. కాలక్రమంలో ఆనాటి భవనాలు, బురుజులు నేలమట్టం అయ్యాయి. అంతటా గడ్డి, పొదలు పెరిగాయి. రాజుల మనస్సులలో, జానపద కథలలో, పెద్ద కొడుకుకి పెట్టే పేరుగా విక్రమాదిత్యుడు మిగిలిపోయాడు.

కానీ భోజ రాజు పాలనలో అతని జ్ఞాపకాలు మళ్లీ ప్రాణం పోసుకున్నాయి. అది ఈ విధంగా జరిగింది:

ఒకసారి, కొంతమంది పశువుల కాపరులు ఒక పొలంలో ఆడుకుంటున్నారు. అక్కడ చాలా రాళ్లు, మట్టి దిబ్బలు ఉన్నాయి.





బాలురు గుట్టలు ఎక్కేవాళ్లు, లేదా రాళ్ల మధ్య దాగుడుమూతలు ఆడేవాళ్లు.

ఒక గుట్ట మిగతా వాటి కంటే ఎత్తుగా ఉంది. అది పువ్వులు, మెత్తటి పచ్చికతో కప్పి ఉండేది - ఒక రాజు కూర్చునే స్థలం లాగా ఉండేది! ఒక బాలుడు దాని పైకి పరిగెత్తి కూర్చున్నాడు. ఆటలో, అతను తన స్నేహితులతో, "నేను న్యాయమూర్తిని! మీ వివాదాలను నా దగ్గరకు తీసుకుని రండి!" అని అన్నాడు.

మిగతా పిల్లలు సంతోషించారు. వాళ్లు కాసేపు ఆలోచించారు. ఇద్దరు అబ్బాయిలు గుట్ట ముందు నిలబడి, "మా భూమి సరిహద్దుల విషయంలో గొడవలు అవుతున్నాయి. దయచేసి మా వివాదాన్ని పరిష్కరించండి," అన్నారు.

గుట్టపై ఉన్న బాలుడు నిజమైన న్యాయమూర్తిలా ధ్వనించటమే కాకుండా కనిపించాడు కూడా. అంతేకాకుండా అతను న్యాయమైన తీర్పు ఇచ్చాడు.

ఎంత అద్భుతమైన ఆట! పిల్లలు తమ స్నేహితుడి వద్దకి మరిన్ని వివాదాలను తెచ్చారు. వాటిని పరిష్కరించడంలో, ఆ బాలుడు ఎంతో అనుభవం ఉన్న జ్ఞానిలా మాట్లాడాడు. అందరికీ ఈ ఆట నచ్చింది. ఇంటికి వెళ్లే వరకు ఈ కొత్త ఆట ఆడుతూనే ఉన్నారు.

ఇప్పుడు న్యాయమూర్తి తాను కూర్చున్న చోటు నుండి దూకాడు. అతను మళ్లీ చిన్న పిల్లవాడు అయ్యాడు. నవ్వుతూ, తన పరిహాసాలు ఆడసాగాడు. ఎప్పటి లాగానే ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. కానీ అది సాధారణ రోజు కాదు!

అప్పటి నుండి, వారి మధ్య నిజమైన వివాదాలు తలెత్తినప్పుడు, అదే బాలుడిని పరిష్కరించమని అడిగేవాళ్లు. ఆ ప్రదేశానికి వెళ్లిన తరవాత అతను తీర్పు చెప్పేవాడు.

దీని గురించిన వార్తలు వ్యాపించసాగాయి. దాంతో, తమ వివాదాలను బాలుడి వద్దకు ప్రజలు తీసుకునిరాసాగారు. దిబ్బ పైన కూర్చుని ప్రతి వివాదాన్ని అతను పరిష్కరించేవాడు. గొడవపడినవాళ్లు ఎల్లప్పుడూ ఆ తీర్పులతో సంతృప్తి చెందేవాళ్లు.

ఇదంతా త్వరలోనే భోజ రాజు చెవులకు చేరింది. అతను వెంటనే సత్యాన్ని ఊహించాడు: 'ఆ బాలుడు విక్రమాదిత్య సింహాసనంపై కూర్చుని ఉండాలి!' దాంతో, తన మనుషులను పంపి దిబ్బను తవ్వించాడు. అక్కడ వాళ్లు ఒక సింహాసనాన్ని కనుగొన్నారు. దాని ముందు ఎగరడానికి సిద్ధంగా ఉన్నట్టు రెక్కలు కలిగిన 25 దేవతల బొమ్మలను చెక్కారు.

'నేను ఈ సింహాసనంపై కూర్చుంటే, విక్రమాదిత్యుని దయ కచ్చితంగా నాపై ఉంటుంది. అన్ని వివాదాలలో తెలివిగా తీర్పు ఇస్తాను, నా తీర్పులలో న్యాయంగా, దయతో ఉంటాను,' అని రాజు అనుకున్నాడు.

సింహాసనాన్ని నగరానికి తీసుకుని వచ్చారు. ఒక పొడవైన ఊరేగింపు దానిని రాజభవనానికి తీసుకునివెళ్లింది. దానితో పాటు సంగీతకారులు, గాయకులు, నృత్యకారులు వచ్చారు. విక్రమాదిత్యుని అద్భుతమైన న్యాయ పీఠాన్ని చూడటానికి ప్రజలు గుమిగూడారు.

ఇది ఒక శుభ దినం. ఉన్నత స్థాయి అతిథులు హాజరయ్యారు. అందరూ చూస్తుండగా, సింహాసనం వైపుకి రాజు అడుగుపెట్టాడు.


అప్పుడే, మొదటి దేవత, "ఆగు! విక్రమాదిత్య సింహాసనంపై కూర్చోటానికి ముందు బాగా ఆలోచించండి. మీరు ఈ గౌరవానికి అర్హులేనా?" అని బిగ్గరగా అడిగింది.

రాజు సంకోచించాడు.

"మరొక రాజు భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుకున్నావా?" దేవత అడిగింది.

"కోరుకున్నాను. ఈ సింహాసనం మీదు కూర్చోటానికి నేను అర్హుడిని కాదని నాకు అర్థమైంది," అని రాజు అన్నాడు.

"మూడు రోజులు పాటు ఉపవాసం, ధ్యానంలో గడపండి. అప్పుడు మళ్లీ ప్రయత్నించండి," అని ఆ దేవత చెప్పి తన రెక్కలను ఆడిస్తూ ఎగిరిపోయింది.





మూడు రోజుల ధ్యానం, ఉపవాసం తరవాత రాజు మళ్లీ సింహాసనంపై కూర్చోటానికి వెళ్లాడు. రెండవ దేవత అతన్ని ఆగమని ఆజ్ఞాపించింది. "విక్రమాదిత్య సింహాసనాన్ని ఎక్కడానికి నువ్వు తగినవాడివా?" రాజు మళ్లీ సంకోచించాడు.

"మరొక వ్యక్తి సంపదను స్వాధీనం చేసుకోవాలని కోరుకున్నావా?" అని దేవత అడిగింది. "అనుకున్నాను. ఈ సింహాసనానికి నేను అర్హుడిని కాదు," అని అతను అన్నాడు.

"ఉపవాసం, ధ్యానంలో మూడు రోజులు గడుపు. తరవాత మళ్లీ ప్రయత్నించు," అని చెప్పి దేవత ఎగిరిపోయింది.

అలా దాదాపు వంద రోజులు గడిచాయి! ఇప్పుడు, ఒకే ఒక్క దేవత మిగిలి ఉంది. "నీ మనస్సు పిల్లల మనస్సు లాంటిదా?" అని ఆమె రాజును అడిగింది.

"లేదు," అని అతను జవాబు ఇచ్చాడు.

ఇది విన్న దేవత సింహాసనాన్ని తీసుకుని ఆకాశంలోకి ఎగిరింది. విక్రమాదిత్య సింహాసనం మానవుల కళ్లకు కనిపించటం అదే చివరిసారి.

విక్రమాదిత్య సింహాసనం గురించి భోజ రాజు తరచుగా ఆలోచించేవాడు. ఒక చిన్న పశువుల కాపరి సింహాసనాన్ని ఎలా ఎక్కగలిగాడు, రాజు అయిన తాను ఎందుకు ఎక్కలేకపోయాడు? చివరికి, అతను అర్థం చేసుకున్నాడు:

స్వచ్ఛమైన హృదయం, పిల్లల అమలిన మనస్సు కలిగిన వ్యక్తి మాత్రమే నిజంగా ఉన్నతంగా ఉండగలడు. అలాంటి వ్యక్తి మాత్రమే విక్రమాదిత్య సింహాసనంపై కూర్చోగలడు.

సిస్టర్ నివేదిత రాసిన కథ ఆధారంగా

© Katha Jharna 2008		**Publisher**	Rajalakshmi Srinivasan Memorial Foundation
P. Saraswati	V. Vijayakanthi	**Telugu**	K. Suresh
L. S. Saraswathi	S. Rajalakshmi	**Artist**	Uma Krishnaswamy

చూడటానికి మూడు రోజులు



హెలెన్ కెల్లర్ (1880-1968)కి చూపు లేదు, వినపడదు. ఆమె తన జీవితాన్ని మానవాళి సేవకి అంకితం చేశారు.

చూపు లేకుండా జీవించడం గురించి అనేక వ్యాసాలను హెలెన్ రాశారు. వాటిలో "చూడటానికి మూడు రోజులు" అన్న వ్యాసం నుండి కొన్ని భాగాలు ఇక్కడ ఉన్నాయి.

అడవిలో నడక నుండి తిరిగి వచ్చిన చాలా మంచి స్నేహితురాలు ఇటీవల నన్ను చూడటానికి వచ్చింది. ఆమె ఏమి గమనించిందని నేను అడిగాను. "ప్రత్యేకంగా ఏమీ లేదు," అని ఆమె సమాధానం ఇచ్చింది.

ఒక గంట పాటు నడిచి గమనించదగినది ఏమీ చూడలేకపోవడం ఎలా సాధ్యమైంది అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. చూడలేని నేను కేవలం స్పర్శ ద్వారా ఆసక్తి కలిగించే వందలాది విషయాలను కనుగొంటాను. ఆకు సున్నితమైన సమరూపతను తెలుసుకుంటాను. బిర్చ్ చెట్టు మృదువైన బెరడును లేదా పైన్ చెట్టు గరుకు బెరడును ప్రేమగా నిమురుతాను. శీతాకాలపు నిద్ర తరవాత ప్రకృతి మేల్కొలుపులకు మొదటి సంకేతమైన చిగుళ్ల మొగ్గల కోసం ఆశతో వసంతకాలంలో చెట్ల కొమ్మలను తాకుతాను. అప్పుడప్పుడు, నా అదృష్టం బాగుంటే, నా చేతిని ఒక చిన్న చెట్టుపై సున్నితంగా ఉంచి, గొంతెత్తి పాడే పిట్ట ఆనందపు వణుకును అనుభూతి చెందుతాను.

ఇవన్నీ చూడాలని కొన్నిసార్లు నా హృదయం కోరుకుంటుంది. కేవలం స్పర్శ ద్వారా ఇంత ఆనందాన్ని పొందగలిగితే, చూపు ద్వారా ఇంకా ఎంత అందం వెల్లడౌతుందో. నాకు చూపు ఉంటే ఏమి చూడటానికి ఎక్కువ ఇష్టపడతానో ఊహించుకుంటాను. నాకు కేవలం మూడు రోజులకు చూపు వస్తే ఏమేమి చూస్తాను!

మొదటి రోజు ఏమాత్రం తీరిక ఉండదు. నా ప్రియమైన స్నేహితులు అందరినీ పిలిచి, వారి ముఖాల్లోకి దీర్ఘంగా చూస్తాను. వాళ్ల లోపలి అందానికి నిరూపణ అయిన బాహ్య రూపాన్ని నా మనస్సులో ముద్రించుకుంటాను.






వాళ్ల ముఖాల అనుభూతి ద్వారా మాత్రమే నా స్నేహితులు నాకు తెలుసు. నా వేళ్ల ద్వారా ముఖ ఆకృతిని 'చూడగలను'. నవ్వు, దుఃఖం వంటి స్పష్టమైన భావోద్వేగాలను గుర్తించగలను. కానీ, 'ఆత్మకి కిటికీలు' అయిన కళ్లల్లోకి చూస్తూ నా స్నేహితురాలి హృదయంలోకి చూడటం అంటే ఏమిటో నాకు తెలియదు.

ముందుగా, నా బాల్యంలో నా దగ్గరికి వచ్చి బాహ్య ప్రపంచాన్ని నాకు తెరిచిన నా ప్రియమైన గురువు ముఖం వైపు చాలాసేపు చూడాలని అనుకుంటున్నాను. కష్టాలను ఎదుర్కొంటూ దృఢంగా నిలబడటానికి వీలు కల్పించిన వ్యక్తిత్వాన్ని, నాకు చాలాసార్లు వెల్లడిచేసిన మానవాళి పట్ల కరుణను ఆమె కళ్లల్లో చూడాలని అనుకుంటున్నాను. మానవ జీవితం, మానవ స్ఫూర్తి లోతులను వెల్లడించిన పుస్తకాలను చూడాలని అనుకుంటున్నాను. తమ వెచ్చని, మృదువైన, ఉల్లాసభరితమైన స్నేహంతో నాకు స్వాంతనను ఇచ్చే నా కుక్కల విశ్వాసపాత్రమైన, నమ్మకమైన కళ్లల్లోకి చూడాలని అనుకుంటున్నాను.

చూసే ఆ మొదటి రోజు మధ్యాహ్నం, నేను అడవిలో ఎంతో దూరం నడిచి ప్రకృతి ప్రపంచ అందాలను నా కళ్లతో తాగాలని అనుకుంటున్నాను. రంగురంగుల సూర్యాస్తమయ వైభవానికి ప్రణమిల్లుతాను. ఆ రాత్రి, నాకు నిద్ర పట్టదని అనుకుంటున్నాను.

మరుసటి రోజు తెల్లవారుజామున లేచి, రాత్రి పగలుగా మారే ఉత్కంఠభరితమైన అద్భుతాన్ని చూడాలి. నిద్రిస్తున్న భూమిని తన కాంతితో సూర్యుడు మేల్కొలిపే అద్భుతమైన దృశ్యాన్ని తన్మయంతో చూస్తాను.





రెండవ రోజుని నేను ప్రపంచ గత, వర్తమానాల విహంగ వీక్షణానికి అంకితం చేస్తాను. మ్యూజియంలకు వెళ్లి మానవ పురోగతి ప్రదర్శనను చూడాలని అనుకుంటున్నాను. భూమి సంక్షిప్త చరిత్రను అక్కడ నేను చూస్తాను- వాటి సహజ వాతావరణంలో చిత్రీకరించిన జంతువులు, మనుషులను; మనిషి పుట్టుకకు చాలా కాలం ముందు భూమిపై సంచరించిన డైనోసార్లు, మాస్టోడాన్ల భారీ కాయాలను చూస్తాను.




నా తరవాతి గమ్యస్థానం ఆర్ట్ మ్యూజియం. చూపు వచ్చిన ఈ రెండవ రోజున, మనిషి కళ ద్వారా అతని ఆత్మను పరిశీలించడానికి ప్రయత్నిస్తాను. స్పర్శ ద్వారా తెలిసిన శిల్పాలను ఇప్పుడు చూస్తాను. చిత్రకళ అద్భుత ప్రపంచం అంతా నాకు తెరుచుకుంటుంది.

రెండవ రోజు సాయంత్రం నాటకం లేదా సినిమా చూస్తాను. నాటకం, సినిమా లేదా ఏదైనా దృశ్యాన్ని చూసినప్పుడు, దాని రంగులు, మనోహర కదలికలను ఆస్వాదించేలా చేసే చూపుకి మీలో ఎంతమంది కృతజ్ఞతలు తెలుపుతారు? నర్తకి మనోహర కదలికలను మసకగా మాత్రమే ఊహించుకోగలను. నేల ప్రకంపనల ద్వారా వచ్చే సంగీతం లయలను నేను కొంతవరకు గ్రహించగలను. ప్రపంచంలోని అత్యంత ఆహ్లాదకరమైన దృశ్యాలలో లయబద్ధమైన కదలిక ఒకటి అని నేను ఊహించగలను.

మరుసటి రోజు ఉదయం, మళ్లీ వేకువని పలకరిస్తాను. కొత్త ఆనందాలను, అందాలను కనుగొనే ఆత్రుతతో ఉంటాను. ఈ మూడవ రోజున నేను వ్యాపార లావాదేవీలలో నిండిన పురుషుల పని ప్రపంచంలో గడుపుతాను. నగరం నా గమ్యస్థానం అవుతుంది.

.



మొదట, నేను ఒక రద్దీ మూలలో నిలబడి, ప్రజలను చూస్తూ, వారి దైనందిన జీవితాలను అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తాను. వాళ్ల చిరునవ్వులు చూసి సంతోషిస్తాను. వాళ్ల దృఢ సంకల్పం చూసి గర్విస్తాను. బాధను చూసి జాలి పడతాను.

ఐదవ అవెన్యూలో నడుస్తాను. దేనిపైనా దృష్టి కేంద్రీకరించకుండా రంగుల చిత్ర, విచిత్ర మాలికను చూస్తాను. జనసమూహంలో మహిళల దుస్తుల రంగుల కదిలకల అందమైన దృశ్యం ఎంత చూసినా తనివి తీరదని నాకు తెలుసు.

ఐదవ అవెన్యూ నుండి నగరాన్ని చుట్టి వస్తాను- మురికివాడలు, కర్మాగారాలు, పిల్లలు ఆడుకునే ఆట స్థలాలను చూస్తాను. ఆనందం, దుఃఖాలను చూస్తూ ప్రజల పని, జీవితాల పట్ల నా అవగాహనను పెంచుకోటానికి ప్రయత్నిస్తాను

అర్ధరాత్రి నా చూపు మళ్లీ పోతుంది. శాశ్వత రాత్రి మళ్లీ నన్ను చుట్టుకుంటుంది. నేను చూడాలని అనుకున్నవి అన్నీ ఆ మూడు రోజుల్లో చూడలేకపోవటం సహజమే. మళ్లీ చీకటి కమ్ముకున్నప్పుడే ఏమేమి చూడలేదో తెలియవస్తుంది. కానీ, అద్భుతమైన జ్ఞాపకాలతో నా మనసు నిండిపోయి, పశ్చాత్తాపపడటానికి సమయం ఉండదు. ఆ తరవాత ఏ వస్తువును తాకినా అది ఎలా ఉంటుందన్న జ్ఞాపకం మదిలో మెరుస్తుంది.

చూపు వచ్చిన మూడు రోజులు ఎలా గడపాలి అన్న నా ప్రణాళికా, మీకు చూపు పోతుందని తెలిస్తే మీరు ఏమి చెయ్యాలని అనుకుంటారో ఒకటి కాకపోవచ్చు. అయితే, ఆ పరిస్థితి ఏదురవుతుందంటే మీ కళ్లను ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఉపయోగిస్తారని నాకు కచ్చితంగా తెలుసు. మీరు చూసిన ప్రతిదీ మీకు ప్రియమైనదిగా మారుతుంది. మీ దృష్టి పరిధిలోకి వచ్చే ప్రతి వస్తువును మీ కళ్లు తాకి, ఆలింగనం చేసుకుంటాయి. చివరికి, మీరు నిజంగా చూడటం మొదలుపెడతారు, మీ ముందు అందాల కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది.

చూపు లేని నేను చూడగలిగిన వారికి ఒక సూచన ఇవ్వగలను. రేపు మీ చూపు పోతుంది అన్నట్లుగా మీ కళ్లను ఉపయోగించండి. ఇదే పద్ధతిని ఇతర ఇంద్రియాలకు కూడా అన్వయించవచ్చు. రేపు మీ వినికిడి పోతుందన్నట్లుగా గొంతుల సంగీతాన్ని, పక్షి పాటలను, ఆర్కెస్ట్రా అద్భుత స్వరాలను వినండి. రేపు మీ స్పర్శ జ్ఞానం పోతుందన్నట్లుగా ప్రతి వస్తువును తాకండి. రేపు వాసన, రుచి చూసే శక్తి పోతుందన్నట్లుగా పువ్వుల సుగంధాన్ని, ప్రతి ముద్దని ఆస్వాదించండి. ప్రతి ఇంద్రియాన్ని పూర్తిగా వినియోగించుకోండి. కానీ అన్ని ఇంద్రియాలలోకి నయనేంద్రియాలు అత్యంత అద్భుతమైనవి అనటంలో సందేహం లేదు.

© Katha Jharna 2008

Publisher Rajalakshmi Srinivasan Memorial Foundation

P. Saraswati V. Vijayakanthi

L. S. Saraswathi S. Rajalakshmi

Telugu K. Suresh

Artist Uma Krishnaswamy